RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస

మాసపత్రిక

తెలుగు మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 6 | జూలై - 2020 | పేజీలు : 70 | వెల : 25/-



ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్, MBA.,Ph.D

ఎడిటర్ : **శ్రీ బి.రాజేష్**

కరస్పాండెంట్
కె.దినేష్, B.Tech.,(M.J.M.C)

ఫొటోగ్రాఫర్ : **బి.వీరయ్య**

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

సేల్స్ మేనేజర్
జి.విజయ్‌కుమార్ B.A., B.Ed

Office Address

**D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002
Cell : 9492423833**

విషయ సూచిక

Registration No.1140/2019

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్ : 94924 23833

ఎడిటోరియల్

రాజుగారి రచ్చ



నేను పార్టీకి వ్యతిరేకం కాదు.. అధినేతను ఏమీ అనలేదు.. నన్నెందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారు. ఇదీ నరసాపురం ఎంపీ.. వైసీపీ నాయకుడు.. శ్రీమాన్ కినమూరి రఘురామకృష్ణంరాజుగారునిన్న మొన్నటి వరకు తననుతాను చేసుకున్న సమర్థన. అనుంగు మీడియాలు, వైసీపీ వ్యతిరేక ఛానెళ్లు.. ఆయనను బాగానే ప్రొజెక్ట్ చేశాయి. అయితే, తాజాగా కూడా ఆయన లేదులేదంటూనే.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేశారని, ఇలా అయితే.. ఆయన చేసింది.. పార్టీ వ్యతిరేక పనికాదా? అంటూ.. చెవిలో చిన్నగా చెప్పుకొంటు న్నారు.. వైసీపీ నాయకులు. వ్యతిరేకం కాదు.. కాదు.. అంటూనే పార్టీకి నడిబజారులో బట్టలు విప్పేస్తున్నారే.. ! అని చెవులు కొరుక్కుంటున్నారు.

ఎంపీ రఘురామకృష్ణ వ్యవహారం నరసాపురం నుంచి ఢిల్లీ వరకు ఎగబాకిన విషయం తెలిసిందే. అతను మామూలోడు కాదు. జగన్‌కే చుక్కలు చూపిస్తున్నాడు! అనే వ్యాఖ్యలు వైసీపీ నుంచే వినిపించాయి. ఇంకా వినిపిస్తూనే ఉన్నాయి. నిజానికి తనకు ఏదైనా బాధకలిగితే.. అధిష్టానానికి లేఖలు రాయొచ్చు .. లేదా సూచనలు చేయొచ్చు.. కానీ, ఎత్తుకోవడం ఎత్తుకోవడమే ప్రధాన ప్రతిపక్షాన్ని మించిపోయే రేంజ్‌లో విమర్శలు ఎత్తుకున్నారు. అదేసమయంలో ఎవరైనా అడిగితే.. నేను పార్టీని తిట్టానా? అధినేత జగన్‌ను ఏమన్నా అన్నానా? అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. రాజకీయ మేధావులమని చెప్పుకొనే నాయకులకే రఘు వ్యవహార శైలి అంతుచిక్కడం లేదు. దీంతో వైసీపీలోనూ రఘు విషయాన్ని ఎవరూ బహిరంగంగా మాట్లాడొద్దని పార్టీ ఆదేశించింది.

దీంతో తాజాగా రఘు చేసిన వ్యాఖ్యలు, ప్రభుత్వంపై లేదులేదంటూనే చేసిన విమర్శలను పార్టీ నాయకులు చెవిలో చిన్నగా చెప్పుకొంటున్నారు. రాజధాని విషయంలో వైసీపీ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే.. తాను దీనికి వ్యతిరేకంగా మాట్లాడతారు. అదేసమయంలో ఇది పార్టీకి వ్యతిరేకం కాదని, ప్రభుత్వానికి సూచన అంటూ.. అమరావతికి మద్దతుగా మొన్న 200వ రోజు జరిగిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఇక, తాజాగా.. అవ్వాతాతల పింఛన్లు పెంచి ఇవ్వాలని, వారి వృద్ధాప్య వయసును తగ్గిస్తూ.. జీవో ఇచ్చారని, దీనిని గత ఏడాది నుంచి అమలు చేయాలని.. ఒక్కొక్కరి అకౌంట్‌లో రూ.15 వేల చొప్పున వేయాలని.. ఇలా తనకు నచ్చిన విధంగా మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సూచనలు మాత్రమే చేశానని, కానీ, జగన్‌ను కానీ, పార్టీని కానీ ఏమీలేదని సమర్థించుకుంటున్నారు.

కానీ, ఇలాంటి వ్యాఖ్యలు, విన్యాసాలు చూస్తున్న వైసీపీ నాయకులు .. ఇదంతా దగుల్బాజీ రాజకీయం కిందకే వస్తుందని.. ఇలాంటి వాడికి టికెట్ ఇచ్చి జగన్ తప్పు చేశారని.. చెవిలో చిన్నగా చెప్పుకొంటున్నా రు. ప్రస్తుతం ఆయనపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో దీనిపై నిర్ణయం వెలువడే వరకు కూడా వేచి చూడడం తప్ప వైసీపీ చేయగలిగింది ఏమీ లేని నేపథ్యంలో నేతలు ఒకరి కొకరు ఫోన్లు చేసుకుంటూ.. ఈ వ్యాఖ్యల వెనుక ఎవరున్నారు? అసలు ఏం జరుగుతోంది? అనే విషయాలను ఆసక్తిగా చర్చించుకుంటుండడం గమనార్హం. మొత్తానికి రఘు విషయం ఇంకా రగులుతూనే ఉండడం గమనార్హం. ఎంపిగా గెలిచిన దగ్గర నుండి పార్టీని ధిక్కరించాడు. ఊరుకున్నారు. పార్టీలో తిరుగుబాటు లేవదీశాడు. అయినా ఊరుకున్నారు. కానీ ఎప్పుడైతే పార్టీ అధినేతనే సవాలు చేశాడో అప్పుడే స్పాట్ పెట్టాలని డిసైడ్ చేశారు. ఇప్పుడిదే పార్టీలో సంచలనంగా మారింది. ఈ పాటికే అర్థమైపోయుంటుంది నరసాపురం ఎంపి రఘురామ కృష్ణంరాజు వ్యవహారం గురించే అని. ఎంపిపై మంత్రి, ఎంఎల్ఏలు ఎదురు కేసులు పెడుతున్నారు. ముందు ఎంఎల్ఏలపై ఎంపి కేసులు పెట్టిన ఫలితంగా ఇపుడు ఎంపిపైనే ఎదురు కేసులు నమోదవుతున్నాయి. దాంతో తనను పోలీసులు అరెస్టు చేస్తారో అనే టెన్షన్ ఎంపిలో పెరిగిపోతోంది. ఈ మొత్తానికి కారణం ఏమిటంటే తనను తాను చాలా ఓవర్‌గా ఊహించుకోవటమే అని తెలిసిపోతోంది.సరిగ్గా ఎన్నికలకు ముందు కృష్ణంరాజు వైసిపిలో చేరాడు. చివరి నిముషంలో టికెట్ తెచ్చుకుని గెలిచాడు. గెలిచిన దగ్గరనుండి పార్టీ లైనుకు కట్టుబడకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాడు. ప్రభుత్వ విధానాలపై బాహాటంగానే వ్యతిరేకంగా మాట్లాడాడు. ఉద్దేశ్యపూర్వకంగానే ఎల్లోమీడియాతో మాట్లాడి రచ్చ చేశాడు. తనకు ఎల్లోమీడియా ఇస్తున్న ప్రాధాన్యతను చూసుకుని ఇదంతా తన గొప్పతనమే అని భ్రమపడ్డాడు. దాంతో బహిరంగంగానే జగన్ ఇమేజిపైనే ఆరోపణలు, విమర్శలు చేశాడు. జగన్ వల్ల తాను గెలవలేదని, తాను పోటీ చేయబట్టే వైసిపి గెలిచిందంటూ పార్టీనే ఎగతాళి చేశాడు. టికెట్ ఇస్తానని తనను కాళ్ళా వేళ్ళా బతిమలాడుకుంటునే తాను వైసిపిలో చేరానంటూ నోటికొచ్చింది మాట్లాడాడు. . ఎల్లోమీడియా కూడా తన అవసరాల కోసం ఎంపి రచ్చను బాగా హైలైట్ చేసింది.ఎలాగూ పార్టీతో వివాదం బహిర్గతమైపోయింది కాబట్టి ఎంఎల్ఏలపైనా కొందరు నేతలపైనా కేసులు పెట్టాడు. దాంతో ఎంపిపై అనర్హత వేటుకు పార్టీ నాయకత్వం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ ఇచ్చింది. అంటే ఎంపిని పార్టీ వదిలేసుకున్నట్లే అనుకోవాలి. దాంతో ఇపుడు ఎంఎల్ఏలకు స్వేచ్ఛ దొరికినట్టయింది. అందుకనే మంత్రి శ్రీ రంగనాథరాజుతో పాటు ఎంఎల్ఏలు కొందరు ఎంపిపై ఎదురు కేసులు పెడుతున్నారు. ఎంపి ప్రోద్బలంతోనే కొందరు తమ దిష్టిబొమ్మలను తగలబెడుతున్నారని, తమకు ప్రాణభయం ఉందంటూ ఏకంగా ఎంపిపైనే పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎప్పుడైతే మంత్రి, ఎంఎల్ఏల నుండి ఫిర్యాదులు అందుతున్నాయో వెంటనే పోలీసులు కూడా ఎంపిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎంఎల్ఏలపై ఎంపి ఇచ్చిన ఫిర్యాదు వేరేసంగతి. అదనపు భద్రత కోసం ఎంపి పెట్టుకున్న రిక్వెస్టు కూడా ఇక్కడ అప్రస్తుతమే. ఇక అనర్హత వేటు గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరమే ఇపుడు పార్టీకి లేదు. ఇపుడు అధికారపార్టీ ముందున్న విషయం ఏమంటే ఎంపిని అరెస్టు చేయటమే. ఎంపిని అరెస్టు చేయటం ప్రభుత్వం చేతిలో పనే. కాబట్టి ముందు ఈ పని చేసేస్తారనే ప్రచారం పార్టీలో జోరందుకున్నది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు చూస్తుంటే దీనికే ఎక్కువ అవకాశం ఉందని అనిపిస్తోంది. మరి పార్టీ టికెట్ మీద గెలిచి, జగన్ ఇమేజి వల్ల అతికొద్ది మెజారిటితో బయటపడిన కృష్ణంరాజు వాస్తవాన్ని మరచిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఎందుకు ఊరుకుంటారు

చీఫ్ ఎడిటర్

రాజగృహంపై దాడి.. రాజ్యాంగంపై దాడే...

- కె.వెంకట్, పి.హెచ్‌డి





ఫాదర్ ఆఫ్ మోడ్రన్ ఇండియా, నవభారత రాజ్యాంగ నిర్మాత, డా॥ బాబా సాహేబ్ అంబేద్కర్ ఇంటి (రాజగృహం) పై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. ఇలా దాడి చేయడం ముమ్మాటికీ మనువాద ముష్కరుల ఉన్మాదానికి పరాకాష్ట అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ దుశ్చర్యలో భాగంగా ఇంట్లో ఉన్న మొక్కల కుండీలను ధ్వంసం చేశారు. ఇంటి వద్ద ఉన్న సిసి టివిలను కూడా ధ్వంసం చేశారు. అద్దాలను కూడా పగులగొట్టారు. రాజగృహ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ నివాసం. ఈ ఇంటిని బాబాసాహెబ్ అంబేద్కర్ పుస్తకాల కోసం నిర్మించారు. ప్రపంచం నలుమూలల నుండి అంబేద్కర్ అనుచరులు రోజూ ఇక్కడకు వస్తారు. ఇది అంత ముఖ్యమైన ప్రదేశం. అంబేద్కర్ అనుచరులకు ఇది అత్యంత గౌరవనీయ భవనం. ఈ ఘటనకు గుర్తు తెలియని వ్యక్తులు పాలపడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తు న్నారు. ఈ ఘటన గురించి అంబేద్కర్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు దుండగుల కోసం వేట మొదలు పెట్టారు.

రాజగృహ (అంబేద్కర్ ఇంటి)పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చెయ్యాలని, ఈ దేశాన్ని ఎలా రక్షించాలో మార్గం చూపిన మహాను బావుని ఇంటి మీద దాడి జరిగితే ఇది దేశం మీద దాడిగా భావించి ఆధుర్మార్గులను చట్టపరంగా శిక్షించాలాని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఘటనను మహారాష్ట్ర హెూంశాఖ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ ఖండించారు. ఈ సంఘటనపై తక్షణమే దర్యాపు చేయాలని పోలీసులను ఆదేశించామని, నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ట్వీట్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు.

రాజగృహలో బీఆర్ అంబేద్కర్ తాను సేకరించిన పుస్తకాలను, సాహిత్యాన్ని పెద్దసంఖ్యలో నిల్వచేసేవారు. ప్రస్తుతం ఆ ఇంటిని అంబేద్కర్ వాడిన కొన్ని వ్యక్తిగత వస్తువులను ప్రదర్శించే మ్యూజియంగా మార్చారు. అదేవిధంగా అంబేద్కర్‌పై పరిశోధనలు చేయాలకునేవారికి రాజగృహ ఒక ప్రధాన అధ్యాయన కేంద్రంగా పనిచేస్తున్నది.

కఠిన చర్యలకు ఉద్ధవ్ థాక్రే ఆదేశం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నివాసం లక్ష్యంగా సంఘ్ పరివార్‌కు చెందిన దుండగులు దాడికి పాల్పడ్డారు. సెంట్రల్ ముంబయిలోని హిందూ కాలనీలో ఉన్న "రాజగృహ"గా పిలువబడుతున్న అంబేద్కర్ ఇంటిపై.. మంగళవారం ఈ నెల 7 అర్ధరాత్రి కొందరు దుండగులు రాళ్ళ దాడికి ఒడిగట్టారు. రాత్రిపూట ఇంట్లోకి ప్రవేశించిన ఆ దుండగులు.. ఇంటి ఆవరణలో ఉన్న సిసిటివి కెమెరాలను ధ్వంసం చేశారు. ఇంటి ముందు ఉన్న పూల కుండీలన్నింటినీ చెల్లా చెదురుగా పడేశారు. పై అంతస్థులో ఉన్న కిటికీలపై రాళ్లు విసిరి, వరండాలో నానా బీభత్సం సృష్టించారు.

అయితే ఈ దాడి ఘటనపై మాతుంగ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు దుండగులు రాళ్లు విసురుతున్న దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయినట్లు పేర్కొన్నారు. మరో దుండగుడు పారిపోతూ కొన్ని పూల కుండీలను ధ్వంసం చేస్తున్న దృశ్యాలు కూడా గుర్తించినట్లు తెలిపారు.

సెంట్రల్ ముంబయిలో దాదార్‌లోని హిందూ కాలనీలో ఉన్న ఈ రెండు అంతస్థుల భవనంలో అంబేద్కర్ పుస్తకాలు, చితాభస్మంతో పాటు అనేక స్మారక వస్తువులు ఉంచిన మ్యూజియం ఉంది. ఇందులో గ్రంథాలయంలో దాదాపు 2 లక్షలకు పైగా పుస్తకాలున్నాయి. అంబేద్కర్ సమాధి "చైతన్యభూమి"లాగే ఈ భవనాన్ని కూడా ప్రజలు అత్యంత ప్రాముఖ్యంగా భావిస్తారు. ప్రస్తుతం అంబేద్కర్, అతని ముని మనవళ్లు వంచిత్ బహుజన్ అగాది (విబిఎ) నాయకుడు ప్రకాష్ అంబేద్కర్, ఆనంద్‌రావ్, బీమ్‌రావ్ ఉంటున్నారు. దాడి జరిగినప్పుడు ప్రకాష్ అంబేద్కర్ ఇంట్లో లేరు. ఆయన అకోలాలో ఉన్నారు.

ఈ దాడి ఘటనను అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే, మాజీ సిఎం దేవేంద్ర ఫడ్నవీస్,

భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌లు ఘటనపై విచారం వ్యక్తం చేశారు. థాక్రే స్పందిస్తూ.. "ఆ ప్రాంగణం ఒక్క అంబేద్కర్ వాదులకే కాదు.. మొత్తం సమాజానికే ఆధ్యాత్మిక స్థలం. అంబేద్కర్ తన రచనలన్నింటిని ఇక్కడ భద్రపరిచారు. ఇది మహారాష్ట్ర సమాజానికి తీర్థయాత్ర వంటి ప్రదేశం. ఈ ఘటనకు పాల్పడ్డవారిపై కఠిన చర్యల్ని తీసుకోవాలని నేను పోలీసులను ఆదేశించాను" అని అన్నారు. రాజగృహ అంబేద్కర్ అనుచరులకే కాకుండా కులమతాలకతీతంగా ప్రజలందరికీ గౌరవ ప్రదమైన స్థలమని ముఖ్యమంత్రి అన్నారు.


అత్యంత ప్రాముఖ్యమైన ఈ భవనంపై దాడికి ఒడిగట్టిన దుండగులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని ఆయన చెప్పారు.

దోషులు ఎంతటివారైనా వారికి కఠిన శిక్ష విధించాలని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత దేవేంద్ర ఫడ్నవీస్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించామనీ, దుండగులను త్వరలోనే గుర్తిస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. ఇక ఈ దాడి రాజగృహ మీద జరిగినట్టు కాదనీ, అంబేద్కర్ వాదుల మీద చేసిందని చంద్రశేఖర్ ఆజాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజగృహ మీద జరిగిన దాడి దురదృష్టకరమని, ఈ ప్రదేశం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ వాదులకు స్ఫూర్తివంతకమైనదని అంబేద్కర్ మనమడు ప్రకాష్ అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రజలంతా సహనం పాటించాలని, ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారని తెలిపారు. ఎవరూ రాజగృహ వైపు రావొద్దని, ఇది సంఘటితంగా ఉండాల్సిన సమయమని సూచించారు. నమ్మకం కోల్పోవొద్దని, ధైర్యంగా ఉండాలని పిలుపు ఇచ్చారు.

ఆధునిక భారత పితామహుడు డా॥ బి.ఆర్.అంబేద్కర్ 125 అడుగుల నిలువెత్తు విగ్రహం

- ప్రజామీడియా నెట్‌వర్క్



రాష్ట్ర ప్రజల్లో స్ఫూర్తిని కలిగించేలా నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల నిలువెత్తు విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి విజయ వాడలోని స్వరాజ్ మైదాన్ వేదిక కానుంది. విగ్రహ ఏర్పాటుతో పాటు పార్కు తదితర నిర్మాణ పనులకు సీఎం వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు.

విజయవాడ నగరం నడిబొడ్డున విగ్రహం ఏర్పాటు చేస్తే అంబేద్కర్‌కు తగిన గౌరవం ఇచ్చినట్టు అవుతుందని, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

డా॥ బి.ఆర్.అంబేద్కర్ స్వరాజ్ మైదాన్‌గా నామకరణం

నీటిపారుదల శాఖకు చెందిన 20.22 ఎకరాల విస్తీర్ణంలో పీడబ్ల్యూడీ మైదానం ఉంది.

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 1997లో దీని పేరు 'స్వరాజ్ మైదాన్'గా మార్చింది.

ఇప్పుడు ఈ మైదానానికే 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదాన్'గా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నామకరణం చేసింది.



ఏడాదిలోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. విగ్రహ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులను ఏపీఐఐసీకి అప్పగించింది.

20 ఎకరాల స్థలంలో అంబేద్కర్ స్మారక మందిరంతో పాటు గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే విగ్రహం చుట్టూ ఆహ్లాదకరమైన (పార్కు), ఓపెన్ ఎయిర్ థియేటర్‌తోపాటు వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు.



పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించనపుడె
పుట్టదు, జనులా పుత్రుని
గనుగొని పొగడగ
బుత్రోత్సాహంబునాడు
పుట్టును సుమతీ !

పుత్రోత్సాహము

పుత్రోత్సాహము అన్నది పుత్రుడు పుట్టినపుడు కాదు. ఆ పుత్రుడు విజయాలు సాధించినపుడు అని అంటారు. ఆ లెక్కన చూసుకుంటే, దివంగత నేత వైఎస్‌కు కావాల్సినంత పుత్రోత్సాహం వచ్చి వుండాలేమో? కొడుకు ఎదిగాడు. ముఖ్యమంత్రి అయ్యాడు. అది మాత్రం కాదు. తండ్రికి తన స్వంత స్థలంలో సమాధి మందిరం కట్టాడు. తండ్రి పేరు కలిసి వచ్చేలా పార్టీ పెట్టాడు. గెలిచి నిలిచాడు. తండ్రి పేరు వాడవాడలా వినిపించేలా పథకాలకు రూపకల్పన చేసారు. వైఎస్ పేరు నిలబడేలా మాత్రమే కాదు, సంక్షేమ పథకాలు అమలు చేసి, జనం గుండెల్లో నిలిచిపోయిన వైఎస్ పేరు పాడుచేయకుండా పాలన సాగిస్తున్నారు జగన్. ఇంతకన్నా పుత్రోత్సాహం ఏం కావాలి?

వాడవాడలా వైఎస్ జయంతి ఘనంగా జరిగింది. పార్టీ అధికారంలో వుంది కనుక, అందులో వింత ఏముంది అని అనేయచ్చు ఎవరైనా? కానీ తరచి చూస్తే అందులో తేడా కనిపిస్తుంది. మాజీ సిఎమ్‌లు ఎవరికి గుర్తుంటారు. మహా అయితే ఎక్కడో ఓ ఫొటో, ఓ ఫంక్షన్, ఓ వార్త అంతే. అది కూడా కొద్ది మంది వరకే. చాలా మంది మాజీ సిఎమ్‌లు జనాలకు గుర్తు లేరు కూడా. కానీ వాడ వాడలా ఒక పండుగ మాదిరిగా వైఎస్ఆర్ పార్టీ జనాలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్టీఆర్‌కు కొడుకులు బోలెడు మంది వున్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ సంపాదించిన భూమలు బోలెడు వున్నాయి. ఒక్క స్వంత స్థలంలో ఒక్క స్మారకమందిరాన్ని వారి కొడుకులు ఎవ్వరూ కట్టిన దాఖలా లేదు. ఎన్టీఆర్ సేకరించిన సినిమా సామగ్రితో మ్యూజియం అన్నది ఎక్కడ వున్నదో తెలియదు. సమాధి ప్రభుత్వం కట్టింది. ప్రభుత్వ స్థలంలో. జయంతి ముందో వర్ధంతి ముందో ప్రభుత్వం దాన్ని శుభ్రపరిచి, అలంకరించాల్సిందే. గతంలో ఇలా చేయలేదని ఎన్టీఆర్ కుటుంబీకులు ఆగ్రహించారు కూడా. కోట్ల ఆస్తులు ఇచ్చిన ఎన్టీఆర్ కోసం వేలు పెట్టి సమాధి అలంకరించడం కానీ, శుభ్రపర్చడం కానీ పిల్లలు చేయలేరా? అన్న కామెంట్లు వినిపించాయి.

జగన్ ఇప్పుడు అధికారంలో వున్నారు. ఆయన తలచుకుంటే ఆంధ్రలో ఎక్కడైనా వైఎస్‌కు ఓ స్మారక చిహ్నం కట్టొచ్చు. కానీ అలాంటి ఆలోచన చేయడం లేదు. తమ స్వంత స్థలమైన ఇడుపులపాయలో తనే కట్టారు. వైఎస్ పేరు నిలబెట్టే పథకాలు ప్రవేశపెడుతున్నారు. అంతే తప్ప ప్రభుత్వ ధనం వాడి వైఎస్‌కు పేరు తెచ్చే పని చేయలేదు. కేవలం మంచి పథకాలకు వైఎస్ పేర్లు పెట్టి, ఆయన పేరును నిలబెడుతున్నారు.

ఓ కొడుకుగా చేయాల్సింది చేస్తున్నారు. వైఎస్ ఆత్మ ఎక్కడున్నా, ఇంతకన్నా ఏం కావాలి.

సంక్షేమ శిల్పి నిరుపేదలకు ఆరోగ్య ప్రదాత

– శ్రీనివాస్

ఈ స్కీము చెబితే ఇప్పుడు నవ్వులాటగా వుంటుందేమో? కానీ దశాబ్ధాల క్రిందట ఎంజీఆర్ (తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి) అమలు చేసిన అనేకానేక స్కీముల్లో స్కూల్ పిల్లలకు పాలపొడి ఒకటి. ప్రభుత్వాలు అంటే పన్నులు వసూలు చేసి, ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు పోను, మిగిలిన దాంతో అభివృద్ధి అనే కార్యక్రమాలు అమలు చేయడం అనే కాన్సెప్ట్‌కు, సంక్షేమం అనే అమెండ్‌మెంట్ జోడించిన ముఖ్యమంత్రి ఎంజీఆర్.

ఇదే బాటలో కిలో రెండు రూపాయలకే బియ్యం అనే పథకాన్ని ప్రవేశ పెట్టింది ఎన్టీఆర్. తెలుగునాట కిలో నాలుగు రూపాయలు రేటు వున్నపుడు అందులో సగం ధరకే బియ్యం పేదలకు అందించి, వారి మనసు చూరగొన్నారు.

సంక్షేమం విషయంలో అంతకు మించి ఆయన ఆలోచనలుముందుకు సాగలేదు. సాగే అవకాశం వుండేనేమో? ఆ వెంటనే ఓ సారి పదవి దిగిపోవడం, ఓసారి మొత్తం ప్రభుత్వం రాజీనామా చేయడం, మరోసారి గద్దె దింపేయడం ఇలా అన్నీ జరిగిపోయాయి.

ఫ్రీ కరెంట్

ఆ తరువాత సంక్షేమం అన్న మాట తెలుగునాట వినిపించలేదు. చంద్రబాబు పాలన వ్యవహారం వేరు. ప్రచారం మూడు వంతులు, పనులు ఒక వంతు అనే పద్ధతి. ఆయన విజన్, ఆ హంగామా సంగతి ఇక్కడ అప్రస్తుతం. అప్పుడు పాదయాత్ర ప్రారంభించాడు వైఎస్ రాజశేఖర రెడ్డి. అప్పటి వరకు లేని విధంగా రైతులకు ఫ్రీ కరెంట్ అంటూ ప్రకటన చేసారు. ఈ హామీని ఎంత ఎకసెక్కం చేయాలో అంతా చేసాడు చంద్రబాబు. ఫ్రీగా ఇస్తే అసలు కరెంటే వుండదని, తీగలపై బట్టలు ఆర వేసుకోవడం మినహా మరెందుకు పనికిరావని ఎద్దేవా చేసాడు. కానీ వైఎస్ గెలిచాడు. ఫ్రీ కరెంట్ ఇచ్చి చూపించాడు.

ఫ్రీ వైద్యం

కార్పొరేట్ వైద్యం అంటే ఎంత ఖరీదో అందరికీ తెలుసు. జబ్బు ఎలాంటిదైనా ఆసుపత్రిలో చేరితే కనీసం యాభై వేలు బిల్లు వేయకుండా ఇంటికి పంపరు. లక్షలకు లక్షలు లాగేయాల్సిందే. కానీ పేదవాడికి ఇది ఎలా సాధ్యం. అప్పుడే రాజన్న ఆరోగ్య శ్రీ పురుడుపోసుకుంది. తెల్లకార్డు వున్నవాళ్లకు కూడా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. లక్షల ఖరీదైన గుండె ఆపరేషన్లు కూడా పేదవాడికి ఫ్రీగా అందాయి. రెండో సారి రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రావడానికి ఈ ఆరోగ్యశ్రీ మూడు వంతులు దోహదం చేసింది.

ఫీజులు వెనక్కి

విద్యార్థులు చదువుకంటే ఫీజులువెనక్క ఇచ్చే ఆలోచన చేసింది కూడా రాజన్నే. సాంకేతిక చదువును సామాన్యుడికి చేరువ చేసారు ఈ స్కీముతో. ఇలా సంక్షేమ బాటను కొత్త పుంతలుతొక్కించే పయనంలో అకస్మాత్తుగా



అదృశ్యం అయిపోయి, తిరిగిరానిలోకాలను మరలి రాని పయనమై పోయాడు రాజన్న. సంక్షేమం మీద విజనరీ వుంటూనే, సాగునీటి పై శ్రద్ధపెట్టిన ముఖ్యమంత్రి. పోలవరం ప్రాజెక్టు అనుమతి వచ్చేవరకు కూర్చుంటే ఆలస్యం అవుతుందని, కాలవల నిర్మాణానికి అనుమతి అక్కరలేదని, ముందుగావాటి పని ప్రారంభించేసారు. కమీషన్ల కోసం అని ఎద్దేవా చేసిన వారే, తరువాత అధికారంలోకి వచ్చాక, ఆ కాలవలు వాడి స్కీములు పెట్టి, నీళ్లు ఇచ్చి, అపర భగీరధుడిగా ప్రచారం సాగించుకున్నారు. వైఎస్ గురించి ఏం చెప్పాలి. అలాంటి వాళ్ల గురించి ఏం మాట్లాడాలి?

స్నేహం..నమ్మకం

రాజకీయాల్లో నమ్మక ద్రోహాలే తప్ప నమ్మకాలు వుండవు అంటారు. కానీ వైఎస్ దానికి కూడా అతీతమే. నమ్మిన వాళ్లందరినీ చేరదీసాడు. ఆదుకున్నాడు. అది మాత్రమే కాదు వైఎస్ గొప్పదనం. తప్పు చేసిన వాళ్లు అయినా, వైరి పక్షంలో వున్నవాళ్లు అయినా, దగ్గరకు వచ్చి, శరణు అన్నా, మీరే దిక్కు అన్నా, అన్నీ మరిచిపోయి, భుజం తట్టి, తన వెనుక నిలబెట్టుకునే గొప్ప గుణం. అంత గొప్ప క్షమాగుణం ఏ రాజకీయ నాయకుడిలోనూ కనిపించదు.

తెలుగు ఠీవి

తెలుగువాడి ఠీవి అన్న పదం గుర్తుకు వచ్చి, రాజకీయాల్లో దాని గురించి వెదికితే గుర్తు వచ్చేది ఇద్దరు ముగ్గురే. ఎన్టీఆర్, పివి నరసింహారావు. వైఎస్. వీరిలో పివి కి ఠీవి అయిన రూపం లేదు. కానీ ఆ ఆహార్యం వుంది. కానీ ఎన్టీఆర్, వైస్ లకు ఠీవికి దీటైన రూపం కూడా వుంది. నిలువెత్తు మనిషి, నిండైన పంచెకట్టుతో నడచి వస్తుంటే కేంద్రంలో రాజకీయ నాయకులు కూడా వైఎస్ ముందు చిన్నగా కనిపించేవారు.

ఆ ఠీవికి తోడు మొహం మీద చెరగని చిరునవ్వు. ఎవరినైనా పేరు పెట్టి పలుకరించగల జ్ఞాపకశక్తి, భుజం తట్టగల చనువు, ఇవ్వగల భరోసా ఇవన్నీ వైఎస్ సొంతం. తెలుగు రాజకీయాల్లో వైఎస్‌ది ఓ చెరగని ముద్ర. అది ఎప్పటికీ తెలుగువాడి జ్ఞాపకాల్లోంచి చెరగిపోదు. అంతకు మించి సంక్షేమ పథకాల విస్తరణ వైఎస్ జగన్ చేపట్టవచ్చు. అంతకు మించిన సంక్షేమ ప్రభుత్వాన్ని నడిపితే నడపవచ్చు.

సంక్షేమపథంలో రాజశేఖరుడిని మరిపించవచ్చేమో కానీ, ఆయన రూపాన్ని, నడకను, నవ్వును, ఇచ్చే భరోసాను, నమ్మకాన్ని జగన్ నే కాదు, మరే రాజకీయ నాయకుడు మరిపించలేరు. జనం గుండెల్లో అది శాశ్వతం. అలాంటి మరపురాని ప్రజానాయకుడి జయంతి నేడు. ఇది సంస్మరణ కాదు...మరుపురాని మనిషి గురించి మరోసారి మననం చేసుకోవడం మాత్రమే.

ఇంటి స్థలంలో ఇరుకైన ఆలోచన!!!

- బి.వినయ్

ఇళ్ల స్థలం లేని కుటుంబం ఆంధ్రలో వుండకూడదు అన్నది సిఎమ్ జగన్ ఆలోచన. నిజానికి ఎవరైనా సరే, పార్టీ బంధాలు, అభిమానాలు పక్కన పెట్టి మెచ్చుకోవాల్సిన సంగతి. ఇళ్ల స్థలం కొనడం అన్నది ఎంత మారుమూల పల్లెలో అయినా వేలు ఖర్చు చేయాల్సిన సంగతి. అలాంటిది ఫ్రీగా ఇవ్వడం, అది కూడా ఓ లేఅవుట్ మాదిరిగా తయారుచేసి ఇవ్వడం అంటే మెచ్చుకోవాల్సిందే కదా.

ఇక ఇక్కడ ప్రతిపక్షాలు రెండు రకాల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఒకటి ఇళ్ల స్థలాల కోసం ప్రయివేటు భూములు అధిక ధరలకు కొంటూ, మధ్య దళారులు లాభం చేసుకునేలా నిర్ణయాలు తీసుకుంటున్నారని. సరే ఆ సంగతి అలా వుంచుదాం. ఎందుకంటే అది గ్రౌండ్ లెవెల్ కు దిగితే తప్ప తేలేదీ కాదు, తెలిసేదీ కాదు.

రెండో రకం అభ్యంతరం ఏమిటంటే కొండల్లో, ఊరికి దూరంగా, రాళ్లల్లో స్థలాలుచదును చేసి ఇస్తున్నారని. ఓ కోస్తా జిల్లాలో 800 వైట్ రేషన్ కార్డులు వున్న ఓ చిన్న పల్లెటూరిలో 170 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు. మనిషికి రెండు సెంట్లు (100 గజాలు) వంతున 340 సెంట్లు అంటే మూడున్నర ఎకరాలు స్థలం కావాలి. ఇంత స్థలం ఊరి నడిబొడ్డున దొరకుతుందా? అయితే కొనాలి. లేదా బంజరు వుంటే అది చదును చేసి ఇవ్వాలి. అంతే కదా? ఊరి చివర బంజరు దగ్గర 170 కుటుంబాలు ఇళ్లు కట్టుకుంటే అది ఎలా వుంటుంది? ఊరుగా మారిపోదా?

సినిమా జనాలకు స్థలాలు ఇచ్చినపుడు బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్ ఎలా వున్నాయి? మాకెందుకీ స్థలాలు అని ఆ కొండలను గుట్టలను వదిలేయలేకపోయారా? ఎగబడి మరీ ఎకరాలు ఎకరాలు ఎలా తీసుకున్నారు. ఇప్పుడు అవి ఎంత కోట్ల విలువ?

ఎన్టీఆర్ టైమ్‌లో...?

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చాక ఓ మంచి పని చేసారు. అవిభక్త ఆంధ్ర రాష్ట్రం అంతా ఆర్టీసీ బస్‌స్టేషన్లు, డిపోలు నిర్మింప చేసారు. కానీ అందుకోసం ఎక్కువ స్థలం కావాల్సి వచ్చింది. ప్రతి చోటా ఊరి శివారులోనే వాటిని నిర్మించారు. జనం అప్పట్లో గోల పెట్టారు. ఊరి చివర బస్‌స్టాండ్ నా అంటూ. కానీ ఇవ్వాళ పరిస్థితి ఏమిటి?

విశాఖ ద్వారకానగర్ బస్‌స్టేషన్ నిర్మిస్తుంటే అప్పట్లో జనం గోల పెట్టారు. ఊరి చివర బస్‌స్టేషన్ కడుతున్నారు. వన్‌టౌన్‌లో వున్న బస్‌స్టేషన్‌నే వుంచాలి అంటూ అప్పట్లో గట్టిగానే ఆందోళనలు జరిగాయి. ఇదే విధంగా చాలా పట్టణాల్లో జరిగాయి. ఇప్పుడు ఆయా పట్టణాల్లో కావచ్చు, విశాఖ ద్వారకానగర్‌లో కావచ్చు, పరస్థితి ఏమిటి? అంగుళం జాగా దొరకదు కొనాలన్నా.

ఇప్పుడు ఈ ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రదేశాలు కూడా ఓ అయిదేళ్లు దాటితే అలాగే మారుతాయి. అందులో సందేహం లేదు. అభివృద్ధి అనేది వికేంద్రీకరణ వల్లే సాధ్యం అవుతుందని తెలుగుదేశం పార్టీ ఎప్పుడు తెలుసుకుంటుందో? రాజధాని విషయంలోనూ ఇదే వాదన. ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలోనూ ఇదే వాదన.

నేషనల్ హైవేలు అభివృద్ధి చేసినపుడు బైపాస్ రోడ్లు ప్రతి ఊరికి దూరంగా వేసారు. కానీ ఇప్పుడు చూస్తే ప్రతి ఊరి బైపాస్ మరో కొత్త ఊరుగా మారిపోయిన వైనం కనిపిస్తుంది.

పల్లెల్లో ఊరికి ఊరికి మధ్యన శివారులు వుంటాయి. ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా రెండు ఊళ్లను కలిపే అవకాశం కలుగుతుంది. అలా కూడా కుదరలేదు అనుకుందాం. వందలాది మందికి ఒకే చోట, ఎక్కడో ఇవ్వడం ద్వారా అక్కడ కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి దారి వేసినట్లు అవుతుంది. అంతే కాదు లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో సిమెంట్, ఇటుక, ఇనుము లాంటి బిల్డింగ్ మెటీరియల్ గిరాకీ ఎంత పెరుగుతుంది. ఏ మేరకు అమ్మకాలు పెరుగుతాయి. ఏ మేరకు జిఎస్టీ పెరుగుతుంది. ఏ మేరకు జనాలకు పనులు దొరుకుతాయి. ఇవన్నీ ఆలోచించాలి కదా? కేవలం ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందో అని అడ్డం పడితే, ముందుగా తెలుగుదేశం పార్టీకి వున్న పరువు, పేరు పోయే ప్రమాదం వుంది.

రససిద్ధుడు మంగళంపల్లి

- శ్రీ

గంధర్వులు,కిన్నరులు అనేవారు అసలు ఉన్నారో, లేరో, మనకు తెలియదు. పూర్వ మహా వాగ్గేయకారులను మనం చూడలేదు.మనకు తెలిసిన సంగీతమూర్తి మంగళంపల్లి బాలమురళీకృష్ణ. వాళ్ళందరూ ఇలాగే ఉంటారేమో, వారే బాలమురళిగా వచ్చారేమో, అనిపిస్తుంది. సంగీతసరస్వతికి ఒక రూపం వస్తే, అదే మంగళంపల్లి. సుమారు ఎనిమిది దశాబ్దాల కాలప్రవాహంలో,సంగీతలోకంలో, మహామహుల మధ్యన నిలబడి, తన్ను తాను విభిన్నంగా, విశిష్టంగా ఆవిష్కరించుకొని, కోట్లాదిమంది సంగీతప్రియుల హృదయాలు దోచుకున్న కృష్ణుడు బాలమురళీకృష్ణ. శాస్త్రీయ సంగీతాన్ని పామరులకు కూడా దగ్గరికి చేర్చి, వారిని సైతం ఆ సంప్రదాయ సాగరంలో ముంచెత్తిన ఏకైక కళామూర్తి బాలమురళి. విశృంఖలంగా గమకాలు వేస్తూ, పాడుతున్న ఆ కీర్తనలలోని పదాలు,దాని భావం, వినేవాడికి ఏమాత్రం అర్థంకాకుండా, ఒక దేహప్రదర్శనలాగా పాడేగాయకుల వల్ల దూరమవుతున్న సంప్రదాయ సంగీతాన్ని, మళ్ళీ ప్రజల వద్దకు చేర్చిన మహనీయుడు ఈయనే. వాగ్గేయకారులు రాసిన ప్రతి కీర్తనలోని ప్రతి అక్షరాన్ని అతి స్పష్టంగా పలికి,అర్థవంతంగా,భావస్ఫోరకంగా అందించి, రసాన్ని చిలికించినవారిలో అగ్రేసరుడు బాలమురళి. ఈరోజు శాస్త్రీయ సంగీతం జనబాహుళ్యంలో చిరంజీవిగా మిగిలి ఉండడానికి బలమైన పునాదులు వేసిన నాదబ్రహ్మ ఆయన.

జయదేవుడు,త్యాగయ్య, రామదాసు,అన్నమయ్య మొదలు సదాశివబ్రహ్మేంద్రులు వరకూ మహనీయులైన ఎందరో వాగ్గేయకారుల కీర్తనలను రసవంతంగా పాడి, లోకానికి కానుకగా అందించిన మహనీయుడు మంగళంపల్లి. అసాధారణమైన ప్రతిభ (జీనియస్), దానికి తోడు అపురూపమైన సృజన (క్రియేటివిటీ),నవీనత (ఇన్నోవేటివ్), సుమధురమైనగాత్రం, అద్భుతమైనగానం ఆధునికకాలంలో కేవలం బాలమురళి సొత్తు.కేవలం కొన్ని వేదికలకే పరిమితమైన శాస్త్రీయ సంగీతాన్ని బాహ్యప్రపంచంలోకి తెచ్చి, బహుళప్రాచుర్యం కల్పించిన ప్రజ్ఞాశాలి.అది లలిత సంగీతమైనా,భక్తి సంగీతమైనా, శాస్త్రీయ సంగీతమైనా... అన్నింటికీ సమన్యాయం చేసి, విస్తృతంగా విహరించాడు. భీమ్‌సేన్‌జోషి వంటి హిందుస్తానీ సంగీతశిఖరాలతో జుగల్బందీలు చేశాడు.నువ్వా-నేనా అన్నట్లుగా పాడి, వారిని అమితాశ్చర్యంలో ముంచి, కోట్లాదిమందిని మంత్రముగ్ధులను చేసిన ప్రతిభాభారతి బాలమురళి. సంగీతంలో ఎన్నో ప్రయోగాలు చేశాడు. స్వరాలతో ఆడుకున్నాడు. తిల్లానాలకు రససృష్టి చేశాడు. బాలమురళిగాత్రంనుండి తిల్లానాలు వస్తూ ఉంటే, ఎవరైనా వడలు మరచి, నాట్యం చెయ్యాల్సిందే. తిల్లానాలకు విన్యాసాలు అందించిన విజ్ఞానం కేవలం బాలమురళి సొత్తు. మనోధర్మానికి పెద్దపీట వేశాడు. కవి లేదా వాగ్గేయకారుడు రాసిన సాహిత్యాన్ని అమితంగా



గౌరవించి, సాహిత్యానికే అగ్రతాంబూలం ఇచ్చి, సంగీతమయం చేసి, ఆ సౌరభాలను మరింత వికసింపజేసినవారిలో బాలమురళిదే అగ్రస్థానం. వాగ్గేయకారుల కీర్తనలు పాడి ప్రాచుర్యం చెయ్యడమేకాక, తాను స్వయంగా ఎన్నో కీర్తనలు రాసి, ఆధునికకాలంలో వాగ్గేయకారుడిగా అవతారమెత్తిన మహనీయుడు మంగళంపల్లి.ఆయన రాసిన కీర్తనలలో సొగసు నీ సొమ్ము.. కల్యాణిరాగిణి వంటివి చాలా ప్రసిద్ధమైనవి.మూడుస్థాయిలలోనూ ఒకే రీతిన పరమాద్భుతంగా పాడగలిగినగాత్ర సంపదకలిగిన అరుదైనగాయకుడు. సంగీతశాస్త్రంలోని 72 మేళకర్తలకు స్వరరచన, పదరచన చేసిన ఏకైక విద్వాంసుడు. పూర్వం, ఎవరైనా ఉండి ఉండవచ్చు. ఈ శతాబ్దంలో మంగళంపల్లి తప్ప ఇంకొకరు లేరు. వయోలిన్, మృదంగం, కంజీరా, వయోలా, వీణ మొదలైన సంగీత వాయిద్యాలను అవలీలగా అద్భుతంగా వాయించగలిగిన బహుముఖ సంగీతప్రజ్ఞ ఈయనకే సొంతం. ఆయనే పాడి, ఆయనే వయోలిన్, మృదంగం వాయించి రికార్డ్ చేసి, ఆకాశవాణిలో అనేకసార్లు వినిపించారు. ఈ రికార్డ్ కూడా ఈయనదే.అంతేకాదు, సమకాలీన మహాగాయకులకెందరికో వయోలిన్ వాయించి, వాద్య సహకారం అందించిన ఘనత, ప్రత్యేకత కూడా బాలమురళిదే. లలితంగా, సుందర సుమధురంగా పాడడం ఈయన విశిష్టత. హడావిడి, హంగామా ప్రదర్శనలు ఉండవు. సృజనాత్మకమైన, రసాత్మకమైన,వినూత్నమైన ఆవిష్కరణలతోనే మంగళంపల్లి సంగీతజైత్రయాత్ర సాగింది.మంగళంపల్లిని అనుకరించడం, అనుసరించడం అసాధ్యం.ఆయనలాగా పాడడం అసంభవం.కొందరు అనుకరించే ప్రయత్నం చేస్తున్నా, అది కృత్రిమంగానే ఉంటుంది.బాలమురళి బాలమురళియే. అలా పాడాలంటే, మళ్ళీ ఆయనే పాడాలి. నేడు ప్రముఖ హిందూస్థానీ కళాకారిణి కౌశికీచక్రవర్తి బాలమురళి దగ్గర తిల్లానాలు

నేర్చుకున్నారు. ఇలా కొందరు శిష్యులు, ప్రశిష్యులు, ఏకలవ్య శిష్యులు ఉన్నా, అలా చెప్పుకున్నా బాలమురళి సంగీతానికి వారసులు కాలేరు. బాలమురళిని ఎవ్వరూ అనుసరించలేరు. ఆయనకు ప్రత్యామ్నాయ సృష్టి లేదు. ఆయనే ఆయనగా మళ్ళీ రావాలి.ఎనిమిదేళ్ల వయస్సులోనే సంగీత యాత్ర ప్రారంభించి, ప్రపంచమంతా కొన్ని వేల ప్రదర్శనలిచ్చారు. మహతి, సుముఖం, సర్వశ్రీ, ప్రతిమాధ్యమావతి, గణపతి, సిద్ధి, అనే ఎన్నో కొత్త రాగాలు సృష్టించారు.కొన్ని సినిమాలకు సంగీత దర్శకత్వం అందించారు. కొన్ని సినిమాల్లో పాటలు పాడారు. కొన్ని సినిమాల్లో నారదుడిగా పాత్రపోషణ కూడా చేశారు. ఆయన పాడిన సలలితరాగ సుధారస సారం, పాడనా వాణి కల్యాణిగా, ఆది అనాదియు నీవే దేవా, మౌనమె నీ బాస ఓ మూగమనసా మొదలైనవి బహుళ ప్రజాదరణ పొందాయి.ఆయన పాడని పాటలేదు. ఆయన చూడని ఊరు లేదు. ఆయన పొందని బిరుదులు, పురస్కారాలు లేవు. ఆయన ఎక్కని ఎత్తులు లేవు. ఆయన ఎత్తుకు ఎవ్వరూ చేరలేరు. ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ మూడూ పొందిన ఏకైక సంగీత విద్వాంసుడు బాలమురళి. ఫ్రెంచ్ ప్రభుత్వంవారి అత్యున్నత గౌరవం చెవెలియర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ కూడా గెలిచిన ఏకైక భారతీయ కళాకారుడు మంగళంపల్లి. త్యాగరాజ శిష్యపరంపరలోని పారుపల్లి రామకృష్ణయ్య పంతులుకు ప్రియశిష్యుడు. ఆ విధంగా, త్యాగయ్య శిష్యపరంపరలోకి కూడా వచ్చి చేరాడు. సంగీత కుటుంబంలో పుట్టి, సంగీతమే లోకంగా జీవించిన సంగీతమూర్తి. లౌకికంగా పెద్ద చదువులు చదువుకోలేదు. అలౌకికంగా, భాగవతోత్తములను ఉపాసించాడు. సంగీత సరస్వతిని ఆరాధించాడు. చదువులలోని మర్మాలన్నీ గ్రహించాడు. బహు భాషల్లో భాషించాడు. రచించాడు. ఆలపించాడు. అలరించాడు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ తర్వాత, మళ్ళీ అన్నమయ్యను ప్రజలకు అందించినవాడు ఈయనే. "ఎక్కడి మానుష జన్మంబెత్తిన ఫలమేమున్నది" అనే కీర్తన విజయవాడ రేడియో ద్వారా పాడి, తాళ్ళపాక కవిని మళ్ళీ తలపుల్లోకి తెచ్చాడు. త్యాగరాజ పంచరత్న కీర్తనలకు సాహిత్యమే ప్రాణం.తనగానంతో ప్రాణప్రతిష్ఠ చేశాడు. కాంభోజి, కల్యాణి, షణ్ముకప్రియ వంటి పెద్దరాగాలను పాడి, లక్షలమందిని కూర్చోపెట్టి వినిపించడం అంత తేలికైన పనికాదు. సలలితరాగ సుధారసంగా పాడి, అందర్నీ ఆయన పాటకు కట్టిపడేశాడు. ఇది కేవలం ఆయనకే సాధ్యమయ్యింది.మంగళంపల్లి రాగపురుషుడు, యోగపురుషుడు, యుగపురుషుడు.తన 86వ ఏట, నిద్రలోనే సునాయాసంగా శరీరాన్ని వదిలి వెళ్లిన పుణ్యపురుషుడు. బాలమురళి భౌతికంగా ఈ లోకం వదిలి వెళ్ళిపోయినా, ఆయన పాట, ఈ లోకం ఉన్నంతకాలం ఉంటుంది. జీవించి ఉంటే, నేటికి 90ఏళ్ళు నిండుతాయి. జనమరణాలకు అతీతుడైన ఈ రససిద్ధునికి అంజలి ఘటిద్దాం.

మడతకాజాజి

- బి.మల్లిక

రామ్ చరణ్, అల్లు అర్జున్... ట్రైన్ లో కూర్చొని స్వీట్‌ను తింటూ ఎంజాయ్ చేస్తున్న ఫోటో ఒకటి. ఇంతకీ ఆ ఫోటో ఎప్పటిది? ఇది 2009 నాటి ఫోటో... అప్పుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు ప్రచారం కోసం... హైద్రాబాద్‌నుండి ఓ ప్రత్యేక రైలులో... రామ్ చరణ్ , అల్లు అర్జున్ తో పాటు మరికొంత మంది సినిమా స్టార్స్... చిరంజీవికి మద్దతుగా ప్రజా రైలు యాత్ర చేశారు. రామ్ చరణ్, అల్లు అర్జున్ ఉభయ గోదావరి జిల్లాలో పార్టీ ప్రచారంలో ఉండగా.... ఫ్యాన్స్ ఇచ్చిన వరల్డ్ ఫేమస్ తాపేశ్వరం కాజా తింటున్నప్పుడు తీసిన ఫోటో. అప్పటికే అల్లు అర్జున్... గంగోత్రి, ఆర్య, బన్నీ, హ్యాపీ, దేశముదురు, పరుగు సినిమాలతో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు.! రామ్ చరణ్ కూడా చిరుత, మగధీర సినిమాలతో జనాలకు దగ్గరయ్యాడు. కానీ ఆ ఎన్నికల్లో... చిరంజీవి పార్టీ ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. 294 స్థానాల్లో పోటిచేసి 18



సీట్లనే గెల్చుకుంది. రెండు స్థానాల్లో పోటీచేసిన చిరంజీవి తిరుపతిలో గెలిచి పాలకొల్లులో ఓడిపోయారు.

సామాజిక వివక్ష తగదని ప్రబోధించిన నాటకం

మునివాహనుడు



ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనిర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231

ప్రసిద్ధ రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన నాటకం 'మునివాహనుడు'. విష్ణు భక్తుడు తిరుప్పాణ్ ఆళ్వార్ శ్రీరంగ దేవాలయ ప్రవేశించడం దీనిలోని కథ. శ్రీరంగదేవాలయ పూజారి లోకసారంగముని. తిరుప్పాణ్ అస్పృశ్యుడు. అందువల్ల దేవాలయ ప్రవేశాన్ని పూజారి అడ్డుకుంటాడు. అతనితో వాదించి, గెలిచి దేవాలయంలో తన పాదాలు పడకుండానే శ్రీరంగనాథుణ్ణి దర్శించుకోవడానికి లోకసారంగమునినే వాహనంగా చేసుకుంటాడు. మునిని వాహనంగా కలిగినవాడైనందువల్ల తిరుప్పాణ్ 'మునివాహనుడు' అయ్యాడు. భక్తి కులాలకు అతీతమైంది. దీన్ని నిరూ పిస్తూ కొందరి పట్ల సామాజిక వివక్ష తగదని ప్రబోధించిన పౌరాణిక, చారిత్రక లక్షణాలున్న నాటకమిది. సామాజిక సందేశాన్ని వీడని గొప్ప ప్రయోగాత్మక నాటకం. ఒకవైపు ప్రేక్షకుణ్ణి / పాఠకుణ్ణి రసానందభరితుణ్ణి చేస్తూనే, నాటకం పూర్తయ్యేసరికి నెమ్మది నెమ్మదిగా బహుజ నుల్లో ఒకరకమైన చైతన్యం ప్రవహించేలా చేస్తుంది. రచయిత బహుముఖ ప్రజ్ఞకు నిదర్శనంగా నిలిచే ఈ నాటకంలో ఇతివృత్తం, పాత్రల చిత్రణా తీరుతెన్నులు, రసనిర్వహణ, సన్నివేశకల్పనలు, రచనా శిల్పం ప్రేక్షకుల/పాఠకుల మనసుల్లో శాశ్వతమైన ముద్రవేస్తాయి. సంప్రదాయ పద్ధతిని పాటించి రాసిన ఈ నాటకానికి అనుగుణమైన భాష కూడా పరిమళభరితంగా అనిపిస్తుంది. 40 సంవత్సరాల క్రితం రాసిన నాటకమిది. నేటికీ దళితులకు చాలా చోట్ల ఆలయప్రవేశం నిషిద్ధం. కనుక, ఈ వస్తువు సమకాలీన సమాజంలో నేటికీ కనిపిస్తుంది.



మునివాహనుడు నాటకం వివరాలు:

కవి, రచయిత, పరిశోధకుడు, విశ్వవిద్యాలయ స్థాయిలో అధ్యాపకుడు, విమర్శకుడు, పరిపాలనాదక్షుడుగా బహు పార్శ్వాల్లో అనుభవం ఉన్న ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు రాసిన నాటకం 'మునివాహనుడు'. 1976 రాసిన ఈ నాటకం 1978లో ఆకాశవాణిలో ఒక సంగీత రూపకంగా ప్రసారమైంది. తర్వాత పౌరాణిక, చారిత్రక నాటకంగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత 1985-1988 వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది. ప్రస్తుతం, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఏ., తెలుగు (దళిత సాహిత్యం) విద్యార్థులకు 2005నుండీ పాఠ్యాంశంగా కొనసాగుతోంది.

ఈ నాటకానికి 1988లో తెలుగు విశ్వవిద్యా లయం వారి బహుమతి వచ్చింది. దీన్ని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతితో సమానంగా భావిస్తుంటారు. ఈ నాటకంపై ఇప్పటికే శ్రీవేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ మొదలైన విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. అలాగే ఇప్పటికే చాలామంది ఈ నాటకంపై పరిశోధన పత్రాలను కూడా రాశారు. ఈ నాటకం వివిధ భాషల్లోకి అనువాదం అయ్యింది. ఈ నాటకాన్ని డా॥ఎం.ఏ.కె. సుకుమార్ మరియు డా॥ మధురాంతకం నరేంద్ర ఆంగ్ల భాషలోకి అనువాదం చేశారు. డా॥ఆర్.శేషశాస్త్రి కన్నడం, డా॥జి.నరసింహన్ తమిళ భాషల్లోకి అనువదించగా, డా॥వై.సి.పి.రెడ్డి హిందీలోకి అనువదించారు. నేటికీ ఈ నాటకానికి ఉన్న ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకునే మళ్ళీ దీనిపై ఒక పరిశోధన పత్రాన్ని రాయాలనిపించింది. పైగా ఈ నాటకంలోని వస్తువు తమిళనాడులోని శ్రీరంగనాథునికి సంబం ధించింది. దీన్ని ఈ ప్రాంతంలోనే చర్చించుకోవడం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. ఇలాంటి అవకాశాన్ని కలిగించిన ఈ జాతీయసదస్సు డైరెక్టర్ డా॥ వి.శంకరరావుగార్కి ముందుగానే ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను. మునివాహనుడు నాటకానికి మూలరచనగా రచయితగానీ, ఈ నాటకంపై పరిశోధన వ్యాసాలు రాసిన వారుగాని నాకు తెలిసినంతవరకు పేర్కొనలేదు. ఆళ్వారుల జీవితాన్ని తెలిపే రచనలు, ప్రచారంలో ఉన్న కథలనుండి ఈ ఇతివృత్తాన్ని స్వీకరించి ఉంటారని డా॥జి.బాలసుబ్రహ్మణ్యం (నాటకస్రష్టగా ఇనాక్, 1999-71) అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాన్నే నేనూ విశ్వసిస్తున్నాను.

నాటకేతివృత్తం:

మునివాహనుడు నాటకాన్ని రచయిత ప్రదర్శనకు అనుగుణంగా అయిదు అంకాలుగా విభజించారు. దీనిలో తిరుప్పాణాళ్వారు, లోకసారం గముని, శ్రీరంగనాథుడు, వేదవేద్యుడు, దేవదత్తుడు ముఖ్యపాత్రలుగా కనిపిస్తాయి. హిందూమతంలోని వైష్ణవ శాఖలో ఆళ్వారు సంప్రదాయం ఉంది. ఆళ్వార్లు తమ పాశురాల(కీర్తనల)తో విష్ణువుని కీర్తిస్తారు. ఆళ్వార్లలో పన్నెండు మంది ప్రసిద్ధి. వీరిలో తిరుప్పాణాళ్వారు ఒకడు. ఇతడు పాణ్ కులస్తుడు. సమాజంలో ఈ కులస్తుల్ని అస్పృశ్యులుగా భావిస్తున్నారు. నాటకాన్ని విశ్లేషించుకునే ముందు, దీని సారాంశాన్ని తెలుసుకుందాం.

ప్రథమాంకంలో... తిరుప్పాళ్వారు శ్రీరంగనాథుణ్ణి దర్శించుకోవాలని దేవాలయానికి వెళ్తాడు. అతడు భక్తియే రూపం దాల్చిన వాడిగా దేవుణ్ణి కీర్తిస్తూ పాడుతుంటే భక్తులంతా మంత్రముగ్ధులవుతుంటారు. అయినప్పటికీ, అతడు అస్పృశ్యుడు కావడం వల్ల పూజారి సారంగముని దేవాలయంలో ప్రవేశించడాన్ని నిరాకరిస్తాడు. అతడు దేవాలయ ప్రవేశం చేస్తే ధర్మహాని జరుగుతుందనీ, దేవుడు మైలపడిపోతాడనీ పూజారి వాదిస్తాడు.

ద్వితీయాంకంలో... ప్రతిరోజు ఆలయ ప్రధాన పూజారి సారంగముని కావేరి నదీతీరంనుండి తీర్థాన్ని తెచ్చి శ్రీరంగేశ్వరస్వామిని పవిత్రం చేస్తుంటాడు. తిరుప్పాణ్ తనకు తెలియకుండానే భక్తిపారవశ్యంతో ఆ నదీతీరంలో రకరకాల చోట్ల తపోనిష్ఠలో కూర్చుంటుంటాడు. తిరుప్పాణ్ అలా కూర్చొన్న ఆ స్థలమంతా అపవిత్రమైందని భావిస్తుంటాడు పూజారి. తాను అనేక రేవుల్లో నీళ్ళు తెచ్చి స్వామిని అభిషేకిస్తుంటే, కావాలనే తిరుప్పాణ్ ఆ ప్రాంతాలను అపవిత్రం చేస్తున్నాడని కోపించి రాయితో కొడతాడు. అంతేకాకుండా అలా అపవిత్రం చేయవద్దని తన శిష్యుడి ద్వారా తిరుప్పాణ్‌కి చెప్పే ప్రయత్నం చేస్తాడు. కానీ, తాను కావాలని అలా చేయడం లేదనీ, అప్రయత్నంగానే తాను అలా రకరకాల రేవుల్లో భక్తితో పాడుకుంటూ పారవశ్యం చెందుతున్నట్లు చెప్తాడు. ఒక వేళ దేవాలయంలోని పవిత్రస్థలాల్ని ముట్టుకొనే ప్రధాన పూజారైన లోకసారం గముని కావేరీతీరంలో అడుగు పెడితే తానూ పవిత్రుణ్ణవుతాని కూడా తిరుప్పాణ్ భావిస్తాడు. కానీ, తిరుప్పాణ్ కావాలనే నదీతీరాలన్నింటినీ అపవిత్రం చేస్తున్నాడని అతణ్ణి రక్తం వచ్చేటట్లు లోకసారంగముని రాయితో కొడతాడు. రాయికీ, దేవాలయంలోని శిలకూ మధ్య గల భేదాల గురించి శిష్యుడు వేదవేద్యుడు ఆలోచిస్తూ, తిరుప్పాణ్‌ని ముట్టుకొని, కారుతున్న రక్తాన్ని తుడిచి, కట్టుకడతాడు. అలా అతణ్ణి ముట్టుకొని కట్టుకట్టినందుకు వేదవేద్యుణ్ణి కూడా దేవాలయ ప్రవేశం కోల్పోతావని బెదిరిస్తాడు పూజారి. అతణ్ణి తాకినందుకు వేదవేద్యుణ్ణి కూడా పంచముడిగా భావిస్తూ రాళ్లు దెబ్బలు తప్పవంటాడు.

తృతీయాంకంలో... పూజారి సారంగముని ప్రతిరోజు కావేరినదీతీరంనుండి తీర్థం తెచ్చి శ్రీరంగనాథుణ్ణి అభిషేకం చేస్తుంటాడు. అలాగా తిరుప్పాణ్‌ని రాయితో కొట్టిన మర్నాడు కూడా నదీతీరానికి వెళ్ళి తీర్థం తీసుకొస్తాడు. తాను తిరుప్పాణ్ తపోనిష్ఠలో ఉన్న ప్రాంతంనుండే ఆ పవిత్ర తీర్థాన్ని తెస్తున్న సంగతినే పూజారి మర్చిపోతాడు. దీన్ని అంతటినీ శిష్యులు దూరంనుండి గమనిస్తుంటారు. పంచముడైన తిరుప్పాణ్‌ని ముట్టుకున్నందుకు దేవాలయ ప్రవేశ బహిష్కరణకు గురైన వేదవేద్యుడు కూడా దాన్ని గమనిస్తాడు. దేవాలయం దగ్గరకు వచ్చిన తర్వాత పూజారి తన నియమ నిష్ఠలను తానే ఉల్లంఘించినందుకు దేవాలయ ప్రవేశార్హత కోల్పోయారని పూజారితో వాదిస్తాడు. దానితో తనకు తెలియకుండా జరిగిన తప్పుకి తాను బాధ్యుణ్ణి కాదంటాడు. కానీ, తిరుప్పాణ్ కూడా తనదైన తపోనిష్ఠలో ఉన్నాడు. తానేమీ కావాలని ఆ నదీతీరాల్ని మలినం చేయలేదు. అయినా అతణ్ణి కొట్టిగాయపరచడం, ఆగాయానికి కట్టుకట్టినందుకు తనని శిక్షించడం నేరమని వేదవేద్యుడు వాదించి, పూజారికి దేవాలయ ప్రవేశాన్ని నిషేధిస్తాడు. దానితో ఒక్క క్షణం కూడా తాను శ్రీరంగనాథుణ్ణి చూడకుండా ఉండలేనని పూజారి ఆవేదనకు గురవుతాడు. తన పూజను శ్రీరంగనాథుడు ఇష్టపూర్వకంగా స్వీకరించడం లేదనీ, ప్రసన్నవదనంతో కనికరించడం లేదని వ్యథచెందుతాడు. కానీ, వేదవేద్యుడు అంతకుముందున్న స్థితిలోనే శ్రీరంగనాథుడున్నాడనీ, పూజారిలోని మాలిన్యం, తిరుప్పాణ్ పట్ల జరిగిన తప్పుల వల్ల మానసికంగా క్రుంగిపోతాడు.

చతుర్థాంకంలో... కావేరీ నదీతీరంలో తన్మయుడై తపస్సు చేసుకుంటూ, పాటలు పాడుకుంటు, ధ్యానముద్రలో గడుపుతుంటాడు తిరుప్పాణ్. అతని పాటలకు శ్రీరంగనాథుని ఆలయంలోని గుడిగంటలు ప్రతిధ్వనిస్తుం టాయి. దేవాలయంలో వెలుగురేఖలు విస్పారుతుంటాయి. వీటన్నింటినీ దేవదత్తుడు, వేదవేద్యుడు చర్చించుకుంటారు. అదంతా తిరుప్పాణ్ భక్తివల్లనే జరుగుతుందనీ, అది శ్రీరంగనాథుని సందేశంగాను భావిస్తుంటారు.

వ్యాకులచిత్తుడై ధ్యానంలో ఉన్న పూజారి లోకసారంగమునికి శ్రీరం గనాథుడు ప్రత్యక్షమౌతాడు. తన భక్తుడైన తిరుప్పాణ్‌ని దేవాలయంలోకి అనుమతించి తన దర్శనం చేసుకోవడానికి అవకాశాన్ని కల్పించమంటాడు. కానీ, పూజారి దానికి ఒప్పుకోడు. అంటరానివాణ్ణి దేవాలయంలోకి రానివ్వడం జరుగదంటాడు. తన కోసమే కట్టిన దేవాలయం కనుకు, తానే అనుమతిస్తున్నందున అపవిత్రత ఉండదంటాడు దేవుడైన శ్రీరం గనాథుడు. కానీ, తమకోసం దేవాలయాన్ని నిర్మించుకున్నామని, తమ నియమానుసారంగానే దేవాలయ నిర్వహణ జరగాలంటాడు పూజారి. అలా కాదంటే ముప్పైమూడు కోట్ల దేవతల్లో ఎవరొకరిని దేవుడిగా ప్రతిష్ఠిస్తామని బెదిరిస్తాడు. తన ఆజ్ఞను కూడా తిరస్కరించేసరికి దేవుడైన శ్రీరంగనాథుడు కళ్ళెర్ర జేసి, కళ్ళనుండి రక్తం కారుస్తుంటాడు. ఆ దృశ్యాన్ని చూసిన పూజారి ఆ రూపాన్ని చూడలేకపోతున్నానంటాడు. ప్రసన్నవదనంతో కనిపించమంటాడు. అలా ప్రసన్నంగా కనపించాలంటే తన భక్తుడైన తిరుప్పాణ్ దేవాలయానికి వచ్చి తనని దర్శించుకోనివ్వాలంటాడు. పూజారితో సుదీర్ఘంగా సంభాషిస్తాడు. ఫలితంగా కొన్ని షరతులకు లోబడి దేవాలయం తిరుప్పాణ్ పాద స్పర్శవల్ల అపవిత్రం కాకుండా పూజారి తన భుజాలపై ఎక్కించుకొనైనా వచ్చి తన దర్శనం చేసుకోనివ్వాలంటాడు.

పంచమాంకంలో... కావేరీతీరంలో ధ్యానముద్రలో ఉన్న తిరుప్పాణ్ దగ్గరకు వెళ్ళి పూజారి దేవాలయానికి తన భుజాలపై కూర్చోబెట్టుకొని తీసుకొస్తాడు. పంచముణ్ణి ముట్టుకోకూడదన్నప్పటికీ, ఇదంతా శ్రీరంగనాథుని ఆదేశానుసారంగా చేస్తున్నానంటాడు పూజారి. దేవాలయంలోకి తీసు కొచ్చిన తర్వాత తిరుప్పాణ్ తన్మయంతో శ్రీరంగనాథుణ్ణి దర్శించుకొని తాదాత్మ్యంతో పాడుతూ దైవంలో ఐక్యమైపోతాడు. మానవుడే మాధవుడిగా మారిపోయి, భౌతికరూపంలో కాకుండా శబ్దరూపంలో ప్రజలందరికీ

దేవాలయంలోనే తిరుప్పాణ్ శ్రీరంగనాథుడిలో దర్శనమిస్తుంటాడు. తిరుప్పాణ్ పాడిన పాశురాల్ని వేదవేద్యుడు భద్రపరిచి తర్వాత వాటిని ప్రాచుర్యంలోకి తీసుకొస్తాడు.

మునివాహనుడు నాటక శిల్ప విశేషాలు:

భక్తిని ప్రధాన రసంగా చేసుకొని, ఒక అస్పృశ్యుణ్ణి కథానాయకుడిగా తీసుకొని, పౌరాణికేతివృత్తాన్ని చారిత్రక విషయాలతో సమ్మేళనం చేసి రాయడం ఒక గొప్పశిల్ప వైవిధ్యం. నాటక రచనలో సందర్భానుసారంగా ఛందోబద్ధపద్యాలను వర్ణించడం రసావిష్కరణకు చక్కని అవకాశాన్నిచ్చింది. ఆకాశవాణిలో సంగీత రూపకంగా ప్రసారమైనప్పుడు దాన్ని వింటే బహుశా ఆ సంగీతం, దానికి అనుగుణమైన పాటలు, పద్యాలు నాటి శ్రోతలకు మరింత రసానందాన్ని కలిగించి ఉండొచ్చు. శ్రవ్య నాటకం మళ్ళీ శ్రవ్య కావ్య లక్షణాల్ని సంతరించుకొని పాఠకుల్ని కూడా ఆకర్షణీయమైన శైలిలో చదివిస్తుంది. దీనిలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీరంగనాథుడు, శ్రీవేంకటేశ్వరుడు...ఇలా వీరంతా వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారని వర్ణించారు. శ్రీరంగనాథుడు, తిరుప్పాణ్, పూజారి లోకసారంగముని సందర్భోచితంగా దైవసాన్నిధ్యంతో మమేకమైనప్పుడు వారి నోటినుండి పలికించిన సంస్కృత సమాస భూయిష్ట శబ్దవిన్యాసం ఔచిత్యభరితంగా ఉంది. భక్త్యావేశాన్ని అర్థం చేసుకుంటేనే ఆస్తోత్రాల్లోని పరమార్థం అర్థమవుతుంది. పైగా సంస్కృతాన్ని దైవభాషగా కూడా చెప్తుంటారు. అందువల్ల కూడా ఈ రకమైన భాషాశైలిని ఎన్నుకున్నారనుకుంటున్నాను. రచయిత ఒక్కొక్క వర్ణనలో కొండంత భావాన్ని ఇమడ్చగలిగారు.

'వార్ధిపోలిన నల్లనయ్యా ఉలుకు పలుకులు లేవురా' అని తిరుప్పాణ్ పద్మాసనంలో కూర్చున్నప్పుడు (ప్రథమాంకంలో) పలికినట్లు వర్ణించారు రచయిత. సముద్రాన్ని దూరంనుండి చూస్తే నల్లగా ఉన్నట్లు కనిపిస్తుంది. అలాగే ప్రశాంతంగా ఉన్నట్లూ అనిపిస్తుంది.శ్రీరంగనాథుడు కూడా శ్రీకృష్ణుడిలా నీలమేఘచ్ఛాయవాడు. తిరుప్పాణ్ పంచముడని, అతన్ని దేవాలయంలోకి రాకుండా అడ్డుకుంటున్నా, వాళ్ళనేమీ అనకుండా నిశ్శబ్దంగా ఉన్న స్థితిని తన పాటలోని చరణంలో పలికించాడు రచయిత. దీని ఫలం చతుర్థ, పంచమాంకాల్లో చూపించారు రచయిత. సముద్రం దగ్గరకు వెళ్ళిన తర్వాత, దాని లోతులు చూడాలనుకున్నవాళ్ళకి మాత్రమే ఆ సముద్రఘోష వినిపిస్తుంది. దాని అసలు రంగు నలుపో, తెలుపో కూడా తెలుస్తుంది. అదే జరిగిందీనాటకం చతర్థ, పంచమాంకాల్లో.

"కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకున్తలా

తత్రాపి చతుర్థోంక: తత్ర శ్లోక చతుష్టయమ్" అని లాక్షణికుల సంప్రదాయం. సంప్రదాయ నాటకాల్లో చతుర్థాంకానికి ప్రాధాన్యం ఉంటుంది. ఆ సంప్రదాయాన్ని ఈ నాటకంలో కూడా పాటించారు. దేవుణ్ణి ఈ చతుర్థాంకంలోనే ప్రత్యక్షంగా పూజారితో మాట్లాడించారు. దేవాలయ ప్రవేశార్హత నిషేధింపబడిన భక్తుడి తరపున దేవుడే మాట్లాడాడు. దేవుడే తన దేవాలయానికి రానివ్వనన్నవాళ్ళచేతనే భుజాలపై మోసుకొచ్చేలా చేశాడు. దేవాలయమే అలాంటి భక్తుడి మాహాత్మ్యంతో నిండిపోయేలా వర్ణించారు. శ్రీరంగనాథుడు తిరుప్పాణ్ గురించి వర్ణిస్తూ 'నిర్మలీమనమూర్తి' అన్నారు. అరిషడ్వర్గాలను జయించి నిర్మలమైన మనసుతో భగవంతుని దర్శనానికై మూర్తీభవించినభక్తుడనే భావన వ్యక్తమవుతుంది. అటువంటి వ్యక్తికి అంటరానితనమేమిటనేది శ్రీరంగనాథుని వివరణ. నాటకంలో సాధారణంగా చతుర్థాంకానికి ప్రాముఖ్యాన్నిస్తారు. కానీ, ఈ నాటకంలో చతుర్థాంకంతో పాటు, పంచమాంకానికి కూడ అత్యధిక ప్రాధాన్యాన్నిచ్చారు. పంచమాంకంలో లోకసారంగముని భుజాలపైనుండి శ్రీరంగనాథుణ్ణి దర్శించుకుంటూ ఆయనలో లీనమైపోయినట్లు చేసిన వర్ణన నేటి సినిమాల్లో చూపించే గ్రాఫిక్స్ లా అనిపిస్తుంది. ఇది గొప్ప భావుకతకు, రచయిత ప్రతిభకు నిదర్శనంగా నిలిచే సన్నివేశ కల్పన. తిరుప్పాణ్ శిరస్సు, ఉరము, ఉర:స్థల కింద భాగం... ఇలా ఒక్కొక్కటీ శ్రీరంగనాథునిలో లీనమైపోతుంటే, భుజం మీద లోకసారంగముని బరవు తగ్గిపోతున్నట్లు వర్ణించారు. దీనితో పాటు ఔచిత్యభంగం లేకుండా తిరుప్పాణ్ తలక్రిందులుగా శ్రీరంగనాథునిలో ఐక్యమైపోతున్నా 'భక్తుని నయనాలు' భగవంతుని పాదాల్లో ఐక్యమైపోయినవి' అన్నారు. హిందూ మతంలో దేవుళ్ళ పాదార్చనకు చాలా ప్రాముఖ్యముంది. ఈ సంప్రదాయాన్ని విస్మరించకుండా, ఈ సన్నివేశాన్ని కల్పించడం రచయిత రచనా నైపుణ్యానికి నిదర్శనం.

తిరుప్పాణ్ నోటితో ఇలా అనేక సందర్భాల్లో పలికించారు రచయిత. తిరుప్పాణ్ భగవంతుణ్ణి దర్శించినప్పుడు కలిగే ఆనందోత్సాహాలు, ఆ సందర్భంలో వచ్చే స్తోత్రాలు, భగవద్వర్ణన, అవతార స్వరూపం ఇలా రచయిత తన రచనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. "శ్రీ మహావిష్ణువు! శ్రీరంగనాథా శ్రీ పరంధామా! నా రంగనాథా! "; "విశ్వాంతరాళాల కెగబ్రాకెడు విరాడ్రూపా!, బ్రహ్మాది దేవదేవతా పూజిత పాదపద్మా!, శత బాణ సంహృత రావణాసురా!, పరిమళోద్యాన శ్రీరంగప్రభూ!" "వేంగడాగ్రోత్తర ప్రాంగణా నివాసప్రభూ!", "తుమ్మెదల ఝుంకారాలతో విలసిల్లు పుష్పోద్యాన ప్రభూ! శ్రీ రంగధామా! చంద్రమౌళి పాపక్షాళన తత్పరా!" విష్ణుసహస్ర నామావళిలా శ్రీరంగనాథుణ్ని అనేక విశేషణాలతో సంస్కృతపదబూయిష్టంగా వర్ణిస్తుంటే పాఠకుడు ఆ శైలికి పారవశ్యం చెందుతాడు. ఒక్కొక్క నామావళికి విష్ణువు యొక్క ఒక్కొక్క అవతారం స్ఫురించేలా చక్కని శైలీశిల్పాన్ని ప్రదర్శించారు. ఇలాంటి వర్ణనలను గమనించినప్పుడు శ్రీవిష్ణువే, శ్రీరాముడిగా, శ్రీకృష్ణుడిగా, శ్రీవేంకటేశ్వరునిగా, శ్రీరంగనాథునిగాను అవతరించినట్లు ఈ నాటకం స్పష్టం చేస్తుంది. సందర్భోచిత భాషాశైలి నాటక రచనలో ఉత్తమశిల్పానికి నిదర్శనం. అది ఈ నాటకంలో కనిపిస్తుంది.

నాయకుడు– అంగిరసం:

నాటకంలో నాయకుడు ప్రధానం. దీనిలో తిరుప్పాణ్ నాయకుడు. ప్రతి నాయకుడనదగిన వాడు దేవాలయ ప్రధాన పూజారి లోకసారంగముని. లోకంలోని సనాతన పూజారుల సారం అంతా ఒకటిగా చేస్తే 'లోకసారంగముని' అవుతాడనిపిస్తుంది. దేవాలయ ప్రవేశం చేయాలనేది తిరుప్పాణ్ ఒక్కడి ఆకాంక్ష మాత్రమే కాదు; అది అస్పృశ్యులందరి కోరిక! గుణ కర్మలను బట్టి నాలుగు వర్ణాలను తానే సృష్టించాననీ, జన్మవల్ల కాకుండా, కర్మవల్ల వారికి సమాజంలో వివిధ అర్హతలు లభిస్తాయని దేవుడే చెప్పినట్లు హిందూమత గ్రంథాలు చెప్తాయి. ఈ నాటకంలో కూడా శ్రీరంగనాథుడితో తిరుప్పాణ్ "జన్మవల్ల కాదు, కర్మవల్ల పవిత్రాపవిత్రతలు ప్రవర్తిల్లుతాయి" (మునివాహనుడు, 2002-95) అనిపిస్తారు రచయిత.

ఇక్కడ కర్మ సిద్ధాంతాన్ని రచయిత అంగీకరిస్తున్నాడనిపిస్తుంది. అలాగే

దళిత సాహిత్యం దేవుడున్నాడని ఒప్పుకుంటుందా? అనేవి కొన్ని చర్చనీయాంశాలు. ఈ నాటకంపై పరిశోధన చేసిన డా.డి.ఎస్. బషీర్ (మునివాహనుడు నాటకం–ఇనాక్‌గారి దృక్పథం, 1999–145) అభిప్రాయంలో ఇది సామాజిక స్పృహ ఉన్న ప్రసిద్ధ నాటకంగాను, రచయిత అభ్యుదయభావాలుగలవాడుగాను పేర్కొన్నారు. ఈనాటకం రాసే నాటికి హరిజనాభ్యుదయాకాంక్ష చాలామందిరచనల్లో వ్యక్త మవుతున్నా, నాటికి నేడున్నంత దళిత తాత్త్వికత రచనల్లో ప్రతిఫలి స్తునట్లు భావించలేం. పైగా ఈ నాటకం వైష్ణవ మతేతివృత్తానికి చెందింది. ఈ వాదనలెలా ఉన్నా దానిలోని పౌరాణిక వస్తువుని విస్మరించకుండా నాటకాన్ని రాయడం రచయిత బాధ్యత. అలాగే తన దృక్పథాన్నీ వెల్లడించాల్సి ఉంటుంది. రచయితకున్న అభ్యుదయదృక్పథమే తిరుప్పాణ్‌ని, లోకసారం గమునిని రెండు భిన్న భావజాలాలకు ప్రాతినిథ్యంగా తీసుకోవడానికి కారణమయ్యింది. సంస్కరణోద్యమంలో హరిజనులు భాగస్వాములు కావడానికి ఒక ప్రధాన కారణం–సామాజిక వివక్షను అంచలంచెలుగా పారద్రోలడం ఒక లక్ష్యం. దీనిలో కూడా సామాజిక మార్పు ఉంటుంది. దీన్నే రచయిత ఈ నాటకం ద్వారా కళాత్మకంగా సామాజిక పరివర్తనను ఆశించారనుకుంటున్నాను. అంతే తప్ప కర్మసిద్ధాంతాన్ని సమర్థించడం, దేవుడున్నాడని స్థిరీకరించడం ఈనాటకం ప్రధాన లక్ష్యాలు కాదు. అది రచయిత దృక్పథం అసలేకాదు. ఇవి తెలియాలంటే ఈ రచయిత రాసిన ఇతర సృజన రచనలతో పాటు, ఈయన రాసిన విమర్శను అధ్యయనం చేసి ఒక అభిప్రాయానికి రావాల్సి ఉంటుంది.

ఈ నాటకంలో కావ్యనాయకుడు సామాజిక పరివర్తన కోసం తన జీవితాన్నే త్యాగం చేయడానికి ఉత్సాహాన్ని చూపాడు. తనది నిష్కళంకమైన భక్తి అని నిరూపించాడు. ఉత్సాహం స్థాయీభావంగా ఉండే రసాన్ని వీరసరమని ఆలంకారికులు చెప్పారు. అయితే భక్తి ద్వారా ఈ ఉత్సాహం ప్రదర్శితమైంది. కాబట్టి వీరంలో గల దయావీరం, ధర్మవీరం, దానవీరం, త్యాగవీరం మొదలైన వీరరసంలోని రకరకాల భేదాలను గుర్తిస్తే భక్తి వీరం కూడా ఒక రసంగా కనిపిస్తుంది. అయితే, మధుసూధనసరస్వతి 'భక్తిరసాయనం' లో "భగవద్గుణ శ్రవణం ద్వారా మనోవృత్తులు ఉద్దీపిత మైనప్పుడు భగవదాకారంతో సంలీనం అయ్యే చిత్తవృత్తిని భక్తి" (మధు సూధన సరస్వతి. భక్తిరసాయనము, ప్రథమాశ్వాసం–3,వ్యాఖ్య: పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, సాధన గ్రంథమండలి : తెనాలి. 1953.) అని పిలిచారు. భక్తిని శృంగారంలో ఒక భాగంగానే భావించారు. కానీ, వీర రసంలో భాగంగా చూడలేదు. అందుకే ఇతివృత్తాన్ని స్వీకరించడంలోను, దాన్ని పౌరాణిక, చారిత్రక నాటకంగా మలచడంలోను, రసపోషణ, సన్నివేశ కల్పనల్ని బట్టి ఒక ప్రయోగాత్మక నాటకంగా కనిపిస్తూనే, సామాజిక ప్రయోజనాల సమ్మేళనంగా భాసిల్లుతోంది. దీన్ని నాటకరచయిత కూడా గుర్తించారు. కనుకనే "వస్తువు నాటకమయిన తర్వాత అది ప్రయోజనకారి అయితే లక్షణ పరామర్శ ఆవశ్య కర్తవ్యమే" (మునివాహనుడు, పుట: 114) అనడం ద్వారా లక్ష్యాలకు అనుగుణంగా లక్షణాలు రూపొందించుకోవాలనే సూచన చేసినట్లయ్యింది.నాటకంలో నాటక లక్షణాలను పాటిస్తూ నాందీ ప్రస్తావనను మంగళకరంగానే వర్ణించారు.

"శ్రీయుతుడు శాంతచిత్తుడు శిష్టరక్ష
కుండు దుష్ట శిక్షణ ధర్మమండితుండు
లోకసారంగముని వాహనాకరుండు
విష్ణుదేవుండు మిమ్ము దీవించుగాక!" (మునివాహనుడు, పుట: 57) అని సూత్రధారుని చేత మంగళావాచకంగా పలికిస్తారు. తర్వాత వసంత ఋతువర్ణన చేసినా, దీనిలో శృంగార రసానికి అవకాశం లేదు. దీన్ని డా.జి.బాలసుబ్రహ్మణ్యం (నాటకస్రష్టగా ఇనాక్, (వ్యాసం), ఆచార్య కొలకలూరి ఇనాక్ షష్ఠి పూర్తి సన్మాన సంచిక, 1999 – 71) వివరిస్తూ "ఈఋతువుతో మోడు వారిన వ్యవస్థను తిరుప్పాణ్ చిగురు చెట్లు చిగుర్చుతాయి. అంటే మోడు వారిన దళిత వ్యవస్థకు తిరుప్పాణ్ చిగు రులాంటి వాడని రచయిత అభిప్రాయంగా తెలుస్తుంది. అట్టడుగు వర్గాలకు మంచి రోజులు వచ్చాయని చెప్పడానికే రచయిత వసంత ఋతుగానం చేయించాడనుకోవలసివుంది" అని చక్కగా వ్యాఖ్యానించారు.

వర్ణనల్లో కూడా వైష్ణవ సంప్రదాయాన్ని నాటకరచయిత చక్కగా పాటించారు. చతుర్థాంకంలో తిరుప్పాణ్ కావేరీ నదీ తీరంలో చేస్తున్న తీవ్రమైన, నిష్కళంకమైన తపోశక్తి వల్ల శ్రీరంగనాథుని దేవాలయంలో గుడిగంటలు నిరాటంకంగా మోగుతుంటాయి. దీన్ని శ్రీచారి (దురాచారంపై దూసిన అస్త్రం, మునివాహనుడు, 2012–32) ఇలా వ్యాఖ్యానించారు. "మునిలో అప్పటి వరకు ఉన్న అస్పృశ్యాది మలిన భావనలు రాక్షసుల వంటివని, ఇప్పుడవి తొలిగి మానవుడే మాధవుడని కలిగిన భావన దేవతల్లాగ పవిత్రమైందని తెలపడమే గంటలు మోగడంలోని ఆంతర్యం" అయితే, దీన్నిక్కడ చర్చించుకోవాలి. శ్రీచారిగారు తన వ్యాసంలో దీన్ని పంచమాంకంలోని జరిగిన దృశ్యంగా చెప్పారు. అలాగే పూజారి లోకసారంగముని తన భుజాలపై తిరుప్పాణ్ ని కూర్చోబెట్టుకొని దేవా లయంలో ప్రవేశించినట్లు పొరపాటున రాశారో, సరిగ్గా గమనించలేదో తెలియదు. రచయిత కొలకలూరి ఇనాక్‌గారు ఈ సన్నివేశాన్ని చతుర్థాం కంలో వర్ణించారు. దేవాలయానికి అప్పటికి ఇంకా తిరుప్పాణ్ చేరుకోలేదు. కావేరీ నదీతీరంలోనే తీవ్రమైన తపస్సులో నిమగ్నమయ్యాడు. ఈ దశ్యాన్ని వేదవేద్యుడు, దేవదత్తులు చర్చించుకోవడం ద్వారా మనకు తెలుస్తుంది. రచయిత చాలా శక్తివంతంగా తన సన్నివేశ కల్పనను చేశారు. తిరుప్పాణ్ దేవాలయానికి రాకముందే అతనెక్కడో తపస్సు చేసుకుంటున్నా దాని ప్రభావం దేవాలయ పరిసరాల్ని కూడా దివ్య మయం చేస్తుందనేది రచయిత లక్ష్యం కావచ్చు. ఇక, అస్పృశ్యత, మలిన భావనలు పోవడం వంటి ఆలోచనలు రచయిత ఉద్దేశించారనుకోలేం. ఎందుకంటే అంతకు ముందే తిరుప్పాణ్ తనకు తెలియకుండానే కావేరీ తీరంలోని వివిధ ప్రాంతాల్లో తపస్సుకి కూర్చుంటాడు. అక్కడకు పూజారి వచ్చి తీర్థాన్ని తీసుకెళుతుంటాడు. కానీ, పూజారి మాత్రం అంటరాని వాడైన తిరుప్పాణ్‌ని మతిభ్రమించిన వాడిగా భావిస్తాడు. తిరుప్పాణ్ కావాలనే నీళ్ళను అపవిత్రం చేస్తున్నాడనుకొంటాడు. తిరుప్పాణ్‌ని నిలదీసినప్పుడు తాను నీళ్ళను అపవిత్రం చేస్తున్న సంగతే అతనికి తెలియదని స్పష్టమవుతుంది. అలాగే, పూజారి ఒకసారి తనకు తెలియ కుండానే తిరుప్పాణ్ ధ్యానముద్రలో ఉండగా అక్కడికి వెళ్ళి తీర్థాన్ని తెస్తాడు. దీన్ని బట్టి దేవాలయంలోకి తిరుప్పాణ్‌ని పూజారి తన భుజాలపై కూర్చోపెట్టుకొని తీసుకొచ్చేనాటికి తిరుప్పాణ్ మలినంగా ఉన్నాడను కోవడానికి వీల్లేదు. అందువల్ల తిరుప్పాణ్‌లో అస్పృశ్యత, మలినాలు అప్పటికి పోయాయనే వ్యాఖ్య సరైంది కాదనిపిస్తుంది. గుడిగంటలు గణగణ మ్రోగడంలోని ఆంతర్యాన్ని వ్యాసరచయిత శ్రీచారి అన్నట్లు రాక్షసభావాలు పోవడం, దైవీయగుణాలు రావడం అనే వ్యాఖ్య బాగుంది.

కాకపోతే, అది తిరుప్పాణ్ లో కాదు, పూజారి లోకసారంగమునిలో అని సమన్వయించి ఉంటే బాగుండేది.

ఆళ్వార్లు–తిరుప్పాణాళ్వారు:

ఆళ్వార్లు సుమారు నాలుగువేల పాశురాలను రాసి, పాడినట్లు సాహిత్య చరిత్ర ద్వారా తెలుస్తుంది. ఈ పాశురాలన్నింటినీ కలిపి నాలాయిర దివ్యప్రబంధం లేదా ద్రవిడవేదం అని పిలుస్తుంటారు. (పాలవంచ తిరుమల గుదిమెళ్ళ వేంకట లక్ష్మీన ృసింహాచార్యులు, 1994–1). ఈ పాశురాలను రాసిన, పాడిన వాళ్ళు పన్నెండుమంది. వీరినే పన్నిద్దరు (12) ఆళ్వార్లు అంటారు. వీరిలో తిరుప్పాణాళ్వారు ఒకడు. 'తిరు' అంటే 'శ్రీ' అనీ,'పాణ్' అనేది వాళ్ళ కులాన్ని తెలియజేస్తుంది. 'ఆళ్వారు' అంటే దైవభక్తిలో మునిగినవాళ్ళు, విజ్ఞాన ఖనులు, కాపాడేవాళ్ళు అనేఅర్థవివరణలు కనిపిస్తున్నాయి. దీనితో పాటు భగవద్గుణానుభవం అనర్ఘళంగా స్వర్గంగలా వీరి వాక్కులనుండి ద్రావిడభాషా రూపంలో వెలువడి, శ్రీవిష్ణువుని నమ్ముకున్నవాళ్ళని కాపాడ్డానికి భక్తి అనే జ్ఞానాన్ని పంచుతూ ప్రజలను కాపాడేవాళ్ళు అనే అర్థంలో 'ఆళ్వారులు' పేరు వ్యవహారంలో కనిపిస్తుంది. తిరుప్పాణ్ ఆళ్వారు తమిళనాడులోని ఉరయూర్‌కి చెందిన వాడు. క్రీ.శ. 8వశతాబ్దికి చెందిన చారిత్రక వ్యక్తి. ఇతనికి పానార్, మునివాహనుడు, యోగివాహనుడు, కవీశ్వరుడు అనేపేర్లుకూడా ఉన్నాయి.(అయాచితం నటేశ్వరశర్మ, 1992–ఙ–ఙఙ)

తిరుప్పాళ్వారు 'పాణ్' కులానికి చెందిన వాడని చెప్పుకున్నాం. సంగీత ప్రియులైన పాణ్ కులస్తులు వీణావాదనలోను, సంకీర్తనలు పాడడంలోను ప్రఖ్యాతులై రాజాస్థానాల్లో సన్మానాలు కూడా అందుకున్నవాళ్ళు. వైష్ణవాల యాల్లో దేవదాసీలకు తోడు నీడగా ఉండటం, క్రమేపీ కళావంతులకు ఆదరణ తగ్గిపోవడంతో వీరి సామాజిక జీవనంలో మార్పులొచ్చాయి. క్రమేపీ వీళ్ళంతా అస్పృశ్యులుగా గుర్తింపుపొందారు.

మునివాహనుడు – సామాజికాంశాల విశ్లేషణ:

ఈ 'మునివాహనుడు' నాటకంలో రచయిత ఆచార్య కొలకలూరి ఇనాక్ వివిధ పాత్రలను కల్పించడంలో కూడా సంక్షిప్తతను పాటించారు. కేవలం నాలుగు మనుష్య పాత్రలను, ఒక దైవపాత్రను మాత్రమే తీసు కున్నారు. వేదవేద్యుడు, దేవదత్తుడు హిందూమతంలోని భిన్నభావాలకు సంఘర్షణ పాత్రలుగా చిత్రించి, చివరికి వేదవేద్యుని వాదనలోని వాస్తవికతను గుర్తించి దేవదత్తుడు కూడా పరివర్తన చెందినట్లు తీర్చిదిద్దారు. సనాతన హిందువుల్లో కూడా సహృదయులు, ఆలోచనా పరులున్నారనే భావాలకు ప్రాతినిథ్యంగా వేదవేద్యుని పాత్రను తీర్చిదిద్దారు. ఈ పాత్రల ద్వారా సమాజంలో వస్తున్న మార్పుని సూచించినట్లయ్యింది. తిరుప్పాణ్ పాత్ర గురించి రచయిత చెప్తూ "ఎన్నోతరాలుగా దేవుని సందర్శింపలేని జాత్యావేదన ఏకీకృత రూపమతడు. తిరుప్పాణ్ ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ" (మునివాహనుడు, పుట: 105) అనడం ద్వారా సమాజంలో అసమా నతలకు కారణమవుతున్న ఒక తీవ్రమైన సమస్యకు కళాత్మక రూపంగా పౌరాణికేతి వృత్తాన్ని స్వీకరించి, చారిత్రక అనుభవాల్ని మేళవించి, సామాజిక పరివర్తనలో వివక్ష రహిత సమాజాకాంక్షతో ఈ నాటకాన్ని బాధ్యతాయుతంగా రాసినట్లు భావించాలి.

పాత్రపోషణలో వేదవేద్యుడు, దేవదత్తుడుగా పేర్లను పెట్టడంలో ప్రదర్శన సమయంలో గందరగోళానికి గురికాకపోవచ్చు. కానీ, శ్రవ్య నాటకంగా దీన్ని చదువుతున్న పాఠకుడు వీరి పేర్లు కొంత క్లిష్టంగా ఉంటాయి. అయినా దీన్ని లోతుగా ఆలోచిస్తే, నాటకరచయిత ఒక లక్ష్యాన్నేదో ఆశించే ఆ పాత్రలకు అలా పేర్లు పెట్టాడనిపిస్తుంది. దీనికి నాటకంలోనే ఒక కీలకమైన వివరణను ఒకపాత్ర ద్వారా పలికించారు. తృతీయాంకంలో తిరుప్పాణ్ కావేరినదీ తీరంలో తపోనిష్ఠలో ఉండగా, అతడ్ని గమనించకుండా శ్రీరంగనాథుణ్ణి అభిషేకించడానికి అక్కడనుండే పూజారి తీర్థాన్ని తీసుకుంటాడని వేదవేద్యుడు దేవదత్తునితో వాదిస్తాడు. పూజారి కూడా తనకు తెలియకుండా అక్కడి జలాన్నే తీసుకొస్తాడు. అప్పుడు తిరుప్పాణ్ భక్తిని వేదవేద్యుడు వివరించగా, తనకు కూడా జ్ఞానోదయం అయ్యిందంటాడు దేవదత్తుడు. ఆ సందర్భంలో రచయిత ఆ సంభాషణను ఇలా పలికించారు. "దేవదత్తా! మనుష్యు లందరు ఒక్కటే! తేడాలు భౌతికాలు, ఆత్మకంగా అందరునొక్కటే! నీవు నేను ఒక్కటే! వేదము దేవదత్తమే! దేవుడు వేదవేద్యుడే! దేవ వేద ద్వయములో ప్రాణాలు–స్థిరమే! వ్యంజనాలే వ్యస్తాలు" (మునివాహనుడు, పుట: 78) దీన్ని బట్టి రచయిత కావాలనే దేవదత్తుడు, వేదవేద్యుడనే పాత్రలను కల్పించడం, వాటికా పేర్లు పెట్టినట్లు తెలుస్తుంది. అయినప్పటికీ పాఠకునికి ఈ పాత్రల పేర్లు కొంత గందరగోళానికి కారణమవుతాయని మాత్రం చెప్పక తప్పదు.

ఈ నాటకంలో ప్రతిఫలించిన సమాజం తిరుప్పాణ్ కాలం (క్రీ.శ. 8వశతాబ్ది) నాటిదా? నాటకం రాసిన రచయిత కాలం (20వ శతాబ్దం) నాటిదా? అనే ప్రశ్నలు రావడం సహజం. ఒక వ్యవస్థలో మంచి చెడులు ఒక్కసారిగా బహిర్గతం కావు. కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూ వాటిలో కొన్ని మార్పులకు గురవుతుంటాయి. అలాంటి వాటిలో భారతీయ సమాజంలో చతురాశ్రమధర్మాలు, చాతుర్వర్ణ్య వ్యవస్థ నిర్దేశించిన మత, కుల ప్రభావాలు ముఖ్యమైనవి. వాటిని ఆధారం చేసుకునే భారతీయ సమాజంలో ఆర్థిక, రాజకీయ, పాలనా పరమైన నిర్ణయాలు జరుగుతున్నాయి. వాటి వల్లే సామాజికంగా కొన్ని వర్ణాల వారి స్థితి గతులు కొనసాగు తున్నాయి. ఈ స్థితిగతులు ఒక్క సారిగా మారిపోయేవి కాదు. ఉపరి తలంలో రాజకీయంగానో, ఆర్థికంగానో మారుతున్న సామాజిక పరి స్థితుల వల్ల కొన్ని మార్పులు కనిపిస్తున్నా, పునాదిలో కుల, మతాలు తీవ్రమైన ప్రభావాన్నే చూపిస్తున్నాయి. భారతీయేతర సమాజాల్లో పునాదిగా ఆర్థికాంశాలున్నా, ఉపరితలంలో మిగతా సాంస్కృతికాంశాలు ఉండొచ్చు. కాబట్టి సమాజాన్ని బట్టి కూడా సామాజిక సమస్యలు, వాటి పరిష్కా రాలు జరగాల్సి ఉంటుంది. కనుక, తిరుప్పాణ్ కాలం నాటినుండీ కొనసాగుతున్న అస్పృశ్యతను, దాని ప్రభావం కొనసాగుతున్న నేటి సమాజాన్నీ ఈ నాటకంలో రచయిత వర్ణించారనుకుంటున్నాను. శ్రీకృష్ణదేవరాయలు రాసిన ఆముక్తమాల్యదలో కూడా మాలదాసరి కథలో అతడు తిరుప్పాణ్ ఆళ్వారేమోననే అనుమానం కలుగుతుంది.

మాలదాసరి–తిరుప్పాణ్ ఆళ్వార్లు:

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో 'మాలదాసరి' ద్వారా ఆళ్వార్ల భక్తితత్త్వాన్ని చెప్తూనే, తన కాలం నాటి సామాజిక, మత పరిస్థితుల్ని వర్ణించడానికి మాలదాసరి పాత్రను వర్ణించారనుకోవచ్చు. కానీ, చాతు ర్వర్ణ వ్యవస్థను ఆయన కట్టుదిట్టంగానే అమలుపరిచాడనే చారిత్రక సత్యాల్ని, విమర్శల్నీ కాదనలేం. ఆముక్తమాల్యద, ద్వితీయాశ్వాసంలో 33వ పద్యంనుండి 36 వ పద్యం వరకు చాతుర్వర్ణ్యం గురించి వర్ణించారు. ఈ దృష్టితో చూసినప్పుడు మాలదాసరి తిరుప్పాణ్ ఆళ్వార్ ప్రభావమే

అయినప్పటికీ, శ్రీకృష్ణదేవరాయల రచనా దృష్టికీ, కొలకలూరి ఇనాక్‌గారి దృక్పథానికీ చాలా భేదం ఉంది. భగవంతుణ్ణి అర్చించడంతో మొదలై, ఆయనలో లీనం కావడం వరకూ భక్తి రకరకాల మార్గాల్లో కనిపిస్తుంది. శ్రవణం, సంకీర్తనం, స్మరణం,సేవా, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే విధానాలను నవవిధ భక్తులు అంటారు. విష్ణుచిత్తుడిలో దాస్య (కైంకర్యం) భక్తినీ, గోదాదేవిలో సఖ్య భక్తినీ, మాలదాసరిలో సంకీర్తన భక్తినీ కవి వర్ణించాడు. ఇనాక్‌గారు సామాజిక పరివర్తనలో భాగంగా సంస్కరణ దృక్పథంతో వస్తువుని నాటకీకరించారు. అలా ఈ నాటకం రాయడానికి ఈ రచయిత ఆళ్వార్ల చరిత్రను పరిశోధన చేసుంటారు. అందువల్లనే శ్రీవైష్ణవుల్లో భిన్న శాఖలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు ఆళ్వార్లలోని తెంగలై శాఖకు చెందిన వ్యక్తిగా తిరుప్పాణ్ ఆళ్వారుని భావించారు. శ్రీవైష్ణవంలో గల వడగలై, తెంగలైశాఖల మధ్య సుమారు 18 సిద్ధాంతపరమైన భేదాలు న్నాయి. (అయాచితం నటేశ్వర శర్మ, 1992- ix-xii) భక్తి విధానం, మోక్షాన్ని పొందేందుకు గల మార్గాన్ని అనుసరించే, ఆచరించే భేదాలివి. భగవంతుడు నిమ్నజాతీయుడికి ప్రసన్నుడైనా, అతడు వర్ణాశ్రమ ధర్మ మర్యాదల్ని అతిక్రమించకుండా భక్తికీ, మోక్షానికీ ప్రయత్నించవచ్చని "వడుగలై" సిద్ధాంతం చెప్తుంటే, భగవంతుని ప్రసన్నత తోడైతే, నిమ్న, అగ్రవర్ణ భేద భావాలతో నిమిత్తం లేకుండానే అందరూ సమాజంలో గౌరవానికి అర్హులవుతారని తెంగలై సిద్ధాంతం విశదీకరిస్తుంది. (అయాచితం నటేశ్వర శర్మ, 1992-ix-xii) శ్రీకృష్ణదేవరాయలు, కొలకలూరి ఇనాక్‌గారలు ఇరువురూ తిరుప్పాణ్ అళ్వారుల జీవితస్పర్శను వర్ణించినా, శ్రీకృష్ణదేవరాయలు వరాహపురాణంలో కనిపించే ఆళ్వారుని వర్ణించినట్లు పరిశోధకులు చెప్తున్నారు. కొలకలూరి ఇనాక్ మాత్రం ప్రత్యక్షంగా తిరుప్పాణ్ ఆళ్వారు జీవితాన్నే తీసుకొని అభ్యుదయ దృక్పథంతో రాశారు. శ్రీకృష్ణదేవరాయలు మాత్రం చాతుర్వర్ణాల్ని బలపరిచే చట్రంలోనే మాలదాసరి కథను వర్ణించారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ రచనలపై పరిశోధన చేసిన డా॥వి.పోతన్న (ఆచార్య కొలకలూరి ఇనాక్ నాటకాలు-నాటికలు, 1999-34) ఈ నాటకం గురించి చెప్తూ "నిర్మలమైన మనసు, చిత్తశుద్ధి, ఎదనిండా భక్తి ఉన్నప్పటికీ అస్పృశ్యుడు కావటం వల్లే ఆలయప్రవేశం చేయటానికి తిరుప్పాణ్ వ్యథ చెందవలసి వచ్చిందని, అదే స్పృశ్యుడైతే ఈ సమస్య ఉండదనీ చెప్పడానికి" రచయిత ఈ నాటకాన్ని రాసినట్లు వ్యాఖ్యానించారు. అంతేకాకుండా " భగవంతునికి 'అంటు' దోషం లేదు. ఇది మానవుల మధ్య ఏర్పడ్డదే. ఒకవర్గం వారు తెచ్చినదే. తిరుప్పాణ్ ప్రార్థన ఆలకించిన శ్రీరంగనాథుడు తన బిడ్డకోరిక తీర్చాలనుకున్నాడు" (పోతన్న, 1999, పుట: 34-35)అని కూడా వ్యాఖ్యానించారు.

సంప్రదాయ, విప్లవానికి స్థానం కల్పించి, మంచిని కోరుకునే విప్లవాన్ని ఆచరించడం కూడా మంచిపనవుతుందనే ధ్వనిని ఈ నాటకం మనకో సందేశాన్ని అందించిందని డా॥జి.బాలసుబ్రహ్మణ్యం (నాటకస్రష్టగా ఇనాక్, 1999-72) అభిప్రాయపడ్డారు.

"శ్రుతి విరుద్ధమైన అస్ప ృశ్యత భారతీయ సమాజానికి ఎంతటి హాని కలిగించిందో జాతి సమైక్యతకు ఎంత అవరోధంగా నిలిచిందో కళాత్మకంగా, గుణాత్మకంగా తెలియజేస్తూ రాసిన నాటకం"గా తెలుగు నాటకాలపై పరిశోధన చేసిన డా॥పి.వి.రమణ ('మానవ జీవన వేదనలు-ఇనాక్ నాటకాలు' 1999-135) అభివర్ణించారు. భౌతికవాదంలో అంతర దృష్టినీ, ఆధ్యాత్మిక వాదంలో బాహ్య దృష్టినీ తనదైన విశిష్టశైలిలో ఈ నాటకం రూపుకట్టిందనీ డా॥పి.వి.రమణ చెప్పారు.

మునివాహనుడు నాటకాన్నీ, దానిపై జరిగిన పరిశోధనలను, విమర్శకుల అభిప్రాయాలను గమనించినప్పుడు భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మూడు దశాబ్దాల తర్వాత కూడా అస్పృశ్యులుగానే నిరాదరణకు గురౌ తున్న దళితుల పరిస్థితిని ప్రతిఫలించిన నాటకంగా దీన్ని చెప్పుకోవాలి. నాటకమంతా విన్న తర్వాత లేదా చూసిన తర్వాత లేదా చదివిన తర్వాత లోకం దళితుల్ని ఎలా చూస్తున్న వాస్తవాన్ని అర్థంచేసుకుని, ఆలోచనలో పడతారు. ఈ నాటకంలో పాటలు, పద్యాలు, సంభాషణలు రచయిత ప్రతిభా పాటవాల్ని అనేక పార్శ్వాల్లో చూపిస్తుంది. అన్నింటికీ మించి వస్తువులో, దాన్ని నడిపిన తీరులో పాఠకుణ్ణి ఆలోచింపజేస్తుంది. నాటకం చదవడం లేదా వినడం లేదా చూడ్డం పూర్తయ్యే సరికి నాటక రచయిత వాదనతో అందరూ హృదయపూర్వకంగా అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. కుల, మత సమస్యని సామరస్యంగా చెప్పిన నాటకంగా దీన్ని అభివర్ణించవచ్చు.(దార్ల వెంకటేశ్వరరావు, పిడి బాకులుగా మారే పూలు ఇనాక్ వాక్యాలు! (వ్యాసం), సారంగ, ఫిబ్రవరి, 2014.). అందుకనే భరతవాక్యంలో కూడా ఈ స్ఫూర్తే కనిపిస్తుంది.

"ఈ తిరుప్పాణ్ ప్రకాశమే యిలకు మిగుల
పిలచి శ్రీరంగనాథుండు వెలుగునట్లు
సర్వ సామాన్య మానవ శక్తి పొంది
ప్రజల ప్రతినిథుల్ జనులు కాపాడుగాక!" (మునివాహనుడు, పుట: 109)

ఈ నాటకంలో వేదవేద్యుడు-దేవదత్తుడు; వేదవేద్యుడు-పూజారి లోకసారంగముని; శ్రీరంగనాథుడు-లోకసారంగముని పాత్రల మధ్య జరిగిన సంభాషణల్లో అనేక సామాజికాంశాలను తాత్త్విక దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. ఒక విధంగా ఈ సంభాషణల సారాన్ని, నాటక ప్రయోజనాన్ని పాఠకులకు మరింతగా చెప్పాల్సిన అవసరాన్ని గుర్తించిన రచయిత 'కులవృత్తి' కథ (ప్రజాసాహితి, 2006)లో మరింత బలంగా ప్రజల్లోకి వెళ్ళాలని కథగా రాశారనుకుంటున్నాను. ఈ కథలో పూజారి (స్వామి)-ఒక అస్పృశ్యుడైన మాదిగ (మూర్తి) పాత్రల మధ్య జరిగిన సంభాషణ మేథోగతంగాను, కళాత్మకంగాను ఉంటుంది. (దార్ల వెంకటేశ్వరరావు, 2007.) దేవుడి కోసం పూజారి కాదు. పూజారి కోసమే దేవుడు అన్నట్లుగా దేవాలయ వ్యవస్థను మార్చేశారని స్వామి-మూర్తిల సంభాషణలో తేలిపోతుంది. మొత్తం మీద మునివాహనుడు నాటకాన్ని ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు సామాజిక ప్రయోజనాన్ని ఆశిస్తూ, పౌరాణిక, చారిత్రక సమ్మేళనంతో చక్కని ప్రయోగాత్మకగా తీర్చిదిద్దారు. ఈ నాటకాన్ని 40 యేళ్ళ క్రితం రాసినా భారతదేశవ్యాప్తంగా నేటికీ దళితులకు చాలా చోట్ల దేవాలయ ప్రవేశం లభించడం లేదు. ఈ సామాజిక వివక్ష పోనంతకాలం ఇలాంటి నాటకాల అవసరం ఉంటూనే ఉంటుంది. దీనితో పాటు దళితుల్లోని భక్తినీ, ఆత్మవిశ్వాసాన్నీ, సామాజిక రుగ్మతలపై పోరాడిన వారి రకరకాల త్యాగాలను స్మరించుకొని నూతనోత్తేజం తెచ్చుకోవడానికి కూడా ఈ నాటికీ ఈ నాటకం అవసరమే.

ములుగు ఎమ్మెల్యే సీతక్క

సామాజిక దృక్పథం, మానవీయ కోణం

- రమేష్ వాల్మీకి, సీనియర్ జర్నలిస్ట్



కష్టంలో వున్నవారికి సహాయం చేయడానికి అందరూ అక్కగా పిలుచుకునే తమ కోసం ఆ అమ్మ మనసు చేస్తున్న కష్టానికి సలామ్....

ఆమె సీతక్క.. ములుగు ఎమ్మెల్యే!

తన ప్రాంత ప్రజలకోసం కరోనా కష్టంలో ఆమె చేస్తున్న సేవలు అమ్మతనానికి కొత్త నిర్వచనాన్ని చెబుతున్నాయి.

నియోజక వర్గంలోని గడపగడపకు వెళ్లారు, గూడెం ప్రజల, గిరిజన ప్రాంతాల ప్రజల కన్నీటిగాథను కళ్లారా చూసారు. వారి ఆవేదనను మనసారా విన్నది, కాళ్ళీడకన వాగులు, వంకలు దాటుకుంటూ అడవిబాట పట్టింది, నిత్యావసర వస్తువులను ఎడ్ల బండ్లలో, ట్రక్కులలో తీసుకెళ్లి తన నియోజకవర్గాల ప్రజలకు చేరవేస్తూ ప్రజాప్రతినిధి అనే పదానికి అసలైన అర్ధాన్ని ఇచ్చింది, ఆవిడే దనసూరి అనసూయ అలియాస్ సీతక్క.



ములుగు ఎమ్మెల్యే ధనసరి అనసూయ అలియాస్ సీతక్క తన ఉదారస్వభావాన్ని చాటుకుంది, లాక్ డౌన్ ఆంక్షల నేపథ్యంలో కుగ్రామాలకు నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడుతోంది. అందులో ములుగు నియోజకవర్గంలో ఎక్కువగా గిరిజనులు, తండాలు, మారుమూల కుగ్రామాలు ఎక్కువగా ఉంటాయి. కనీసం వాహనాలు వెళ్లేందుకు రోడ్ల సౌకర్యం కూడా లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కేవలం ఎడ్ల బండ్ల ద్వారానే ఆ గ్రామాల్లోకి ప్రవేశించే వెసులుబాటు ఉంటుంది. లాక్ డౌన్ ఆంక్షల నేపథ్యంలో అలాంటి గ్రామాల నిరుపేద ప్రజల ఆకలి బాధలు తీర్చేందుకు ములుగు ఎమ్మెల్యే సీతక్క కాలినడకన, ఎండ్ల బండి మీద నిత్యవసర సరుకులు అందజేస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంటున్నారు ఎమ్మెల్యే సీతక్క. తన నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో పర్యటించారు.

కుగ్రామాల్లోని నిరుపేదలకు సహాయం చేయాలని నిర్ణయించుకొన్న సీతక్క ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తెలిసింది. ములుగు నియోజకవర్గం ఒక ఆదివాసీ జిల్లాగా కొనసాగుతోంది. అక్కడ కోయ, గోండు, మరియు లంబాడీ లాంటి ఆదివాసీ జాతులు ఎక్కువగా నివసిస్తుంటారు. అడవి ప్రాంతం కాబట్టి కొన్ని చోట్లకి కనీసం రోడ్లు కూడా ఉండకపోవడంతో రవాణా సౌకర్యం ఉండదు.

అలాంటి ప్రాంతాలకు నిత్యావసర సరుకులు చేరవేస్తూ ప్రతి పేదవాడి కడుపు నింపే ప్రయత్నం చేసింది సీతక్క. అలాంటి ప్రాంతాలకు చేరురకోవడంలో అనేక సమస్యలను ఎదుర్కొన్నారు, వీలైన చోట ట్రాక్టర్ ప్రయాణం, అక్కడనుండి ఎడ్ల బండి, అక్కడనుండి కాలినడక, అవసరం అనుకుంటే బురదలో కూడా నడక కొనసాగించింది సీతక్క.

అడవి మార్గం గుండా కుగ్రామాలకు చేరుకోవడంలో తన వ్యక్తిగత సిబ్బంది మరియు గన్‌మెన్‌లను సైతం వదిలేసి అక్కడి స్థానిక నాయకుల సహాయంతో ఆదివాసీ గ్రామాల్లోని ప్రజలకు కరోన వైరస్ పై అవగాహన కల్పిస్తూ వారికి అవసరమైన నిత్యావసర సరుకులను అందించి వారి ఆకలిని తీర్చడానికి తన వంతు కృషి చేస్తున్నారు సీతక్క. తాను కూడా వారితో పాటే భోజనం చేస్తూ తన నిరాడంబరతను చాటుకుంది. ప్రజాసేవ చేయాలనే సంకల్పం ఉంటే ఎంత కష్టం, నష్టం సంభవించనా వెనకడుగు వేసేది ఉండదని సీతక్క నిరూపించింది. అణగారిన వర్గాల కోసం నాడు






ఎగరేసిన ఎర్ర బావుటా. అదే వర్గాల అభ్యున్నతి కోసం నేడు ఎమ్మెల్యే. లాక్‌డౌన్ వేళ కాంగ్రెస్ నేత, ములుగు ఎమ్మెల్యే సీతక్క. మరోసారి అడవి బాట పట్టింది. ఒక ఎమ్మెల్యేగా ఉంటూ ప్రజల కష్టాలను తెలుసుకుంది గిరిపుత్రుల కోసం అమ్మగా మారి స్వయంగా తానే సద్దిని మోసుకెళ్లి అడవిపుత్రుల ఆకలి తీర్చింది, ప్రభుత్వంనుంచి, ప్రజలనుంచి ఎన్నో మన్ననలు పొందింది.

ధనసరి అనసూయ అలియాస్ సీతక్క వరంగల్ జిల్లా, ములుగు మండలం, జగ్గన్నపేట గ్రామంలో ఓ కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద కుటుంబంలో పుట్టారు. సీతక్క ములుగు జిల్లాలోని ప్రభుత్వం వసతి గృహంలో ఉంటూ పదోతరగతి వరకు విద్యాభ్యాసం పూర్తి చేసారు. సీతక్క తన చిన్నతనంనుంచే ప్రజలకు సేవచేసేవారు. 1986లో ఆమె 8వ తరగతి చదువుతున్న సమయంలో గోదావరి వరదల కారణంగా ములుగు చుట్టుప్రక్కన గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. ఆ సమయంలో ప్రజలకు సాయం చేయడానికి తన స్నేహితులతో కలిసి మూడురోజుల పాటు చందాలు వసూలు చేసి సుమారుగా 13,500 రూపాయలు జమ చేసి సాయం చేసారు. ఆ తరువాత పాఠశాలలలో, వసతి గృహాలలో జరిగే అన్యాయాలను ఎదుర్కొన్నారు. 1988లో తుపాకీ చేతబట్టి అడవిబాట పట్టారు. ఉద్యమసమయంలోనే జనశక్తి కమాండర్ మేనబావ రాముతో సీతక్క వివాహం జరిగింది. ఆ తరువాత కొద్ది రోజులకు సీతక్క జనజీవన స్రవంతిలోకి కలిసిపోయారు. సమాజంలో జరిగే అన్యాయాలను చూడలేక వారికి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో పడాల రామరెడ్డి లా కాలేజిలో ఎల్ ఎల్ బీ పూర్తి చేసారు. ఆ తరువాత వరంగల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేసారు. సీతక్క 2004లో తొలిసారి తెలుగుదేశం పార్టీనుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో మహాకూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీనుండి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య పై ములుగు శాసనసభ నియోజకవర్గంనుండి గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత జరిగిన 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థి అజ్మీరా చందూలాల్ చేతిలో ఓడిపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి అభ్యర్థి అజ్మీరా చందూలాల్ పై గెలిచి రెండవసారి అసెంబ్లీ కి ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే అనగానే విలాసవంతమైన జీవనం, మెరుగైన నివాస సదుపాయాలు, అన్ని సౌకర్యాలతో కూడుకున్న వాహనం, మంది,మార్బలం.. ఇది ప్రస్తుత ప్రజా ప్రతినిధుల జీవన శైలి. ప్రజా జీవితంతో పెద్దగా సంబందాలు అవసరంలేని పరిస్థితులు ఉన్న తరుణంలో ఇళ్లకే పరిమితమవుతున్నారు కొంత మంది ప్రజా ప్రతినిధులు. సరిగ్గా ఇలాంటి తరుణంలో అందరు ప్రజా ప్రతినిధుల్లా కాకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించారు సీతక్క. ఎమ్మెల్యే సీతక్క ఔదార్యం తోటి ప్రజా ప్రతినిధులకు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉందనే చర్చ జరుగుతోంది. గిరిజన ప్రాంతాల్లోని నిరుపేదల సంక్షేమం కోసం సీతక్క చూపిస్తున్న అంకితభావానికి ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు స్థానిక ప్రజలు.

నమో నమః

- వరప్రసాద్



వీరత్వం ద్వారానే శాంతి లభిస్తుంది అని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు చాలా శక్తివంతమైంది. ప్రధాని హుటాహుటిన ఒక్కసారిగా లడాఖ్‌లో ప్రత్యక్షమై, ప్రపంచాన్ని ఆశ్చర్యపరచారు. చైనాకు ఒక ప్రకంపన, ఒక అలజడి సృష్టించారు. ఎవ్వరూ ఊహించని ఈ కదలికతో (మూవ్) చైనాతో పాటు పాకిస్తాన్ కు కూడా ఒక షాక్ తగిలింది. నిన్నటి వరకూ పిల్లిలా ఉండి, చైనా అండతో ఇండియాపై ఒంటికాలుతో లేస్తున్న నేపాల్ కు వెన్నులో చలి పుట్టించింది. మొత్తమీద, భారత్‌ను శత్రుదేశంగా భావించే దేశాలన్నింటికీ ఇది ఒక హెచ్చరిక. శాంతికాముకమైన భారతదేశం అవసరమైతే వీరత్వాన్ని చూపిస్తుందనే సందేశం ప్రపంచం మొత్తానికి,ఈ చర్య ద్వారా నరేంద్రమోదీ బలంగా వినిపించారు. దీనివల్ల, సరిహద్దులో యుద్ధక్షేత్రంలో ఉన్న మన సైనికులకు ఉత్తేజం, భారతజాతి జనులకు విశ్వాసం ఏకకాలంలో కలిగాయి, పెరిగాయి. ఈనేలను వీరభూమిగా గుర్తుచేస్తూ, జల, వాయు, పద, అంతరిక్ష విభాగాల్లో అజేయశక్తి సామర్థ్యాలు భారత్ కలిగి ఉందని, ప్రధాని ఉద్ఘాటన చైనాకు దీటైన హెచ్చరికను అందించినట్లయింది. 50ఏళ్ళ తర్వాత,యుద్ధవాతావరణం కమ్ముకున్న సరిహద్దు ప్రాంతాలకు భారత్ ప్రధాని వెళ్లడం ఇదేనని గమనించాలి. 1971లో, బంగ్లాదేశ్‌తో యుద్ధసందర్భంలో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వెళ్లారు. బలమైన సందేశం ఇచ్చారు. ఇండియా విజయలక్ష్మిని వరించింది. ఈ గెలుపు తర్వాత, ఇందిరాగాంధీ అమేయమైన శక్తిగా అవతరించింది. భారత్‌లో దుర్గగా, ప్రపంచంలో శక్తిస్వరూపిణిగా ఆమెను అభివర్ణించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ఇందిరాగాంధీ అద్భుతమైన గెలుపు సాధించి, విజయేందిరగా విశేష ఖ్యాతి పొందింది. దీనికి 10ఏళ్ళ ముందు,1962లో, చైనా-భారత్ యుద్ధం నేపథ్యంలో, అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ కూడా సరిహద్దు ప్రాంతాన్ని పర్యటించారు. అప్పుడు జరిగిన యుద్ధంలో భారత్ ఓడిపోయినప్పటికీ, తర్వాత సాగిన చైనా దురాక్రమణ పర్వాలలో ఇండియాదే పైచేయిగా నిలబడింది.1962 మినహా, దాదాపుగా 60ఏళ్ళనుండీ, చైనా - భారత్ మధ్య యుద్ధం జరుగలేదు. 1993లో అప్పటి ప్రధానమంత్రి పి.వి నరసింహారావు చైనా -భారత్ శాంతి ఒప్పందం(ట్రాంక్విలిటీ అండ్ పీస్) కుదుర్చుకున్నారు. అప్పటినుండి మొన్నటి డోక్లామ్ సంఘటన వరకూ సరిహద్దుల్లో ప్రశాంత వాతావరణమే రాజ్యమేలింది. ఈ మధ్య కొంతకాలంనుండి అలజడులు, ఆందోళనలు, కవ్వింపులు తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. అప్పటి చైనా దురాక్రమణల పర్వంలో, రెండు వైపులా కొంత ప్రాణ నష్టం జరిగింది. ఎక్కువ నష్టం చైనాకే జరిగింది.ఈ మధ్య జరిగిన డోక్లామ్ అలజడుల తర్వాత, మళ్ళీ కొన్ని రోజులనుండీ సరిహద్దుల్లో సాగుతున్న చర్యలు యుద్ధవాతావరణాన్ని తలపింపజేస్తున్నాయి. 20మంది సైనికులను మనం కోల్పోయాం. చైనా అనైతికంగా ప్రవర్తిస్తున్నా, భారత్ హుందాగా, వీరోచితంగా పోరాడుతోంది. శాంతి చర్చలు సాగుతూ ఉన్నప్పటికీ, చైనా కయ్యానికే కాలు దువ్వుతోంది. మనం కూడా యుద్ధానికి సంపూర్ణంగా సిద్ధమవుతూ ఉన్నాం.ప్రస్తుతం సరిహద్దుల్లో ఉన్న పరిస్థితుల్లో, రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ అక్కడికి వెళ్లాలని అనుకున్నారు. ఎందుకో, ఒక్కసారిగా వ్యూహం మారింది. సాక్షాత్తు ప్రధానమంత్రి సరిహద్దుల్లో ప్రత్యక్షమై, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఇరుగుపొరుగు దేశాలని తొక్కెయ్యాలి, సరిహద్దులను ఆక్రమించాలి,అమెరికాను కూడా అధిగమించి, ప్రపంచంలో అగ్రరాజ్యంగా ఆధిపత్యం వహించాలి, అనే ఏకైక లక్ష్యంతో చైనా ముందుకు వెళ్తోంది.తాజాగా, రష్యాలోని ఒక భూభాగం నాదే అంటోంది. అటు అమెరికా -ఇంకోవైపు రష్యా - ఇటు ఇండియాపై తన ప్రతాపం చూపించాలని చైనా ఉరకలు


వేస్తోంది. ఈ పరిణామాల్లో, ఈ మూడు దేశాలు ఏకమవుతాయి. చైనాకు గట్టిదెబ్బకొడతాయి. కొన్నేళ్ల వరకూ పైకిలేవకుండా కూడా చూస్తాయి. కోరి, చైనా ఈ పరిస్థితులనే తెచ్చుకునేలా కనిపిస్తోంది. తాను అందరికంటే, అన్నింటా చాలా బలమైన దేశమని నిరూపించుకొనే యత్నాలు చేపడుతోంది. బలవంతమైన సర్పం చలిచీమల చేతచిక్కి చావదె, సుమతీ.... అన్నట్లు, చైనా తన చావు తానే తెచ్చుకుంటోంది. ఇప్పుడు చైనా గొడవ పెట్టుకుంటోంది చలిచీమలతో కాదు. అమెరికా, రష్యా, ఇండియా వంటి బలమైన దేశాలతో. చైనాతో పోల్చుకుంటే, భారత్ బలం తక్కువ కావచ్చు. అమెరికా, రష్యా, జర్మనీ, జపాన్ మొదలైన దేశాలన్నీ, ఈ పోరులో భారత్ వైపు నిల్చోడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇన్ని దేశాలను తట్టుకునేంత శక్తి చైనాకు లేనేలేదు. భారతదేశం చైనాకు వరుసగా షాక్ లు ఇస్తోంది. మొన్న డిజిటల్ నిషేధాలు, నిన్న రహదారులు, టెలికాం, రైల్వే సంబంధమైన భాగస్వామ్యాలతో కూడిన ఆర్థిక, వాణిజ్యాలపై నిషేధాలు, బహిష్కరణల పర్వానికి శ్రీకారం చుట్టడంతోనే చైనాలో ఒక ఒణుకు ప్రారంభమైంది. ఇప్పుడు భారత్ ప్రధాని యుద్ధ క్షేత్రంకు వెళ్లి, హెచ్చరికలు ఇవ్వడంతో, ఊహించని ఈ పరిణామాలు చైనాను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్ ఇంత దూరం వస్తుందని, బహుశా! చైనా ఊహించి ఉండదు. వేణువు ఊదే కృష్ణుడిని పూజిస్తాం.... సుదర్శన చక్రంతో పోరాడే కృష్ణుడిని ఆరాధిస్తాం... అని, ప్రధాని చేసిన వ్యాఖ్యల్లో శాంతి –వీరత్వం రెండూ ప్రకటితమయ్యాయి.

భారత రాయబార ఘట్టంలో, దుర్యోధ నాదులకు శ్రీకృష్ణ పరమాత్మ చేసిన హితవాక్యాల్లా, సందేశంలా నరేంద్రమోదీ మాటలు ధ్వనిస్తున్నాయి. చర్చల ద్వారా శాంతికే పెద్దపీట వేస్తాం. లేనిపక్షంలో, వీరోచితంగా పోరాడి సరిహద్దుల్లో శాంతిని స్థాపిస్తామని చైనాకు భారత్ బలమైన సందేశం, సంకేతం ఇచ్చింది. విస్తరణ కాంక్షతో సాగే సామ్రాజ్యవాదానికి భరతవాక్యం పలికే దిశగా భారత్ ముందుకెళ్తోంది. చైనాపై భారత్‌దే తుది గెలుపు అవుతుంది. మన ప్రధాని నరేంద్రమోదీ శక్తివంతమైన నాయకుడిగా ప్రపంచంలో సుకీర్తి పొందుగాక. జయహో భారత్.

మహనీయులు మధుర స్మృతులు..

- రాంబాబు

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు స్కూలు టీచరుగా వారి ఊరికి దగ్గరగా ఉన్న గ్రామంలో పని చేస్తుండేవారు. అప్పటి వారి జీతం ఇరవై ఒక్క రూపాయలు. విశ్వనాథ వారు పోషించేది తొమ్మిదిమందిని: తల్లి,తోబుట్టువులు,వారి పిల్లలు,ముగ్గురు తమ్ముళ్ళు. రాబడి తక్కువ.ఒకనాటి రాత్రి వారి అమ్మగారు పార్వతమ్మగారు వచ్చి “నాన్నా, బియ్యం రేపటికి నిండుకున్నవి. చాట అప్పుపుట్టే తీరు లేదు.” అన్నారు. విశ్వనాథ వారు “సరేలే,అమ్మా“ అన్నారు. పాపం మరుసటి రోజు స్నానాదికాలు ముగించుకుని బయటకు వెళ్లారు.ఆ రోజుల్లో శనాదివారాలు రెండూ సెలవుదినాలు.ఉదయం వెళ్లి రాత్రి పదిన్నరకు తిరిగి వచ్చారు. ఆరోజుల్లో బ్రాహ్మణుల ఇళ్ళలో ముందు ఒక నీళ్ళ తొట్టి,దాని మీద ఒక కర్ర తో చేసిన మూత ఉండేది .పెరట్లో మరొక నీళ్ళ తొట్టి మూతతో ఉండేది. బయటనుంచి రాగానే ముందు కాళ్ళు కడుక్కుని ఇంటిలోకి ప్రవేశించటం పద్ధతి .భోజనానంతరం పెరట్లో ఉన్న తొట్టి వద్ద కాళ్ళు కడుక్కోటం ఆచారం.



విశ్వనాథవారు వచ్చీ రావటంతోటే పద్ధతి ప్రకారం కాళ్ళు కడుక్కోకుండానే సరాసరి వంటింట్లోకి వెళ్లి చూసారు.పొయ్యిలో పిల్లి లేవలేదు. గొప్ప ఖేదానికి గురయ్యారు. అప్పుడు పాదప్రక్షాళనం చేసి, ముఖం కడుక్కుని “మా స్వామి“ అనే శతకం వ్రాయటం మొదలు పెట్టారు. మా స్వామిలోని మొదటి రెండు పద్యాలు రామాయణ కల్పవృక్షానికి నాంది.

పది,పదిహేను పద్యాలు వ్రాసిన తర్వాత ఒక పద్యంలో అంటారు, “మా నాన్నగారికి, నీకు లావాదేవీలు ఏమున్నాయో నాకు తెలియదు.ఏమైనా ఉంటే మీరూ మీరూ చూసుకోండి.నన్నిలా కష్ట పెడితే మాత్రం నేను ఊరుకునేదిలేదు.ఆహితాగ్ని పెట్టెలో ఉన్న నీ బంగారు లింగాన్ని తెగనమ్ముతాను. రెండు బస్తాల బియ్యం,దినుసులు తెచ్చుకుంటాను.” అని వ్రాస్తుండగా తలుపు తడుతున్న శబ్దం అయింది. తల్లిగారైన పార్వతమ్మగారు తలుపు తెరిచారు. బండి తీసుకుని వచ్చిన వ్యక్తి “అమ్మా, కపిలేశ్వరపురంనుంచి రావి సూరయ్యగారు తమకు ఇవ్వమని రెండు బస్తాల బియ్యం ,కందిపప్పు మూట,బెల్లపు బుట్ట,నెయ్యి పంపించారు. ఎవరైనా కొద్దిగా సాయం చేస్తే ఆ బస్తాలు పంచలో పెడతాను.“ అన్నారు.అది విశ్వనాథ వారి భక్తి ,నిర్భీతి ,వారి కున్న దైవానుగ్రహం.

జులై 12, 13 తేదీల్లో శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర

- డా॥గంగాధర్





సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియనివారు ఉండరు. 200 సంవత్సరాల చరిత్ర ఉన్న ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో జరిగే బోనాల జాతరకు ఎంతో ప్రత్యేకత ఉంది. జులై 12,13 తేదీల్లో పండుగ జరిపేందుకు అధికారులు నిర్ణయించారు. కానీ ప్రస్తుతం దేశం, ప్రపంచం కరోనా వైరస్‌తో సంక్షోభంలో ఉంది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత కష్టమవుతున్న సందర్భాల్లో జాతర ఎలా జరుగుతుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజురోజుకు కరోనా కేసులు పెరుగుతున్నాయి, వ్యక్తిగత దూరం, మాస్కులు, సానిటైజర్స్ తప్పనిసరి అని ప్రభుత్వం చెప్పుతుంది, బోనాల జాతరలో దాదాపు 30 లక్షల భక్తులు పాల్గొంటారు. ఇప్పటికే జాతర పనులు మొదలయ్యాయి.

బోనాలు, బతుకమ్మ, పీర్ల పండుగ, తెలంగాణ బతుకు చిత్రానికి ప్రతీకలు.. తెలంగాణ సంస్కృతిక వారసత్వానికి, ఇక్కడి ప్రజల ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటిచెప్పే పండుగల్లో బోనాలు ఒకటి. ఏటా ఆషాఢ మాసంలో ప్రారంభమై శ్రావణ మాసం (జూలై-ఆగస్టు) వరకూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బోనాల వేడుకలను నిర్వహించుకుంటారు. ఆషాఢ మాసంలో మహంకాళీ అమ్మవారు పుట్టింటికి వస్తుందని ఈ ప్రాంతవాసుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారిని పెద్దమ్మగా, ఎల్లమ్మగా, పోచమ్మగా, పోలేరమ్మగా, మైసమ్మగా, అంకాలమ్మగా, మారెమ్మగా, నూకలమ్మగా వివిధ నామాలతో కొలుస్తారు. అమ్మవారికి సారె, చీర,గాజులు, పసుపు, కుంకమలతో పాటు బోనాన్ని సమర్పించుకుంటారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

ఆలయ చరిత్ర: 1813వ సంవత్సరంలో మిలిటరీలో పనిచేయుచున్న సికింద్రాబాద్ వాస్తవ్యులు సురిటి అప్పయ్యగారు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని టవర్‌కు బదిలి అయినాడు, కొన్ని రోజులకు ఉజ్జయినిలో కలరా వ్యాధి సోకి వేలాదిమంది మరణించారు. ఆ సమయంలో సూరిటి అప్పయ్య మరియు అతని అనుచరులు ఉజ్జయినిలో మహాకాళి దేవిని దర్శించి కలరా వ్యాధినుండి ప్రజలను కాపాడవల్సిందిగా ప్రార్థించగా అనేక వేలమంది రక్షించబడినారు. 1815 సంవత్సరంలో సూరిటి అప్పయ్యగారు అతని అనుచరులు సికింద్రాబాద్ తిరిగి వచ్చి ఇప్పుడు అమ్మవారు ఉన్నచోట కట్టెతో అమ్మవారి విగ్రహము చేయించి ప్రతిష్ఠించి నిత్య పూజలు చేశారు శ్రీ ఉజ్జయిని మహాకాళి అని నామకరణ చేసారు. దేవాలయము మరమ్మత్తు చేయుచున్న సమయంలో త్రవ్వకాలలో శ్రీ మాణిక్యాలదేవి అమ్మవారి విగ్రహము దొరికింది. 1864లో కట్టె విగ్రహము తీసివేసి ఇప్పుడున్న మహాకాళి, మాణిక్యాలదేవి అమ్మవార్ల విగ్రహములను శాస్త్రోక్తంగా ప్రతిష్టచేసి ఆలయ నిర్మాణము చేశారు, ఆరోజునుండి వైదిక ఆగమ శాస్త్రానుసారంగా నిత్యపూజలు నిర్వహించుట జరుగుచున్నది. సికింద్రాబాద్‌లోని చారిత్రాత్మకమైన శ్రీ ఉజ్జయిని మహాకాళీ అమ్మవారు మహోన్నతమైన మహిమ కలిగి, హైద్రాబాద్ నగరవాసులకు ఆరాధ్య దేవతగాను, ఇలవేల్పుగాను వీరాజిల్లుతున్నది. అమ్మవారి ఘటము ఇంటింటికి వెళ్ళినప్పుడు వేపాకు సమర్పించి అమ్మ వారిని నీళ్లతో శుద్ధిచేసి కొబ్బరికాయలను నివేదనం చేయుదురు.

బోనాలు : బోనాల రోజున లక్షలాదిమంది భక్తులు వారి ఇళ్లలో

తలస్నానము చేసి, పరిశుభ్రమైన వస్త్రములు ధరించి బోనము (ప్రసాదం) తయారుచేసి ఒక పాత్రలో పెట్టి శుద్ధిగా పాత్రపై జ్యోతిని వెలిగించి తలపై పెట్టుకొని అలయమునకు వచ్చి అమ్మవారికి బోనము సమర్పించి మొక్కు తీర్చుకొందురు. దీనినే బోనము సమర్పించుట మరియు బోనాల పండుగ అని పిలుస్తున్నారు. పండుగ రోజు స్త్రీలు ముఖమునకు పసుపు పూసుకుని తడిబట్టలతో అలయమునకు వచ్చుట సంప్రదాయము, పరిశుభ్రమైన నీటిని పసుపుతో కలిపి పాత్రలో నింపుకొని వేపమండలు పాత్రలో నింపుకొని అలయమునకు వచ్చి అమ్మవారి ఆలయంలోని మండపమునకు ఎదురుగా శ్రీ మాతంగేశ్వరి దేవాలయంలో సమర్పించేదరు దీనినే సాక అందురు. పండుగ రోజున నగరంలోని వివిధ ప్రాంతాలనుండి భక్తులు ఇంట్లో తయారుచేసుకొని ఒక బండిలో పెట్టుకొని వచ్చి ఆలయము చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి కొద్దిగా సమర్పించి మిగిలినది మహాప్రసాదంగా స్వీకరించెదరు, కొన్ని వందల సంఖ్యలో బండ్లపై ప్రసాదములు తెచ్చి అమ్మవారికి సమర్పించుట ఫలహారపు బండ్లు అని పిలుచుట ఒక ఆనవాయితి. బోనాల పండుగ రోజు జంటనగరంలోని ప్రతిబస్తినుండి పోతరాజులు శరీరమంతా పసుపు పూసుకుని, లంగోటి వస్త్రము ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకొని, కళ్ళకు కాటుక, నోటియందు నిమ్మకాయ పెట్టుకొని,నుదుట పెద్దగా కుంకుమ బొట్టు పెట్టుకొని, చేతియందు పసుపుతాడు కొరడగా ధరించి తప్పెట్లకు అనుగుణంగా గజ్జెలు సవ్వడిగా నాట్యముచేస్తు అనేకమంది గుంపుగాకలసి ఆనందోత్సవాలతో అలయమునకు వచ్చి ప్రదక్షణలుచేసి, అమ్మవారిని సేవించుకొని వెళ్లుట ముఖ్యమైనది. వేలాదిమంది పోత రాజులు జాతరలో పాల్గొని లక్షల మంది భక్తులను భక్తి పారవశ్యముతో రంజింపచేయుదురు.

రంగము వేడుకలు: బోనాల పండుగ మరుసటిరోజు అలయములోపల శ్రీ మాతంగేశ్వరి దేవలయమునందు ఒక పచ్చికుండపై అవివాహిత స్త్రీ అమ్మవారికి ఎదురుగా నిలబడి అమ్మవారి కళను ఆమెపై అవహింప చేసుకొని రాష్ట్రంలో, దేశంలో జరిగే పరిణామాలను మరియు ముఖ్య విషయములను చెప్పు కార్యక్రమమును లక్షలాదిమంది వినుటకు వీలుగా అలయము చుట్టూ అమర్చబడిన ప్రత్యేక మైకులద్వారా విని ఆనందింతురు. ఈ రంగము కార్యక్రమంలో పాల్గొనే స్త్రీ జీవితాంతం పెళ్ళి చేసుకోదు, సాంప్రదాయంగా ఒక కత్తికి మాంగల్య ధారణ చేసి ఒక ప్రతిజ్ఞకు కట్టుబడి అవివహితగా ఉండి రంగం కార్యక్రమంలో ప్రతి సంవత్సరం పాల్గొనును. రంగం కార్యక్రమము తరువాత ఆలయ వంశపారంపర్యముగా వచ్చు పోతారాజులు ఉదయం 9 గంటల ప్రాంతంలో గంభీరంగా విలయతాండవం చేయుచు ఉద్రేకాపురితంగా ఊగిపోతు దేవాలయం చుట్టూ నాట్యం చేసి ముందుబాగంలో అమ్మవారికి ఎదురుగా లయబద్ధంగా మేళతాల మూల మధ్య నాట్యముచేస్తు గుమ్మడికాయ, సొరకాయను బలితీయుదురు దీనినేగావు అని పిలుస్తారు, ఈ కార్యక్రమమును వేలమంది చూసి ఆనందిస్తారు. తరువాత అమ్మవారి చిత్రపతమును ఏనుగు పై అమర్చి ప్రత్యేక అలంకరణ చేసి మంగలవాయిద్యములు, బ్యాండు వాయిద్యాములతో ఆనందోత్సాహాలతో అమ్మవారిని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తరువాత అమ్మవారు ఏనుగుపై పురవీధుల్లో ఊరేగుతూ మెట్టుగూడా ప్రాంతానికి తరలివెళుతుంది దీనినే సాగనంపు



సేవ అని అంటారు. ఈ విదంగా అమ్మవారి ఆషాడ జాతర లక్షలాది మంది భక్తుల సందర్శనముతో జాతర వేడుకలు పూర్తి అవుతాయి.

ఆషాడ మాసంలో వచ్చే జాతరకు ప్రతి సంవత్సరం దాదాపు 35 లక్షల మంది అమ్మవారిని దర్శించుకుంటారు, దర్శనం కోసం వచ్చు భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తారు, దేవాలయానికి రంగులు సున్నాలు వేయుట, ఆషాడ జాతర గురించే ప్రజలకు వాల్ పోస్టర్స్, ఫ్లెక్సీలు, బ్యానర్ల ద్వారా ప్రజలకు తెలియపర్చడం, దేవాలయ ప్రాంగణం మొత్తం కలకత్తా డెకరేషన్, బోనముతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూ, వయోవృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక దర్శన ఏర్పాటు, దేవాలయ ప్రాంగణము పూర్తిగా విద్యుత్ దీపాలంకరణ, అలయములో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిసి కెమెరాల ఏర్పాటు, అమ్మవారి ప్రసాదం కోసం ప్రత్యేక కౌంటర్, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు, భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు, ఆలయ పరిసరాలన్ని పరిశుభ్రంగా ఉంచుటకు పారిశుధ్య సిబ్బందిని నియమించుట, దేవా లయమునకు వచ్చు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రేటర్ హైద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్, మహానగర మంచినీటి సరఫరా, రోడ్లు భవనాల శాఖ, జంతు ప్రదర్శన శాల, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, ఫైర్ సర్వీసెస్, వైద్య ఆరోగ్య శాఖ, టి.ఎస్.ఆర్.టి.సి, దక్షిణ మధ్య రైల్వే ఇతర డిపార్ట్మెంట్ వారు జాతర ఏర్పాట్లను చేస్తాయి.

ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తారు.

బోనాల జాతర కోసం నార్త్ జోన్ పోలీసులు అన్ని ఏర్పాట్లులు చేస్తారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. జాతర బందోబస్తు కోసం 3వేల 5వందల మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దింపారు. ఆలయ పరిసరాల్లో 200 సీసీ కెమెరాలను అమర్చారు. ఇక బోనాల జాతరకొచ్చే వారి కోసం ఆరు క్యూలైన్లు, మహిళలకు రెండు క్యూలైన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు.

దగాపడ్డ ప్రకాశం పంతులు

– **కొడుకుల శ్రీనివాస్,** సీనియర్ జర్నలిస్ట్



ఉండవల్లి "వైయస్సార్‌తో.." అనే పుస్తకం రాశారు. సూర్యచంద్రరావు అనే కాంగ్రెసు నాయకుడు తనతో చెప్పిన ఆంధ్రకేసరి ప్రకాశం గారి ఉదంతాన్ని వైయస్‌కు చెపితే ఆయన చాలా చలించిపోయాడని దానిలో రాశారు. అది తెలుసుకుంటే ధర్మసంకటం అనే పరిస్థితి ఏమిటో వేరే వివరించనక్కరలేదు. దానిలో ప్రకాశం గారు చేసిన పనిని అర్థం చేసుకోవాలంటే ఆయన వ్యక్తిత్వాన్ని ముందుగా తెలుసుకోవాలి. అందుకు ఉపోద్ఘాతంగా రెండు విషయాలు రాస్తాను.

మీలో చాలామందికి తెలిసి వుంటుంది. ప్రకాశంగారు నిరుపేదగా జన్మించారు. స్వయంకృషితో లాయరై, బారిస్టరై విపరీతంగా ఆర్జించారు. అయితే ఆస్తంతా స్వాతంత్రోద్యమానికి ఖర్చు పెట్టేశారు. ఎవరైనా తన దగ్గరకు వచ్చి సాయం అడిగితే జేబులో ఎంతుంటే అంతా యిచ్చేసేవారు. ఆయన అలా యిచ్చేస్తున్నాడని ఆందోళన పడి అభిమానులు, ప్రజలు ఆయనకు విరాళాలు యిచ్చేవారు. ఆయన దాన్ని దాచుకునేవాడు కాదు. మళ్లీ అదంతా అర్థులకు యిచ్చేసేవాడు. జేబులో డబ్బుందా లేదా అన్న చింతే వుండేది కాదాయనకు.

ప్రతాప్ ఆర్ట్ పిక్చర్స్ బ్యానర్‌పై అనేకమంది దర్శకులకు, నటీనటులకు తొలి అవకాశం యిచ్చిన నిర్మాత కె.రాఘవకు మా "హాసం క్లబ్"లో సన్మానం చేసినప్పుడు ఆయన ఒక ఉదంతం చెప్పాడు. రాఘవ అనాథ. పొట్టకూటి కోసం మద్రాసు చేరి ప్రకాశం గారి దగ్గర కారు తుడిచే కుర్రాడిగా చేరారు. అప్పుడాయన మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి. ఓ రోజు పొద్దున్నే కారులో చెంగల్పట్టుకి బయలుదేరారు. దారిలో ఆకలేసి టిఫెన్లు తిందామన్నారు. రాఘవ వెళ్లి దగ్గర్లో ఉన్న హొటల్లో టిఫెన్లు కట్టించుకుని వస్తే అందరూ తిన్నారు. బిల్లు ఎంతయింది అంటే రెండో, మూడో రూపాయలైంది. ప్రకాశం తన సెక్రటరీ కేసి తిరిగి, ఇచ్చేయ్ అన్నారు. 'మీరు వంద రూపాయలిచ్చి, అది ఖర్చయ్యాక మళ్లీ అడగమంటారు. వందా నిన్ననే ఖర్చయిపోయాయి. జేబులో ఏమీ లేదు' అన్నాడతను. ప్రకాశం గారి జేబు ఎప్పటిలాగానే ఖాళీ. ఇక మిగిలింది డ్రైవరు, క్లీనర్ రాఘవ.

ప్రకాశం రాఘవతో "వెళ్లి ఆ హోటల్ వాడితో ఇలా ప్రకాశం తాలూకు అని చెప్పు. చెంగల్పట్టులో ఎవరినైనా అప్పడిగి, తిరిగి వచ్చేటప్పుడు బాకీ తీర్చేస్తామని చెప్పు" అన్నారు. రాఘవ చెప్పగానే హోటల్ వాడు అయ్యయ్యో ప్రకాశం గారా, టిఫిన్ తెప్పించుకున్నది అంటూ మరిన్ని టిఫిన్లు ప్యాక్ చేయించి, కారు దగ్గరకు వచ్చి ఆయనకు దణ్ణం పెట్టి, డబ్బాగిబ్బా ఏమీ వద్దు, మీలాటి వారు నా హోటల్ టిఫిన్ తినటమే నా అదృష్టం అని చెప్పుకున్నాడు. అదీ ప్రజల్లో ఆయనకున్న పలుకుబడి. డబ్బు పట్ల ఆయన నిర్లక్ష్యం. ప్రకాశం గారు మనుష్యులను నమ్మి బోల్తా పడిన సందర్భాలు కూడా చాలా ఉన్నాయి. తన ఆత్మకథలో ఆయన రాసుకున్న ఒక ఘట్టాన్ని చెపుతున్నాను.

ప్రకాశం "స్వరాజ్య" అనే పత్రికను పెట్టడానికి ఓ కంపెనీ నెలకొల్పి దానికి ఎండీగా తనుంటూ, ఇన్వెస్టరుగా తన భార్య పేరు పెట్టారు. ప్రెస్ పెట్టడానికి ఒక యింటిని నెలకు రూ. 300 అద్దెపై మూడేళ్ల లీజుకు తీసుకున్నారు. ఈయన జైలుకి వెళ్లి వస్తూండడంతో పత్రిక నష్టాల్లో పడింది. 1932లో ఆయన అరెస్టు అయ్యేనాటికి లినోటైపు కంపెనీకి, యింటి యజమానికి రూ. 20 వేల దాకా బాకీలు పడ్డారు. అయితే లక్షలు విలువ చేసే మెషినరీ అక్కడ వుంది. పత్రిక ఆగిపోతుందని భయపడిన కంపెనీ మేనేజరు కృపానిధి యిల్లు గలాయన సూర్యనారాయణ వద్దకు వెళ్లి "అద్దె బకాయికు ఒత్తిడి చేయకండి, పైన కాస్త ఋణం యివ్వండి, పంతులుగారు బయటకు వచ్చేవరకు పత్రిక నడపాలి." అన్నాడు. అప్పు యిచ్చినట్లే యిచ్చి మొత్తం మెషినరీతో సహా

కొట్టేద్దామని సూర్యనారాయణకు దుర్బుద్ధి పుట్టింది.

ప్రకాశం భార్య హనుమాయమ్మ రూ. 1.13 లక్షల డబ్బు కంపెనీకి అప్పు యిచ్చి కంపెనీ ఆస్తులపై ఫ్లోటింగ్ హక్కు పొంది ఉన్నారు. ఆ సరికి ఆ అప్పు రూ.2 లక్షలైంది. ఆమె కున్న యావత్తు హక్కు తనకు దఖలు పరిచి, ఆ తర్వాత కంపెనీవారు యావదాస్తీ తన పేర తనఖా రాస్తే తప్ప ఒక్క కాణీ కూడా అప్పు యివ్వనని సూర్యనారాయణ చెప్పాడు. ఆవిడ అలా రాయాలంటే వెల్లూరు జైల్లో ఉన్న ప్రకాశం గారు ఆ మేరకు ఆవిడ పేర ఉత్తరం రాసి యివ్వాలి. ఇలాటి అన్యాయపు ప్రతిపాదనకు ప్రకాశం గారిని కన్విన్స్ చేయడం చాలా కష్టం. అందుకని ఆయనను గందరగోళ పరిచి రాయించుకోవడమే మార్గం. దానికోసం ఆ సూర్యనారాయణ పెద్ద ప్లాను వేశాడు. కృపానిధిని వెంటబెట్టుకుని ఒక శనివారం నాడు సాయంత్రం వెల్లూరు జైలుకి వెళ్లి జైలు సూపర్నెంటుని కలిశాడు. చాలా జరూరు పనిమీద వచ్చామని, రేపు ఉదయం ఆరు గంటలకు ప్రకాశం గార్ని కలవాలని, ఐదు నిమిషాలు చాలని రిక్వెస్టు చేశారు. ముందస్తు దరఖాస్తు పెట్టుకోకపోయినా అర్జంటు అన్నారు కదాని ఆయన సరేనన్నాడు.

ప్రకాశం గారికి ఏ సమాచారమూ లేదు. ఎవరు వస్తున్నారో తెలియదు. ఉదయం ఆరు గంటలకల్లా కలవాల్సి వచ్చింది. అందునా కృపానిధిని బయట నిల్చోబెట్టి, సూర్యనారాయణ ఒక్కడే కటకటాల వద్దకు వచ్చాడు. సూపరింటిండెంటు కాస్త అవతలగానుంచుని, నిమిషనిమిషానికి లెక్కపెడుతూ టైమైపోతోంది అంటూ కేకలు పెడుతున్నాడు. ఇవతల సూర్యనారాయణ కొంపలు మునిగిపోతున్నాయని కంగారుపెట్టి, వెంటనే భార్యపేర ఉత్తరం రాసి యిమ్మనమని చెపుతూ కాగితం కలం చేతిలో పెట్టాడు. విషయాలు తెలుసుకుందామంటే కృపానిధి దగ్గర్లో లేడు. ఇలాటి గందరగోళ పరిస్థితుల్లో ప్రకాశం గారు ఆ ఉత్తరం రాసి అతని చేతిలో పెట్టేశారు. వాళ్లావిడ ఆయన చెప్పినట్లుగానే చేసింది. దాంతో ప్రెస్ ఆస్తంతా సూర్యనారాయణ చేతిలోకి వెళ్లిపోయింది. ఈయన జైల్లోంచి బయటకు వచ్చాక న్యాయపోరాటం చేసినా పూర్తి లాభం దక్కలేదు. లక్షలు చేసే ప్రెస్సు మెషినరీ, భూమి వందలూ, వేలల్లో ఎగిరిపోయాయి.

తన ప్రవర్తనను సమీక్షించుకుంటూ ప్రకాశం గారు ఆత్మకథలో రాసుకున్నారు– 'నా సొంత ఆస్తులే కాదు, నన్ను నమ్మి నా యందు ఉన్న అఖండిత విశ్వాసంతో, యీ దేశీయులే గాక పై దేశాల వారు కూడా, ఏ విధమైన ఆపేక్షలూ లేకుండా విరివిగా చేసిన ధనసహాయం చేర్చి నెలకొల్పిన ఆ 'స్వరాజ్య' సంస్థను మూసివేయడం నాకు ఎంతమాత్రమూ యిష్టం లేదు. ఆనాటి నా సంతకమే మూసివేతకు కారణమైంది. నా జీవితంలో ఎప్పుడూ ప్లీడరుగా, అడ్వకేటుగా, రాజకీయవేత్తగా పనిచేసి, అటువంటి చికాకు పరిస్థితులలో నేను చిక్కుకోలేదు. ఆ సమయంలో నా సహజ వివేకం కూడా నన్ను విడిచిపెట్టి పారిపోయిందనుకుంటాను. అందుకే సూర్యనారాయణ నన్ను మోసపుచ్చ గలిగాడు.' అని.

ఇప్పుడు ఉండవల్లి చెప్పిన ఉదంతం రాస్తాను. ఓ సిమెంటు డీలరు వద్దకు కోటేశ్వర్రావు అనే వ్యక్తి వచ్చి 200 బస్తాల సిమెంటు ఎలాట్‌మెంట్ ఆర్డరు చూపించి, 'నువ్వు నాకు సిమెంటు యివ్వనక్కరలేదు, బస్తాకి రూపాయి చొప్పున యిచ్చేసి, యీ బస్తాలను బ్లాక్‌లో బస్తాకు రెండు రూపాయలు ఎక్కువేసి అమ్ముకో' అన్నాడు. ఆ ఆర్డరు మీద ముఖ్యమంత్రి ప్రకాశం సంతకం ఉంది. ఆ డీలరు దాన్ని ప్రతిపక్ష నాయకులకు అందజేశాడు. కనుక్కుంటే ఆ వ్యక్తికి స్థలం లేదని, యిల్లు కట్టుకునే స్తోమత లేదని తేలింది. ముఖ్యమంత్రే అలాటి కొందరు ఏజంట్ల ద్వారా సిమెంటు బ్లాక్ మార్కెట్‌ను ఎన్‌క్యాష్ చేసుకుంటున్నారని, క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని ప్రతిపక్షం వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో యీ ఉత్తరం చూపించి నిలదీద్దామనుకున్నారు. స్పీకరు తన ఛాంబర్‌లో ప్రకాశం గారికి, ప్రతిపక్ష నాయకులకు సమావేశం ఏర్పాటు చేశారు. ప్రకాశం గారికి అప్పుడు 80 ఏళ్లు. అందర్నీ ఏరా అనే అలవాటు.

వీళ్లు చెప్పేదేమిటో ప్రకాశం గారికి మొదట అర్థం కాలేదు. 'సిమెంటేమిటిరా?' అన్నారు. ఉత్తరం చూపిస్తే 'అవును, యీ సంతకం నాదే. ఓర్నీ పైన సిమెంటు అని రాశాడా వీడు!' అని ఆశ్చర్యపడ్డారు. అదేమిటి, చూడకుండానే సంతకం పెట్టారా? అని అందరూ ఒక్కసారిగా అడిగారు. 'అవునురా, సంగతి చెప్తానుండండి. ఈ కోటేశ్వర్రావు వాళ్ల నాన్న చలపతి అని బాగా డబ్బున్నవాడు. స్వాతంత్ర్యపోరాటంలో జైలుకి వెళ్లినవారి కుటుంబాలను ఆదుకునేవాడు. వేలాది కుటుంబాలను పోషించే భారం నెత్తిన వేసుకుని ఆస్తంతా కరగదీసేశాడు. పోయాడు. ఇప్పుడు ఆయన భార్యకి పెద్ద రోగ మొచ్చింది. వెల్లూరు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలి. చేతిలో పైసా లేదు. అప్పుడు కోటేశ్వర్రావు నా దగ్గరకు వచ్చి సాయం చేయమన్నాడు. జేబులన్నీ వెతికితే ఎనిమిది రూపాయలున్నాయి. అది యిస్తే నిష్ఠూరంగా చూశాడు. ఏం చెయ్యమంటావురా, నా దగ్గర యింతే ఉంది అన్నాను.

'ముఖ్యమంత్రివి, రెండొందలివ్వలేవా అని వాడంటూంటే నాకు ఎందుకు బతికున్నానా అనిపించింది. లెక్కలేనంత సొమ్ముని మాలాటి వాళ్ల కోసం, మనం యీనాడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం కోసం చేతికి ఎముక లేకుండా దానం చేసిన చలపతి భార్యను యీ రోజు మృత్యుముఖంనుంచి రక్షించుకో వడానికి రెండొందలైనా యివ్వలేని నేనెందుకు? ఈ పదవెందుకు? అనిపించింది.నువ్వు తలచుకుంటే రెండొందలు యివ్వలేవా? అని వాడు నిలదీశాడు. తలచుకుంటున్నానురా, ఎలాగివ్వమంటావో చెప్పు, ఏం చెయ్యమన్నా చేస్తాను అన్నాను. మర్నాడు యీ కాగితం తెచ్చి సంతకం పెట్టు, నాకు డబ్బు సర్దుబాటవుతుంది అన్నాడు. మీరనేది నిజమే, సంతకం పెట్టేముందు చదవాల్సింది, కానీ చదివినా సంతకం పెట్టేసి వుండేవాణ్ని. అది నా బలహీనత. వాడిని ఎలాగైనా ఆదుకోవాలనే నా తాపత్రయం. నా సొంత డబ్బయినా, ప్రభుత్వం డబ్బయినా అంతే.

'ఇంత బలహీనమనస్కుడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రసంపద కాపాడలేడు అని మీరు అనుకుంటే తప్పేమీ లేదు. నా సొంత ఆస్తే తగలేసుకున్నవాణ్ని, యింత బాధ్యత ఏం మోస్తాను. అన్నట్టు చలపతి భార్య ఆసుపత్రికి తీసుకెళ్లకుండానే పోయిందట. ఆ డబ్బు వెనక్కి యిచ్చేస్తానని కబురు చేశాడు. పెద్ద కుటుంబంనుంచి వచ్చినవాడ్రా. తల్లికోసం యీ వెధవపని చేశాడు. ఇచ్చేస్తాడులే. ఇక నా రాజీనామా సంగతంటారా, దానిలో అనారోగ్య కారణమో మరోటో రాసి లేఖ తయారు చేయించండి. ఈ కథంతా అందరికీ తెలియటం నాకంత యిష్టం లేదు.' అని ముగించారు ప్రకాశం.

కళ్ల వెంబడి నీళ్లు కారుతూండగా ప్రతిపక్ష నాయకుడు లేచి నిలబడి "పంతులుగారూ, క్షమించండి" అన్నాడు. స్పీకరుగారు తలదించుకుని కన్నీరు కారుస్తున్నాడు. గదిలో అందరికీ ఏడుపు ఆగటం లేదు. ఎందుకంటే వారిలో చాలామంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారున్నారు. తాము జైలులో వుండగా తమ కుటుంబాలు ఎటువంటి అవస్థలు పడ్డాయో తెలుసు వారికి. విషయం అంతటితో ముగిసిపోయింది. ఎవరూ రాజీనామా గురించి యిక ప్రస్తావించలేదు. ఇలాటి పరిస్థితిని ధర్మసంకటం అని నేనెందుకు అంటానంటే ప్రకాశం గార్ని యీ విషయంలో తప్పు పట్టాలా లేదా, ఆయన చేత రాజీనామా చేయించాలా వద్దా అని చటుక్కున చెప్పడం కష్టం. చట్టప్రకారం నేరం చేశారు. కానీ దాని వెనకాల వున్న కారణాలను పరిగణనలోకి తీసుకుని శిక్ష వేయకూడదు అనగలమా?

నెలవంక కత్తి దూసింది!

– సతీష్ చందర్

కవి వస్తాడు.

చూడాలి. ఎదురు చూడాలి.

ఎలా చూడాలి?

సూర్యుణ్ణి దర్శించినట్లు కాదు, చంద్రుణ్ణి వీక్షించినట్లు చూడాలి.

భళ్ళున తెల్లారినప్పుడు, కిటికీలో భానుణ్ణి ముఖం చిట్లించి చూస్తాం. కానీ నెలవంకను చెట్ల కొమ్మల చిగురుటాకుల సందుల్లోంచి చిరునవ్వుల్తో చూస్తాం.

మండే వాడని తెలిసి కూడా రవిని ఒక్క సారి చూసేస్తాం. మెత్తనిదని తెలిసి కూడా జాబిల్లిని వెతుక్కుంటూ, అంచెలంచెలుగా చూస్తాం.

కవిని చందమామను చూసినట్లు చూడాలి.

అజంతా శివసాగర్‌ను అలాగే చూశాడు.

అరణ్యాన్ని వీడి, అజ్ఞాతాన్ని వీడి వచ్చిన కవి అతడు. లోపలినుంచి వెలుపలికి వచ్చాడన్నారు అంతా.

సరిగ్గా ఇదే వేళలో ఆఫ్రికాలో సూర్యుడు నల్లగా ఉదయించాడు. నెల్సన్ మండేలా తెల్లని జైలుగోడలనుంచి వెలుపలికి వచ్చాడు.

బెజవాడ ప్రెస్ క్లబ్‌లో హడావిడి. వాళ్ళంతా శివసాగర్‌లోని కె.జి.సత్యమూర్తిని చూడటానికి వచ్చారు.

అజ్ఞాతం ఒక ఆకర్షణ. కనిపించకుండా వుండటం ఒక సంచలనం. విరాట పర్వం ఒక ఉత్కంఠ.

అజంతా గుమ్మం దాటకుండా శివసాగర్ కోసం మాత్రమే ఎదురు చూస్తున్నాడు.

చిత్రం. ఒకరిలో ఇద్దరు. కత్తులు విసిరే వాడొకడు. పువ్వులు కోసే వాడొకడు

అజంతాకు పువ్వులు కావాలి. 'విప్పపూల'తో వస్తాడని గుమ్మం దిగకుండా ఎదురు చూస్తున్నాడు. ఆ రోజు కుదరలేదు.

మరుసటి రోజు సాయింత్రం సూర్యుడు జారుకునే వేళ, సాయింత్రపు ఎండ మనుషుల ముఖాలను గమ్మత్తుగా వెలిగిస్తున్న వేళ శివసాగర్ నాకు చిక్కాడు. చిక్కిన వాణ్ణి చిక్కినట్టే ఎత్తుకు పోయి, అజంతా ఇంటి ముందు నిలబెట్టాను.

లోపలికి అడుగు పెడుతున్న శివసాగర్‌ను వెలుపలే నిలవమన్నాడు అజంతా.

కొంచెం ఆశ్చర్యం! ఎందుకో కొంత కోపం కూడా వచ్చింది.

అజంతా కూడా వెలుపలకి వచ్చాడు.

అలా పక్కగా నీరెండలో నిలబడమన్నాడు. దూరంగా, దగ్గరగా.. దగ్గరగా, దూరంగా రకరకాలుగా చూశాడు.

'మహాకవిని చూస్తున్నాను' అని మురిసి పోయాడు అజంతా.

కౌగలించుకున్నాడు, కళ్ళు చెమ్మ చేసుకున్నాడు. అప్పుడు కానీ ఇంటిలోపలికి రానివ్వలేదు.

అజంతా ఎప్పుడూ చెబుతూ వుండేవారు, తాను శ్రీశ్రీకి దగ్గరగా వెళ్ళే వాణ్ణి కాదని. ఎందుకంటే, 'వాడు సూర్యుడు. దూరంనుంచే చూడాలి. దగ్గరకు వెళ్ళితే మాడిపోతాం.' అనే వారాయన.

ఈ మాటలు అజంతా గురించి తెలిసిన వారికి ఆశ్చర్యం కాదు.

అజంతా కవే కానీ, అందరి లాంటి కవి కాదు. అందరూ కవిత్వం రాస్తాడు. అజంతా కవిత్వాన్ని జీవిస్తాడు. తీరిక దొరికితే రాస్తాడు.

అలాంటి అజంతా శివసాగర్‌లోని పుచ్చపువ్వుల వెన్నెల్ని చూశాడు.

నెలవంక వచ్చేశాక, అంతవరకూ ఒక వెలుగు వెలిగిన సూర్యుడు వెలవెల బోతూ పడమటి గుమ్మంలోంచి వెళ్ళిపోయాడు.

అదే రాత్రి అనుకుంటాను. ఎవరిదో డాబా. కవుల సందడి. మధ్యలో 'చితి–చింత' వేగుంట మోహన్ ప్రసాద్ . అక్కడకీ శివసాగర్ వెన్నెల తెచ్చాడు. శివసాగర్ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు 'మో' ('మో' అంటేనే బావుంటుంది. మోహన్ ప్రసాద్ అనేటంత పెద్ద పేరును ఆయన మోయడు)

'ఇంత మెత్తగా... ఓహ్! కవిత్వం రాసే చేతులు కదా! ఈ చేతుల్తో నే మనుషుల్ని చంపేస్తారా...?'

'మో' ప్రశ్నకు శివసాగర్ నవ్వులు.. 'హోరు హోరు హోరుగా.. హొయలు హొయలు హొయలుగా'

అవును 'యాంగ్సీ' నది పొంగినట్టుగానే.

ఒక చేత్తో గన్ను. తూటాల హోరు!!

మరో చేత్తో పెన్ను. పదాల హొయలు!!

మృగాలతోనే వేట. మనుషులతో పాటే.

ఒకరి లో ఇద్దరు. శివుడూ అతడే, పార్వతీ అతడే. తాండవమూ తెలుసు. లాస్యమూ తెలుసు.

శివసాగర్ ది వెన్నెల భాష.

వేడిని మింగుతాడు. వెలుతురును పంచుతాడు.

అందుకే 'భూస్వాముల తలల గుత్తులను రాల్చే' గండ్రగొడ్డళ్ళ తళ తళల ఉద్యమానికి నెలవంకనే ప్రతీక గా తీసుకున్నాడు.

శ్రీశ్రీ అలా కాదు. వెలుతురు కావాలంటే, వేడిమిని భరించాల్సిందే నంటాడు. అందుకే అతడికి 'కవీ, రవీ' పర్యాయ పదాలవుతాయి.

అభ్యుదయ భానుడిగా శ్రీశ్రీ, విప్లవోద్యమ నెలబాలుడిగా శివసాగర్ గుర్తుంటాడు.

తెలుగు వాడికి– అభ్యుదయం అంటే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'

విప్లవం అంటే శివసాగర్ 'ఉద్యమం నెలబాలుడు'

ఎవరి యుగాలు వారికున్నాయి. ఇద్దరూ తమ తమ యుగాలకు

పథనిర్దేశం చేసినవారే.

యుగానికో యుద్ధం. యుద్ధానికో ఆయుధాగారం.

నిన్నటి ఆయుధాలు, నేటి యుద్ధంలో పూచిక పుల్లలయిపోతుంటాయి

యుగానికో కవిత్వం. కవిత్వానికో 'డిక్షన్'

నిన్నటి ప్రతీకలు, నేటి కవిత్వం ముందు చిన్న బోతూ వుంటాయి.

విప్లవంలో ఆయుధంపట్టటం తర్వాత సంగతి.

విప్లవ కవిత్వానికి ఏ ప్రతీకలు, పదచిత్రాలూ అవసరమో వాటిని విప్లవం లోనే వెతికి పట్టాడు. వెన్నెల్లో అరణ్య సౌందర్యాన్ని దర్శించాడు.

ఎంత అందం!

అక్కడ పుట్టడమొక అందం.

'గరిక పూల పాన్పు మీద అమ్మ నన్ను కన్నందుకు
విప్లవాభివందనాలు'

బతకటమొక అందం.

'ఇప్పుపూ సెట్టుకింద నరుడో భాస్కరుడా, విల్లు సారించితివా
నరుడో భాస్కరుడా'

చావటమొక అందం.

'అమరత్వర రమణీయమయ్యింది'

ఏవీ నిన్నటి 'భూతాలు, యజ్ఞోపవీతాలు'?

ఎక్కడ 'జగన్నాథ, జగన్నాథుని రథచక్రాలు'?

ఎటు వెళ్ళాయి 'హరోం హర హర.. హర.హర' ప్రతిధ్వనులు?

అవి గిరిజన తండాల్లో సరిపడవు.

చెల్లీ చెంద్రమ్మలకు వినపడవు.

ఎండుటాకుల మీద వీరుడి పాదాల అలికిడికీ, అలికిడికీ మధ్య ఒక్కొక్క మాట వేసుకుంటూ పోయినట్లు,

కవిత్వానికి ఒక కొత్త కూర్పు అవసరమయ్యింది.

శివసాగర్ పోల్చుకున్నాడు.

ఒక్కొక్క పోలిక కోసం, ఒక్కొక్క వైరుధ్యం కోసం ఎదురు చూశాడు.

ఎండా, వాన కలిసి రావటం కోసం ఎదురు చూడటం తెలియాలి. వాళ్ళే కవిత్వం గురించీ ఎదురు చూడగలరు?

కవిత్వం రావాలి. దానంతట అది రావాలి. వచ్చే వరకూ వేచి చూడాలి.

ఆ గుట్టు పాబ్లో నెరుడాకు తెలిసినట్లే , శివసాగర్‌కూ తెలుసు.

'కవిత్వం నన్ను వెతుక్కుంటూ వచ్చిందంటాడు' నెరుడా.

శివసాగర్ కూడా అలాగే అంటాడు.

వెంపటాపు సత్యాన్ని చంపగానే కలతపడ్డాడు శివసాగర్. రూపం కోసం వెతికాడు. దొరికింది. కొత్త రూపం. ప్రజల్లోనే

బాధను తాను దిగమింగి ఆశను ఇచ్చిన రూపమిది.

సూర్యుడి వేడిమిని తాను మింగేసి, వెలుతురు మాత్రమే ఇవ్వ గల నెలవంక రూపమది.

సత్యం హత్యకు దు:ఖితులయి వున్న వారిని ఓదార్చటానికి, ఓ రైతు–

'అదే లెండి. తుపాకీ గుండు గుండెకు తగల్లేదు. తొడకు తగిలింది అన్నాడు'.

చనిపోలేదు. కోలుకుంటాడూ– అనే ఆశను ఇచ్చినట్టుగా శివసాగర్ భావించి, ఉద్యమం దెబ్బతిన్నా కోలుకుంటుందన్న భరోసానిస్తూ,

'తోటారాముని తొడకు తూటా తగిలిందానీ
చిలుకా చీటీ తెచ్చెరా!
మైనా మతలబు చేసెరా!'

శివసాగర్ దగ్గర ఒక ఆవేశమయినా, ఆవేదనయినా అక్షరరూపం దాల్చాలంటే,

ఎదురు చూడాల్సిందే. 'అరచేతిలో గోరింటాకు ఎరుపెక్కేటంత' వరకూ ఎదురు చూడాల్సిందే.

ఇలా తపస్సు తపస్సు కో ఆయుధం

విప్లవ కవిత్వాయుధాగారాన్ని నింపి, తన సమకాలికులకు ఉదారంగా వీలునామా రాసిచ్చేసిన అక్షర దానకర్ణుడు శివసాగర్?

యుద్ధం తర్వాత వుండేది కేవలం శాంతి మాత్రమే కాదు, ఒక స్వప్నం కూడా.

ప్రతి యుద్ధానికీ ఒక స్వప్నం వుంటుంది. అదే కవి చేసే ఊహ

స్త్రీ అంటే శరీరమేనంటూ ప్రబంధాంగనలను సృష్టించే కాలానికి చెల్లు చీటి ఇచ్చేస్తూ, ఆమె హృదయాన్ని ఆవిష్కరించటానికి యుద్ధం చేస్తూ వున్న భావకవికీ ఒక ఊహ వుంటుంది:

'ఆకులో ఆకునై.. పూవులో పూవునై
ఇచటనే దాగిపోనా'

దోపిడి సమాజానికి వ్యతిరేకంగా కార్మికులు సంఘటితం అయ్యే రోజును ఆవాహన చేసే అభ్యుదయ కవికీ ఒక ఊహ వుంటుంది:

'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాల్'

అదే దోపిడి కూలదొయ్యటానికి ఆయుధం పట్టేసి, బరిలోకి దిగిపోయి, బలిదానానికి సిద్ధమయి పోయాక విప్లవ కవి శివసాగర్ చేసిన ఊహ మరోలా వుంటుంది.

'ఉరి కంబం మీద నిలిచి
ఊహాగానం చేసెద
నా ఊహల ఉయ్యాల లోన
మరో జగతి ఊసులాడు'

విప్లవ భావుకతలో అత్యంత సంపన్నుడు శివసాగర్

ఈ భావుకతను అభ్యుదయ కవిలో చూడలేం. ఇంకా ,అభ్యుదయ కవిత్వాన్ని(జడరూపం దాల్చాక) వెక్కిరించి వచ్చి విప్లవ కవి చెరబండరాజులో ఇదే భావుకతను చూడగలం:

'ఉరి తాటికి పాట నేర్పి
పల్లవినై పాడిస్తా.'

శ్రీశ్రీ అభ్యుదయ కవినుంచి విప్లవ కవిగా మారాక, ఈ ఛాయలు 'మరో ప్రస్థానం' లో కనిపిస్తాయి. కానీ చాలా మటుకు 'మహాప్రస్థానం' ఆయుధసంపత్తితోనే ఇక్కడా యుద్ధం చేస్తారు. అందుకే 'మహాప్రస్థానం' అయినట్టుగా 'మరోప్రస్థానం' ఆయనకు ప్రాతినిథ్యం వహించే కావ్యం కాలేక పోయింది.

కానీ శివసాగర్ కు 'ఉద్యమం నెలబాలుడే' కాదు. తర్వాత వచ్చిన 'నెలవంక' కూడా విప్లవ ప్రాతినిథ్యం వహిస్తాయి.

అభ్యుదయ కవిత్వం దోపిడీని ఎత్తి చూపిస్తుంది.

విప్లవకవిత్వం దోపిడీని నిలదీస్తుంది.

'బలవంతులు దుర్బల జాతిని

బానిసలు కావిస్తుంటే...' ఇది అభ్యుదయ కవి చూసిన దోపిడీ.

'వీపు మీద చద్దిమూట

చేతిలోన గండ్ర గొడ్డలి'

ఇది విప్లవ కవి చూపిన దోపిడీ ప్రతిఘటన.

చద్దిమూట మోసే అతి సామాన్యుడి చేతికి గండ్రగొడ్డలి ఇచ్చింది విప్లవం.

బలహీనులే విప్లవంలో బలవంతులుగా మారటం విప్లవ కవి ఆవిష్కరించిన దృశ్యం.

ఇదే దారిలో నడిచిన విప్లవ కవి వంగపండు ప్రసాద రావు కూడా

'సికాకులంలో సిలకలున్నయట.

సిలకలు కత్తులు దులపరిస్తయట.' అని సుకుమారమైన చిలకల్ని యుద్ధప్రతీకలు చెయ్యటం వెనుక వున్నది ఈ విప్లవ భావుకతే

అభ్యుదయ కవితా యుగంలో శ్రామికులూ, దోపిడీ దారులే వుంటారు.

విప్లవ కవిత్వంలోకి 'అన్న'లూ, 'అక్క'లూ వస్తారు.

వీరికీ జనానికీ వుండే అనుబంధం. అందులో వుండాలల్సిన స్వచ్ఛతనీ శివసాగర్ ముందుగా పోల్చుకున్నాడు, ఎవరూ నిర్వచించలేనంత గొప్పగా ముందుగా నిర్వచించాడు.

'కసితో స్వార్థం శిరస్సు గండ్రగొడ్డలితో నరక గల్గిన వాడే నేటి హీరో'.

జనం, దళం- ఒకరికి ఒకరు ఏమవుతారో చెప్పటానికి ఏకంగా సముద్రాన్ని ఎరువు తెచ్చుకున్నాడు శివసాగర్:

'కడలి జనం. అలలు దళం

అలలు కడలి ప్రాణ ప్రదం'

ఆయుధం 'అక్క' చేతికి ఇచ్చేశాక కూడా రెండో చేతిలో ఎక్కడ 'గరిటె' పెడతారోనని ముందుగానే ఆందోళన చెందిన క్రాంత దర్శి శివసాగర్. అందుకే మావో వాక్కును అక్కున చేర్చుకుని 'అక్కల్ని' సైతం అంతే సమానంగా నిర్వచించాడు.

'ఆకాశంలో సగం నీవు

అనంత కోటి నక్షత్రాల్లో సగం నీవు. సగంనేను'

ఇంత జాగ్రత్త పడ్డా, అక్కల్ని తక్కువ చేశారు. లేకుంటే తర్వాత కాలంలో విమల 'వంటిల్లు' వచ్చేది కాదు.

యుద్ధం తెలిసిన వాడు బహిర్యుద్ధమే కాదు. తేడా వస్తే అంతర్యుద్ధమూ చేస్తాడు.

శివసాగర్ రెండూ చేశాడు.

బ్యాలెట్‌కు కులముందనే కదా, బులెట్ పట్టుకున్నదీ..!

కానీ బులెట్ గురి తప్పటం లేదు. ఎప్పుడూ అట్టడుగు వాణ్ణే గురి పెడుతోంది.

కాల్చటమే అధికారమయిన చోట కాల్పించేది అగ్రవర్ణమవుతోంది.

ఉద్యమం అన్నాక తప్పులు జరుగుతాయి. కానీ జరిగిన తప్పులే తిరిగి తిరిగి జరగవు.

అలా జరిగితే, ఎవరిదో ఒక్కరిదే బాధ్యత కాదు.

ప్రాణాలిచ్చే చోట పరాచికాలకు చోటుండదు.

వెన్ను చూపిన వారినీ, వెన్ను పొడిచిన వారినీ- ఇద్దరిలో ఎవ్వరినీ శివసాగర్ కవిత్వంలోనూ క్షమించలేదు.

'శత్రు చేజిక్కితినని వెక్కిరించకు నన్ను

మిత్ర ద్రోహము చేత శత్రు చేజిక్కితిని.. ఓ చందమామా!'

ఇది లోపలి మాట.

వెలుపలి ప్రపంచంలోనూ అంతే. 'శత్రు భజన' చేస్తున్నాడని, తాను అతిగా ఆరాధించిన శ్రీశ్రీని కూడా వదల్లేదు.

'నెహ్రూ బతికి వుంటే నక్సలైట్ అయ్యే వాడంటూ' శ్రీశ్రీ కవిత రాశాడని కోపం తెచ్చుకుని శ్రీశ్రీని కడిగి పారేశాడు శివసాగర్.

'నిదురించే శవాలను

వీపు తట్టి లేపకు.

దిష్టి బొమ్మ ఊహలను

నీ కవితలో మోయకు'

ఈ అంతర్యుద్ధం మామూలే.

కానీ ఏ 'అంచెల' కుల వ్యవస్థను ధిక్కరిస్తూ తాను 'విప్లవోద్యమం'లో చేరాడో అక్కడ కూడా, అది వుందని తాను తెంపుచేసుకున్నాక రాసుకున్నట్టున్నాడు:

'మాటల్లో మార్క్సిజం

చేతల్లో మనువాదం'

ఇక్కడే మరో యుగం వచ్చేస్తోందని గ్రహించాడు 'నెలబాలుడు'

స్త్రీ,దళిత, మైనారిటీ,ప్రాంతీయ అస్తిత్వాల యుగాలను ఆవిష్కరిస్తున్న వేళ లోపలినుంచి బయిటకు వచ్చాడు.

వాళ్లతో భుజం భుజం కలిపాడు.

మార్క్స్ చదివిన కళ్ళతోనే అంబేద్కర్‌ను చదివాడు.

ముందుకు దూసుకు పోతున్న కొంగ్రొత్త కవులతో కలం కలం కలిపి రాశాడు, గళం గళం కలిపి పాడాడు.

విప్లవ స్ఫూర్తితో 'ద్రోణుడి బొటన వేలు'ను 'ఏకలవ్యుడి' తో నరికించాడు. ఈ కవిత్వానికి తనకు తానుగానే నిర్వచించుకున్నాడు:

'ఇది కేవలం దళిత కవిత్వం కాదు. విప్లవ దళిత కవిత్వం. దళిత విప్లవ కవిత్వం.'

శివసాగర్ మహాకవి.

ఇలాంటి కవి యుగానికి ఒక్కడే వుంటాడు

ఆయనే అన్నాడు:

'కాలానికి ఒక కవి కావాలి.

ఒక కవిత కావాలి.

అందుకనే కాలం కడుపుతో వుండి

శ్రీశ్రీని కన్నది.'

నిజమే. కాలం-

అభ్యుదయ యుగంలో శ్రీశ్రీను కన్నది.

విప్లవ యుగంలో శివసాగర్‌ను కన్నది.

ఎప్పుడో శ్రీశ్రీ వెళ్ళిపోయాడు. ఇప్పుడు శివసాగర్ వెళ్ళిపోయాడు.

ఇద్దర్నీ తలవకుండా వుంటామా?

నెల పొడిచినప్పుడెల్లా నింగి చుక్కల్ని రాలుస్తుంది.

అవి మన కన్నీటి చుక్కలే!!

అమరజీవిని మరువలేము

- ఆర్.విజయబాబు



ఎందరో పుణ్యమూర్తుల త్యాగాల ఫలమే భారతదేశ స్వాతం త్ర్యం. పరాయిదేశస్థుల పాలననుండి విము క్తులైనా? తెలుగు వారికి స్వరాష్ట్ర పాలనలో స్వేచ్ఛ లేదు. స్వాతంత్ర్యం లేదు. అన్నింటా అవమానాలే. ఇంకొక భాషీయుల, ప్రాంతీయుల పెత్తనమే కాను కగా మిగిలింది. ఇదీ సుమారు 70 ఏళ్ళనాడు తెలుగువారి పరిస్థితి. ముఖ్యంగా ఆంధ్రా ప్రాంతీ యుల దుస్థితి. ఆ సంకెళ్ళనుండి విముక్తులై, నేడు, సొంత గడ్డపై స్వేచ్ఛా వాయువులు పీల్చు కునే సౌభాగ్యాన్ని అందించిన త్యాగమూర్తి 'అమంంజీవి' పొట్టి శ్రీరాములు. భారతదేశంలోనే తొలిగా భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కావడంలో అయన సేవ, పడిన తపన, చేసిన త్యాగం ఎన్నటికీ ఎవ్వరూ మరువలేము. తెలుగుస్ఫూర్తిని నింపుకుందాం. తెలుగు సంస్కృతిని నిలుపుకుందాం. అమరజీవిగా మనం కొలుచుకునే ఆ మహనీయుడు పొట్టి శ్రీరాములు. మద్రాస్ పెసిడెన్సీ పాలనా కాలంలో మార్చి 16 వ తేదీ 1901లో మద్రాస్ లో పుట్టారు. విద్యాభ్యాసం, ఉద్యోగాలు కొంత కాలం సాగించినా?చిన్న వయస్సులోనే భార్య, బిడ్డలను పోగొట్టుకున్న అయన తన జీవితాన్ని జాతికి అంకితం చేశారు. ముఖ్యంగా భారత స్వాతంత్ర్య సాధన, హరిజన ఉద్ధరణ, ఆంధ్రప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు.. వీటికే సర్వం అర్పించారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడు తుందని అందరూ భావించారు. జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి అగ్రనాయకులు ఈ అంశాన్ని అటకెక్కించారు. నిజంగా, మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనలో తెలుగు వారికి ఎటువంటి గౌరవం, భాగస్వా మ్యం లేదని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు తప్పక జరగాలనే డిమాండ్ ఎప్పటినుండో ఉంది. 1912లో నిడదవోలు లో జరిగిన గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లా నాయకుల తొలి సమావేశంలోనే బీజం పడింది. తర్వాత 1913 బాపట్ల, 1914 లో జరిగిన విజయవాడ, కాకినాడ, మద్రాస్ సభలు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు పునాదులుగా నిలిచాయి. ఈ పరిణామాల తర్వాత, 1918లో మద్రాస్ లో జరిగిన సభలో కాంగ్రెస్ ప్రత్యేక ఆంధ్ర విభాగం ఏర్పాటుచేశారు. గతంలో, భోగరాజు పట్టాభిసీతా రామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి వారు "భారత రాష్ట్రాల పునర్ని ర్మాణ" కరపత్రాలు రూపొందించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ వారు వీటిని పంచిపెట్టారు కూడా. రాష్ట్రం ఏర్పడితే? రాజధాని ఏర్పాటు, మంత్రివర్గ రూప కల్పన, నీటి పారుదల మొదలైన అంశాల విషయంలో రాయలసీమ, కోస్తా ప్రాంతపు అగ్రనాయకుల మధ్య అనేక విభేదాలు, అనుమానాలు ఉన్నాయి. ఇటువంటి నేపథ్యంలో, వీటన్నిటి పరిష్కారాల దిశగా, కోస్తా, రాయలసీమ నాయకుల మధ్య సయోధ్య కోసం 1937 నవంబర్ 16 వ తేదీనాడు మద్రాస్ లో చారిత్రాత్మకమైన "శ్రీ బాగ్ ఒడంబడిక" జరిగింది. "శ్రీ బాగ్ " అంటే? ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరావు పంతులు నివాసం. రాజధాని రాయలసీమ లో ఏర్పాటుచేస్తే? హైకోర్టు కోస్తా ప్రాంతంలో ఉండాలి, కోస్తా ప్రాంతంలో రాజధాని ఏర్పాటుచేస్తే? హైకోర్టు రాయలసీమలో ఉండాలి. ఇదీ ఒడంబడిక. మళ్ళీ, 1939 లో కృష్ణాజిల్లా కొండపల్లిలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సంఘం ఏర్ప డింది. అప్పటి కేంద్రప్రభుత్వం ఎస్ కె దార్ నేతృ త్వంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల కమీషన్ నియమించింది. ఇన్ని మలుపులు, ఇన్ని సంఘటన లు జరిగినా? చివరకు, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రమనే సంకల్పం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే సిద్ధిం చింది. మద్రాస్ తో కూడిన ఆంధ్రరాష్ట్రాన్ని మాత్రమే పొట్టి శ్రీరాములు కోరారు. మద్రాస్ నగరం నిర్మాణం లోనూ,అభివృద్ధిలోనూ, మద్రాస్ ప్రెసిడెన్సీ లో భౌగోళిక భాగస్వామ్యం లోనూ ఆంధ్రప్రాంతీయులదే అగ్రస్థానం, అని పొట్టి శ్రీరాములు భావన. అధికారం, ఆర్థిక అంశా లలో మాత్రం తమిళీయులదే పెత్తనమనేది ఆయన వాదన. వీటన్నింటికీ చరమగీతం పాడాలంటే? ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం సాధనే ఏకైక మార్గమని భావించి, ఉద్యమబాట పట్టారు. పొట్టి శ్రీరాములు మద్రాస్‌లో బులుసు సాంబమూర్తిగారింట్లో 1952 అక్టోబర్ 19వ తేదీ నాడు దీక్ష ప్రారం భించారు. 58 రోజులపాటు అచంచల ఆత్మవిశ్వాసంతో సాగించి డిసెంబర్ 15 వ తేదీ ప్రాణత్యాగం చేశారు. అయినా? ఢిల్లీ పెద్దలు కనికరించలేదు. హృదయాలు కరగలేదు. మద్రాస్‌నుండి విశాఖపట్నం వరకూ ప్రజలు ఉవ్వె త్తున ఉద్యమంలోకి వచ్చారు. హింసా సంఘటనలు జరిగాయి. పోలీసుల కాల్పులలో ఎందరో ప్రాణాలు ఒదిలారు. చివరకు, చేసేదిలేక, ఏలినవారు దిగివచ్చారు. డిసెంబర్ 19 వ తేదీ నాడు అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుచేస్తున్నామని ప్రకటించారు. దేవుడు వరమిచ్చినా? పూజారి వరమి య్యలేదు.. అన్న చందాన, చక్రవర్తుల రాజగో పాలాచార్యులు మద్రాస్‌ను ఆంధ్రరాష్ట్రంలో ఉంచడానికి ససేమిరా ఒప్పు కోలేదు. నెహ్రూ వంటి అగ్ర నాయకుడు కూడా ఆయన్ని ఎదిరించే పరిస్థితి లేదు. ఎట్టకేలకు, కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోని కొన్ని జిల్లాలు, బళ్లారి జిల్లా లోని రాయదుర్గం, ఆదోని, ఆలూరు కలిసి 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తెలుగువాళ్ళు ఎన్నో ఏళ్ళుగా కన్న కలలు నిజమ య్యాయి. తెలుగువాడు తమిళుల పెత్తనంనుండి బయటపడి, సొంతగాలి పీల్చుకునే స్వేచ్ఛ, సొంత పరిపాలన చేసుకునే సౌభాగ్యం పొందాడు.పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని ఎన్నటికీ మరువలేము.ఆయన ఋణం తీర్చుకోలేం. వారి పూర్వీకుల ప్రాం తమైన నెల్లూరు జిల్లాకు 2008లో అయన పేరు పెట్టుకున్నాం. తెలుగు విశ్వవిద్యాలయం ఇప్పటికీ అయన పేరునే ఉంది. 2014 లో తెలుగు రాష్ట్రాల విభజన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రం, మూలాలు ఇంకా హైదరాబాద్ లోనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో తెలుగు విశ్వవిద్యా లయం ఉనికి, విస్తరణ, వైభవ వికాసాలు జరిగినా? అదే పేరు తో ఉంటుందని ఆశిద్దాం. ఉండాలని ఆకాంక్షిద్దాం.మద్రాస్ మైలాపూర్ –రాయపేట హైవే ప్రాంతంలో నంబర్ 126 లో ఉన్న ఆయన నివాసం " పొట్టి శ్రీరాములు స్మృతి చిహ్నం" గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉంది.నేడు, తెలుగువారు రెండురా ష్ట్రాలుగా విడిపోయినా? పొట్టి శ్రీరాములు వంటి మహనీయులు నింపిన స్ఫూర్తితో ఐకమత్యంగా మెలగడమే మనం ఆ త్యాగధనులకిచ్చే నిజమైన నివాళి.

అరగంట ముందు తీసుకొచ్చినా బతికించేవాళ్లం...

- సురేష్

అబ్బా, జస్ట్, అరగంట ముందు తీసుకొచ్చినా బతికించేవాళ్లం... అంటారు కొన్ని సందర్భాల్లో డాక్టర్లు...అది ప్రాణాలను పోసే టైం... అదే టైంలో కాస్త ఆక్సిజెన్ పెట్టగలిగితే...అత్యవసర సేవ అందించగలిగితే... వేగంగా హాస్పిటల్ చేర్చగలిగితే...అదుగో అదే 108 సంకల్పం... ప్రభుత్వాలు వోట్ల యావతో చేపట్టే అనేకానేక దిక్కుమాలిన పథకాలతో పోలిస్తే వెయ్యిశాతం ఉపయోగకరమైన కార్యక్రమం ఇది... వైఎస్ హయాంలో కుయ్ కుయ్ పిలుపుతో ఫేమస్...తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది...అనేక ప్రాణాల్ని నిలబెట్టింది.

ఆయన తరువాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని భ్రష్టుపట్టించాయి... రాష్ట్ర విభజన తరువాత కూడా...రెండు రాష్ట్రాల్లోనూ అంతే... చాలాసార్లు డీజిల్ లేక, అంబులెన్సులు కదల్లేని దురవస్థ...రిపేర్లు చేయించేవారు లేక షెడ్డుకు...అప్పుడప్పుడూ సమ్మెలు...మిగిలినవి పేరుకు ఉన్నట్టే గానీ...అందులో ఏమీ ఉండవు...టైంకు రావు...ఓ స్ట్రెచర్, హాస్పిటల్‌కు రవాణా...అంతే...ఈ స్థితిలో జగన్ ప్రభుత్వం దీన్ని చక్కదిద్దేందుకు పూనుకుంది...శెభాష్...మిగతా బోలెడు వ్యవహారాలపై మనకు ఉండే అభిప్రాయాలు ఏమైనా గానీ...ఈ విషయంలో మాత్రం జగన్‌కు అభినందనలు.

వైఎస్ మొదట్లో ఇవి తీసుకొచ్చినప్పుడు ఓ లెఫ్ట్ నాయకుడు తన సహజధోరణిలో, ఛాట్, ఇదంతా కార్పొరేటు వారికి దోచిపెట్టే కుట్ర, ఈ పథకం, స్కాం అని ఆరోపించేవాడు...తరువాత ఓరోజు ఈ 108 కారణంగానే బతికి బట్టకట్టాడు...నోరు మూతపడింది...నిజంగా అర్జెంటు వైద్యం అవసరమైన వాళ్లకు ఇది సంజీవని.

నో, నో...మెయింటెనెన్స్ పెంచేశారు, ఇదీ స్కామే, ఇప్పటి సంస్థను తీసేసి, విజయ సాయిరెడ్డి అల్లుడికి కట్నంగా ఇస్తున్నారు, అడ్డగోలు రేట్లు పెంచారు అని తెలుగుదేశం ఏదో చెబుతుంది, వదిలేయండి... అది రాజకీయం... స్టాఫ్ జీతాలు కాస్త పెంచి, వాటిల్లో ఎక్విప్‌మెంట్ పెంచితే మెయింటెనెన్స్ పెరగదా..? ఓకే, కొంత కాస్ట్ పెరిగినా సరే, 108 సర్వీసులో నాణ్యత పెరగాల్సిన అవసరం ఉంది...ఆ పనే ఈ ప్రభుత్వం చేస్తోంది... అంతే.

లోన భాగం అంతా ఓ ఐసీయూ లాగా తీర్చి దిద్దారు... రాను రాను ఎవరూ దీన్ని భ్రష్టుపట్టించకూడదని ప్రార్థిద్దాం... ప్రతి మండలానికి ఒక 108... గుడ్... మొత్తం 412... ఓసారి 104 గురించీ చెప్పుకోవాలి...ఇక్కడ టీఆర్ఎస్ ప్రభుత్వం, అక్కడ టీడీపీ ప్రభుత్వం పూర్తిగా వదిలేశాయి...కేసీయార్ అయితే ఏకంగా హెలికాప్టర్ అంబులెన్సుల గురించీ మాట్లాడాడు...తెలుసు కదా, చివరకు ఏం జరుగుతుందో...జరిగిందో.

నిజానికి 104 ఊళ్లోకి వస్తే, దవాఖానా మన దగ్గరకు వచ్చినట్టే... కొన్ని పరీక్షలు, కొన్ని మందులు...ఇప్పటికీ వైద్యం ఛాయ సోకని తండాలు, గూడేలు, మారుమూల పల్లెలకు ఇవి ఎంత సౌకర్యం..? నిజానికి ఇంకా పెంచాలి వీటిని... ట్రెయిన్డ్ డాక్టర్లను పంపించాలి... ఇప్పుడు 676 మొబైల్ హాస్పిటల్స్ ప్రిపేరయ్యాయి.

108 లోనే 26 ప్రత్యేకంగా పిల్లలు, శిశువుల కోసం



కేటాయిస్తున్నారు...అది మరీ అభినందనీయం...(అడ్వాన్సుడ్ లైఫ్ సపోర్ట్ -104, బేసిక్ లైఫ్ సపోర్ట్-282, పిల్లల కోసం నియోనేటర్ వాహనాలు-26) కొన్ని వేల కోట్లను ఇష్టారాజ్యంగా పంచిపెట్టే పథకాలతో పోలిస్తే 200-300 కోట్లతో ఎంత మంచి సౌకర్యం అందుబాటులోకి వస్తున్నది...నిజానికి ఇదుగో, ఇలాంటివే జగన్ దృష్టి పెట్టాల్సింది... ఎవడు చెప్పాడో గానీ, ఎడాపెడా పంచేయడం అలవాటు చేసుకున్నాడు.

అడ్వాన్స్‌డ్ 108లో ఏమేం ఉంటాయంటే.

పల్సాక్సీ మీటర్ : ఆక్సిజన్ శాచ్యురేషన్ అంటే.. శరీరంలో ఆక్సిజన్ స్థాయిని చూడటంతోపాటు పల్స్ రేటు చూపిస్తాయి.

మల్టీపారా మానిటర్ : ఈసీజీ స్థాయిని ఎప్పటికప్పుడు చూడటంతో పాటు ఉష్ణోగ్రతల స్థాయి, రక్తపోటు స్థాయిలను చూడొచ్చు.

ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ : కొత్త వాహనాల్లో ఆక్సిజన్‌తో కూడిన ట్రాన్స్ పోర్ట్ వెంటిలేటర్ ఉంటుంది. బాధితుల పరిస్థితి విషమంగా ఉండి, శ్వాస తీసుకోలేని సమయంలో అంబులెన్స్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్‌ను ఉపయోగిస్తారు.

సక్షన్ ఆపరేటర్ : ప్రమాదంలో గాయపడినప్పుడు ఊపిరితిత్తుల్లో నిమ్ము, లేదా రక్తం చేరినప్పుడు ఆ తేమను లాగేందుకు ఈ సక్షన్ ఆపరేటర్ ఉపయోగపడుతుంది.

ఫోల్డబుల్ స్ట్రెచర్స్ : గతంలో ఇవి లేవు. తాజాగా తెచ్చారు. స్ట్రెచర్‌ను పూర్తిగా మడత పెట్టి తీసుకెళ్లొచ్చు. ఇది చాలా సులభంగా ఉంటుంది.

సిరంజి పంపు : ప్రమాదం జరిగినప్పుడు బాధితుడికి ఐవీ ఫ్లూయిడ్స్ లేదా, ఇంజక్షన్లు ఎక్కించాల్సి వచ్చినప్పుడు టైమ్‌ను సెట్‌చేస్తే ఆ టైము ప్రకారం ఇది ఎక్కిస్తుంది.,,

104 వాహనాల్లో సేవలు ఏమిటంటే..

ప్రతి పల్లెకూ నెలలో ఒకరోజు విధిగా వెళ్లాల్సిందే. మండలానికి ఒక 104 వాహనం ఉంటుంది. ఏ పీహెచ్‌సీ పరిధిలోకి వాహనం వెళ్లినప్పుడు ఆ పీహెచ్‌సీ సిబ్బంది లేదా ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది కూడా విధిగా వాహనం వద్దకు రావాల్సిందే. వాహనంలో డాక్టర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారు. మొత్తం 9 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారు. 20 రకాల సేవలు అందుబాటులో ఉంటాయి.

మొత్తం 74 రకాల మందులు పెడతారు. మధుమేహం, రక్తపరీక్షలు చేస్తారు. సర్వేజన సుఖినోభవంతు.

పగ కూడా మనిషిని బతికిస్తుంది...

- ఎస్.సిహెచ్. వెంకటేష్, ఎం.ఎ., ఎంఫిల్ - బెంగళూరు



అది 1919 ఏప్రిల్ 13 పంజాబ్ లోని అమృతసర్ లో జలియన్ వాలాబాగ్ ... అక్కడ ఓ చిన్నతోటలో.... రౌలత్ చట్టానికి వ్యతిరేఖంగా శాంతియుతంగా భారతీయులు సభ జరుపుకుంటున్నారు.

ఇంతలో అక్కడ ఉన్న అమాయక ప్రజలపై జనరల్ డయ్యర్ ఆధర్యంలో ఏ హెచ్చరిక లేకుండా విచక్షణారహితంగా కాల్పులు జరపడం జరిగింది. దాదాపు వెయ్యిమంది మరణించారు. రెండువేలమంది క్షతగ్రాత్రులైనారు. ఇది అత్యంత ఘోరమైన సంఘటన గా చరిత్రలో మిగిలిపోయింది..

ఆ రోజు ఆ సభలో మంచినీరు సరఫరా చేయడానికి ఒక అనాధశరణాలయంనుండి 19 యేండ్ల కుర్రాడు వచ్చాడు.. జరిగిన దురంతం చూసి చలించిపోయాడు. నేలమీదపరుండి ప్రాణాలు కాపాడుకున్న ఆ కుర్రాడు.. శవాల గుట్టలను చూసి కోపంతో వణికిపోయాడు.. కంటినిండానీరు ఉబికివస్తుండగా ఆ తోటలోని రక్తం అంటినమట్టిని తీసుకొని “ఈ దురంతానికి కారకుడైన వ్యక్తులను చంపేదాకా నేను చావను”అంటూ ప్రతిజ్ఞ చేశాడు.

దీనికి కారకుడైన జనరల్ డయ్యర్‌ను వెతుక్కుంటూ బయలు దేరాడు. తుపాకీ కాల్చుడం నేర్చుకున్నాడు. కొన్నిరోజులు భగత్‌సింగ్‌తో కలిసి విప్లవకార్యక్రమా లలో పాల్గొన్నాడు..

జనరల్ డయ్యర్‌ను చంపేందుకు ఇంగ్లండ్ పయన మవ్వాలనుకుంటున్న సమయంలో భగత్‌సింగ్‌తో పాటు ఆయనను అరెస్ట్ చేశారు.తన కళ్ళముందే భగత్‌సింగ్‌ను ఉరితీయడం చూసి హతాసుతుడైనాడు.. 1932లో విడుదలైన తర్వాత ఇంజనీరింగ్ చదవాలని ఇంగ్లండ్ పయన మైనాడు. పేరు మార్చుకుంటూ జనరల్ డయ్యర్‌ను వెంటాడసాగాడు.. దీనికోసం చాలా కష్టాలు పడ్డాడు. ఆకలితో నిద్రలేని ఎన్నో రాత్రులు గడిపాడు.

ఆరోజు 1940 జూలై 13....

డయ్యర్ ఒక కాన్ఫరెన్స్‌కు హాజరుకాబోతున్నాడు. ఆ సమాచారం ఆ యువకునికి అందింది... వెంటనే అతను ఎంతో కష్టపడి ఎంట్రీ పాస్ సంపాదించాడు .. ఒకపుస్తకంలో పిస్టల్ పట్టేటట్లు కాగితాలను కత్తిరించి అందులో పిస్టల్ దాచాడు.. అది చేతపట్టుకొని ఏమీ ఎరగనట్లు డయ్యర్ సభకు వెళ్ళాడు...

సభ ప్రారంభమైంది.. డయ్యర్‌ను వీరుడు, ధీరుడంటూ ఆంగ్లేయులు పొగిడేస్తున్నారు...

అది వింటున్న ఆ యువకుడి రక్తం సలసలా మరిగి పోసాగింది. జలియన్ వాలాబాగ్‌లో అమాయకుల ఆర్తనాదాలు గుర్తుచ్చాయి.. రక్తమడుగులో గిలగిలకొట్టుకుంటూ ప్రాణాలిడుస్తున్న అభాగ్యులు గుర్తుకొచ్చారు.. కానీ ఆ ధీరుడు తన ముఖంలో ఆ ఛాయలు కనిపించనీయకుండా గంభీరంగా ఉన్నాడు...

ఇంతలో డయ్యర్ ప్రసంగం ముగిసింది... ఆయనను అభినందించాడానికి జనాలు ఆయన దగ్గరకు వెళుతున్నారు.

ఆ యువకుడి కూడా లేచి పుస్తకం చేతబట్టుకొని డయ్యర్ దగ్గరకు వెళు తున్నాడు...

నిశితంగా గమనిస్తున్న డయ్యర్ ఆ యువకుడి వేషధారణను చూసి ఏదో గుర్తుకొస్తున్నట్లు అనిపించి కంగారు పడుతూ అప్రమత్తమ య్యేందుకు లేచాడు.

అంతే ఆయువకుడు పుస్తకంలోని పిస్టల్ మెరుపువేగంతో తీసి అంతే వేగంతో డయ్యర్ పై గుళ్ళ వర్షం కురిపించాడు..

భారత్ మాతాకీ జై అంటూ ధైర్యంగా అక్కడే నిలుచున్నాడు....

వేలమందిని చంపి భారతీయులు నా బానిసలు..వారి ప్రాణాలు నేను పెట్టిన బిక్ష అంటూ జలియన్ వాలాబాగ్ కాల్పుల తర్వాత గర్వంగా అన్నాడో... ఆతను జనరల్ డయ్యర్ నేలకొరిగాడు.. ప్రాణాలు విడిచాడు.

డయ్యర్‌ను చంపిన తరువాత ఈయనను చంపడానికే నేను ఇన్నిరోజులు బతికాను. ఇంక నన్ను ఏమైనా చేసుకోండి అంటూ లొంగిపోయాడాయువకుడు...

ఇంతకీ ఆ యువకుడి పేరేమిటో తెలుసా????

షంషేర్ ఉద్దామ్ సింగ్ ....

“జోహార్ ఉద్దాం సింగ్ ...జోహార్ “??

❄❄❄❄❄

తిరుగు ప్రయాణం!

జయంతి ప్రకాశ శర్మ

నాకెందుకో.. ఎప్పుడూ లేనిది, ఈసారెందుకో చాల టెన్షన్ గా వుంది! నెల రోజుల కిందట అమ్మకి బాగా జ్వరం వచ్చిందని తెలిసి, ఓసారి ఇండియా రావాలని ప్రయత్నం చేస్తే, ఇప్పటికి కుదిరింది. కబురు తెలిసినప్పట్నుంచి, రోజూ మాట్లాడుతున్నా, ఓసారి అమ్మని చూడాలనే కోరిక నన్ను రోజూ వేధిస్తునే వుంది. దానికి తోడు, పది రోజుల్నుంచి అమ్మనుంచి రోజుకి రెండు సార్లు ఫోన్లు వస్తున్నాయి. "అక్కడెలా ఉంది, ఇంటిపట్టునే ఉన్నావా, జాగ్రత్తగా ఉండు, బయట భోజనం చెయ్యకు, రోజులు బాలేవు. ఇక్కడ కూడా ఒకటే గోల!" అంటూ కంగారుగా అడుగుతునే వుంది. ఆ గొంతుకలో ఏదో మార్పు కనబడింది. ఆందోళన లీలగా కనబడుతుంది. అమ్మకి తన ఆరోగ్యం కంటే, నా ఆరోగ్యం గురించే ఎక్కువ బెంగ కనబడుతున్నాది. అమ్మ గొంతుక వింటుంటే, అవిడ ఆరోగ్యం మీద భయం వేసింది. ఆ విషయమే అడిగితే ఎప్పుడూ ఒకే మాట... "నాకేం అవుతుందిరా! పుట్టి పెరిగిన ఊరు. దానికి తోడు మన అయ్యకోనేరుని రోజుకోసారి చూస్తే చాలు, రోగాలేవి దగ్గరకి రావు!" అంటూ ఏవో మాటల్లో దింపుతుంది.

ఎప్పుడో.. ఏభై ఏళ్ల కిందటే మా తాతగారు ఆ తూర్పు గట్టు మీద ఆ ఇల్లు కొన్నారు. నేను అక్కడే పుట్టి పెరిగాను. నాన్న హయాం వచ్చిన తర్వాత, ఆ పెంకుటిల్లుని మార్చి, డాబా ఇల్లు చేసారు. కోనేరు గట్టు మీద ఉన్న చాలా ఇళ్లు మారిపోయాయి. కాని కొంచెం పాత, కొత్త వాసన ఉన్న మా ఇల్లే అలాగే ఉంది! ఇప్పటికీ అమ్మ ఆ ఇంట్లోనే ఉంటుంది. ఇవి తలుచుకోగానే, అమ్మ మీదే కాకుండా, కోనేరు మీద కూడా బెంగ పట్టుకుంది.

అమ్మకి సిరియస్ గా ఉందని ఆఫీసులో చెప్పి, వెంటనే ఇండియాకి టిక్కెట్టు తీసుకున్నాను. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎవరికి సెలవులు ఇవ్వడానికి అభ్యంతరం చెప్పడం లేదు. మర్నాడే ప్రయాణం.

నేను అమెరికా వచ్చి ఐదేళ్ళు అయిపోయాయి. ఎమ్ యస్ చదవగానే ఉద్యోగం వచ్చింది. తర్వాత షడన్ గా నాన్న పోవడంతో, విజయనగరం వచ్చాను. పన్నెండు రోజులు కార్యక్రమాలు అయిన తర్వాత, అమ్మని ఒక్కర్తిని వదిలి వెళ్లాలనిపించలేదు. అదే మాట అన్నాను.

"పర్వాలేదురా! నాకేం ఇబ్బంది లేదు. ఇంట్లో రెండువాటల్లో ఉన్నవాళ్ళు మంచివాళ్లే! అదీకాక, మీ మావయ్యలు, అత్తయ్యలు దగ్గర్లోనే ఉన్నారు, నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నారు. భయం లేదులే! నాకా.. బిపి కూడా లేదు!నువ్వు వెళ్లు! వచ్చే ఏడు నీ పెళ్ళికూడా చేసేస్తే, నా బాధ్యత తీరిపోతుంది. ఇక లేవలేని పరిస్థితి వస్తే, అప్పుడే నీ దగ్గరకి వస్తాను! అప్పటి వరకు నాకేం డోకా లేదులే! " అంటూ బలవంతంగానే పంపింది. ఆ తర్వాత నాన్న సంవత్సరికాలకి వచ్చాను. రెండు సంవత్సరాల తర్వాత మళ్లీ ఇప్పుడే!

ప్రపంచం అంతా గగ్గోలు పెడుతున్న పరిస్థితిలో, నేను వస్తున్నట్టు అమ్మకి చెప్పక పోవడమే మంచిదనిపించింది. చెపితే మరింత టెన్షన్ కి లోనవుతుంది.

నేను ఎయిర్ పోర్టుకి వెళ్ళేసరికి అప్పటికే తమ తమ దేశాలకి వెళ్ళిపోయే ప్రయాణికులతో కిటకిటలాడిపోతున్నాది. ఎదురుగా ఉన్న బోర్డులో, తను ఎక్కవలసిన విమానం ఆరుగంటలు లేటు చూపెడుతున్నాది. ఎదురుగా టీవి వార్తల్లో ఇండియాలో విదేశీ ప్రయాణికుల మీద ఆంక్షలు చూపెడుతున్నారు. 'సరే.. ఏదేమైనా తప్పదు!' అంటూ నిర్ణయించుకున్నాను. ఆరు గంటల ఆలస్యం, పది గంటలైంది. టిక్కెట్టు దొరకని వాళ్ళు హడావిడి చేస్తున్నారు! టెన్షన్ల మధ్య విమానం రావడం, ఎక్కడం జరిగింది.

హైదరాబాదులో దిగిన ప్రయాణికులందరికి ఏవో టెస్టులు చేస్తున్నారు. అప్పటికే రెండు రాత్రులు, ఒక పగలు ప్రయాణం చేసేనేమో.. చాలా చిరాగ్గా ఉంది. టెస్టులు చేసి "మీరు ఎవరిని కలగడానికి వీల్లేదు, పద్నాలుగు రోజులు మా పర్యవేక్షణలో ఉండాలి!" అంటూ అక్కడ టెస్టులు చేసిన డాక్టర్ బాంబు పేల్చాడు.

"నో సార్, ఐ యమ్ క్వయిట్ ఓకే సార్! నో కంప్లయింట్!" సీరియస్ గా అన్నాను.

"దట్స్ అవర్ జాబ్!" అతనూ సీరియస్ గానే అన్నాడు.

"మా అమ్మగారి ఒంట్లో బాలేదు సార్, అర్జంటుగా వెళ్ళాలి!" అంటూ బ్రతిమలాడాను.

"నో.. అది మరీ ప్రమాదం! అరవై ఏళ్ల పైపడ్డవారికి మీరు దూరంగా ఉండాలి!" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వలేదు. చేతిమీద ముద్రవేసి, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి పంపేసారు. అయితే గుడ్డిలో మెల్లలా, సెల్ఫ్ ఐసొలేషన్ చాలని చెప్పారు. కాని ఎక్కడికి వెళ్లాలన్నది సమస్య! అమ్మకి వచ్చినట్టు తెలిస్తే నేనెక్కడున్నా వచ్చేస్తుంది. అప్పటికే వైజాగ్ ఫ్లైట్ కాన్సిలయింది. చేసేదిలేక, అర్జంటుగా రైల్వే స్టేషనుకి వెళ్ళాను. అక్కడున్న ట్రైన్ పేరు చూసి, జనరల్ కంపార్టైంటు ఎక్కేసాను. ఫుల్ హేండ్స్ చొక్క మార్చుకుని, చేతి మీద ముద్ర కనబడకుండా జాగ్రత్త పడ్డాను. జనంతో ఆ పెట్టంతా కిక్కిరిసి పోయింది. నిలబడ్డానికి చోటు చూసుకున్నాను. ఇప్పుడు వైజాగ్ వెళ్ళి ఎక్కడుండాలనే సమస్య మెదడ్లోకి వచ్చింది. పెద్దమావయ్యకి ఫోన్ చేసి జరిగింది చెప్పాను.

"పైన డాబా మీద ఓ రూముంది. అక్కడ ఉండొచ్చులే.. ట్రైన్ దిగి తిన్నగా ఇంటికి రా!" మావయ్య మాటలు నాకు ఆనందం ఇచ్చాయి.

"నేను వచ్చినట్టు అమ్మకు చెప్పకుసుమీ!" అంటూ అభ్యర్ధించాను.

అక్కడున్న పద్నాలుగు రోజులు అమ్మతో ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నాను. చేతిమీద వేసిన ముద్రలో తేదిని రోజూ చూసుకోవడం, రాత్రిళ్ల వెన్నెల్లో డాబా మీద చాప వేసుకుని పడుకోవడం, వేళకి మావయ్య ఇంట్లోంచి వచ్చే భోజనం చేసి, కంచం గిన్నెలు కనుక్కోవడం.. అలా పద్నాలుగు రోజులు మేడ దిగకుండానే గడిచిపోయాయి. అమ్మకి రోజూ ఫోను చేస్తూ, ఎన్నో అబద్దాలు ఆడాను. ఆ తేది అవగానే, మర్నాడే జనతా కర్ఫ్యూ వచ్చింది. ఇంటిఖైది జీవితం ముగిసినా, బయటకు అడుగుపెట్టే పరిస్థితి లేదు. 'రేపు వెళ్దువుగానిలే' అన్న మావయ్య మాటలు వినడం తప్ప ఇంకేం చేయలేక పోయాను.

మర్నాడు ఉదయాన్నే, కారులో మావయ్య బస్టాండు దగ్గర దింపాడు.

కరోనా పై నా వంతు

అక్షర యుద్ధం

రచన : శ్రీనివాస్

పల్లవి:

సరిహద్దుకు పోతేనే సైనికులు కారండి

ఇంటిపట్టునుండి కూడా దేశభక్తి చాటండి

మన ఇల్లే మనదేశం అనుకుంటే చాలండి

మనగడపే సరిహద్దుగ తలచుకునీ

ఉండండి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు వినరండి

లక్ష్మణ రేఖ దాటక లక్షణంగ ఉండండి

స్వీయానుసాసనమే కరొనాకు వైద్యమండి

ఔషధాలు లేవంటూ నైరాస్యత వదలండి

చరణం 1:

కళ్ళెదుట జరుగుతున్న కల్లోలం కనరండి

కళ్ళముందు కానరాని కరోనాను తరమండి

కరచాలన మానండి నమస్కార మనరండి

సంప్రదాయపు అలవాట్లను సాగించ రారండి

పరిశుభ్రత పాటించి ఆరోగ్యం పొందండి

కరోనా మహమ్మారి వ్యాపనాన్ని ఆపండి

సకల జనుల సంక్షేమం మదిలోన తలవండి

బలమైన సంకల్పం కరోనాను తరుమునండి

చరణం 2:

ఆదేశం ఈదేశం ప్రతిదేశం మనదేనండి

మనసున్న మనుషులుగా మానవతను చాటండి

కరోనా ప్రబల కుండ కర్తవ్యం తెలుసుకోండి

సమ సమాజ రక్షణలో భాగస్తులు కారండి

అత్యవసర రంగాలకు బాసటగా నిలవండి

అలుపెరుగని సేవకులను దాసోహం అనరండి

తరతరాల ఘనచరితను కలలోనూ మరువకండి

భావి తర భవితవ్యం మనచేతిలోనే ఉండండి

ఏమైందో తెలియలేదు, కాని ఆ రోజు కూడా బస్సులు కదిలే వాతావరణం కనబడ లేదు. అంతా నిర్మానుష్యంగా ఉంది. ఏదో ప్రవేటు వాహనం బయట కనబడింది. అది తగరపువలస వరకే వెళ్తుందిట, బేరం కుదుర్చుకుని, కూర్చున్నాను. 'సార్.. ఆ సూట్ కేసులకి వేసిన విమానం టాగులు తీసేయండి సార్! పోలీసులు చెక్ చేస్తున్నారు, ఇవి కనబడతే మిమ్మల్ని, నన్ను కూడా బుక్ చేస్తారు సార్!' అంటూ డ్రైవర్ అభ్యర్ధనగా చూసాడు. నవ్వుతూ అవి తీసిసాను. మధ్యలో పోలీసులకు ఏవో కథలు చెపుతూ, మొత్తానికి తగరపువలస చేర్చాడు.

రోడ్డుమీద ఎక్కడా పిట్టమనిషి లేదు. అక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరం ఉంది. అక్కడ అప్పుడప్పుడు ఆటోలు కనబడుతున్నాయి. ఎండలో సూటు కేసులు పక్కన పెట్టుకుని, నిలబడ్డాను. ఓ ఆటో నలుగుర్ని ఎక్కించుకుని నా ముందు ఆగింది. 'వద్దు వెళ్ళు' అన్నట్టు చేతితో సంజ్ఞ చేసాను. మరో అరగంటకి ఓ ఆటో వచ్చింది. బేరం ఆడకుండా, ఎక్కడకి వెళ్లాలో చెప్పి కూర్చున్నాను. "ఊరు ముందే ఆపేస్తాను సార్, పోలిసులు వదలడం లేదు!" అంటూ పోనిచ్చాడు. తిన్నగా ఒంటితాటి అగ్రహారం దగ్గర ఆపి, దిగిపొమ్మన్నాడు. రెండు సూటుకేసుల పట్టుకుని, రోడ్డు పక్కనే నించుని అటూ ఇటూ చూస్తున్నాను. పట్ట పగలైనా, రోడ్డు మీద ఒక్క మనిషికూడా లేదు. మనిషికి చావంటే ఎంత భయం అర్ధమయింది. ఓ అరగంట అలాగే ఉండిపోయాను. అంతలో ఓ పోలీసు జీప్ వచ్చి, నా ముందు ఆగింది. జరిగిన విషయం చెప్పాను. చేతి మీద ముద్ర కూడా చూపెట్టాను.

"సార్.. నేను ఇంటికి వెళ్లడానికి ఓ మార్గం చూపండి సార్!" అంటూ అభ్యర్దించాను.

"రండి, వెనక కూర్చోండి!" ఆ ఇన్స్పెక్టర్ మాట వింటూనే ఎక్కిసి, "థాంక్స్ సార్!" అంటూ రెండు చేతులెత్తి దండం పెట్టాను.

జీప్ బయలుదేరింది. ఒక్కసారిగా అమ్మ మీదకు మనసు లాగింది. ఇలా సడన్ గా నన్ను చూస్తే, అమ్మ ఎలా ఉద్వేగ పడుతుందో అని ఆలోచన వచ్చింది. అందులో పోలీసు జీపులో ఇంటిముందు దిగాలి. ఒక్కసారిగానుదుట చెమట పట్టింది. నేరుగా జీపు, మా ఇంటి ముందు ఆగింది. వారికి మరోసారి కృతజ్ఞతలు చెప్పి, దిగి వారిని పంపి, ఒక్కసారి ఇంటి ముందు నిలబడి నాలుగు గట్లు కలయ చూసాను. వయసు పెరిగే కొద్ది, సన్నబడాలన్నట్టు.. కోనేరు కొంత సన్నబడి వయ్యారంగా కదులుతూ కనబడింది. నాలుగు రోడ్లు నిర్మానుషంగా ఉన్నాయి. కోవెల మూసున్నా, ఎదురుగా ఉన్న మండపం మీద అంజనేయుడు కూర్చున్నట్టు అనిపించింది.

'అబ్బా.. ఎంత హాయిగా వుంది!' నెల రోజులుగా అనుభవిస్తున్న అందోళన పటాపంచలు అయినట్టనిపించింది.

అప్పటికే పోలీసు జీపును చూసి, వీధిలో కొద్దిమంది బయటకొచ్చి చూస్తున్నారు. అవేం పట్టించుకోకుండా, రెండు సూట్ కేసుల్ని తోసుకుంటూ, గుమ్మం దగ్గరకి వెళ్ళి నిలబడి బెల్లు కొట్టాను.

తలుపు తీసి, నన్ను చూస్తూనే, అమ్మ ఒక్కసారి శిలలా నిలబడిపోయింది. చాలా ఉద్వేగ పడిపోయింది. నోటమాట రాలేదు. తేరుకున్న అమ్మ కళ్ళు నమ్మలేనట్టు వర్షించాయి. రెండు చేతులతో, నా వళ్లంతా తడుముతూ గుండెల మీద అదుముకుంది.

"అమ్మా! కొంచెం దూరం అమ్మా.. నేను.."

నా మాటలు పూర్తికాకుండానే అంది.

"వెర్రినాగన్నా, కాటికి కాళ్లు చాపుకున్న నాకు, ఇంకా ఏం కావాలిరా! అయినానువ్వు వచ్చిసావుగా, ఇక ఆ మహమ్మారి నన్నేం చేస్తుందీ! నా దగ్గరికే రాదు!" అంటూ నానుదుటిమీద ముద్దు పెడుతున్న అమ్మని వారించలేక పోయాను. ఆమె వెచ్చటి కన్నీళ్లు నా చెక్కిల్ని తాకాయి.

అమ్మా చివరి మాట... ఎందుకో అమే కొరికలా అనిపించింది.

శ్రీరాముడు అరణ్య వాసం తర్వాత, తన రాజ్యానికి తిరిగొచ్చినప్పుడు, ఆయన కళ్లకి కనిపించిన కౌసల్యాదేవిలా, నాకు అమ్మ కనిపించింది.

నేను తిరుగు ప్రయణ టిక్కెట్టు గురించి ఇక ఆలోచించలేదు.

కొత్త అందాల్ని అందిపుచ్చుకున్న అయ్యకోనేరు, నా ఆలోచన అర్ధమయినట్టు ఆనందంగా తలూపింది!

❄❄❄❄❄

తారాచంద్రమా..నీ రాకకోసం...



విశ్వసృష్టి రహస్యాన్ని
తెలుసుకునేంత వరకు
మాతోనే వుంటానన్నావ్?
అంతలోనే ఎందుకిలా స్టీఫెన్?
ఈ ధరిత్రినే ఒంటరిగా వదిలేశావ్
అర్థమవుతునేవుంది..
విశ్వసృష్టిరహస్యమేదో
నీవు తెలుసుకునే వుంటావు
అది నీవు మాకు ఎలాగైనా చెప్పేస్తావని తెలిసి దేవుడు ఇలా చేసివుంటాడు
ఆదినుంచీ అతడు ఇంతే
అవ్వ ఇచ్చిన తినకూడని పండును
తిని 'నగ్నసత్యాలు'
శోధించినందుకు తన్ని తరిమేశాడు
హవ్వా..!
ఆ పండే అనుకుంటా
చెట్టునుంచి కిందపడితే
కిందికే ఎందుకుపడిందబ్బా?
అని విశ్వసత్యాలను ఆవిష్కరించినందుకు
న్యూటన్ జీవితంలో అవ్వను లేకుండా చేశాడు
నీవు 'మన్ను'వయ్యుండీ,
'మిన్ను'వైపు చూస్తావా అని
గెలీలియోని కబోదిని చేశాడు
సాపేక్ష సిద్ధాంతాలను ఉపేక్షించలేక
మరణించిన ఇన్‌స్టీన్ మనోవ్యవస్థను
ముక్కలు చేసి చూశాడు
కృష్ణబిలాలను తాకే సమీకరణాలను
సమీపించాడని అనంతం తెలిసిన
రామానుజాన్ని
క్షయతో కనుగమరుగుచేశాడు
అంతరిక్షం ఆనుపానులను
తెలుసుకోవాలనే సంకల్పాన్ని 'కల్పన'గావించాడు
చావ్లాని అంతరిక్షంలోనే ఆపేసుకున్నాడు
స్టీఫెన్!
నీవు విశ్వసృష్టి సంగతులు
చెప్పాలనుకున్నందుకే
నీగొంతు నొక్కేసి, నిన్ను నిర్వీర్యం చేశాడు
కాని...నీవు దేవుణ్ణేధిక్కరించి
యంత్రఊతంతో
విశ్వం ఊసులు చెపుతున్నందుకే
అతడికి కన్నుకుట్టింది
సత్యానికి వున్న మౌఢ్యపు ముసుగును
ఇంకెవ్వరు తొలగిస్తారు?
అలవాటుగా ఆకాశం వైపు చూస్తే..
చక్రాల కుర్చీతోనే దేశదేశాలు తిరుగుతూ..
నక్షత్రగాథల్ని ప్రవచించే ఆత్మబంధువు
ఎక్కడున్నాడని విషణ్ణవదనాలతో ఎదురు చూస్తుంటాం.
నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ
నీజాడను ప్రశ్నిస్తుంటే
కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ
నేను ఒకటేమాట బదులిచ్చాను.
"స్టీఫెన్‌లేడు. కాని...ఆయన చెప్పిన
కాలంకథ "ఆచంద్రతారార్కం" అని
నేస్తమా.. నీ విశ్వదృష్టిని
మదినిండా నింపుకొని
నీ జ్ఞాపకాల జ్ఞానసంపదకు
జననీరాజనాలు అందిస్తున్నాను
నీపరిత్యాగాన్ని .. పదిమందికీ
పంచుతూ పరితపిస్తునేవుంటాను.
మళ్లీ నీ రాకకోసం ..
నిరీక్షిస్తుంటాను.




డాక్టర్ చింతపల్లి డేవిడ్‌రాజు
950567 1729

నోట్ల రద్దును మించిన పెట్రో పాలసీ..!

మోడీ వాయించేస్తున్నాడు!!!

- బి.రాజేష్

మోడీ ప్రతి చర్యా మోసం... బయటికి చెప్పేది వేరు, చేసేది వేరు... జనంపై ప్రేమ ఉన్నవాడు చేసే పాలన కాదు ఇది... ఏదో కసితనం ఉన్నట్టుగా ఉంది... లేకపోతే ఏమిటి..? అంతర్జాతీయ మార్కెట్‌లో 30 డాలర్లకు క్రూడాయిల్ బ్యారెల్ ధర పడిపోయినప్పుడు... దేశప్రజలు ఆ ధర తగ్గింపు తమకు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశపడ్డారు... నోట్ల రద్దు విలన్ అక్కడ కుర్చీలో కూర్చున్నాడని మరిచిపోయారు... తను కూడా అందరూ అనుకున్నట్టే చేశాడు... మళ్లీ ఎక్సైజు సుంకం పెంచేశాడు... లీటర్‌కు మూడు రూపాయలు తాజాగా...! అందరూ అనుమానిస్తున్నదే... ఎడాపెడా... తను అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఇదే తంతు... ఎవడూ ఏదీ అనడానికి లేదు...



మాట్లాడితే కాషాయం కస్సుమంటుంది... ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిపోయినా సరే, ఓ మంచి ఆర్థిక పాలసీ లేదు, కార్యాచరణ లేదు... ఎదురు మాట్లాడినోడిని పంపించేస్తారు... ఇప్పుడూ అదే... ఎన్ని స్కాములు చేసినా... దేశాన్ని దోపిడీ చేసినా... యూపీఏ హయాం ఓ ఆర్థికవేత్త సారథ్యంలో ఉండేది... ఈ చార్ట్ చూడండి... బీజేపీని అభిమానించేవాడు కూడా అసహ్యించుకునేలా..!

సరిగ్గా 2014... అంటే మన గ్రేట్ మోడీ గారు ప్రధానిగా పీఠం ఎక్కిన కాలం... క్రూడాయిల్ ధర 100 డాలర్లు దాటి ఉండేది... కానీ అప్పుడు పెట్రోల్ లీటర్ ధర 71 రూపాయల చిల్లర... అప్పటికే మన్మోహన్ ఓ సిస్టం ప్రవేశపెట్టా డు... అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో ఎగుడుదిగుళ్లను బట్టి దేశీయ మార్కెట్‌లో వాటి ధరలు పెరగడం, తగ్గడం..!

తరువాత ఏమైంది...? క్రూడాయిల్ ధరలు పడిపోవడం స్టార్టయ్యింది... ప్రతి 15 రోజులకు ధరల్ని సమీక్షించుకుని, పెట్రోల్, డీజిల్ ధరల్ని రివైజ్ చేయాలి కదా... ఆ పడిపోయిన ఇంధనం ధరలను బట్టి దేశంలో వాటి ధరలూ పడిపోవాలి కదా... నో... అసలే ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వాలు వాయించే పన్నులు... దీనికితోడు మోడీ ఏం చేశాడు..? ధరలు తగ్గిన ప్రతిసారీ ఆ ప్రయోజనం ప్రజలకు దక్కకుండా... ఎక్సయిజు సుంకం పెంచుతూ పోయాడు... ఫలితం... అప్పటి 100 డాలర్ల ధరలో మనం ఏ పెట్రోల్ ధరలు భరించామో, ఇప్పుడు 30 డాలర్ల సమయంలోనూ అదే పెట్రోల్ ధర... దారుణం కదా... గతంలోకన్నా కాస్త ఎక్కువే...

ఆరేళ్ల క్రితం పెట్రోల్‌పై లీటర్‌కు రూ.9.20 ఉన్న ఎక్సైజు కాస్తా ఇప్పుడు 23 రూపాయలు.... డీజిల్‌పైనా అంతే... అప్పట్లో లీటర్‌కు మూడున్నర... ఇప్పుడు 19 రూపాయలు... పోనీ, ఇతరత్రా దేశప్రజలకు ఏమైనా ప్రయోజనం చేశారా..? ఏమీలేదు... జీఎస్టీ వచ్చాక ప్రతి సరుకు ధర పెరిగింది... జీఎస్టీ స్ఫూర్తి, మల్టిపుల్ టాక్సేషన్ అనేది నీరుగారిపోయి... జనం పరిస్థితి పెనం మీదనుంచి పొయ్యిలో పడింది... ఎవ్వడూ సమీక్షించేవాడు లేదు... దెబ్బలు అలవాటై ప్రజలే నోళ్లు మూసుకుని, కిక్కురుమనకుండా భరిస్తున్నారు... నిజం... చదువు రాని ప్రధాని ఎంతో... చదువు నేర్చిన నిర్మలక్కా అంతే... ప్రజలపై ప్రేమ లేదు... పన్నుల రుచి మరిగిన రాచరికం... మన ఖర్మ కాలి, ఓ మంచి ప్రత్యామ్నాయం లేకపోవడం..! ఓ మంచి ఆర్థికవేత్త దేశాన్ని సక్సెస్ ఫుల్ ఫైనాన్షియల్ రూట్‌లో తీసుకుపోలేకపోవడం..!!

❄❄❄❄❄

నిష్పక్షపాతంగా ఆలోచించండి

- కె.ప్రశాంత్ కుమార్



ప్రపంచ ఆరోగ్య సంస్థకు చైనా కోవిడ్ గురించి ఎప్పుడు చెప్పింది? 2019 డిసెంబరు 31న. వెంటనే ఆ సంస్థ ఐఎమ్ఎస్‌టి (ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సపోర్ట్ టీమ్) అని పెట్టి దాని గురించి శోధించడం మొదలుపెట్టింది. జనవరి 30 నాటికల్లా మన దేశంలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. ఫిబ్రవరి 12 కల్లా ప్రపంచ ఆరోగ్య సంస్థ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఫోరమ్ అని పెట్టి, ప్రపంచం నాలుగు మూలలనుంచి 400 మంది నిపుణులను పిలిచి చర్చించింది. కోవిడ్ అనే ఊపిరితిత్తుల రోగం ఉందని ప్రకటించింది. ఫిబ్రవరి 16 కల్లా అనేక దేశాల ఎక్స్‌పర్ట్స్‌తో సహా ఓ టీము చైనా వెళ్లి సంగతేమిటో చూస్తోంది.

ఇవన్నీ నాబోటి, మీబోటి సామాన్యుల దృష్టిని పెద్దగా ఆకర్షించక పోవచ్చు. కానీ కేంద్ర ఆరోగ్యశాఖలో ఉన్నవారికి యిదే పని కదా. అందువలన వారు జాగ్రత్తలు తీసుకోవడం మొదలుపెట్టారు. జనవరి 21నుంచే చైనానుండి వచ్చేవారిని థర్మల్ చెక్ చేసే పని 7 ఎయిర్‌పోర్టుల్లో మొదలుపెట్టారు. జనవరి నెలాఖరుకి దాన్ని 20 ఎయిర్‌పోర్టులకు విస్తరించారు. ఫిబ్రవరి వచ్చేసరికి చైనానుంచే కాకుండా థాయ్‌లాండ్, సింగపూర్, హాంగ్‌కాంగ్, జపాన్, సౌత్‌కొరియాలనుంచి వచ్చినవారినీ చెక్ చేయసాగారు. ఫిబ్రవరి ఆఖరి వారం వచ్చేసరికి నేపాల్, వియత్నాం, ఇండోనేసియా, మలేసియాలను కూడా లిస్టులో చేర్చారు. ఫిబ్రవరి 24న మోదీగారు ఏం చేస్తున్నారు?

అహ్మదాబాద్‌లో "నమస్తే ట్రంప్" కార్యక్రమానికి లక్షాపాతిక వేలమందితో హంగామా నిర్వహిస్తున్నారు. అహ్మదాబాద్, దిల్లీ, ఆగ్రా అంతా సందడే సందడి. ఆగ్నేయాసియా దేశాలనుంచి వచ్చినవారిని మాత్రమే తనిఖీ చేయాలి, యితర దేశాలనుంచి వచ్చినవారిని చేయనక్కరలేదని కేంద్రం ఎలా అనుకుంది? గ్లోబల్ విలేజి, ప్రపంచం ఒక కుగ్రామం వంటి సూక్తులు వినలేదా? చైనానుంచి భూగోళంలోని సమస్తదేశాలకు యాత్రికులు వెళతారని తెలియదా? ముఖ్యంగా అమెరికాతో మనకున్న వ్యాపారబంధం సామాన్యమైనదా? చైనాతో మన వ్యాపారం 84 బిలియన్ డాలర్లయితే, అమెరికాతో 74! అమెరికానుంచి ట్రంప్‌తో బాటు, ముందూ వెనుకా ఎంతమంది అమెరికన్లు, ఎంతమంది ఎన్నారైలు వచ్చి వుంటారు? వాళ్ల నెందుకు కట్టడి చేయలేదు?

ఎందుకంటే మోదీగారు తలపెట్టిన నమస్తే ట్రంప్ ఆగడానికి వీల్లేదు. దక్షిణ కొరియా అప్పటికే ఫంక్షన్లన్నీ రద్దు చేసేసింది. మనం మాత్రం చేయలేదు. ఎందుకంటే 'హౌడీ మోడీ' ఋణభారం వుండిపోయింది. అది తీర్చుకోవాలి. అందువలన రిస్కు తీసుకున్నారు. ఈ రోజు భారత్‌లో ప్రస్తుతానికి 250 మంది మరణించారని చెప్తున్నారు. ఒక మరణం సంభవించిందంటే దాని వెనక రోగం సోకి, వివిధ దశల్లో ఉన్నవారు 800 మంది ఉంటారని లెక్క వేసి చెప్పారు. ఆ లెక్క ప్రకారం యిప్పటికి 2 లక్షల మంది భారతీయులకు సోకి వుండాలి. కానీ యిప్పటిదాకా కన్‌ఫమ్ అయినది 8 వేల లోపునే. అంటే యింకా ఎంతోమంది బయటపడాల్సి వుంది. అవన్నీ బయటకు వచ్చాక ఎప్పుడు, ఎక్కడ, ఎలా సోకిందో తెలియాలి.మార్చి 13నుంచి 15 వరకు తబ్లీగీ సమావేశం జరుపుకుంటామంటే దాన్ని దిల్లీ ముఖ్యమంత్రి లేదా కేంద్ర హెూం మంత్రి అనుమతించారు. పెద్ద ఫంక్షన్లకు వెళ్లకండి, నిర్వహించకండి అని ఆదేశాలిచ్చిన తర్వాత దాన్ని ఉల్లంఘించారు యెడియూరప్ప. మార్చి 16న 2 వేల మంది హాజరైన ఎమ్మెల్సీ కూతురి పెళ్లికి వెళ్లారు.

తిరుపతి గుడిని మార్చి 19 వరకు తెరిచే వుంచారు. రోజుకి కనీసం 50–60 వేల మంది భక్తులు వస్తారు. వారికి సేవలందించేవారు వేలమంది వుంటారు. తిరుపతికి వచ్చినవారిలో అనేక దేశాలనుంచి వచ్చిన ఎన్నారైలు ఎందరో వుంటారు. ఎంతో ఆర్గనైజ్‌డ్‌గా, ఓ మోస్తరు శుభ్రంగా ఉండే తిరుపతిలోనే కరోనా పాకే అవకాశం ఉందనుకుంటే ఉత్తరభారతంలో అస్తవ్యస్తంగా నిర్వహించే పెద్ద గుళ్ల గురించి ఏం చెప్పాలి..మనం యిళ్లల్లో హాయిగా వున్నామనుకుంటున్నారు. లాక్‌డౌన్‌లో సామాన్యుల సమస్యల గురించి ఆలోచించే నిర్ణయాలు తీసుకుంటున్నారా అనే సందేహం తప్పక కలుగుతుంది.

భారత్‌తో యుద్ధం దిశగా చైనా...

- నీతు

భారతదేశంతో యుద్ధం చెయ్యటానికే చైనా సిద్ధమవుతున్నట్లుగా కొన్ని రోజులనుండి జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి. కరోనా సృష్టికర్తగా ప్రపంచ దేశాల దృష్టిలో ఇప్పటికే చైనా చెడ్డపేరు మూటగట్టుకుంది. చైనాను దోషిగా నిలబెట్టడానికి అమెరికా శతవిధాలా ప్రయత్నం చేస్తూనే ఉంది. భారత్ -అమెరికాల మధ్య స్నేహబంధాలు మరింత పెరుగుతున్నాయనే అనుమానాలు చైనాలో రోజురోజుకు పెరుగుతున్నాయి. కరోనా అవమానభారం, అమెరికా ఒత్తిళ్ళు, భారత్ పై అనుమానాలు మొదలైన అంశాలు భారత్ పై చైనా కవ్వింపు చర్యలకు ఉత్ప్రేరకాలుగా కనిపిస్తున్నాయి. 2017లో డోక్లామ్ ట్రై జంక్షన్ దగ్గర చైనా-భారత్ సైన్యాల మధ్య 73రోజులపాటు నిరంతర ఘర్షణలు జరిగాయి. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే? వాటికి మించిన ఘర్షణలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేపాల్‌ను రెచ్చగొట్టడం, నేపాల్‌తో భారత్ పై కరోనా విషయంలో నిందలు వేయించడం ఇందులో భాగమే. ఇంకో పక్క పాకిస్తాన్‌ను కూడా చైనా రెచ్చగొడుతోంది. భారత్ సరిహద్దు దేశాలన్నింటినీ భారత్‌పై ఉసిగొల్పే చర్యలు చైనా చేపట్టింది. ముందు ముందు ఈ చర్యలు ఇంకా పెంచుతుంది. భారతదేశం, భారత్ మిత్ర దేశాలతో పాటు అమెరికాకు కూడా బలమైన హెచ్చరికలు చేసే వ్యూహంలో భాగమే ఈ దుందుడుకు చర్యలు. చైనా- పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ ద్వారా ఆర్థిక ప్రయోజనాలు చూపించి, చైనా పాకిస్తాన్ కు దైవసమానంగా మారిపోయింది. ఇంకొక పక్క, తూర్పు యూరప్ దేశాలకు కూడా చైనా ఎరవేస్తోంది. కమ్యూనిస్ట్ దేశాలతో ఒక పక్క - క్రిస్టియన్ వ్యతిరేక దేశాలతో మరోపక్క మైత్రీ బంధాలు పెంచుకునే దిశగా బలమైన అడుగులు వేస్తోంది. 2013లో, బి.ఆర్.ఐ (బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్) అనే పేరుతో చైనా 70 దేశాలతో, అంతర్జాతీయ సంస్థలతో ఒక వ్యూహాత్మక సంబంధం ఏర్పరచుకుంది. మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడులలో వీటిని భాగస్వామ్యం చెయ్యడం దీని ప్రణాళిక. ఇది జిన్ పింగ్ వేసిన పథక రచన. పాకిస్తాన్, నైజీరియా, బంగ్లాదేశ్, ఇండోనేసియా, మలేసియా, ఈజిప్ట్, యు.ఏ.ఈ, సింగపూర్, దక్షిణ కొరియా, ఇజ్రాయిల్, రష్యన్ ఫెడరేషన్ మొదలైనవన్నీ వీటిల్లో ఉన్నాయి. ఒకప్పటి సోవిట్ యూనియన్‌ను కూడా తన చెప్పు చేతల్లో పెట్టుకునే పనిలో చైనా ఉంది. అమెరికాను, అమె రికా మిత్రదేశాలను తొక్కేయ్యాలి, ప్రపంచంలో అగ్రరాజ్యంగా సుస్థిరస్థానం ఏర్పరచుకోవాలనే మహాలక్ష్యంతో చైనా ముందుకు వెళ్తోంది. అందులో భాగంగా, ప్రస్తుతం భారత్ పై తన ప్రతాపం చూపించే పనిలో నిమగ్నమైనట్లు బలంగా అనిపిస్తోంది. ఇప్పుడు, వాస్తవాధీన రేఖ చుట్టూ ఘర్షణలకు తలపడుతోంది. జమ్మూ, కశ్మీర్ లో భాగమైన లడాఖ్‌ను కేంద్రపాలితప్రాంతంగా ప్రకటించడం కూడా చైనా కోపానికి ఒక కారణం. అరుణాచల్ ప్రదేశ్ భూభాగం కూడా తమ దక్షిణ టిబెట్ కు చెందినదే అనే వాదనా ఎప్పటినుండో చేస్తోంది. వీటన్నింటికి తోడు, కరోనా అంశం కూడా జతకలిసి, చైనా భారత్ పై దూకుడు పెంచుతోంది. ఇప్పటికే, 2000-2,500 మంది సైనికులను సరిహద్దులకు చేర్చింది. భారత్ కూడా ఈ చర్యలకు పోటీగా బలగాలను పెంచుతోంది. కొన్ని కీలకప్రాంతాల్లో చైనాబలగాలు ఎక్కువగా మోహరించి ఉన్నాయి. వాస్తవాధీన రేఖాఅంశంపై ఇంతవరకూ రెండుదేశాల మధ్య స్పష్టమైన ఒప్పందం కుదర్లేదు. రెండు దేశాల మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థల సహకారాన్ని పరిపుష్టిచేసుకునే దిశగా "వ్యూహాత్మక మార్గ నిర్దేశనం" జరగాలి. ఈ అంశంపై వూహన్ లో జరిగిన శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ, చైనా అధినేత షీ జిన్ పింగ్ పరస్పరం చర్చించుకున్నారు. కానీ, అది ఇంతవరకూ కార్యరూపం ధరించినట్లు లేదు. భారతదేశం కంటే చైనా చాలా బలమైన దేశం. మిలిటరీ పరంగానూ, ఆర్థికంగానూ చైనాదే పెద్దచెయ్యి. జాతీయ రక్షణా విధానంలోనూ, అంతర్గత భద్రతలోనూ భారత్ ఇంకా వ్యవస్థీకృతంగా ఎదగాలి. విధానాల రూపకల్పనలు బలంగా జరగాలి. తమ దేశ పరిధులను విస్తరించుకోవడం, మిగిలిన దేశాలను ఎర వెయ్యడం, శత్రుదేశాలుగా భావించేవాటిని చక్రబంధంలో ఇరికించడం మొదలైనవి చైనా అవలంబించే వ్యూహాలు. ఇవి కాక, సి. బి. ఆర్. ఎన్ అనే రక్షణా వ్యవస్థలో బలంగా ఉంది. సి అంటే కెమికల్, బి అంటే బయో, ఆర్ అంటే రేడియోలాజికల్, ఎన్ అంటే న్యూక్లియర్ విధ్వంసాలు. ఈ సి లో ఇప్పుడు సైబర్ కూడా చేర్చుకోవాలి. కరోనా వైరస్‌ను బయోఆయుధంగానే భావించడానికి బలమైన నిదర్శనాలు ఉన్న ట్లుగా పరిశీలకులు చేస్తున్న వ్యాఖ్యలను కొట్టిపారెయ్యలేం. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామం. ఇప్పటివరకూ వివాదాస్పద భూభాగాల్లో లేని గాల్వాన్ సెక్టార్ వైపు కూడా చైనా బలగాలు దూసుకురావడం అనుమానాస్పదం. ఆందోళనకరంగా కూడా భావించాలి. గత రెండు వారాల్లోనే గాల్వాన్ లోయలో చైనా సుమారు 100 తాత్కాలిక గుడారా లను ఏర్పరచుకుంది. మే 5వ తేదీ నాడు పాంగాంగ్ ప్రాంతంలో రెండు దేశాల సైనికులు తీవ్రఘర్షణకు దిగారు. ఇరువైపు సైనికులకూ తీవ్ర గాయాలు కూడా అయ్యాయి. మే 9వ తేదీన ఉత్తర సిక్కింలోనూ ఇదే తరహా పరిస్థితులు తలెత్తాయి. తూర్పు లడాఖ్ ప్రాంతంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులే నెలకొని ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో భారత్ బలగాలు కూడా చైనా సైనికులతో ఢీ కొట్టే సామర్థ్యంలోనే ఉన్నాయి. ఐనప్ప టికీ, భారత్ - చైనాల మధ్య యుద్ధం ఆశావహపరిణామం కాదు. నిజంగా, యుద్ధమే సంభవిస్తే? ఎంతో ప్రమాదకరం. వీలైనంత త్వరగా చైనా - భారతదేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరగాలి. ఈ ఘర్షణలకు ముగింపు పలకాలి. అమెరికా - చైనాల ఆర్థిక, అధికార దాహాలకు భారత్ బలికాకూడదు. రక్షణ, ఆర్థికం, వ్యూహాత్మక పథక రచనలు మొదలైనవాటిలో భారతదేశం తన బలాలను ఇంకా పెంచుకోవాలి. "ముల్లును ముల్లుతోనే తియ్యాలి- వజ్రాన్ని వజ్రంతోనే కోయ్యాలి" అనే ఆర్యోక్తిని భారత్ ఆచరణలో పెట్టాలి.

చరిత్ర మరిచిన నేత గోపాల్ బాబా వాలంగకర్

- కె.వి.రమణ, ఎం.ఎ., బి.ఇడి





దేశ వ్యాప్తంగానూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ దళితోద్యమ చైతన్యం 1985 కారంచేడు సంఘటన తర్వాత ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఇందుకు బహుజన సమాజ్ పార్టీ స్థాపన కూడా తోడ్పడింది. ఉత్తరప్రదేశ్‌లో తర్వాతి కాలంలో మాయావతి అధికారంలోకి రావడంతో అప్పటి వరకు మౌఖిక గాథలుగా ప్రచారంలో ఉన్న వీరగాథలపై చాలామంది అకాడమీషియన్స్ పరిశోధన చేసి ఎన్నో కొత్త విషయాలను

వెలుగులోకి తెచ్చారు. అంతకుముందునుంచి గెయిల్ ఆంవెట్, ఎలినార్ జీలియట్, రోజూలిండ్, ఫిలిప్ కానిస్టేబుల్ లాంటి విదేశీ ఆచార్యులు చేసిన పరిశోధనకు ఇది కొనసాగింపు. ఈ కొనసాగింపులోనే 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న దళిత యోధుల గురించి గోపాల్ గురు, బద్రి నారాయణ తదితరులు తమ రచనల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఇట్లా వెలుగులోకి వచ్చిన దళితోద్యమ చైతన్య స్ఫూర్తి ప్రదాత గోపాల్ బాబా వాలంగకర్ (గోపాలకృష్ణ). బాబా సాహెబ్ అంబేద్కర్ చేత 'దళిత వైతాళికుడుగా కీర్తింప బడ్డ గోపాల్ బాబా వాలంగకర్ భారతదేశ మొట్టమొదటి దళిత జర్నలిస్టు. దళిత చైతన్యంతో ఉద్యమాలను సిద్ధాంతీకరించిన మొదటి వ్యక్తి, మొదటి దళిత సామాజిక విప్లవకారుడు. దళితోద్యమానికి పునాదులేసిన స్ఫూర్తి ప్రదాత, దళితుల సమస్యలను సైద్ధాంతికంగా అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించిన తత్వవేత్త, రచయిత, కవి. సంస్థల స్థాపకుడు, నిర్వాహకుడు. అన్నింటికీ మించి జ్యోతిరావు పూలే అనుయాయిగా ఉంటూ ఉద్యమాలను నిర్మించాడు.

బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజా సమూహాన్ని కూడగట్టినాడు. భార్య రమాబాయి తరపున అంబేద్కర్‌కు దగ్గరి బంధువు. బ్రిటీష్ వారి ఏక పక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసినాడు. ఆర్మీలో మహర్లకు అవకాశాలు లేకుండా చేసినప్పుడు పెద్ద ఎత్తున మాజి సైనికులను కూడా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించాడు.

మహరాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలోని రాయిగఢ్ జిల్లా మహద్ తాలూకా కేంద్రానికి దగ్గరలోని రావ్‌దాల్ గ్రామంలో గోపాల్ బాబా వాలంగకర్ 1840లో జన్మించాడు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ముగిసిన తర్వాత 1858 ప్రాంతంలో ఇండియన్ మిలిటరీలో చేరాడు. మిలిటరీలో ఉన్న సమయంలోనే కొంత విద్యాభ్యాసం కూడా చేసాడు. మంచి వక్త కూడా అయిన వాలంగకర్ తన వాగ్ధాటితో మిలిటరీలోని మిత్రులను ఆకట్టుకునే వారు. మిలిటరీ ఉద్యోగంలో భాగంగా గోపాల్ బాబా పుణె, బొంబాయి నగరాల్లో చాలా రోజులు పనిచేసాడు. అయితే పుణెలో ఉన్న సమయంలో జ్యోతిరావు పూలే దంపతులతో కలిసి వివిధ సామాజిక, చైతన్య కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. సమాజంలో పెచ్చరిల్లుతున్న మూఢనమ్మ కాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం కోసం జ్యోతిరావు పూలే తన మిత్రులతో కలిసి 1873లో 'సత్యశోధక్ సమాజ్'ని ఏర్పాటు చేసాడు. ఇట్లా సత్యశోధక్ కార్యకలాపాలతో మమేకమైన గోపాల్ బాబా తర్వాతి కాలంలో జ్యోతిరావు పూలే ప్రియ శిష్యుడిగా మారాడు.

సత్యశోధక్ కార్యకలాపాలను పూలే బతికున్న సమయంలోనే మహా



రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గోపాల్ బాబా ప్రచారం చేసాడు. ఆ సంస్థ కార్యక లాపాలతో పాటు, వివిధ దళిత, అభ్యుదయ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొన్నాడు. పుణెలోని భవానీ పేటలో గల గోపాల్ బాబా ఇంటికి జ్యోతిరావు పూలే తరచూ వచ్చేవాడు. ఇట్లా రావడంలో దళితులు-బీసీల మధ్యన ఒక బంధం గట్టిపడాలనే ఉద్దేశ్యముండేదని పూలే మరో అనుచరుడు గోవింద్ గణపతి కాలే రాసినాడు. సత్యశోధక్ సమాజ్ కార్యకలాపాల్లో గోపాల్ బాబా ఇతర దళితేతరులతో సమానంగా ఆసీనులయ్యేవారు. ఇలా కూర్చోవడంలో ఎలాంటి అభ్యంతరం ఎవ్వరూ వ్యక్తం చేయక పోవడంతో గోపాల్ బాబాకు సత్యశోధక్ సమాజ్‌పై మరింతగా గౌరవం పెరిగింది. సెప్టెంబర్, 24, 1885 నాడు సత్యశోధక్ సమాజ్ 11వ స్థాపక దినోత్సవం సందర్భంగా మహారాజా సాయాజిరావు గైక్వాడ్‌ని సన్మానించారు. ఈ సన్మాన సభ నిర్వహణలో గోపాల్ బాబా చురుగ్గా పాల్గొన్నాడు. అలాగే పూలే అనంతరం గోపాల్ బాబా కూడా వేదికపైనుంచి సభికులనుద్దేశించి ప్రసంగించారు.

దళిత సామాజిక వర్గంనుంచి వచ్చిన మొట్టమొదటి జర్నలిస్టు గోపాల్ బాబా. సత్యశోధక్ సమాజ్ కార్యకలాపాల ప్రచారం కోసం జ్యోతిరావు పూలే పూనికతో 'దీనబంధు' అనే వార పత్రిక స్థాపితమయింది. పత్రిక తొలి ప్రతి 1877 జనవరిలో వెలువడింది. ఈ పత్రిక స్థాపనకు హైదరాబాద్‌నుంచి బొంబాయి, పూణెలకు వలసబోయిన తెలుగువారు కూడా ఆర్థికంగా సహాయపడ్డారు. ఇట్లా ఏర్పాటైన పత్రికకు కృష్ణారావు పాండురంగ్ భాలేకర్ (1850-1910) సంపాదకుడిగా ఉండేవారు. ఈ పత్రిక రైతులు, కార్మిక వర్గానికి సంబంధించిన వార్తలను ప్రధానంగా ప్రచురించేది. ఈయన మొట్టమొదటి బీసీ సంపాదకుడు, మాలీ కులస్థుడైన భాలేకర్ ప్రోత్సాహంతో పత్రికకు రాయడం ప్రారంభించిన గోపాల్ బాబా ఆనాడు దళిత సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పత్రికలో విరివిగా వ్యాసాలు రాసాడు.


అట్లాగే 1888లో పుణెలో 'సుధారక్' అనే పత్రిక స్థాపితమయింది. దీని సంపాదకుడు గోపాల్ గణేశ్ అగార్కర్. ఈయన అంతకు ముందు బాలగంగాధర తిలక్ ప్రారంభించిన పత్రిక 'కేసరి'కి సంపాదకుడుగా వ్యవహరించారు. 'సుధారక్' (సంస్కర్త) పేరుకు తగ్గట్టుగానే ఈ పత్రిక సామాజిక సంస్కరణలపై ప్రధానంగా వ్యాసాలను వెలువరించేది. గోపాల్ బాబా వాలంగకర్ ఈ పత్రికలో కూడా సామాజిక సంస్కరణలకు సంబంధించిన వ్యాసాలను ప్రచురించాడు.

ఉద్యోగ బాధ్యతలనుంచి తప్పుకున్న తర్వాత గోపాల్ బాబా వాలంగకర్ సామాజిక చైతన్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఈ దశలో తన కార్యకలాపాలకు ప్రాచుర్యం కల్పించడమే గాకుండా, దళితులు సైతం తమ విషయాలను ప్రపంచానికి అర్థమయ్యే విధంగా చెప్పడానికి, దళితుల సమస్యలపై అగ్రవర్ణాల వారి సానుకూల అభిప్రాయాన్ని కూడగట్టే ఉద్దేశ్యంతో గోపాల్ బాబా 'విఠల్ విధ్వంసక్' అనే పత్రికను ప్రారంభిం చారు. 1888లో బ్రాహ్మణీయ భావజాలాన్ని నిరసించేందుకు గాను ఈ పత్రిక ప్రారంభమైంది. దీని టార్గెట్ రీడర్స్ ప్రధానంగా దళితులు. ఈ పత్రికలో విరివిగా అంటరాని తనాన్ని నిరసిస్తూ వ్యాసాలు వెలువడేవి...

❄❄❄❄❄

దైవోపహతుడు ఈడిపస్

– పి.భూషణం



ఫ్రాయిడ్ ప్రతిపాదించిన ఈడిపస్ కాంప్లెక్స్ అర్థం చేసుకోవడానికి గ్రీకు పురాణపాత్ర ఈడిపస్ కథ. ఇతని కథను క్రీ.పూ. 5వ శతాబ్దంలో సోఫోక్లిస్ అనే గ్రీకు నాటకకర్త 'ఈడిపస్ రెక్స్' (రే అని పలకాలి – రాజు అని అర్థం) పేర నాటకంగా మలిచాడు. ఇది ప్రపంచమంతా ప్రఖ్యాతి చెందింది. అనేక భాషల్లో సినిమాగా వచ్చింది. బెంగాలీ నాటక, సినీ కళాకారుడు, "జాగ్‌తే రహెూ" హిందీ సినిమాకు సహదర్శకుడు ఐన శంభు మిత్రా "రాజా ఈడిపస్" పేర నాటకంగా వేసి చాలా పేరు తెచ్చుకున్నారు. తెలుగులో కూడా కొందరు వేశారు. నాటకానువాదం తెలుగులో పుస్తకరూపంలో వచ్చినట్లు గుర్తు. ఇక కథలోకి వస్తే –

గ్రీసులోని థేబ్స్ రాజ్యంలో ప్లేగు వ్యాధి ప్రబలింది. ప్రజంతా రాజైన ఈడిపస్ దగ్గరకు వచ్చి ఏదైనా చేయమని మొర పెట్టుకున్నారు. దీనికి దైవికమైన కారణం ఏదో ఉంటుందని, డెల్ఫిలో ఉన్న అపోలో గుడి జోస్యులను సంప్రదించి పరిష్కారం తెలుసుకుంటానని రాజు హామీ యిచ్చాడు. అతను కొన్నేళ్ల క్రితం ఆ రాజ్యానికి యాదృచ్ఛికంగా రాజయ్యాడు. నిజానికి అతను పొరుగున ఉన్న కోరింథ్ రాకుమారుడు. అనూహ్య పరిస్థితుల్లో ఆ రాజ్యాన్ని వదిలి థేబ్స్ వైపు వస్తూండగా దారిలో స్ఫింక్స్ అనే వింత జంతువు అడ్డగించింది. దానికి స్త్రీ తల, రొమ్ములు, సింహం శరీరం, గ్రద్దలా రెక్కలు వుంటాయి. అది నేను ఒక చిక్కుప్రశ్న వేస్తాను. సమాధానం చెప్పకపోతే చంపేస్తాను అంది. అది అలా అడుగు తూనే థేబ్స్ పౌరుల నెందరినో భక్షించేసింది. దాని బాధ పడలేక 'దాన్ని ఎవరైనా చంపితే వారిని రాజును చేసి, రాణీగారినిచ్చి పెళ్లి చేస్తాం' అని రాజప్రతినిధి, రాణిగారి సోదరుడు అయిన క్రియాన్ ప్రకటించి వున్నాడు.

జరిగినదేమిటంటే ఆ రాజ్యానికి లాయియస్ అనే రాజుగారు ఉన్నారు కానీ ఆయన ఏదో సందర్భంలో జోస్యం చెప్పించుకోవడానికై డెల్ఫికి వెళ్తూంటే, మార్గమధ్యంలో బందిపోట్లెవరో చంపేశారు. రాణి వితంతువు అయింది. వారికి పిల్లలు లేరు. అందుకని ఈ ప్రకటన చేశారు. ఈడిపస్‌కు యిదంతా ఏమీ తెలియదు. ఆ స్ఫింక్స్‌తో నీ ప్రశ్నేమిటో అడగమన్నాడు. "ఉదయం నాలుగు కాళ్ల మీద, మధ్యాహ్నం రెండు కాళ్ల మీద, సాయంత్రం మూడు కాళ్ల మీద నడిచే ప్రాణి ఏది?" అని అడిగింది. "మనిషి, చిన్నపుడు పాపగా నాలుగు కాళ్ల మీద పాకుతాడు, ముసలితనంలో కఱ్ఱసాయంతో కుంటుతాడు. యవ్వనంలో దృఢంగా రెండు కాళ్ల మీద నిలబడతాడు' అన్నాడు. సరైన సమాధానం చెప్పడంతో ఆ స్ఫింక్స్ తనంతట తనే కొండమీదనుంచి కిందకు పడి చచ్చిపోయింది.

ఈ సంగతి తెలియగానే థేబ్స్ ప్రజలు అతన్ని రాజుగా చేసి, రాణి జోకా స్తాను యిచ్చి పెళ్లి చేశారు. వారికి యిద్దరు కూతుళ్లు, తర్వాత యిద్దరు కొడుకులు పుట్టారు. అంతా సుఖంగా వున్న సమయంలో యీ ప్లేగు వచ్చింది. ఈడిపస్ బావమరిది ఐన క్రియాన్ అపోలో గుడికి వెళ్లి అడిగితే జోస్యులు 'పాత రాజు లాయియస్‌ను చంపినవాడిని శిక్షిస్తే తప్ప యీ మహమ్మారి పీడ దేశానికి వదలద'ని చెప్పారు. ఇక ఆ హంతకుడి జాడ కనిపెట్టడం రాజు గారి పని అయింది. ఆ సంఘటన జరిగి చాలా ఏళ్లయి పోయింది. కనుక్కోవడం ఎలా అని విచారిస్తే టిరియాసిస్ అనే ఓ ముసలి గ్రుడ్డివాడు సోదె చెప్పగలడని రాజుకి ప్రజలు సూచించారు.

టిరియాసిస్‌ను తన వద్దకు రప్పించి ఈడిపస్ ఆ హంతకుడి గురించి అడిగాడు. అతను నోరు విప్పలేదు. కొన్ని సందర్భాల్లో సత్యాన్వేషణ చేయకపోతేనే మంచిదన్నాడు. దాంతో రాజుకి కోపం వచ్చింది. "ఈ మహమ్మారి తగ్గ కుండా ఉండాలని, ఆ విధంగా నాపై ప్రజలకు ఆగ్రహం పెరగాలని నీ కుట్ర. లంచం యిచ్చి నీ చేత యిలా చేయిస్తున్నవాడు క్రియాన్. ప్రజలు తిరగబడి నన్ను పదవీభ్రష్టుణ్ని చేస్తే తను గద్దె కెక్కాలని చూస్తున్నాడు' అంటూ తిట్టిపోశాడు. దాంతో టిరియాసిస్ నోరు విప్పాడు. ఆ హంతకుడు తన తల్లికి మొగుడు, కూతురికి సోదరుడు అని చెప్పి వెళ్లిపోయాడు. ఈడిపస్ ఆశ్చర్యపడ్డాడు. తల్లితో రమించి పిల్లల్ని కనేవాడు ఎవడైనా ఉంటాడా? తను యిలాటి ప్రమాదాన్ని తప్పించుకునే కదా యిక్కడకు చేరాడు అని

గతం గుర్తు చేసుకున్నాడు.

అతను కోరింథ్ రాజ్యానికి రాజైన పోలిబస్‌కి కుమారుడు. తల్లి మెరోప్. పెరిగి పెద్దవాడయ్యాక అతనో సారి డెల్ఫి గుడికి వెళ్లాడు. అక్కడి జోస్యులు అతనికి ఒక ఘోరమైన విషయం చెప్పారు – 'నువ్వు తండ్రిని చంపుతావు, తల్లిని కూడతావు.' అని. ఇతను హడిలిపోయాడు. కలలోనైనా ఊహించలేని విషయమది. తెలిసితెలిసి తను అటువంటి ద్రోహం చేయడు. పొరబాటున కూడా అలా జరగకుండా ఉండాలంటే అసలు ఆ రాజ్యంలో లేకుండా ఎక్కడికో వెళ్లిపోతే మంచిది అనే ఆలోచనతో థేబ్స్ వైపు ప్రయాణం సాగించాడు. అనుకోకుండా దారిలో స్ఫింక్స్ తగలడం, యీ దేశానికి రాజు కావడం జరిగాయి.

పాత రాజు హంతకుడి సంగతి విన్నాక యిలాటి తలరాత దేవుడు యింకా కొందరికి రాసినట్లున్నాదే అనుకున్నాడు. కానీ పాత రాజుగారికి పిల్లలే లేనపుడు ఆయన కొడుకు చేతిలో హతుడయ్యాడని ఎలా అనగలం అది సరే, కుట్రదారుడు క్రియాన్ యిలాటి పన్నాగాలు మరిన్ని పన్నకుండా మరణశిక్ష విధించడం అన్నిటి కంటె ముఖ్యమైన పని అనుకున్నాడు ఈడిపస్. క్రియాన్ వచ్చి తనకి ఇలాంటి దురుద్దేశం ఎంతమాత్రం లేదని, కావాలంటే గుడికి వెళ్లి ఒట్టు వేస్తానని, అక్కడి జోస్యులు ఏం చెప్తారో చూద్దామని అన్నాడు.

జోకాస్తా కలగచేసుకుని, క్రియాన్‌కు అలాటి బుద్ధి లేదని, అనవసరంగా శిక్షించవద్దని నచ్చచెప్పింది. "అయినా జోస్యాలు నమ్మవద్దు, నా పాత భర్తకు జోస్యులు యిలాగే నీ కొడుకు చేతిలో చస్తావని చెప్పారు. మాకు కొడుకు లేడు, పైగా ఆయన రహదారిలో బందిపోట్ల చేతిలో చచ్చిపోయాడని అందరికీ తెలుసు. అందువలన ఈ జోస్యాలు, పాత రాజు హంతకుడి వేట యివన్నీ పక్కన పెట్టి వ్యాధిని అదుపులో తెచ్చేందుకు ఏదైనా మార్గం చూడు" అంటూ హితవు చెప్పింది.

కానీ ఈడిపస్ వినలేదు. పాత రాజు ఎక్కడ చనిపోయాడు, ఆ సమయంలో అతని పక్కన వున్నవారెవరు అని తీవ్రంగా విచారణ జరిపించాడు. చివరకు హత్యకు సాక్షిగా వున్న బానిస దొరికాడు. అతను వచ్చి డెల్ఫినుంచి వచ్చేదారిలో మూడు వీధులు కలిసేచోట పాత రాజుతో ఒక యువకుడికి వాగ్వివాదం జరిగిందని, ఆ యువకుడు రాజును పొడిచి చంపేశాడనీ చెప్పాడు. వెంటనే ఈడిపస్‌కు అర్థమైంది. ఆ యువకుడు వేరెవరో కాదు, తనేనని. కోరింథ్ వదిలి థేబ్స్‌కు వస్తూంటే ఓ ముసలాయన చాలా పొగ రుగా మాట్లాడి, తనను కొట్టి, కవ్వించడంతో అతన్ని పొడిచి చంపేశాడు. ఆ తర్వాతే స్ఫింక్స్‌ని చూడడం జరిగింది. ఆ రాజు భార్యను పెళ్లాడడం, పిల్లల్ని కనడం జరిగింది. తను అతని కొడుకా? తన భార్య జోకాస్తా తన కన్నతల్లా? అలా ఎలా సంభవం? తన తలిదండ్రులు వేరేవారు కదా! వారికి అపకారం జరగకూడదనే కదా తను దేశం విడిచి వచ్చేశాడు!?

ఇంతలో కోరింథ్‌నుంచి ఒక వార్తాహరుడు వచ్చి అతని తండ్రి మరణవార్త చేరవేశాడు. ఆయన పోతూపోతూ ఈడిపస్‌కు రాజ్యాన్ని అప్పగిస్తూ శాసనం చేశాడు. 'వచ్చి తల్లిని ఓదార్చి, రాజ్యభారాన్ని స్వీకరించమని వార్తాహరుడు కోరాడు. వద్దు, నేను అక్కడకు వస్తే అనర్థం జరుగుతుంది. అంటూ ఈడిపస్ తను విన్న జోస్యం గురించి చెప్పాడు. అప్పుడు వార్తాహరుడు 'ఆ జోస్యం ప్రకారమైతే ఆయన నీ చేతుల్లో చావాలి. కానీ మామూలు పరిస్థితుల్లోనే పోయాడు కదా. పైగానువ్వు ఆయన పెంపుడు కొడుకువి తప్ప అసలు కొడుకువి కాదని చెప్పుకుంటారు.' అన్నాడు.

ఈడిపస్ ఉలిక్కిపడ్డాడు. తన జన్మ గురించి ఆరా తీశాడు. సమాధానం చెప్పడానికి యిష్టపడని వారిని రొక్కించి, చంపుతానని బెదిరించి, జవాబులు రాబట్టాడు. ఒక కొండపై గొఱ్ఱెలకాపరికి ఓ పిల్లవాడు దొరికితే అతను కోరింథ్ రాజుకి అప్పగించాడని, పిల్లవాడి పాదాలు కట్టివేయబడి ఉబ్బివుండడంతో, పాదాలు వాచినవాడు అనే అర్థం వచ్చేట్లు ఈడిపస్ అని పేరు పెట్టి ఆ దంపతులు తమ కొడుకుగా పెంచారని తెలిసింది. ఇంతకీ తనను కొండ మీద వదిలేసిన వారెవరు?

అప్పటికి జోకాస్తా కు జరిగినదేమిటో అవగాహనలోకి వచ్చింది. 'నువ్వు నీ కొడుకు చేతిలోనే మరణిస్తావ'ని తన భర్త లాయియస్‌కు జోస్యులు చెప్పడంతో తాము పిల్లలు వద్దనుకున్నారు. అయితే ఓ రోజు రాత్రి బాగా మద్యం సేవించడంతో అనుకోకుండా రతిలో పాల్గొనడం వలన ఆమె గర్భవతి అయింది. కొడుకు పుట్టాడు. లాయియస్ ఆ పిల్లవాణ్ని చంపేయమన్నాడు. అయితే కన్నబిడ్డను స్వయంగా చంపడానికి ప్రాణం రాక, తనను తాను రక్షించుకోలేని విధంగా వాడి పాదాలు రెండూ బిగించి కట్టేసి, ఒక సేవకుడికి యిచ్చి కొండమీద వదిలేయమంది. ఆ పిల్లవాడే ఈడిపస్ అయి వుంటాడు.

తన సేవకుడు కొండ మీద గాలికి వదిలేయకుండా పసిబిడ్డపై జాలితో తన స్నేహితుడైన గొఱ్ఱెల కాపరికి యిచ్చి వుంటాడు, ఆ కాపరి కోరింథ్ రాజుకి యిచ్చినట్టున్నాడు. అనర్థం జరగకుండా ఎంతోమంది ఎంత ప్రయత్నించినా విధి క్రూరంగా తమందరి జీవితాలతో ఆడుకుంది. ఇది అర్థం చేసుకున్నాక ఆమె జరిగింది జరిగిందనుకుని ఈడిపస్‌ను నిజాలు తవ్వడం ఆపమని బతిమాలింది. కానీ అతను పట్టుబట్టాడు.

నిజాలు తెలుసుకోవాలని పరితపిస్తున్న అతని బాధ యిక చూడలేక గతమంతా ఈడిపస్‌కు చెప్పి ఏడుస్తూ తన అంతఃపురంలోకి పరిగెట్టుకుంటూ వెళ్లి ఉరి వేసుకుని చనిపోయింది. ఈడిపస్ పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తన ప్రమేయం లేకుండానే జరిగినా తల్లితో శయనించిన పాపానికి ఒడిగట్టానని బాధపడ్డాడు. తెలిసి చేసినా, తెలియక చేసినా పాపం పాపమే అనుకుంటూ రాజమందిరమంతా పిచ్చెక్కినవాడిలా తిరిగాడు.

చివరకు జోకాస్తా మందిరానికి వెళితే అక్కడ ఆమె శవం కనబడింది. ఆమె దుస్తుల్లోంచి రెండు బంగారు పిన్నులను బయటకు లాగి వాటితో తన కళ్లు తనే పీకేసుకున్నాడు. ఆ తర్వాత తన బావమరిది, నిజానికి మేనమామ అయిన క్రియాన్‌ను తన రాజ్యానికి రాజప్రతినిధిగా, పిన్నవయస్కులైన తన మగపిల్లలకు సంరక్షకుడిగా నియమించాడు. దేశం విడిచి వెళ్లిపోయాడు. అతనితో బాటు అతని కూతురు ఆంటిగన్ తోడుగా వెళ్లింది. చివరకు అనామకుడిగానే మరణించాడు. ఇదీ ఈడిపస్ విషాదగాథ.

ఇంగ్లీష్ రాని అమ్మాయి కలెక్టర్ అయ్యింది

- ఎం.కె.సన్నీ

సురభీ గౌతమ్... ఐఏఎస్ ఆఫీసర్ కావాలని పదో తరగతిలోనే నిర్ణయించుకుంది. మధ్య ప్రదేశ్‌లోని అత్యంత వెనుకబడిన, కుగ్రామంనుండి వచ్చిన ఆ అమ్మాయి తన కలను సాకారం చేసుకోవడానికి ఎంతో కష్టపడింది. ఇంగ్లీష్ మాట్లాడలేక అవమానపడింది. చివరకు అనుకున్నది సాధించింది. ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. ఆమె ప్రయాణం గురించి మరిన్ని విశేషాలు...

'ఆరో తరగతి లెక్కల పరీక్షలో వందకు వంద మార్కులు సాధించాను. అప్పుడే క్లాసులో నాకంటూ ఓ గుర్తింపు, ప్రోత్సాహం లభించింది. ఎంత శ్రమిస్తే అంత గుర్తింపు వస్తుందని అప్పుడే నాకు అర్థమయింది'' అంటూ తన స్కూలు చదువును గుర్తు చేసుకుంది సురభి. పదో తరగతిలో లెక్కలు, సైన్స్‌లో వందకు వంద మార్కులను సాధించింది. ఈ విజయం ఆమెకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. తన కలను నేరవేర్చుకోవడానికి ఈ విజయాన్ని ఓ మార్గంగా భావించింది.

బాధ్యతగా భావించి...

ప్రస్తుతం ఓ మనిషి బతకాలంటే కనీసం వైద్యం, విద్యుత్ ఉండాలి. అయితే సురభి పుట్టిన గ్రామంలో ఇలాంటి మౌలిక సదుపాయాలు లేవు. అందుకే ఎప్పటికైనా ఐఏఎస్ ఆఫీసరై ఇలాంటి గ్రామాలకు సేవ చేయాలని నిర్ణయించుకుంది. ఇలాంటి ఎన్నో కలలు, ఆశయాలతో ఇంజనీరింగ్ చేయడానికి భూపాల్ వెళ్ళింది. ''నాకు తెలుసు నాపై ఎంత బాధ్యత ఉందో. నా విజయం వెనుక మా గ్రామంలోని ఎంతో మంది అమ్మాయిల కలలు దాగి ఉన్నాయి. వారి ఆశలను, కలలను తీర్చడం నా బాధ్యత'' అంటూ ఆమె తన కాలేజీలో చేరిన మొదటి రోజు గుర్తు చేసుకుంది. ఆ గ్రామంనుండి పై చదువుకు గ్రామం వదిలి బయటకు అడుగుపెట్టిన మొదటి అమ్మాయి సురభి.

వెనక్కు వెళ్ళిపోవాలని

అప్పటి వరకు ఆమె హిందీ మీడియంలో చదువుకుంది. అయితే అక్కడి పిల్లలందరూ ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతున్నారు. ఇది సురభికి పెద్ద ఎదురు దెబ్బగా అనిపించింది. మొదటి రోజు క్లాసు రూములో తనని తాను



పరిచయం చేసుకున్న రోజే అవమానానికి గురయ్యింది. అది భరించలేక తన సామాను సర్దుకుని తిరిగి గ్రామానికి వెళ్ళిపోవాలనుకుంది. ఇదే విషయాన్ని తల్లికి చెబితే ''సవాళ్ళు ఎదురైనప్పుడే ధైర్యంగా నిలబడాలి'' అని సలహా ఇచ్చింది. ''గ్రామంలో నా లాంటి ఆడపిల్లలు ఎందరో నా విజయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు నేను వెనక్కు వెళ్ళిపోతే మూసి ఉన్న తలుపులు ఇక ఎప్పటికీ తెరుచుకోవు'' అని తనకు తాను ధైర్యం చెప్పుకుంది.

ఏ మూలనో అసంతృప్తి

ఇక తన ప్రయాణాన్ని ఆపదలచుకోలేదు. తన శ్రమను రెట్టింపు చేసింది. ఇంగ్లీష్ మాట్లాడడం నేర్చుకుంది. నలుగురిలో తనని తాను ఇంగ్లీష్‌లో పరిచయం చేసుకోవడానికి భయపడిన సురభి తన కాలేజీలోనే కాదు ఆ యూనివర్సిటీ పరిధిలోనే టాపర్‌గా నిలిచింది. సివిల్ సర్వీస్ పరీక్షలు రాయాలంటే కనీసం 21 ఏండ్లు ఉండాలి. అయితే ఆమెకు వయసు సరిపోలేదు. దాంతో ఆ సమయాన్ని కూడా ఆమె వృధా చేసుకోకుండా ఇతర పోటీ పరీక్షలు రాసి

ఎంపికయింది. కానీ ఇవేవీ ఆమెకు తృప్తి నివ్వలేకపోయాయి. ఏ మూలనో అసంతృప్తి. అసలు లక్ష్యాన్ని తల్లి ఆమెకు గుర్తు చేసింది. దాంతో మళ్ళీ సివిల్ సర్వీస్‌పై దృష్టి పెట్టింది.

ఒక్కో నిమిషం...

సాధారణంగా సివిల్స్‌కు సిద్ధమయ్యే వారు తమ ధ్యాస మొత్తం వాటిపైనే పెడతారు. కానీ సురభి అలా చేయలేదు. రైల్వేలో ఉద్యోగం చేస్తూ సాయంత్రం సమయంలో ఒక్కో పేపర్‌కు నాలుగు గంటలు సమయం కేటాయించేది. అయితే లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆ సమయం సరిపోదు. అందుకే మరింత సమయాన్ని కేటాయించింది. దొరికిన ప్రతి నిమిషాన్ని ఉపయోగించుకుంది. కావల్సిన మెటీరియల్ సేకరించుకుంది.

అమ్మే స్ఫూర్తిగా...

జీవితంలో ఇబ్బంది పెట్టే క్షణాలు ఎన్నో వస్తాయి. వాటిని తట్టుకున్న వాళ్ళే విజయం సాధించగలరు. ''మా అమ్మ 23 ఏండ్ల వయసులో ముగ్గురు పిల్లలకు తల్లి అయ్యింది. కుటుంబం కోసం ఎంతో కష్టపడింది. పది నెలల పాపను వదిలిపెట్టి, ఇంటి బాధ్యతలు చూసుకుంటూ పది కిలో మీటర్ల వెళ్ళి ఉద్యోగం చేసి వచ్చేది. అంత బాధ్యతను మోస్తూ కూడా ఎవ్వరినీ నిందించలేదు. కానీ నాకు అలాంటి బాదరబందీలు లేవు. కాస్త కష్టపడితే అనుకున్నది సాధించగలను. ఇలా అమ్మను చూసి ఎన్నో నేర్చుకున్నాను'' అన్నది సురభి.


సేవ చేసినప్పుడే...


ఇలా ఎంతో కష్టపడి సివిల్స్‌లో ఆలిండియా 50వ ర్యాంకు సాధించిన ఆమె 'గుజరాత్‌లో నా మొదటి పోస్టింగ్. ఇక్కడి వాతావరణం చాలా కొత్తగా అనిపించింది. సమాజానికి సేవ చేయాల్సిన సివిల్ సర్వీస్‌ను ఇక్కడి వాళ్ళు ఓ అధికారంగా భావిస్తున్నారు. కేవలం బాధ్యత తీసుకున్నంత మాత్రాన అధికారి కారు. ప్రజలకు సేవ చేసినప్పుడే ఈ వృత్తికి అసలైన గౌరవం'' అంటారామె. ఇలాంటి ఆలోచనలతోనే సురభి తన పనిని ప్రారంభించారు. తన చేతలతో అతి తక్కువ కాలంలోనే ప్రజల గౌరవాన్ని పొందారు.

ఎన్నో సవాళ్ళు...

సురభి ప్రస్తుతం గుజరాత్‌లోని వడోదర ప్రాంతంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చూస్తున్నారు. ''ఇప్పటి వరకు ఎన్నో నేర్చుకున్నాను. ఒక్కో ప్రాంతంలో ఒక్కో పరిస్థితి. ముఖ్యంగా రాజకీయ పరిస్థితులు వేరువేరుగా ఉంటాయి.ఎన్నో ఒత్తిళ్ళను, సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటివి ఎన్ని ఎదురైనా ప్రజల అవసరాలు తెలుసుకుని వాటిని తీర్చడంపైనే దృష్టి పెడుతున్నాను'' అంటారామె.

ఈ విధంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి సురభి ఎన్నో అడ్డంకులను బద్దలు కొట్టుకుంటూ ముందుకు సాగారు. ఒక స్ఫూర్తి దాయకమైన ఆఫీసర్‌గా గుర్తింపు పొందారు. ఎంతో మంది విద్యార్థులకు, యువతకు ఆదర్శంగా నిలిచారు....






వృద్ధాప్యానికి ఆహ్వానం


-శ్రీ గొల్లపూడి మారుతీరావు

ప్రతీ వ్యక్తీ కోరుకున్నా, కోరుకోక పోయినా తప్పని సరిగా చేరుకునే మజిలీ.
వయస్సులోని కోరికలన్నింటికీ సెలవిచ్చి,
అలసి పోయిన అనుభవాలనీ,
ఆరిపోయిన అనుభూతులనూ
నెమరు వేసుకునే చలివేంద్రం.
వృద్ధాప్యం ఒక అవకాశం.
వెనక్కి తిరిగి చూసుకుని,
చేసిన తప్పిదాలకు నవ్వుకుని,
దాటిన అడ్డంకులను పరామర్శించి,
ఇక దాటనక్కరలేని స్థితికి వచ్చినందుకు ప్రశాంతంగా నిట్టూర్చే ఆటవిడుపు.
ముసిలితనం కొడుకుకంటె ఒక అడుగు వెనక నడిపిస్తుంది.
మనవరాలి భుజాన్ని ఆసరా చేసుకుంటుంది.
జీవితమంతా కొరుకుడు పడని నిజాలతో
ఆనందంగా రాజీపడేటట్టు చేస్తుంది.
పిల్లలు "నీకేం తెలీదు నాన్నా!"
అంటే కోపం రాదు.
ఒక జీవిత కాలాన్ని 'తెలీని
తనానికి తాకట్టు' పెట్టిన
కొడుకుని చూసి నవ్వు
కుంటుంది.
తనకి తెలీదని పక్కకి తప్పించే
తరాన్ని చూసి గర్వపడుతుంది.
అవలీలగా అర్థం
చేసుకుంటుంది. "వాడికి
తోచినట్టే చెయ్యనివ్వండి" అనే
భార్య హితవుకి గంభీరంగా
తలవొంచుతుంది.
ఏ విమర్శా అవమానం
అనిపించదు.
ఏ నిందకీ కోపం రాదు.
వృద్ధాప్యాన్ని అందరూ
గౌరవిస్తారు.
నీ జీవితకాలంలోని సాధనల్ని పక్కనపెట్టి, కేవలం వయస్సు కారణంగానే పెద్దరికాన్ని అంగీకరిస్తారు.
అదొక అంతస్థు. అతని హితవుని నలుగురూ వింటారు, నీ ఆలోచనని గౌరవిస్తారు. దాన్ని పాటించరని అర్థమవుతున్నా కోపం రాదు. వయస్సు అర్థం చేసుకునే సంయమనాన్ని నేర్పుతుంది.



"మా రోజుల్లో..." అని చెప్పుకోవడంలో
చిన్న 'సాకు'ని వృద్ధాప్యం
మప్పుతుంది.
"ఈ కాలం కుర్రాళ్లు..." అన్న
వెక్కిరింతకి అర్హతని సంపాదించి
పెడుతుంది.
తన గురించి తన పెద్దలూ
అలనాడు.. అలాగే అనుకొని
ఉంటారని అప్పుడు జ్ఞాపకం
వస్తుంది.
వేసిన ప్రతీ
అడుగూ
తెలిసి వేసే
నమ్మకాన్నిస్తుంది.
చేసే ప్రతీ పనీ
యిబ్బంది లేని,
శ్రమ
అనిపించని
మార్గం వేసే
ప్రయాణం
చేయిస్తుంది.
తన 'రేపు'
క్రమక్రమంగా
కురుచనయి పోతోందని
అర్థమవుతూంటుంది.
దక్కిన చిన్న తప్పుల్ని
వృద్ధాప్యం భద్రంగా
అలంకరించుకుంటుంది.
"మనకి చేతకాదు" అని
చెప్పడం పెద్ద అర్హతగా
కనిపిస్తుంది.
అసాధ్యానికి 'అనవసరం'
అంటూ గడుసుదనం
చిన్న ముసుగువేస్తుంది.
దానికి ఊతం వృద్ధాప్యం.
జీవితంలో చాలా ప్రశ్నలకు సమాధానాలు అర్థమవుతూంటాయి.
ఇప్పుడా సమాధానాలకూ వేళ మించిపోయిందని అర్థమవుతుంది.

ఈ సమాజంలో అవినీతి అనే కుళ్లు ఎప్పుడు తొలగుతుంది?
ప్రతీక్షణం దోపిడీకి గురవుతున్న ఈ పర్యావరణం ఒక్కసారి ఎదురు తిరిగితే ఏమవుతుంది?
ఏమయినా తనకేం బాధలేదు.
సమయంలో తను ఉండడు.
ఈ జీవితనుంచి శెలవు తీసుకోవడమే తనకి ఉపశమనం.
దేవుడు ఎక్కడ ఉంటాడు?
ఎలా వుంటాడు?
మృత్యువు తరువాత ఏమవుతుంది?
సమాధానాలు అర్థమయే క్షణాలు దగ్గరవుతున్నాయి.
చుట్టూవున్న జీవితాన్ని క్రమంగా ఖాళీ చేసుకుంటుంది వృద్ధాప్యం.
చిన్నకేక తుళ్లిపడేటట్టు చేస్తుంది.
చిన్న నిశ్శబ్దం ప్రశాంతంగా ఉంటుంది.
ఎప్పటిలాగే తెల్లారి,
వృద్ధులతో కలిసి నడిచి,
రెండుముద్దల అన్నం తిని,
అరగంట సేదతీరి,
వేడి టీ తాగి,
సాయంకాలం పార్కు బెంచీ దగ్గర 'ఈ దేశం తగలడి పోతోంద'ని తిట్టుకుని, శాంతపడి, కీళ్ల నొప్పులకు మాత్రలు మింగి, రాని నిద్రనీ, నిన్నటి జ్ఞాపకాలనీ నెమరు వేసుకోవడం – వృద్ధాప్యం వ్యసనం.
ఇప్పుడు విచారం దగ్గరకు రాదు.
వెళ్లిపోయిన హితులూ, సన్నిహితులూ దిగులుగా జ్ఞాపకం వస్తారు.
ముగింపు భయపెట్టదు.
ఎందుకంటే భయపడినా రాకతప్పదు కనుక.
అన్నిటినుంచీ, అందరినుంచీ తనని కుదించుకుని – మెల్లగా అంతర్ముఖుడు కావడం వృద్ధాప్యం.
ఇప్పుడు అన్ని దురదృష్టాలకూ కారణాలు అర్థమౌతాయి.
చేసిన తప్పిదాలు, మాటతప్పిన కప్పదాట్లూ, మనసు నొప్పించిన చిన్న చిన్న జ్ఞాపకాల ముళ్లూ –
అవన్నీ ఓ జీవితకాలం ఆలస్యంగా కళ్లముందు కదుల్తాయి.
ఈ అనుభవాల్ని హెచ్చరికలు చెయ్యబోతే పిల్లలు వినరు.
వినినట్టు నటిస్తారు.
నటిస్తున్నారని తనకీ తెలుసు.
విన్న తృప్తిని తానూ నటిస్తాడు.
వారికీ వృద్ధాప్యం ఒకనాడు పాఠాలు చెప్తుందని తెలుసు.
కాని వృద్ధాప్యం
ఒక వరమని ఇప్పుడు చెప్పి ఒప్పించలేడు.
వారు ఒప్పుకునే వేళకి తను ఉండడు.
జీవితం ఎంత విచిత్రం! నవ్వుకుంటాడు.
ఆ నవ్వు ఖరీదు ఒక జీవితం.
'చమకం' ఏ ఋషి, ఏ మహానుభావుడు ఎప్పుడు సృష్టించారో.
ఎంత ముందుచూపు, ఎంత వినయసంపద, జీవుని నిస్సహాయత, నిర్వేదం – అందులో ఎంత నిక్షిప్తమయి వుందో, ఆనాటి కోరిక సంపూర్ణమయిన స్వరూపంతో కళ్లముందు దర్శనమిచ్చేనాటికి తాను జీవితమంతా కోరుకున్న 'వృద్ధాప్యం' తనని ఆవరించుకుని ఉంటుంది.
ఈ దేశపు వేదసంపద, సాంస్కృతిక వైభవం, జాతి దర్శనం అపూర్వం, అనన్యసామాన్యం.
చమకంలో 'వృద్ధం చమే' అనే ఒక్క కోరికా ఈ జాతినీ, మతాన్నీ, ఆలోచనా స్రోతస్సునీ అత్యద్భుతంగా ఆవిష్కరించే అభిజ్ఞ.. వరం.
భగవంతుడిని కోరడంలోనే భగవంతుడు ప్రసాదించిన తన ఆలోచనా పరిణతిని అలంకరించే భగవద్దత్తమైన ఆశీర్వాదం. అదీ వృద్ధాప్యం.





గుళ్లు, గోపురాలంటూ కాలం వృథా చేస్తున్నాం

ఒకపక్క చైనా రోబో టెక్నాలజీ, కృత్రిమ మేథ, యంత్రాల రంగాల్లో పోటీపడి ఎదుగుతూ ఉంటే.. మనం మాత్రం.. గుళ్లు, గోపురాలంటూ కాలాన్ని వృథా చేసుకుంటున్నాం.

– అరుణ్ ప్రకాశ్, నావికాదళ మాజీ చీఫ్

శ్రమైక జీవన సౌందర్యం

- టి.సోమయ్య

నాలుగు కాళ్ల జంతువు రెండు కాళ్ల మీద లేచి నిలుచోవడం మానవ పరిణామ క్రమంలో ఒక మలుపు. ఒక గెలుపు. జంతువునుండి మనిషిగా విడివడిన ఒక దశ. వెన్నెముక అడ్డంగా ఉన్నవి జంతువులు. నిటారుగా ఉంటే మనుషులు. ఆ క్షణంనుండి మనిషి నడుస్తూనే ఉన్నాడు. ఆగకుండా పరుగెత్తుతూనే ఉన్నాడు. వేటకోసం, ఆహారం కోసం, వ్యవసాయం కోసం, యుద్ధాలకోసం పరుగులు పెడుతూనే ఉన్నాడు ఉపాధికోసం వలసలు, నడకలు, పరుగులు భూగోళమంతా ఉన్నవే కరోనా దెబ్బకు తొలిసారి ఉపాధిని వదులుకుని సొంత ఊళ్లను వెతుక్కుంటూ మనిషి నడవడం మొత్తం మానవ నాగరికతను అపహాస్యం చేస్తోంది. మానవాభివృద్ధి సూచికలను ప్రశ్నిస్తోంది. సంక్షేమరాజ్యాన్ని నిలదీస్తోంది. అభివృద్ధిని అడుగుతోంది. సమసమాజ స్ఫూర్తి గొంతులో పచ్చి వెలక్కాయ పడుతోంది

జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి- అని వాల్మీకి రామాయణంలో రాముడన్న విషయం ఈ నడిచే కోట్ల వలస కాళ్లకు తెలియకపోవచ్చు. వలస వచ్చినప్పుడు తెలియని జననీ జన్మ భూమి- కరోనా కష్టం వచ్చాక తెలిసివచ్చింది ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి పొట్ట కూటి కోసం రాష్ట్రాలు దాటారు. దేశాలు దాటారు. సముద్రాలు దాటారు. ఖండాలు దాటారు.

నిర్మాణాలకు రాళ్ళెత్తారు. కోటలు కట్టారు. పేటలు పేర్చారు. స్లాబులు వేశారు. స్తంభాలు వేశారు. గోడలు పేర్చారు. ఇనుమును వంచారు. యంత్ర భూతముల కోరలు తోమారు. ఇళ్ళలికారు. ముగ్గులు వేశారు. అంట్లు తోమారు. పిల్లలను పెంచారు. తోటలు పెంచారు. కాయలు కోశారు. ఎడారుల్లో ఒంటరి ఒంటెలయ్యారు. పెట్రోలు బావుల్లో పడి లేచారు. రేకుల షెడ్లలో నలిగిపోయారు


ఉన్న ఊరు కానప్పుడు ఏ రాష్ట్రమయినా, ఏ దేశమయిన ఒకటే. ఊరొదిలి వెళ్ళడానికి బస్సు, రైలు, విమానం ఏదో ఒక వాహనం. శరీరకష్టమే పెట్టుబడిగా వలస కార్మికులది శ్రమయాన పరిశ్రమ. బతుకులెట్లా ఉన్నా ఏదో ఒక పని. నాలుగు మెతుకులు నోట్లో పడేవి.

కరోనా లాక్‌డౌన్. ఆంక్షలు. నిర్బంధాలు. సరిహద్దుల మూసివేతలు. ఆగిన పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ బస్సులు, రైళ్లు, విమానాలు. స్వదేశీ వలస కార్మికులు ఊళ్లకు వెళ్ళలేరు. విదేశాల్లో ఉన్న మన కార్మికులు స్వదేశం రాలేరు.

కాయకష్టం చేసుకుని గౌరవంగా నాలుగు మెతుకులు తినడానికి- ఒక ప్రభుత్వ కరోనా సహాయ శిబిరంలో చేయి చాచి దొరికింది తినడానికి మధ్య ఆత్మాభిమాన సమస్య ఉంది. ఆవేదన ఉంది. ఆకలి ఉంది. అవమానం ఉంది. మాటలకందని బాధ ఉంది. అసహనం ఉంది. అంతర్గత సంఘర్షణ ఉంది.

కాళ్ల కింద నేల తమది కాదు. నెత్తి మీద రేకు తమది కాదు. కొట్టే చప్పట్లు, మోగే గంటలు, వెలిగే బాల్కనీ దీపాలను ఎలా అన్వయించుకోవాలో వారికి అర్థం కాలేదు

కారులో తిరిగేవాడికి కారు లేకపోతే కాలు కదలదు. విమానంలో తిరిగేవాడికి కాలు నేల మీద ఆనదు. సొంత కాళ్లను నమ్ముకుని వలస వచ్చినవాడు. శ్రమ సౌధాలు సొంత



కాళ్ల పునాదుల మీద మహా నగరాలను నిర్మించినవాడు. సొంత కాళ్లతో జాతీయ రహదారులకు దారులు వేసినవాడు. జాతీయ సమైక్యతకు శ్రమైక జీవన సౌందర్య గీతాన్ని పాడినవాడు. ఎండకు ఎండడానికి, వానకు తడవడానికి, చలికి వణకడానికి సిద్ధపడి కన్న ఊరు వదిలినవాడు. కరోనా అతడిని ఇంకా ఇంకా బాధపెట్టగలదు కానీ, భయపెట్టలేదు.

రోటీ తినేవాడికి అన్నం సహించదు. అన్నం తినేవాడికి రోటీ సహించదు. ఆధార్ కార్డులో ఏ అడ్రెస్ ఉందో కానీ- ఏ ఆధారమూ లేక అగమ్యగోచరంగా, అంతా శూన్యంగా ఉన్నప్పుడు వారికి కన్న ఊరు కళ్లల్లో మెదిలింది. సొంత కాళ్లతో ఇంత దూరం నడిచి వచ్చినవారు, సొంత కాళ్ల మీద ఇంత బరువు మోసినవారు- అనుకుంటే సొంత కాళ్లతో మళ్లీ కన్న ఊరు చేరలేరా?

వందల కిలోమీటర్లు. వేల కిలోమీటర్లు పగలు- రాత్రి. ఎండా వాన. రహదారి తారు రోడ్డు. మట్టి దారి. రైలు పట్టాలు. సిమెంటు లారీ. ఆటో. సైకిలు. ఏదీ దొరకకపోతే నడక. కాలి నడక. కాళ్లకు చెప్పులు లేకపోయినా నడక. తోడు పిల్లా జెల్లా . నెత్తిన మూట ముల్లె. ఆగని నడక.

కాళ్లు బొబ్బలెక్కుతున్నా ఆగని నడక.
కళ్లు తిరిగి తూలుతున్నా ఆగని నడక.
ప్రాణాలు పోతున్నా ఆగని నడక.
సహచరులు ఊపిరి వదిలినా ఆగని నడక.

ఊళ్లకెళ్లి ఇన్ని కోట్ల మంది ఏమి చేస్తారు? ఏమి తింటారు? అన్నది అర్థం లేని ప్రశ్న. పనిచేసేచోట పనిలేనప్పుడు, పని చేసినా జీతం రానప్పుడు, జీతం వచ్చినా బియ్యం గింజలు దొరకనప్పుడు, నిలువ నీడ లేనప్పుడు వారికి ఒకే ఒక ఆశ కన్న ఊరు. కన్న వారు

ఇది గమ్యం తెలియని పయనం కాదు-
గమ్యం తెలిసిన పయనం.
ఇది వలస బాట కాదు-
కన్నీటి పాట.

ఇది ఉపాధి వెదుకులాట కాదు-
కన్నపేగు అన్వేషణ.
ఇది విహార యాత్ర కాదు-
విషాద యాత్ర.
ఇది ఊరు మారడం కాదు-
ఊరు పొమ్మనడం.

వీళ్లు వలస కార్మికులు.
వీళ్లు మనుషులు.
కాళ్ళుండి నడుస్తున్న మనుషులు.
కళ్లుండి నడుస్తున్న మనుషులు.
సంకల్పం నడకయిన మనుషులు.
ఆవేదన నడుపుతున్న మనుషులు.
కన్నీళ్లు కూడా కరువయిన మనుషులు.

ఈ నడకకు పేరు లేదు కానీ- బలమయిన వేరు ఉంది. ఆ వేళ్లు భూమిని చీల్చుకుని నడుస్తాయి. పాతుకుపోయిన వేళ్లతో చెట్టు నడవలేదు. ఎండిన కొమ్మలు, రెమ్మలతో బాధలతో, బరువులతో. తమను తాము నరుక్కున్న చెట్లు. మళ్లీ చిగుళ్ళొస్తాయో లేదో తెలియని చెట్లు, కన్నీటి చెట్లు. ఆకురాలిన చెట్లు. పూవు పూయని చెట్లు. కాయ కాయని చెట్లు. పండివ్వని చెట్లు. పరులకు నీడనివ్వడానికి పనికొచ్చినా, తమ నీడ తమకు పనికిరాని చెట్లు

ఇది గమ్యం చేరినా, గమ్యం చేరని పయనం.

ఇది తీరం చేరినా తీరని దాహం.

చీర అందానికే అందం
ఆడతనానికి చిహ్నం
భారతీయతకు
ప్రతిరూపం
మగువ కడితే
పుత్తడిబొమ్మ
బొమ్మకు కడితే కళగల
భామ
చీరను చుడితే
వలపుల సుధార
మమతల తెర
నులివెచ్చని చెర
శృంగారానికి ఎర
ఎక్కడ చూపాలో
ఎక్కడ దాచాలో
తెలిసిన నెరజాణ
"చీర"
తెల్లచీర మల్లెపూలతో
అడుగిడితే అప్సరస
నల్లచీరలో నడయాడితే
చీకటిలో చుక్క
పచ్చచీరలో చిరుగాలికి
కదిలే పంటచేను
ఎర్రచీరలో మెరిసే
సందె పొద్దు
పసుపుచీరలో
చిరునవ్వే చామంతి
ఏ చీరలోనైనా
హర్షించే హరివిల్లు !

- ప్రజామీడియా నెట్‌వర్క్



బుల్లెట్ ప్రూఫ్

- వి.శర్మ

మాకు 1,86,000 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కావాలి అని రక్షణ దళాలు 2009లో మన్మోహన్ ప్రభుత్వాన్ని అడిగితే 2014 వరకు ఒక్కటంటే ఒక్కటి కూడా కొనలేదు.

కారణం? అవినీతి. 2009లో 59,000 జాకెట్లు కొనడానికి టెండర్ పిలిచి ఫైనలైజ్ చేశారు. కానీ ఆ జాకెట్స్ శాంపిల్స్ నాణ్యత ఎంత దారుణంగా ఉంది అంటే మామూలు తుపాకీ గుళ్ళకే అది తట్టుకోలేక జాకెట్ కన్నాలు పడిపోయింది. అంటే సైనికుల ప్రాణాల కన్నా అవినీతి డబ్బే ముఖ్యం అన్నమాట. అప్పుడు మీడియాలో వీటిమీద విపరీతమైన అవినీతి ఆరోపణలు రావడంతో ఆ టెండర్ రద్దు చేసి యూపీఏ ప్రభుత్వం మరి వీటిని కొనే సాహసం చెయ్యలేదు.

2014లో మోడీ ప్రభుత్వం వచ్చిన దగ్గరనుండి మళ్లీ సైనిక దళాలు వీటి గురించి అడగడం మొదలు పెట్టారు. అత్యవసరంగా వాడుక కోసం మోడీ ప్రభుత్వం 2016లో 50,000 జాకెట్స్ దేశంలోనే గల టాటా అనుబంధ సంస్థనుంచి కొనుగోలు చేసింది.

రక్షక దళాలు సుమారు 3,50,000 జాకెట్లు కావాలని ప్రభుత్వాన్ని అడిగితే ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యత ఉండే విధంగా సుమారు 1,86,000 కొనడానికి 2018 ఏప్రిల్‌లో ఒప్పుకొని టెండర్లు పిలిచారు. ఒక భారత్ కంపెనీ టెండర్ గెలుచుకుని ?639 కోట్ల ఆర్డర్ సంపాదించింది. ఈ జాకెట్స్ AK47 బుల్లెట్స్ కూడా తట్టుకోగలవు.

పూర్వం మనం ఈ జాకెట్లను అమెరికానుండి దిగుమతి చేసుకుంటూ వుండేవారం.

అయితే మొట్టమొదటి సారిగా దేశంలో స్వాతంత్రం వచ్చిన 70 సం. తరువాత ఈ జాకెట్స్ దేశంలో తయారుచేయడం మొదలయింది. దీనికి ముఖ్య ప్రేరణ శ్రీ శాంతను భౌమిక్. ఈయన మాతా అమృతానందమయి యూనివర్సిటీలో ఏరోస్పెస్ ఇంజినీరింగ్‌లో ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. ఈయన మన సైనికులకు పనికి వచ్చే దృఢమైన తేలిక అయిన బులెట్ ప్రూఫ్ జాకెట్లు తయారీ మీద మన కేంద్ర రక్షణ పరిశోధనా సంస్థ (DRDO)తో కలసి పరిశోధనచేసి విజయం సాధించారు. అమెరికానుండి దిగుమతి చేసుకుంటున్నవి ఒక్కొక్కొ జాకెట్ ?1,50,000 ఖరీదు ఉండి, 15–18 కేజీల బరువు ఉంటే ఈయన తయారుచేసినవి? 50,000 ఖరీదు మాత్రమే చేసి 1.50 కేజీలు బరువు మాత్రమే ఉంటాయి. అంతే కాక ఇవి 57 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద కూడా పని చేస్తాయి. మోడీ ప్రభుత్వం వచ్చాక వీటి పనితనం, నాణ్యత పరిశీలించి బాగున్నాయని ఈ జాకట్లకే ఆర్డర్ పెట్టారు. ఈ భౌమిక్‌గారివల్ల దేశం సం.కి సుమారు ?20,000 కోట్లు వరకు ఆదా చేయగల్గుతుంది అని నిపుణులు చెపుతున్నారు.

ఈ జాకెట్లు ఇప్పుడు మన దేశీయ అవసరాలకు ఉపయోగపడడమే కాదు మన దేశం యూరోపియన్ దేశాలతో సహా సుమారు 100 దేశాలకు ఎగుమతి ఆర్డర్స్ సంపాదించింది. అమెరికా, బ్రిటన్, జర్మనీ తరువాత దేశీయ పరిజ్ఞానంతో ఈ జాకెట్లను తయారు చేసుకుంటున్న 4వ దేశంగా భారత్ ప్రపంచంలో నిలిచింది.

కరోనా పాజిటివ్ రోగులొస్తే కచ్చితంగా చేర్చుకోవాలి

గవర్నర్ తమిళసై



హైదరాబాద్: కరోనా పాజిటివ్ రోగులొస్తే కచ్చితంగా చేర్చుకుని మెరుగైన చికిత్స అందించాలని గవర్నర్ తమిళసై ప్రైవేటు హాస్పిటల్స్ యాజమాన్యాలకు తేల్చి చెప్పారు. అంతేకాదు.. నాణ్యమైన చికిత్సతో రోగులకు భరోసా కల్పించేలా వ్యవహరించాలని గవర్నర్ స్పష్టం చేశారు. తెలంగాణలో కరోనా వ్యాప్తి రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తమిళ సై వివిధ ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలతో నేరుగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో 11 ప్రయివేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు పాల్గొన్నాయి. కరోనా కల్లోలంతో భయాందోళనలు పెరిగిపోతున్న దృష్ట్యా అనేక కారణాలతో ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వచ్చే రోగుల పట్ల బాధ్యతగా.. మానవత్వంతో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందుటలేదన్న ఫిర్యాదులను ప్రస్తావిస్తూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వచ్చే పాజిటివ్ రోగులకు భరోసా కల్పించాలన్నారు. పాజిటివ్ బాధితులు హాస్పిటల్స్ రాగానే కచ్చితంగా చేర్చుకోవాలని, నాలుగైదు హాస్పిటల్స్ తిరిగే పరిస్థితి రాకూడదని గవర్నర్ హెచ్చరించారు. అలాగే టెస్టులు బాధ్యతతో చేయాలని.. అవసరమైతే కార్పొరేట్ హాస్పిటల్స్ కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల సహకారం తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేషెంట్స్‌నుండి అధిక చార్జీలు వసూలు చేయకూడదని గవర్నర్ తమిళ సై స్పష్టం చేశారు.

- ప్రజామీడియా నెట్‌వర్క్

మంచిరోజులు

- డా॥ విజయ్‌కుమార్

యావత్తు సమాజాన్ని కకావికలం చేస్తున్న కరోనా కబంధహస్తాలనుండి బయటకు వచ్చే మంచిరోజులు కనుచూపు మేరలోనే కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని మందులు అందుబాటులోకి వచ్చాయి. వ్యాక్సిన్‌లు కూడా ఆ దారిలోనే ఉన్నాయి. ఈ ఆగస్టు 15 నాటికే కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తోందన్న వార్త భారత ప్రజలకు వెయ్యేనుగుల బలాన్ని ఇస్తోంది. భారత్‌తో పాటు పలుదేశాలు వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చే చర్యల్లో పోటీపడి పనిచేస్తున్నాయి. వ్యాక్సిన్ వస్తే కానీ, ఈ సంక్షోభానికి తెరపడదు. ఈ భూమిపై ప్రస్తుతం జీవించి ఉన్న సుమారు నాలుగు తరాల మనుషులు ఇటువంటి గండాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఎవ్వరూ కలలో, ఇలలో ఊహించని ఉపద్రవం ఇది. ఇది, వందల కోట్లమానవాళితో – కనిపించని ఒక సూక్ష్మజీవి ఆడుతున్న రాక్షస క్రీడ. దీనికి చరమగీతం పాడితేకానీ, సమాజం ముందుకు వెళ్ళలేదు. ఆగస్టు 15వ తేదీలోగా టీకా తీసుకురావాలని భారత వైద్య పరిశోధనా మండలి తీవ్రస్థాయిలో సన్నాహాలు చేస్తోంది. సాధ్యాసాధ్యాలు చూడాలి. మానవులపై వివిధ దశలలో చేపట్టబోతున్న ప్రయోగాలు సత్వర సత్ఫలితాలను ఇవ్వాలి. అవి సంపూర్ణంగా జయప్రదం కావాలని అందరం మనసారా కోరుకుందాం. మనదేశం సొంతంగా ఆవిష్కరించే తొలి టీకా ఇదే అవుతుంది. భారత్ బయో టెక్ తయారు చేస్తున్న ఈ టీకా పేరు కొవాగ్జిన్. క్లినికల్ పరీక్షలు నిర్వహించడానికి హైదరాబాద్ నిమ్స్, విశాఖపట్నంలోని కింగ్ జార్జి హాస్పిటల్ సహా దేశవ్యాప్తంగా 12 హాస్పిటల్స్, సంస్థలను ఇప్పటికే ఎంపిక చేశారు. ఇంకొక పక్క ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ ఓ) కరోనాను నయం చేసే ఔషధాలపై జరుగుతున్న ప్రయోగ ఫలితాలు రెండు వారాల్లోపే వెల్లడవుతాయని చెప్పడం మరో మంచి అడుగు. రెమ్ డెసివిర్, హైడ్రోక్సీ క్లోరోక్విన్, లోపినావిర్, ఇంటర్ ఫెరాన్ మొదలైన ఔషధాలు మనుషులపై ప్రయోగించి పరిశీలిస్తున్నారు. మనుషులపై వ్యాక్సిన్ ఎలాంటి ప్రభావం చూపిస్తుందో తెలియడానికి ఈ ఏడాది చివరి వరకూ సమయం పట్టే అవకాశముందనీ, భారీస్థాయిలో ఉత్పత్తి చెయ్యడమే ఇప్పుడు మన ముందున్న ప్రశ్న, అనీ డబ్ల్యూ. హెచ్. ఓ అత్యవసర కార్యక్రమాల విభాగాధిపతి మైక్ ర్యాన్ వ్యాఖ్యానించారు. ఇది కొంత ఆలోచించాల్సిన అంశం. వ్యాక్సిన్లు ఆగస్టు 15కల్లా సిద్ధమని భారత్, అక్టోబర్ –డిసెంబర్‌లోపు, అని కొన్ని దేశాలు ప్రకటిస్తున్న నేపథ్యంలో, డబ్ల్యూ. హెచ్. ఓ ప్రతినిధులు చేస్తున్న వ్యాఖ్యలు శల్యసారథ్యాన్ని తలపిస్తున్నాయి. కరోనా వ్యాక్సిన్ ఎప్పుడు వస్తుందో, ఇప్పుడే అంచనా వెయ్యడం తెలివితక్కువ పని అవుతుందని, మైక్ ర్యాన్ చేస్తున్న వ్యాఖ్యలు దీనికి అద్దంపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 18 రకాల వ్యాక్సిన్లు మానవ ప్రయోగాల దశకు చేరుకున్నాయి. భారతదేశంలో ఆగస్టు 15వ తేదీ నాటికి కొవాగ్జిన్ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తేవడానికి, భారత వైద్య పరిశోధన మండలి చర్యలను వేగవంతం చేస్తోంది. గత శతాబ్దంలో వచ్చిన అనేక రకాల వైరస్‌లపై, కనిపెట్టిన వ్యాక్సిన్లు సత్ఫలితాలనే ఇచ్చాయి. చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపించే హిమోఫిలియస్ ఇన్ఫ్లూయెంజా



బ్యాక్టీరియాపై 1977, 1990లో రెండు దశల్లో వ్యాక్సిన్లు తయారుచేశారు. ఈ వ్యాధిసోకినవారు 5శాతం మంది చనిపోతే, మిగిలినవారికి మెదడు దెబ్బతిని, వినికిడి శక్తిని కోల్పోయేవారు. కాలేయంపై దాడి చేసి, క్యాన్సర్ కూడా దారితీసే హెపటైటిస్ బి వైరస్‌కు 1981లో యు.ఎస్ వ్యాక్సిన్‌ను వినియోగంలోకి తెచ్చింది. గవదబిళ్ళలుకు 1948, 1960లో రెండు దశల్లో వ్యాక్సిన్‌ను తెచ్చారు. ధనుర్వాతానికి 1890, 1924లో టెటానస్ వ్యాక్సిన్ కనుక్కొన్నారు. పొంగువ్యాధికి 1969లో వ్యాక్సిన్ కనిపెట్టారు. ఆటలమ్మ (చికెన్ పాక్స్)కు 1984లో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. పోలియోకు 1950లో వ్యాక్సిన్ కనిపెట్టారు. కొన్నేళ్ల తర్వాత ఓరల్ వ్యాక్సిన్‌ను తయారుచేశారు. కోరింతదగ్గుకు 1926లో వ్యాక్సిన్‌ను రూపొందించారు. ఫ్లూ వ్యాధికి 1930లో వ్యాక్సిన్ కనిపెట్టినా, 1945నాటికి అమెరికాకు, తర్వాత మిగిలిన దేశాలకు వాడకంలోకి వచ్చింది. ఒకరి నుండి మరొకరికి వేగంగా వ్యాప్తిచెందే తట్టు అనే వ్యాధికి 1963లో వ్యాక్సిన్ వచ్చింది. ఇలా, ప్రపంచ వ్యాప్తంగా, అనేక రకాల వైరస్‌లు ప్రజలకు వ్యాధులను అంటించాయి. వీటిని మట్టుపెట్టడానికి వివిధ దశల్లో అనేక రకాల వ్యాక్సిన్లను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అవి చాలావరకూ మంచి ఫలితాలను ఇచ్చాయి. ఇప్పటికీ ప్రపంచ ప్రయోగశాలలలో అధ్యయనాలు, ఆవిష్కరణలు జరుగుతూనే ఉన్నాయి. మానవ పరిణామ క్రమంలో, జీవ వైవిధ్యంలో, జీవుల పరిణామవికాసాల్లో ఎన్నో వైరస్‌లు వస్తుంటాయి. పోతుంటాయి. కొన్ని మామూలుగా ఉంటాయి. మరికొన్ని ప్రమాదకారులుగా ఉంటాయి. ఇంకొన్ని మరింత ప్రమాదకారులుగా ఉంటాయి. ఈ వైరస్‌ల సృష్టి తుదిలేని జీవనహేల. ఈ శతాబ్దంలో ఆరోగ్యశాస్త్రం ఊహాతీతమైన అభివృద్ధి గడించింది. మనిషి సగటుజీవితకాలం బాగా పెరిగింది. జీవరసాయనశాస్త్రం బాగా అభివృద్ధి చెందింది. ఆధునిక మానవాళిలో కొన్ని అనారోగ్యమైన అలవాట్లు, ఆలోచనలు వచ్చి చేరాయి. పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసుకుంటూ ఉన్నాం. ఆ దుష్ఫలితాల ప్రభావమే ఈ కరోనా వంటి వైరస్‌ల పరిణామం. అదే సమయంలో, ఆధునిక మానవుడిలో ఇప్పుడిప్పుడే ఆరోగ్యస్పృహ పెరుగుతోంది. ఇది శుభ పరిణామం. కరోనా కొన్ని గుణపాఠాలు నేర్పు తోంది. కొత్త అనుభవాలను అందిస్తోంది. జీవన దృక్పథం మారడానికి కరోనా తప్పకుండా ఒక పారామీటర్ అవుతుంది. ఈ యుగపు మానవుని నడక కరోనా ముందు – కరోనా తర్వాత, అని లిఖించవలసి వస్తుంది. ఏది ఏమైనా, కరోనా నుండి మనల్ని రక్షించడానికి కొన్ని మందులు వచ్చాయి. ఇంకా కొన్ని వస్తున్నాయి. త్వరలో వ్యాక్సిన్లు కూడా రాబోతున్నాయి. ఇది ముందడుగు అని భావించాలి. ఈ ఔషధాలను కనిపెడుతున్న శాస్త్రవేత్తలకు, విశేషంగా కృషి చేస్తున్న తత్ సంబంధీకులకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుదాం.

జానపద జాదూ... కదిరి వెంకటరెడ్డి


కె.వి.రెడ్డిగారిజయంతి

- వాసుశ్రీ

తెలుగు చలనచిత్రరంగానికి ఒక ఊపును, మెరుపును దిద్దిన మహనీయుడు కదిరి వెంకటరెడ్డి. ఆయన చిత్రరంగంలో కె.వి.గా చిరపరిచితుడు. 'భక్తపోతన', 'పాతాళభైరవి', 'పెద్దమనుషులు', 'మాయా బజార్', 'దొంగరాముడు', 'జగదేకవీరుని కథ', 'శ్రీకృష్ణార్జున యుద్ధం' వంటి సినిమాలను ఒక్క పాతతరమే కాదు నేటి ఆధునిక తెలుగు ప్రేక్షకుడు కూడా మరచిపోలేరు. ఆ రోజుల్లోనే ఆధునిక వివాహ వ్యవస్థ మీద 'పెళ్లినాటి ప్రమాణాలు' చిత్రం నిర్మించి ప్రశంసలు అందుకున్న మహనీయుడాయన. ఆయన సినిమాలు రంగుల కాలంలో రాలేదు... కానీ ఆ బ్లాక్ అండ్ వైట్ సినిమాలు చూస్తుంటే వానవెల్లి రంగులన్నీ అంతర్లీనంగా కనపడుతూనే వుంటాయి. ఆయన సినిమాలు సినిమా కళకే పాఠ్య పుస్తకాలుగా పరిగణించవచ్చు. ఖద్దరు పంచె కట్టు, ఫ్రెంచి మీసకట్టు, పొట్టిచేతుల చొక్కా, మెడచుట్టూ తెల్ల తువాలుతో అచ్చం పల్లెటూరి రైతులా కనపడే కె.వి.రెడ్డి బి.ఎస్.సి (ఆనర్స్) పట్టభద్రులంటే వెంటనే నమ్మలేం. డిసెంబరు శీతాకాలంలో "జలకాలాటలలో" పాటను 'జగదేకవీరుని కథ' కోసం చిత్రీకరించవలసి వచ్చినప్పుడు ప్రొడక్షన్ మేనేజర్‌కు 'ఫుట్ నోట్'లో "కొలనులో వేడి నీళ్లను సిద్ధం చేయాలి" అని రాసిపెట్టి రెండ్రోజుల్లో చిత్రీకరించాల్సిన పాటను ఒక పూటలోనే పూర్తిచేసి ఆ నాయికలకు ఉల్లాసం కలిగించిన దర్శకుడు మరొకరు వుండరు. కె.వి.రెడ్డి (జూలై 1, 1912) 108వ జయంతి. సందర్భంగా ఆ మహనీయుని గుర్తించి కొన్ని విశేషాలు...

బాల టామ్ సాయర్‌గా...

కె.వి.రెడ్డి అనే కదిరి వెంకటరెడ్డి సొంతవూరు అనంతపురం జిల్లా, తాడిపత్రికి దగ్గరలోవున్న తేళ్ళమిట్టపల్లి గ్రామం. కె.వి. రెడ్డి తండ్రి కొండారెడ్డి ఆ వూరి మునసబు... నూట యాభై ఎకరాల భూస్వామి. మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఆ గ్రామంలో చదవను, రాయను నేర్చింది కొండారెడ్డి ఒక్కరే. కె.వి.రెడ్డి ఆయనకు ఏకైక సంతానం. కె.వి.రెడ్డి తల్లిది తాడిపత్రి. వారిది కూడా సంపన్న కుటుంబమే. అందరూ విద్యావంతులే. కె.వి.రెడ్డి పితామహుడు తాహశీల్దారు వుద్యోగం చేశారు. కె.వి.రెడ్డి పుట్టింది తాడిపత్రిలో పితామహుల ఇంటనే. ఆయనకు రెండేళ్ల వయసున్నప్పుడే తండ్రి కొండారెడ్డి కాలం చేశారు. దాంతో కె.వి.రెడ్డి, తల్లితో సహా తాడిపత్రిలోని పితామహుల ఇంటికి వచ్చేశారు. ఆయన చదువు సంధ్యలు మేనమామ పర్యవేక్షణలో తాడిపత్రిలోనే జరిగాయి. భర్త మరణించడంతో తట్టుకోలేని కె.వి.రెడ్డి తల్లి వైరాగ్యం చెంది కుమారుని పెంపకం గురించి పట్టించుకోలేదు. కె.వి.రెడ్డి బాల్యం ఆహ్లాదకరంగా సాగింది. మార్క్ ట్వేన్ పాత్ర టామ్ సాయర్‌లాగే ఈతకొట్టటం, చేపలు పట్టటం, కొండలెక్కటం, పొలాలమీదకు వెళ్లి అజమాయిషీ చెయ్యటం వంటి పనులు ఎంతో ఆసక్తికరంగా



చేసేవారు. శ్మశానానికి వెళ్లి ఎముకలు ఏరుకొనివచ్చి వాటిని పరిశోధించేవారు. స్కూలు ఫైనల్ వరకు కె.వి.రెడ్డి తాడిపత్రిలోనే చదివారు. నాలుగవ తరగతి మొదలు స్కూలు ఫైనల్ వరకు కె.వి.రెడ్డికి ఒక జిగరీ దోస్త్ ఉండేవాడు. ఇద్దరూ ఒకే బెంచిలో కూర్చొనేవారు. అతని పేరు మూలా నారాయణ స్వామి. ఇద్దరికీ చాలా పెద్ద పెద్ద పనులు చేయాలనే ఊహలు ఉండేవి. చిన్నతనంనుంచే అందుకోసం ప్రణాళికలు వేసుకుంటూ వుండేవారు. వారు చదువుకునే రోజుల్లో ఆ వూరికి బయోస్కోప్ వచ్చింది. మిత్రులిద్దరూ సినిమాలు చూసేవారు. ఆ సినిమాల తీరు వారికి వింతగా తోచేది. ఎప్పటికైనా సినిమాలు నిర్మించాలని ధృడంగా ఆశించారు. పదిహేనేళ్ల వయసులోనే సినిమా నిర్మాణం కోసం లొకేషన్ కూడా నిర్ణయించేశారు. వారి వూరికి ఐదు మైళ్ల దూరంలో ఒక చిన్న కొండ, దాని ప్రక్కనే ఒకలోయ, ఆలోయ మధ్యలో చిన్న నీటి ప్రవాహం ఉండేది. తమ స్నేహితులతో వీరిద్దరూ తరచూ అక్కడకు వెళ్లి వారి ఊహలకు రూపమిస్తూ, వాటిని స్నేహితులతో చర్చిస్తూ ఆనందిస్తూ వుండేవారు. ఎప్పటికైనా ఆ లొకేషన్‌లో సినిమా నిర్మించాలనేది వారి అభిలాష. కె.వి.రెడ్డికి ప్రతి సబ్జెక్ట్‌లోనూ మొదటి మార్కులు వచ్చేవి. ఆ రోజుల్లోనే వీరిద్దరూ ఫుట్‌బాల్, హాకీ వంటి క్రీడల్లోనూ, పరుగు పందెం, జిమ్నాస్టిక్స్‌లోను ముందుండేవారు. 1930లో కె.వి.రెడ్డి స్కూలు ఫైనల్ పరీక్షలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం (ప్రెసిడెన్సీ) మొత్తం మీద రెండవ స్థానంలో నిలిచారు. అయితే స్నేహితుడు నారాయణ స్వామి మాత్రం స్కూలు ఫైనల్ తప్పారు.

మద్రాసుకు మకాం..

అనంతపురంలో కాలేజి ఉన్నా తను మాత్రం మద్రాసు ప్రెసిడెన్సీ

కళాశాలలో చదవాలని కోరడంతో వారి కుటుంబ సభ్యులు కె.వి.రెడ్డిని మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో చేర్చారు. అప్పట్లో విక్టోరియా హాస్టల్‌లో కె.వి.రెడ్డి వుండేవారు. మద్రాసులో అడుగు పెట్టాక తరచూ సినిమాలు... ముఖ్యంగా ఇంగ్లీషు సినిమాలు చూడడం అలవాటయింది. అయితే ఆ సినిమాలను కేవలం వినోదం కోసం మాత్రమే చూసేవారు కాదు. భాషా జ్ఞానం పెంచుకోవడం కోసం, ఆ సినిమాల్లో మంచి విషయాలను గుర్తుపెట్టుకొని విశ్లేషించుకోవడం కోసం చూసేవారు. సినిమా వాల్ పోస్టర్లను కూడా నిశితంగా పరీక్షించి వాటి ప్రయోజనాన్ని ఆకళింపు చేసుకోనేవారు. అందువలన సినిమాల్లోకి రాకపూర్వమే కె.వి.రెడ్డికి చిత్రనిర్మాణం గుర్తించి, ప్రచార సాధనాల గురించి మంచి అవగాహన వుండేది. కె.వి.రెడ్డి 1935లో బి.ఎస్సీ (ఆనర్స్ ...అంటే ఎం.ఎస్సీకి సమానం) పూర్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి పదవి చేబట్టిన పట్టాభి రామారావు, 'ఆంధ్ర మహిళా' సంపాదకులు ఎ.వి.వి.కృష్ణారావు, ఎం.కె.వి.రెడ్డి వీరికి సహాధ్యాయులు. ప్రముఖ దర్శక నిర్మాత పి.పుల్లయ్య కాలేజిలో కె.వి.రెడ్డికి ఒక సంవత్సరం సీనియర్. కె.వి.రెడ్డి ఆనర్స్ డిగ్రీ పూర్తీ చేసేనాటికే పి.పుల్లయ్య సినిమా రంగంలో ప్రవేశించి స్టార్ కంబైన్స్ వారు నిర్మించిన 'హరిశ్చంద్ర' చిత్రానికి దర్శకుడు టి.ఎ.రామన్‌కు సహాయ దర్శకుడిగా పనిచేశారు. కె.వి.రెడ్డి రాత్రిపూట పుల్లయ్యతో కలిసి స్టార్ కంబైన్స్ లాడ్జిలో కూర్చొని సినిమాలకు పనికి వచ్చే కథల గురించి చర్చించుకునేవారు. వారు చర్చించుకున్న కథలన్నీ కాలక్రమంలో సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి! ఆనర్స్ డిగ్రీ ప్రథమ శ్రేణిలో పాసైనా కె.వి.రెడ్డికి ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగం చేయడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఆఖరకు టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు పెడితే బోధనానుభవం లేదని నిరాకరించారు. దాంతో కె.వి.రెడ్డి తన సహాధ్యాయి ఎ.వి.వి.రెడ్డితో కలిసి 'ది స్టాండర్డ్ సైంటిఫిక్ ఇన్స్ట్రుమెంట్స్ కంపెనీ'ని ప్రారంభించారు. స్కూళ్లకు, కాలేజీలకు కావలసిన శాస్త్రోపకరణాలను ప్రామాణికంగా తయారుచేసి సరఫరా చేసేవారు. ఈ వ్యాపారం లాభసాటిగా మారింది.

రోహిణీ ఫిలిమ్స్‌నుంచి వాహిని సంస్థకు...

1937లో మూలా నారాయణ స్వామి కె.వి.రెడ్డికి తాడిపత్రినుంచి కబురంపారు. తను రోహిణీ ఫిలిమ్స్ అనే సినిమా కంపెనీలో భాగస్తుడుగా చేరినట్లు, కె.వి.రెడ్డికి సినిమాల మీద ఆసక్తి వుంటే తనుకూడా అందులో చేరవచ్చని ఆ కబురు సారాంశం. కె.వి.రెడ్డి మిత్రుడు ఎ.వి.వి.రెడ్డితో ఈ విషయం మీద చర్చిస్తే 'ఆరునెలలు వెళ్లి చూసి లాభాదాయకమనిపిస్తే సినిమా రంగంలో స్థిరపడు. లేకుంటే మన కంపెనీ ఉండనే వుంది కదా' అని మంచి సలహా ఇచ్చాడు. ఆ సలహామీద కె.వి.రెడ్డి రోహిణీ ఫిలిమ్స్ సంస్థలో చేరారు. ఈ రోహిణీ సంస్థను హెచ్.ఎం.రెడ్డి స్థాపించగా అందులో నారాయణస్వామి తోబాటు బి.ఎన్.రెడ్డి, ఛాయాగ్రాహకుడు రామనాథ్, కళాదర్శకుడు శేఖర్, బ్రిజ్ మోహన్ దాస్, నాగిరెడ్డి, సముద్రాల రాఘవాచార్య భాగస్వాములు. ఈ బ్యానర్ మీద నాగయ్య హీరోగా 'గృహలక్ష్మి' సినిమా నిర్మించారు. అందులో కె.వి.రెడ్డి తొలుత క్యాషియర్. సైన్స్ విద్యార్థి కనుక సౌండ్ రికార్డింగ్ నేర్చుకోవాలనిపించినా, షూటింగులన్నిటికీ హాజరవుతూ నిర్మాణ కార్యకలాపాలని, ఎడిటింగ్, రీ-రికార్డింగ్‌తో సహా అన్ని 'క్రాఫ్ట్'లలోని విభాగాలను క్షుణ్ణంగా గమనిస్తూ అధ్యయనం చేయసాగారు. ఆ సినిమా విడుదలవుతుండగానే మూలా నారాయణ స్వామి రోహిణీ సంస్థనుండి విడిపోయి బి.ఎన్.రెడ్డి, నాగిరెడ్డి, సముద్రాల, బ్రిజ్ మోహన్ దాసు, కె.వి.రెడ్డి, నాగయ్యలను కలుపుకొని వాహినీ సంస్థను స్థాపించారు. వాహినీ సంస్థ కె.వి.రెడ్డి పెరుగుదలకు ఆదర్శవంతమైన వాతావరణాన్ని కల్పించింది. సంస్థలో అందరూ విద్యావంతులే కావడం, బి.ఎన్. రెడ్డి అందరికన్నా పెద్దవాడు కావడంతో ఆయన నేతృత్వంలో పనిచేయడంతో వాహినీ సంస్థకు మంచి బీజం పడింది. వాహిని పిక్చర్స్ బ్యానర్ మీద బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో రూపొందిన తొలిచిత్రం 'వందేమాతరం'. ఇందులో కె.వి.రెడ్డి నాగయ్య సహాధ్యాయిగా నటించారు. తరువాత బి.ఎన్.రెడ్డి దర్శకత్వంలో నిర్మించిన 'సుమంగళి', 'దేవత' చిత్రాలకు కె.వి.రెడ్డి ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశారు. అయినా ప్రొడక్షన్‌కు సంబంధించిన ప్రతి విషయంలోనూ కె.వి.రెడ్డి ఇమిడిపోయేవారు.. అంతే కాదు ఆ సినిమాల్లో చిన్న పాత్రల్లో కనిపించారు కూడా.

దర్శకుడుగా 'భక్తపోతన'...

1941లో 'దేవత' చిత్ర నిర్మాణం పూర్తి, విడుదలయ్యాక మూలా నారాయణస్వామి ప్రోత్సాహంతో కె.వి. రెడ్డికి దర్శకత్వం నిర్వహించే అవకాశం దొరికింది. అందుకు తను ఎన్నుకున్న కథ 'భక్తపోతన'. దర్శకత్వంలో ఏమాత్రం అనుభవం లేని కె.వి.రెడ్డిని దర్శకుడిగా నియమించడం పట్ల కొంత అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నారాయణస్వామి కల్పించుకొని 'ఈ సినిమా ద్వారా లాభం వస్తే కంపెనీది. నష్టం వస్తే నాది' అని గట్టిగా చెప్పి కె.వి.రెడ్డికి భరోసా కల్పించారు. 'దేవత' చిత్ర నిర్మాణం జరుగుతున్నప్పుడే కె.వి.రెడ్డి రాత్రిపూట సముద్రాలతో కూర్చొని పోతన గురించి చర్చలు జరిపేవారు. అలా 'భక్త పోతన' స్క్రిప్టు పనులు పూర్తిచేసిపెట్టుకున్నారు. అనుభవజ్ఞుడైన రామనాథ్ చేత స్క్రీన్ ప్లే రాయించారు. కొందరు భాగస్వాములు పోతన పాత్రకు దైతా గోపాలం పేరును ప్రతిపాదించినా కె.వి.రెడ్డి మాత్రం నాగయ్యనే తీసుకున్నారు. ఈ సినిమా నిర్మాణ సమయంలోనే రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతోంది. జపాన్ వాళ్లు కోస్తా పట్టణాల మీద బాంబులు కురిపించారు. మద్రాసు మీద కూడా యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. దాంతో యూనిట్ మొత్తం మద్రాసు ఖాళీ చేసి వెళ్లాల్సి వచ్చింది. 'భక్తపోతన' సినిమా అప్పటికి మూడువంతులు పూర్తయింది. సినిమా నెగటివ్‌ను భద్రపరచడానికి తాడిపత్రికి పంపించారు. అసలు ఈ సినిమా పూర్తవుతుందని ఎవరికీ నమ్మకం లేదు. పరిస్థితులు కుదుటపడ్డాక మద్రాసు తిరిగివచ్చి మిగిలిన సన్నివేశాల చిత్రీకరణ, ప్యాచ్ వర్కులు, ట్రిక్ షాట్లు పూర్తిచేసి సినిమా విడుదలకు సిద్ధం చేశారు. సినిమా 1943 జనవరి 7న విడుదలై దంకాబజాయించింది. కోయంబత్తూరులో స్వర్ణోత్సవం జరుపుకుంది. పిఠాపురం రాజావారు ఈ చిత్రాన్ని చూసి ముగ్ధులై లక్షరూపాయల చెక్‌ను కె.వి.రెడ్డికి అందజేశారు. ఈ సినిమా ప్రభావం ఎలాంటిదంటే, ఒక కోర్టులో కేసు విచారణ జరుగుతుండగా

హటాత్తుగా జడ్జిగారు లేచి 'ఈ కేసు రేపటికి వాయిదా వేస్తున్నాను. ఎందుకంటే నేను 'భక్తపోతన' చిత్రాన్ని చూడడానికి వెళ్ళాలి' అన్నారట. ఈ సినిమా చూసిన వాళ్ళెవరూ ఇది కె.వి.రెడ్డి తొలిచిత్రమంటే నమ్మరు. అపారమైన కె.వి.రెడ్డి దర్శకత్వ ప్రతిభ ప్రతి ఫ్రేములోనూ కనబడుతుంది. ఈ సినిమా రాబడిలో పది శాతం వాటాగా మూలా నారాయణస్వామి కె.వి.రెడ్డికి ఇచ్చారు.

తదుపరి చిత్రం 'యోగి వేమన' ...

'భక్తపోతన' విజయం మరో చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశాన్ని కల్పించింది. ఆ చిత్రం 'యోగి వేమన' (1947). కె.వి. రెడ్డికి వేమనయోగి అంటే ఎంతో అభిమానం. ఈ చిత్రానికి చేసినంత కృషి కె.వి.రెడ్డి మరే చిత్రానికీ చేయలేదంటే నమ్మితీరాల్సిందే. అదే కె.వి.రెడ్డి మాటల్లో చెప్పాలంటే 'ఈ కృషిలో నాకు సముద్రాల వలన కలిగిన సహాయం అంతులేనిది. నాలోపాలన్నిటినీ ఆయన కమ్మేశారు'. వేమన తత్త్వం గురించి, వేదాంతం గురించి సముద్రాలకు బాగా తెలుసు. అదీ కాకుండా సముద్రాల ఈ చిత్ర కథ కోసం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి నిష్ణాతుల అభిప్రాయాలు సేకరించి వాటిని కథలో పొందుపరచారు. 'కామికానివాడు కవి కాడు. కామిగాక మోక్షగామి కాడు. కామి అయినవాడు కవియగు, రవియగు' అనే సూత్రాన్ని 'యోగి వేమన' చిత్రంలో చక్కగా పొందుపరచారు కె.వి.రెడ్డి. అనుభవాల బలం తప్ప సెంటిమెంట్ల బలహీనతలేని నాస్తికుడుగా వేమన పాత్రను రూపుదిద్దారు కె.వి.రెడ్డి. పసిపాప 'జ్యోతి' చనిపోతే, కాంత, కనకాల మధ్య కొట్టుమిట్టాట మానేసి విరాగిగా మారిన అంశాన్ని అద్భుతంగా చిత్రీకరించి సినిమాను సూపర్ హిట్ చేశారు. వేమనకు అతి గుప్తమైన ఆత్మవిద్యను భగవానుడు బోధించే సన్నివేశాన్ని, ఆ బోధన ఆధారంగా వేమారెడ్డి, యోగి వేమనగా పరిణామం చెంది చివరికి గుహలోనికి వెళ్ళిపోయే దృశ్యాన్ని కె.వి.రెడ్డి చిత్రీకరించిన విధానం నభూతో న భవిష్యతి అని చెప్పాలి. ఈ సన్నివేశ చిత్రీకరణలో యూనిట్ సభ్యులంతా కన్నీరుపెట్టుకున్నారు. దర్శకుడు 'కట్' చెప్పడం మర్చిపోయి నిశ్చేష్టులై నిలిచిపోయారని ఆ రోజుల్లో చెప్పుకునేవారు. దర్శక నిర్మాత వి.శాంతారాం ఈ చిత్రాన్ని చూసి కె.వి.రెడ్డి పనితీరును ఎంతగానో మెచ్చుకున్నారు. 'యోగి వేమన' చిత్రం న్యూటోన్ స్టూడియోలో నిర్మించారు. మేలురకం సినిమాలు తయారవ్వాలంటే అన్ని సౌకర్యాలతో కూడిన స్వంత స్టూడియో వుండాలనిపించి మూలా నారాయణ స్వామి వాహిని స్టూడియో నిర్మాణానికి నడుం బిగించారు. స్టూడియో నిర్మాణానికి అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకు వచ్చారు. అప్పటికీ ఇండియాలో ఎక్కడాలేని 'వెస్టెక్స్ సౌండ్' ఎక్విప్మెంట్ ఈ స్టూడియోలో అమర్చారు.

వాహిని స్టూడియోలో 'గుణసుందరి కథ'...

ఆ రోజుల్లో 'బాలనాగమ్మ', 'గొల్లభామ' వంటి జానపద చిత్రాలను ప్రేక్షకులు బాగా ఆదరించడంతో కె.వి.రెడ్డికి అటువంటి జానపద చిత్రాన్ని నిర్మించాలనే సంకల్పం కలిగింది. అప్పటికి వాహినీ సంస్థ ఆరు సినిమాలు నిర్మించింది. ఆ సంస్థకు బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి ఒకరి తరువాత ఒకరు సినిమాలు చేయాలనేది ప్రత్యేక ఒడంబడిక. అయితే స్టూడియో నిర్మాణ పనుల్లో బి.ఎన్.రెడ్డి తలమునకలై ఉండడంతో కె.వి.రెడ్డికి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. ఆ చిత్రమే బాక్సాఫీస్ హిట్ అయిన 'గుణసుందరి కథ'. వాహినీ సంస్థకు ఆస్థాన రచయిత వున్న సముద్రాల ఇతర చిత్రాల రచనలో బిజీగా ఉండడంతో కె.వి.రెడ్డి కమలాకర కామేశ్వరరావు సూచనతో పింగళి నాగేంద్రరావును రచయితగా తీసుకున్నారు. 'కింగ్ లియర్' నాటకం ఆధారంగా 'గుణసుందరి కథ'కు రూపకల్పన జరిగింది. మూడు నెలల్లో స్క్రిప్టుతో సహా పాటలు కూడా తయారయ్యాయి. కె.వి.రెడ్డి, కమలాకర కలిసి స్క్రీన్ ప్లే సిద్ధం చేశారు. కె.వి.రెడ్డి నిర్మాణ శైలే వేరు. స్క్రిప్టు సిద్ధం కాగానే 'షాట్ డివిజన్' చేసేవారు. అసిస్టెంట్ డైరెక్టర్లతో సీన్లు చదివించుకుంటూ స్టాప్ వాచీ పెట్టుకొని ఫుటేజ్ నోట్ తయారు చేసుకునేవారు. ఒక్కో సన్నివేశానికి ఎంత టైం పట్టేదో స్పష్టంగా నోట్ అయ్యేది. నటీనటుల వాచాకాన్ని బట్టి రెండు నిమిషాలు అటోయిటో జరిగేది. దాంతో ముడి ఫిలిం ఎంత అవసరమో తేలిపోయేది. కె.వి.రెడ్డి తీసిన సినిమాలు అన్నీ తన అంచనాకు మించి ముడిఫిలిం ఖర్చయిన దాఖలాలు లేవు. అందుకే కె.వి.రెడ్డిని 'మిస్టర్ పర్ఫెక్షనిస్ట్' అని ప్రశంసించేవారు. సినిమా షూటింగ్ వాహినీ స్టూడియో రెండు ఫ్లోర్లలో 1948 ఆగస్టు 13న ప్రారంభమైతే 1949 డిసెంబరు 29న సినిమాను విడుదల చేశారు. వినోదంతోబాటు సెంటిమెంటు కలగలిపిన ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చింది. క్లాసు, మాసు తేడా లేకుండా జనం విరగబడి చూశారు. జనం కోరికమీద రోజుకి నాలుగు ఆటలు వేశారు.

జై...'పాతాళ భైరవి'....

1949 ప్రాంతంలో వాహిని స్టూడియో యాజమాన్యంతోబాటు, ఆబ్కారీ వ్యాపారం మరికొన్ని ఇతర సంస్థలు వున్న మూలా నారాయణస్వామి మీద ఆదాయపు పన్నుశాఖ రెయిడ్ చేసి ముప్పై లక్షల అపరాధ పన్ను వసూలు చేసేందుకు ఆస్తులు జప్తుచేసింది. వాహిని స్టూడియోను కాపాడాలని నారాయణస్వామి అప్పటికప్పుడు స్టూడియోని విజయా ప్రొడక్షన్స్ పేరిట లీజుకు ఇచ్చినట్లు రాశారు. తరువాత నారాయణస్వామి ఆర్థిక పరిస్థితి క్షీణించి కాలంచేశారు. ఈ పరిస్థితుల మధ్య విజయా ప్రొడక్షన్స్ సంస్థను నాగిరెడ్డి, చక్రపాణి నిలబెట్టి 'షావుకారు' చిత్రాన్ని నిర్మించారు. చిత్రం విజయం సాధించకపోవడంతో కె.వి.రెడ్డిని ఒక జానపద చిత్రాన్ని నిర్మించవలసిందిగా కోరారు. అరేబియన్ నైట్స్ కథలను దృష్టిలో వుంచుకొని కె.వి.రెడ్డి పింగళితో 'పాతాళ భైరవి' కథను తయారు చేయించారు. కమలాకర, పింగళితో కలిసి స్క్రిప్టు, స్క్రీన్ ప్లే సిద్ధం చేశారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో నిర్మించారు. ఇందులో పాతాళభైరవిని ప్రసన్నం చేసుకోవడానికి మాంత్రికుడు చదివే మంత్రాల కోసం మంత్రపుష్పంలోని వేదమంత్రాలను తిరగరాయించి విచిత్రమైన భాషగా రంగారావు చేత పలికించారు. అలాగే పద్మనాభం చేత పలికించిన 'మోసం గురూ' అనే మాట తరువాతి కాలంలో 'గురూ' అనే మాటతో వూతపదమై కూర్చుంది. మాంత్రికుడు పలికే 'సాహసం శాయరా....రాజకుమారి

లభిస్తుందిరా', 'నరుడా ఏమి నీ కోరిక', 'ఏ డింబకా... ఏ బుల్ బుల్, ఏ డింగరీ' వంటి మాటలు అందరి నోళ్లలో నానాయి. కేవలం 13 ప్రింట్లతో విడుదలైన ఈ చిత్రం 10 కేంద్రాల్లో శతదినోత్సవం చేసుకుంది. నాలుగు కేంద్రాల్లో రజతోత్సవం జరుపుకుంది. బెంగుళూరు మినర్వాలో 30 వారాలు, గోల్డన్ గ్లోరీ థియేటర్‌లో 50 వారాలు ఆది రికార్డు సృష్టించింది. తరువాత 11 వారాలకు అరవై ప్రింట్లు వేసి ఆంధ్రదేశమంతా సినిమాను పంపిణీ చేశారు. ఈ సినిమాకు వచ్చిన లాభాలతో వాహినీలో ఇంకొక ఫ్లోరు నిర్మాణం చేశారు. సినిమా అఖండ విజయం సాధించిన విషయం విదితమే. ఈ చిత్రం భారతీయ తొలి అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శనకు నోచుకుంది. వాహినీ సంస్థ అధిపతి బి.ఎన్.రెడ్డి 'మల్లీశ్వరి' చిత్ర నిర్మాణంలో బిజీగా వుండగా తదుపరి వాహినీ వారి చిత్రాన్ని నిర్మించే బాధ్యత కె.వి.రెడ్డి మీద పడింది. 'పాతాళభైరవి' తరువాత మరలా మరో జానపదం తీయకుండా ఈసారి కె.వి.రెడ్డి సాంఘిక చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. ఆ చిత్రమే 'పెద్దమనుషులు'(1954). ఈ చిత్రానికి కూడా పింగళి రచన చేయాల్సివుండగా, నాగిరెడ్డి సహకరించకపోవడంతో డి.వి. నరసరాజును రచయితగా తీసుకున్నారు. స్క్రిప్టు తయారయ్యాక నరసరాజు, కె.వి.రెడ్డిలతోబాటు డి.జి.బి.తిలక్ (డి.వి. సుబ్బారావు కుమారుడు) కలిసి స్క్రీన్ ప్లే సమకూర్చారు. నరసరాజు సంభాషణలు సహజంగాను, పాత్రోచితంగాను ఉండడంతో ప్రేక్షకులకు చిత్రం బాగా నచ్చింది. ఇందులో ప్రధాన పాత్రధారి అయిన మునిసిపల్ ఛైర్మన్ పాత్రకు జంధ్యాల గౌరీనాథ శాస్త్రిని తీసుకున్నారు. కీలకమైన తిక్క శంకరయ్య పాత్రలో రేలంగి లీనమై నటించారు. కొంత సినిమా రేవతి స్టూడియోలో చిత్రీకరించారు. గ్రూప్ విలనిజానికి ఈ సినిమా బీజం నాటింది. 'శివశివమూర్తివి గణనాథా నీవు శివుని కుమారుడవు గణనాథా', 'నందామయా గురుడ నందామయా' పాటలు తెలియనివారెవరూ వుండరు. ఈ పాటలతో కొసరాజు రాఘవయ్య చౌదరి మంచి పేరుతెచ్చుకున్నారు. సమాజంలోని సమస్యల నేపథ్యంలో, వ్యంగ్య ధోరణిలో కె.వి.రెడ్డి రూపొందించిన 'పెద్దమనుషులు' సాంఘిక చిత్రాల విభాగంలో అజరామరంగా నిలిచిపోయింది. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో ద్వితీయ ఉత్తమ చిత్ర బహుమతి లభించింది. కేంద్ర ప్రభుత్వ బహుమతి పొందిన తొలి తెలుగుచిత్రమిదే. కె.వి.రెడ్డికి ఇబ్సెన్ రాసిన నాటకాలంటే ఇష్టమే కాదు, ఇబ్సెన్ కె.వి.రెడ్డికి ఆరాధ్య దైవం. ఇబ్సెన్ నాటక పోకడలు 'పెద్దమనుషులు' చిత్రంలో అక్కడక్కడా కనిపిస్తాయి.

అన్నపూర్ణలో కె.వి.రాముడు...

తెలుగు సినిమాకు స్వర్ణయుగం తీసుకువచ్చిన సంస్థల్లో అన్నపూర్ణా సంస్థ పేరెన్నికగలది. అక్కినేని నాగేశ్వరరావు, దుక్కిపాటి మధుసూదనరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొరటాల ప్రకాశరావు, టి.ఎ.వి.సూర్యారావు భాగస్వాములుగా ఏర్పడి దుక్కిపాటి సవతి తల్లి పేరిట 'అన్నపూర్ణా పిక్చర్స్' సంస్థను ఏర్పాటు చేశారు. తొలి చిత్రానికి భరణీ రామకృష్ణరావును దర్శకుడిగా నియమిస్తే వ్యక్తిగత ఇబ్బందులవలన ఆయన తప్పుకున్నారు. తరువాత బి.ఎన్.రెడ్డిని సంప్రదిస్తే లక్షరూపాయల పారితోషికం అడిగారు. పుల్లయ్య 'అర్ధాంగి' సినిమాతో బిజీగా వుండడం వలన చేతులెత్తేశారు. తలవని తలంపుగా వాహినీ సంస్థతో తలెత్తిన మనస్పర్థల వలన దర్శకుడు కె.వి.రెడ్డి బయటకు వచ్చేశారు. అప్పుడు అక్కినేని, దుక్కిపాటి ఇద్దరూ వెళ్లి కె.వి.రెడ్డిని కలిశారు. ఆ సమయంలోనే కె.వి.రెడ్డి నిర్మాత, దర్శకుడుగా వాహినీ బ్యానర్ మీద 'పెద్దమనుషులు' చిత్ర నిర్మాణంలో బిజీగా వుండడంతో ఆ సినిమా నిర్మాణం పూర్తయ్యాకే అన్నపూర్ణావారి సినిమా చేస్తానని అన్నారు. అంతటి గొప్ప దర్శకునితో సినిమాతీస్తే అన్నపూర్ణా బ్యానర్‌కు మంచి గుర్తింపు వస్తుందని భావించి కొంతకాలం ఆగేందుకు వారు సమ్మతించారు. ఆ నిరీక్షణ చివరికి 'పెద్దమనుషులు' (1954) విడుదలయ్యేదాకా, రెండు సంవత్సరాల పాటు కొనసాగింది. అయితే ఆ శ్రమ వృథా పోలేదు. అన్నపూర్ణా పతాకం నలభై యేళ్లదాకా అప్రతిహతంగా కొనసాగింది. 'పెద్దమనుషులు' సినిమాకు తొలి రచన చేసిన డి.వి.నరసరాజు కె.వి.రెడ్డి సలహాపై 'దొంగరాముడు' సినిమాకు మలిరచన చేశారు. షూటింగు ప్రారంభించే ముందు నరసరాజు స్క్రిప్టు చదువుతూవుంటే కె.వి.రెడ్డి టైం నోట్ చేయించి, ప్రతి షాట్‌కు ముడిఫిలిం ఎంత ఖర్చువుతుందో లెక్క వేసి, మొత్తం ఫిలిం నిడివి 17 వేలుగా తేల్చారు. సినిమా పూర్తయ్యేసరికి నిడివి మొత్తం 17,250 అడుగులు వచ్చింది. 70 కాల్షీట్లలో సినిమా పూర్తయింది. కాల్షీట్ అనుకున్న సమయానికన్నా పావుగంట ముందుగానే పూర్తయ్యేది. అంత ఖచ్చితమైన ప్రణాళికతో కె.వి.రెడ్డి ఈ సినిమా తీశారు. అందుకే పుణే ఫిలిం కళాశాలలో 'దొంగరాముడు' సినిమా ఇప్పటికీ ఫిలిం మేకింగ్ సిలబస్‌గా కొనసాగుతోంది. 'సినిమాలో నవరసాలు వున్నాయి. మంచి హిట్ అవుతుంది. నా అంచనా తప్పితే నేను చిత్రరంగంనుండి విరమిస్తాను' అని కె.వి.రెడ్డి అన్నపూర్ణా భాగస్వాములకు భరోసా ఇవ్వడం ఆయన ప్రతిభకు నిదర్శనం. భానుమతిని హీరోయిన్‌గా తీసుకుంటే బాగుంటుందని దుక్కిపాటి భావించినా కె.వి.రెడ్డి సావిత్రి వైపే మొగ్గుచూపారు. 'దొంగరాముడు' సినిమాకు కె.వి.రెడ్డి తీసుకున్న పారితోషికం యాభై వేలు. 1955 అక్టోబరు 2గాంధి జయంతినాడు సినిమా విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. నాటకీయత లేకుండా సహజసిద్ధమైన సన్నివేశాలు ఈ తరం ప్రేక్షకులను కూడా అలరిస్తూనే వున్నాయి.

హై... హై... కె.వి. రెడ్డి...

'పాతాళభైరవి' తరువాత కె.వి.రెడ్డి విజయా వారి తదుపరి చిత్రానికి సినిమా చేయాల్సివున్నా, అన్నపూర్ణావారి 'దొంగరాముడు' సినిమాకు పనిచేయాల్సి రావడంతో వీలుపడ లేదు. 1955లో 'దొంగరాముడు' సినిమా విడుదలయ్యాక కె.వి.రెడ్డి 'మాయాబజార్' (1957) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సంవత్సరం పాటు శ్రమించి స్క్రిప్టు పని పూర్తిచేశారు. ఈ సినిమా మీద నమ్మకం లేక పోవడం, అంతకుముందు భారీ ఎత్తున కమలాకర దర్శకత్వంలో నిర్మించిన 'చంద్రహారం' సినిమా పరాజయం పాలవడంతో నిర్మాతలు నాగిరెడ్డి–చక్రపాణి చిత్ర నిర్మాణాన్ని వాయిదావేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎ.వి.ఎం అధిపతి మెయ్యప్పచెట్టి మాయాబజార్ సినిమా తీసేందుకు ముందుకు వచ్చి కె.వి.రెడ్డి ఎంత పారితోషికం అడిగితే అంత ఇస్తానని కబురంపారు. అంతేకాదు సుందర్లాల్

సహాయంతోబాటు మరో ఇద్దరు తమిళ నిర్మాతలు కూడా కె.వి.రెడ్డికి ఇదే ప్రతిపాదనను చేరవేశారు. కె.వి.రెడ్డి మాత్రం విజయా వారికి తప్ప వేరేవారికి తీయనని చెప్పడంతో, నాగిరెడ్డి–చక్రపాణి పునరాలోచనలో పడ్డారు. సినిమా బడ్జెట్‌ను కె.వి.కి అప్పగించి నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. తెలుగుతోబాటు తమిళంలో కూడా ఈ చిత్రాన్ని ఏకకాలంలో నిర్మించాలనే నిర్ణయం జరిగింది. సినిమా స్క్రిప్టు రాసుకుంటున్నప్పుడే ఏయే పాత్రలకు ఎవరెవరిని ఎంపిక చేయాలి అనే విషయాన్ని ముందుగానే కె.వి.రెడ్డి నిర్ణయించేశారు. ఆ రోజుల్లో కృష్ణుడు అంటే కల్యాణం రఘురామయ్యే అనుకునేవారు. అయితే కృష్ణుడి పాత్రకు ఎన్.టి.రామారావును తీసుకొని, కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, కళాధర్‌లతో రకరకాల స్కెచ్‌లు గీయించి నిండుకిరీటం పెట్టించి, మేకప్ మెన్ పీతాంబరం, భక్తవత్సలం చేత ఆహార్యం మెరుగు పరచి, నడక, వాచకంలో మార్పులుచేసి 'కృష్ణుడంటే ఇలా వుండేవాడా' అనేలా తీర్చిదిద్దారు. ఇక హీరో ఘటోత్కచుడి పాత్రకు ఎస్.వి.రంగారావును తీసుకున్నారు. ఘటోత్కచుడుగా తదాత్మ్యంతో రంగారావు అసమాన అభినయాన్ని ప్రదర్శించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. పింగళి అనేక కొత్త మాటల్ని ఈ చిత్రం ద్వారా వెలుగులోకి తెచ్చారు. భారతీయ సినిమా స్వర్ణోత్సవం సందర్భంగా 2013లో సిఎన్ఎన్ ఐబిఎన్ సంస్థ నిర్వహించిన సర్వేలో వంద ఆల్ టైం గ్రేట్ భారతీయ సినిమాలలో మాయాబజార్ సినిమా ప్రథమ స్థానంలో నిలిచింది. 26 లక్షల వ్యయంతో నిర్మించిన మాయాబజార్ 27 కేంద్రాల్లో శతదినోత్సవం, నాలుగు కేంద్రాల్లో రజతోత్సవం జరుగుతుంది.

'మాయా బజార్' తరువాత 'పెళ్లినాటి ప్రమాణాలు', 'జగదేకవీరుని కథ' చిత్రాలకు కె.వి.రెడ్డి దర్శకత్వం వహించారు. సొంత బ్యానర్ 'జయంతి పిక్చర్స్' బ్యానర్ మీద 'శ్రీకృష్ణార్జున యుద్ధం' (1961) నిర్మించారు. అక్కినేని, నందమూరి నటించిన ఈ చిత్రం 'జగదేకవీరుని కథ' సినిమాతో సమానంగా విజయం సాధించింది. అయితే తరువాత కె.వి.రెడ్డి విజయా సంస్థకు దర్శకత్వం వహించిన 'సత్య హరిశ్చంద్ర', 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' విజయవంతం కాలేదు. ఎన్.టి.రామారావు సంస్థ కోసం దర్శకత్వం వహించిన 'శ్రీకృష్ణ సత్య' సుమారుగా ఆడింది. సొంత బ్యానర్ మీద నిర్మించిన 'భాగ్యచక్రం' కూడా సరిగా ఆడలేదు. కె.వి.రెడ్డి మూడు దశాబ్దాల కాలంలో దర్శకత్వం వహించిన చిత్రాలు కేవలం 14 మాత్రమే. అయినా అవి వేటికవే అజరామరాలు. కె.వి.రెడ్డి భార్య శేషమ్మ. వారిది అన్యోన్యమైన దాంపత్యం. భార్య తల దువ్వనిదే కె.వి.రెడ్డి అడుగు బయటకు పెట్టేవారు కాదు. వారికి తొమ్మండుగురు సంతానం. వారిలో ఎవరినీ సినిమా నిర్మాణపు గడప తొక్కనీయలేదు. పిల్లలు క్రమశిక్షణతో పెరిగి ప్రయోజకులయ్యారు. కె.వి.రెడ్డి అంటే తెలుగు చలచిత్ర చరిత్రలో చెరిగిపోని మచ్చలేని సుగంధ కుసుమం.

నో బాల్‌కి నో


క్రికెట్‌లో ఒక్క బాల్.. మ్యాచ్ రిజల్ట్స్ నే తలకిందులు చేస్తుంది. ఒక్క ఎక్స్ ట్రా రన్ కూడా మ్యాచ్ మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.! బౌలర్లు ఎంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినప్పటికీ అప్పుడప్పుడు వైడ్స్, నో బాల్స్ పడుతూనే ఉంటాయి. అయితే క్రికెట్ చరిత్రలో ఇప్పటి వరకు NO -- BALL వేయని 5 గురు బౌలర్స్ ఉన్నారు.

లాన్స్ గిబ్స్:

వెస్టిండిస్ స్పిన్నర్ .. 79 టెస్ట్ లు , 3 ODIs లు ఆడిన గిబ్స్ ఒక్క నో బాల్ కూడా వేయలేదు. 300 వికెట్స్ ఫాస్ట్‌గా తీసిన బౌలర్ కూడా ఇతనే.!

ఇయాన్ బోథమ్

ఇంగ్లాడ్ ఫాస్ట్ బౌలర్ ఇయాన్ బోథమ్.. 102 టెస్ట్‌లు 116 ODIs ఆడాడు. ఒక్కటంటే ఒక్క నో బాల్ కూడా



వేయలేదు.

ఇమ్రాన్ ఖాన్.

175 ODIs 88 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన ఇమ్రాన్ ఖాన్ కూడా ఒక్క నో బాల్ వేయలేదు.! ఈయన కూడా ఫాస్ట్ బౌలరే

డెన్నిస్ లిల్లీ..

ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ డెన్నిస్ లిల్లీ..



70 టెస్ట్ 63 ODI లు ఆడాడు.. సింగిల్ నో బాల్ కూడా వేయలేద

కపిల్ దేవ్.

ఇండియాకు మొదటి వరల్డ్ కప్ తెచ్చిపెట్టిన కెప్టెన్.. కపిల్ దేవ్.. 131 టెస్ట్ 225 ODIs ఆడాడు. ఈయన కూడా ఒక్క నో బాల్ కూడా వేయలేదు

- ప్రజామీడియా నెట్‌వర్క్

ఝాన్సీరాణి కుడిభుజం... ఝల్కారీభాయ్

- ఎన్.రాజేందర్



1838 బుందేల్ ఖండ్‌లోని అటవీ ప్రాంతం ..ఎనిమిదేండ్ల అమ్మాయి పశువులను మేపేం దుకు అడవిలోనికి వెళ్ళింది. ఎప్పటి లాగా పశు వులను మేతకు తోలి.. వెంటతెచ్చుకున్న రోటీల మూటను చెట్టుక్రింద పెట్టి నీడన కూర్చొంది.. ఉన్నట్లుండి పొదలమాటన నక్కివున్న "చిరుతపులి" ఆవు మీదకు దాడిచేసింది..ఆవు అరుపులు విన్న ఆ అమ్మాయి వెంటనే కర్ర తీసుకొని ఆవువైపు పరిగెత్తింది..కర్రను కత్తిలా తిప్పుతూ చిరుతపై దాడికి దిగింది. ఆవును వదిలిన చిరుత ఆ బాలికపై దాడికి దిగి తన పదునైన పంజాలను ఆ అమ్మాయిపైకి విసరసాగింది. ఆ పంజాదెబ్బలను ఒడుపుగా తప్పించుకుంటూ కర్రతో చిరుత తలపై దాడిచేస్తుంది అప్పుడప్పుడూ ఆ అమ్మాయి.. ఈ అరుపులు విని పరిగెత్తుకు వచ్చిన కొంతమంది పశుకాపరులు జరుగుతున్న పోరాటాన్ని చూసి నిశ్చేష్టులైనిలబడి పోరాటాన్ని చూడసాగారు, చిరుత నాలుగు అడుగులు వెనక్కి వేసి వున్నట్లుండిగాలిలోనికి లేచి ఆమె మీదకు దూకింది. అత్యంత చాకచక్యంగా తప్పుకుంటూ ఆ బాలిక తన మొనదేలిన చేతికర్ర బాగాన్ని ఆ చిరుత కంఠంలోనికి అదిగాలిలో వుండగానే దింపింది.అంతే అంత పెద్దచిరుత గిలగిలకొట్టుకుంటూ ప్రాణాలొదిలింది.. అప్పటిదాకా కళ్లప్పగించి ఆత్రుతగా పోరాటాన్ని చూస్తున్న పశువుల కాపరులు చప్పట్లుకొడుతూ గ్రామానికి వెళ్ళి ఆమె పోరాటాన్ని గొప్పగొప్పగా చెప్పసాగారు. ఆమె ధైర్యసాహసాలు ఆ ప్రాంత మంతా మారుమ్రోగిపోయింది.. ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా.. బుందేల్ ఖండ్‌లో ఈ రోజుకీ జానపదగీతాలలో పాడుకోనే వీరనారి ఝల్కారీభాయ్ ... 1857 జాతీయోద్యమంలో ఝాన్సీరాణి కుడిభుజం... ఝల్కారీభాయ్ 1830 నవంబరులో ఒక పేద దళితకుటుంబంలో సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు జన్మించింది. అయితే చిన్నతనంలోనే తల్లి జమునాదేవి మరణించడం వలన తండ్రి పెంపకంలో పెరిగింది. సదోవర్ సింగ్ ఆమెకు గుర్రపుస్వారీ, కత్తిసాము నేర్పించాడు.. ఆమె ధైర్యసాహసాలు విన్న ఝాన్సీలక్ష్మిభాయ్ ఆమెను కోటకు ఆహ్వానించి ఝాన్సీ సైన్యములోని మహిళా విభాగమైన "దుర్గావాహినికి" నాయకురాలిగా చేసింది. ఝల్కారీభాయ్ ఝాన్సీ సైన్యనాయకులలో ఒకడైన పూరణ్ సింగును వివాహమాడింది.1857లో జరిగిన జాతీయోధ్యమంలో ఈమె కూడా పాల్గొంది..1858 ఏప్రిల్ 3 వతేదిన బ్రిటీష్ సైనిక జనరల్ హ్యూ రోజ్ ఝాన్సీ కోటను ముట్టడించాడు..ఝాన్సీరాణి ఆ ముట్టడినుండి తప్పించుకొని విప్లవకారులను చేరేందుకు ఝల్కారీభాయ్ ఝాన్సీరాణిలా వేషం వేసుకొని హ్యూ రోజ్ సేనల దృష్టిని మళ్ళించింది. అత్యంతధైర్యసాహసాలతో హ్యూ రోజ్ సైన్యాలను ముప్పతిప్పలు పెట్టింది..ఆమెను పట్టుకునేందుకు వారు ఎంతో కష్టపడవలసివచ్చింది..ఎట్టికేలకు ఆమెను బంధించగలిగేరు.. ఆమె ఝాన్సీరాణి కాదని తెలుసుకున్న ఆంగ్లేయులు ఆమె ధైర్యసాహసాలకు, తెలివికి ఆశ్చర్యపోయారు... అయితే ఆంగ్లేయులకు చిక్కిన తర్వాత ఆమె ఏమైంది అనేది మిష్టరీగా మిగిలిపోయింది.. ప్రథమ స్వతంత్ర సంగ్రామంలో ఒక బహుజన వీరపుత్రి పాత్ర మరుగున పడిపోయింది... ఇప్పటికీ బుందేల్ ఖండ్ ప్రాంతంలో ఝాన్సీరాణితో సమానంగా ఝల్కారీభాయ్‌ను గౌరవిస్తారు. ఆమె వీరగాథలను జానపథబాణీలలో పాడుకుంటూవుంటారు!!!

సంక్షేమ పాలనలోనూ వీళ్ళకి అసంతృప్తే

ప్రత్యేక కథనం

- ఫణికుమార్

ఏపీలో సంక్షేమ పాలన సాగుతూ ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ ఉన్నారు. కొత్త కొత్త పథకాలను తెస్తూ ఉన్నారు. మంచినీళ్ల ప్రాయంగా కొన్ని వందల కోట్ల రూపాయల మొత్తాలను పంచి పెడుతూ ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఉమ్మడి ఏపీ చరిత్రలో ఏ ప్రభుత్వమూ చేపట్టనన్ని సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం చేపడుతూ ఉంది. ఈ విషయంలో పక్క రాష్ట్రాలు కూడా పోటీకి రాలేని పరిస్థితి ఉంది. ఈ సంక్షేమ పథకాల ఫలాలను అందుకుంటున్న ప్రజలు చాలా ఆనందంగా ఉన్నారు. ఊహించని రీతిలో డైరెక్టుగా పథకాల సొమ్ములు చేతికి అందుతుండే సరికి కరోనా వంటి ఉత్పాతం వచ్చిన సమయంలో కూడా ఏపీ ప్రజల చేతుల్లో డబ్బులు ఆడుతున్నాయి.

రైతులు, అమ్మ ఒడి లబ్ధిదారులు, చేతి వృత్తుల వాళ్లు, కుల వృత్తుల వాళ్లు, ఆటోలు నడుపుకునే వాళ్లు, పూజారులు, పాస్టర్లు, ఇమామ్‌లు.. ఇలా వాళ్లూ వీళ్లూ అనే తేడాలు లేవు. కులాల వారీగా కూడా సంక్షేమ పథకాలు వేరే! అప్పటికే అమల్లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ వంటి తండ్రి కాలం నాటి పథకాలను కొనసాగిస్తూ కూడా జగన్ ప్రజలకు డైరెక్టుగా డబ్బులు చేతికి అందే పథకాలను అమలు చేస్తూ ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే కనీవినీ ఎరగని రీతిలో ఏపీలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి! వీటికి నిధులు ఎలా తెస్తున్నారు అనేది వేరే ప్రశ్న! ఇక్కడ విషయం ఏమిటంటే.. నభూతో అనే స్థాయిలో జగన్ హయాంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నా.. ఇంకా అసంతృప్తి ఉండనే ఉండటం! అనేక వర్గాల వారీగా బోలెడన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా.. ఇంకా తమకు ప్రాధాన్యత లభించడం లేదనే వాళ్లు తెర మీదకు వస్తున్నారు. అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు! ఇదో చిత్రమైన పరిస్థితి. జగన్ ప్రభుత్వం గమనించాల్సిన విషయం ఇది.

వాళ్లకు ఇస్తున్నారుగా, మాకెందుకు లేదు?

ప్రజలకు అన్నింటి మీదా అవగాహన ఉంటున్న రోజులివి. తమ ఎదురింటి వారి గురించి, పక్కింటి వారి గురించి పక్కా అవగాహన ఉంటుంది సహజంగానే. తమ ఊర్లో ఫలానా వాళ్లకు ఫలానా సంక్షేమ పథకం ద్వారా డబ్బులొచ్చాయనే విషయం గురించి ఊరందరికీ తెలిసి పోతుంది. కామ్‌గా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి పనులు జరిపించేసుకునే రోజులు కావివి! కాబట్టి.. ఎవరెవరు ఏ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారనేది అందరికీ అవగాహన ఉండనే ఉంటుంది. ఇలాంటి క్రమంలో.. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను చూసి, అలాంటి లబ్ధి పొందని వాళ్లలో అసంతృప్తి కలుగుతూ ఉంది. వీళ్లకూ ఎంతో కొంత లబ్ధి కలిగి ఉండొచ్చుగాక, తమ ఎదుటి వాడికో, పక్క వాడికో తమ కంటే ఎక్కువ లబ్ధి కలుగుతుంటే మిగతా వాళ్లు ఊరికే ఉండరు కదా! మనిషి సహజ లక్షణం ఇది. ఇదే ఇప్పుడు జగన్ అమలు చేస్తున్న పథకాల విషయంలోనూ అంతర్లీనంగా ఒక అసంతృప్తికి కారణం అవుతూ ఉంది.

అన్నీ వాళ్లకేనా..?

ఉదాహరణకు చేతి వృత్తుల వారికి ఈ మధ్యనే జగన్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఒక్కోరికి 24 వేల రూపాయల చొప్పున డబ్బులిచ్చారు. ఇది డైరెక్టు క్యాష్ ట్రాన్స్ఫర్ స్కీమ్. ఈ వృత్తుల వాళ్లు ఆల్రెడీ బీసీ జాబితాలోనే ఎక్కువమంది ఉంటారు. కొద్దో గొప్పో భూములున్నవారూ ఉంటారు. రైతు భరోసా పథకంలో ఏడాదికి 12 వేల రూపాయల డబ్బు అందుకున్న వారూ ఉంటారు, వారే మళ్లీ చేతి వృత్తుల కోటాలో 24 వేల రూపాయల డబ్బూ అందుకుంటున్నారు. వీళ్ల ఇళ్లకే మళ్లీ అమ్మ ఒడి పథకం డబ్బులూ అందుతుంది! ఒక్కో రేషన్ కార్డులో ఒకరికి పెన్షన్ కామన్! అది నెలకు రెండు వేల ఐదు వందల రూపాయల వరకూ! అవిగాక.. ఇళ్ల స్థలాలు, ఫీజు రీయింబర్స్ మెంట్లు వేరే కథ! ఇలా జగన్ అమలు చేస్తున్న అన్ని పథకాల లబ్ధినీ ఆసాంతం వాడుకుంటున్న కుటుంబాలు ఏపీలో కొన్ని లక్షల్లో ఉంటాయి!

బీసీ వర్గాల్లో.. రేషన్ కార్డు కలిగి ఉండటం ఒక్కటే చాలు వాళ్లకు ఏ చేతివృత్తుల కిందో 24 వేలు, ఇంట్లో కనీసం ఒక పెన్షన్ -30 వేలు, ఐదెకరాలలోపు భూమి ఉంటే ఇంకో 12 వేలు, అమ్మ ఒడి.. ఇలా లెక్కబెడితే కనీసం 70నుంచి 80 వేల రూపాయల లబ్ధి పొందుతున్న కుటుంబాల సంఖ్య గణనీయంగా ఉంది! ఇంట్లో ఏ డిగ్రీనో, బీటెక్కో చదువుతుండే పిల్లలు ఉంటే అది అదనం, ఆరోగ్య శ్రీ, రేషన్ బియ్యం ఇవన్నీ వేరే! ఇండియా వంటి దేశంలో ఈ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలుతున్నాయంటే ఆశ్చర్యపోవాల్సిందే!

కట్ చేస్తే.. అసంతృప్త వర్గాల పరిస్థితి ఏమిటంటే... వీళ్లలో ఓసీలే ఎక్కువమంది. వీళ్లలో ఐదు-పది ఎకరాల పై స్థాయి భూములున్న వారికి సంక్షేమ పథకాలూ అందవు! ముందుగా వాళ్లకు రేషన్ కార్డు తీసేస్తున్నారు. దీంతో అన్నీ ఆటోమెటిక్‌గా కట్ అవుతున్నాయి. ఆఖరికి రైతు భరోసా పథకం డబ్బులు కూడా వాళ్లలో కొంతమందికి అందకపోవచ్చు. పెన్షన్ రాదు, పంట నష్టపరిహారాలు అందవు, రేషన్ కార్డే లేకుండా పోవడంతో.. ఏ అమ్మ ఒడి సాయమో, పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంటో ఉండదు! ఇదీ పరిస్థితి!

ఇంతకన్నా దారుణం ఏమిటంటే.. ఇంట్లో ఎవరైనా ఒక్కరి పేరుతో ఐటీ రిటర్న్ దాఖలు అయి ఉంటే.. రేషన్ కార్డును పూర్తిగా రద్దు చేస్తున్నారు! ఇంట్లో ఒక్కరు సంపాదిస్తున్నా, రేషన్ కార్డును రద్దు చేయడం ద్వారా వాళ్లను అన్ని సంక్షేమ పథకాలకూ దూరం

చేస్తున్నారు. ఒక్కరు ఐటీ రిటర్న్ దాఖలు చేసిన పాపానికి ఇంట్లో వృద్ధులు ఉన్నా వాళ్లకు పెన్షన్ ఉండదు, ఏ చదువుకునే పిల్లలుంటే వాళ్లకూ ఫీజు రీయింబర్స్ మెంట్ కొశ్చన్ మార్కే, చాలా సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే అర్హత, అలాంటి రేషన్ కార్డునే ఐటీ రిటర్న్ కారణంగా చూపి రద్దు చేసేస్తే.. అన్నీ కట్ అయిపోతున్నాయి!

ఇదీ పరిస్థితి. ఈ రోజుల్లో ఏ నగరంలోనే ఉండి 30నుంచి 40 వేల రూపాయల జీతం పొందే వాళ్లు ఐటీ రిటర్న్ దాఖలు చేయకతప్పని పరిస్థితి. ఆ జీతాలు నగర జీవనంలో ఏ పాటివో అర్థం చేసుకోవచ్చు. ఆ డబ్బులో నగరంలో ఇద్దరు పిల్లలతో బతుకీడ్చడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. ఆ కారణం చూపి.. రిటర్న్ దాఖలు చేస్తున్నారని, పల్లెలోనో, సొంతూర్లోనో వారు పేరు ఉందని రేషన్ కార్డును రద్దు చేయడం అంటే.. ఎంత వరకూ న్యాయం?

కొందరు తెలివైన వాళ్లు అలా రిటర్న్ దాఖలు చేసే పేరును కార్డునుంచి తొలగించుకుని లబ్ధి పొందుతున్నారు. మరి కొందరు పొందలేకపోతున్నారు. అందరికీ లబ్ధి కలిగితే ఏ ఇబ్బందీ లేదు, కొందరికి లబ్ధి కలిగి, మరి కొందరికి కలగకపోవడం అసహనాన్ని పుట్టిస్తుంది. నియమాలను అమలు చేసేట్టు అయితే గట్టిగా అమలు చేయాలి, లూప్ హోల్స్‌లో కొంతమంది తప్పించుకుంటే.. మిగతా వాళ్లలో అసహనం కలుగుతుంది.

పల్లెల్లోనే ఈ రచ్చలు ఎక్కువ!

కొడుకు తన కుటుంబంతో నగరంలో బతుకుతుంటాడు. ఊర్లో తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ ఉంటారు. కొడుకు రిటర్న్ దాఖలు చేశాడని, అతడి తల్లిదండ్రులకు రైతు భరోసా, పెన్షన్ వంటి పథకాలను రద్దు చేస్తే.. ఆ వృద్ధుల్లో అసహనం కలగవచ్చు. ఇందులో మరో విషయం ఏమిటంటే..ఇలాంటి వాళ్లలో కొంతమంది ఇది వరకూ పెన్షన్ పొందుతూ వచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి కట్ చేయడంతో వాళ్లు అసహనానికిలోనవుతూ ఉన్నారు.

నిజంగా వాళ్లు అర్హులా..?

అటు ప్రభుత్వ కోణంనుంచి కాకుండా, ఇటు ప్రజల కోరికల ప్రకారం కాకుండా.. చూస్తే, అర్హులు ఎవరికీ అన్యాయం జరగడం లేదు. ఈ రోజుల్లో కూడా పదెకరాలకు మించి భూమి ఉన్న వాళ్లకు పెన్షన్ అవసరం లేదు. ఆ స్థాయిలో భూమి ఉన్న వారికి పెట్టుబడి సాయాలు కూడా అవసరం లేదు. వాళ్లకు రేషన్ కార్డులు రద్దు చేసినా తప్పేం లేదు. ఎందుకంటే భూమి అంటేనే సంపద. వాళ్లను ప్రభుత్వం ఇలా పోషించాల్సిన అవసరం లేదు. ఏ పంట నష్ట పరిహారాల వరకూ ఓకే కానీ, అంతకు మించి వాళ్లను పోషించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం కూడా వదిలించుకోవచ్చు. రైతులు కూడా ఆ మేరకు ఆశించేవారు కాదేమో! అయితే ఎవరెవరో ఎలాగెలాగో ప్రభుత్వాలనుంచి డబ్బులు తెచ్చుకుంటుండే సరికి.. వాళ్లలోనూ ఆశలు పుడుతున్నాయి. 'వాళ్లకేనా.. మాకు వద్దా?' అనే ప్రశ్న వాళ్లలో ఉత్పన్నం అవుతోంది. 'ఇచ్చేవాడుంటే, సచ్చేవాడు కూడా లేచొస్తాడు..' అని ఒక సామెత. అలా మారుతోంది పరిస్థితి.

చేనేత వర్గాలకు ఇటీవలే జగన్ ప్రభుత్వం భారీగా డబ్బులు ఇచ్చింది. అయితే వారిలో చాలా మంది అనర్హులు కూడా డబ్బులు పొందారు. చేనేత పని చేసే వాళ్లంతా చిరిగిన బట్టలతో ఏమీ ఉండరు. పట్టు చీరల వ్యాపారంతో చక్కగా సెటిలైన వారూ ఉంటారు. అలాంటి వారికి అలా అయాచితంగా ప్రభుత్వం డబ్బులిచ్చే సరికి మిగతా వాళ్లలో అసహనం కలుగదా? వాళ్లకు ఇస్తే ఇచ్చారు, మాకెందుకు ఇవ్వరు? అనే ప్రశ్న వస్తోంది!

చంద్రబాబు నాయుడు ఏం చేశారు?

చంద్రబాబు నాయుడు హయాం విషయానికి వస్తే.. మాటలెక్కువ, చేతలు తక్కువ. జనాలకు చంద్రబాబు నాయుడు పథకాల డబ్బులు ఇలా ఇచ్చిన చరిత్ర లేదు! డబ్బులు ఏవైనా వాటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిందే! వస్తే వస్తాయ్.. లేకపోతే లేదు. ఇలా కచ్చితంగా ఏడాదికి ఒక మారు అని, ఆరు నెలలకు ఒకసారని మాటకు కట్టుబడి చేసిన పాలన కాదది. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలకు డబ్బులు ఇచ్చి వాళ్ల చేత ఓట్లు వేయించుకునే పాలన చేశారు చంద్రబాబు నాయుడు. దీంతో అప్పుడు ప్రజలు కూడా ఆశించేది ఏమీ లేకపోయింది. వస్తే వచ్చినట్టు, లేకపోతే లేనట్టు! అదీ చంద్రబాబు పాలన. కాబట్టి.. ప్రజలు పట్టుబడి మాకు రాలేదు అని అడిగే పరిస్థితి లేకపోయింది. వైఎస్ తెచ్చిన సంక్షేమ పథకాలను తప్పక చంద్రబాబునాయుడు అమలు చేశారు కానీ లేకపోతే ఆ మాత్రం కూడా లేదు. రుణమాఫీ అని రైతులను, డ్వాక్రా మహిళలను చంద్రబాబు నాయుడు ఓపెన్‌గా మోసం చేశారు. దీంతో చంద్రబాబు మాటల మీద జనాలకు నమ్మకం పోయింది. టీడీపీ చిత్తు అయ్యింది. అదే జగన్ పాలనకు వచ్చే సరికి, వాళ్లకు ఇస్తున్నాడే, మాకు ఇవ్వలేదే.. అనే భావన లబ్ధి కలగని వారిలోకి ప్రవేశిస్తోంది. 12 వేల రైతు భరోసా పొందిన రైతు కూడా, అరే.. ఆటోలు నడిపే వాళ్లకే 10 వేలు అంట, నేను రైతును నాకు 12 వేలేనా అంటే దానికి సమాధానం ఏముంది? 12 వచ్చినా వీళ్లకు ఆనందం లేకుండా పోతే ఏ ప్రభుత్వం అయినా ఏం చేస్తుంది. చంద్రబాబులా మోసం చేస్తే ఏ సమస్యా లేదు, హెచ్చు తగ్గులను మాత్రం కొంతమంది సహించలేకపోతున్నట్టుగా ఉన్నారు.

అర్హులను నిర్ణయించడంలో జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న నియమాలు మరీ అన్యాయంగా ఏమీ లేవు. కానీ జనాలు ఆలోచించే తీరు ఒకలా ఉండదు కదా. 'నాకేం పదెకరాల ఆసామిని, ప్రభుత్వం మీద ఆధారపడాల్సిన ఖర్మ నాకేంటి.. నా పిల్లలు చక్కగా సెటిలయ్యారు, నేను హ్యాపీ..' అని ప్రభుత్వంనుంచి ఆశించకుండా ఆలోచించగలిగే వాళ్లు ఎంతమంది? ఎంత ఉన్నా.. ఇంకా వస్తుందేమో అని ఆశించే వాళ్లే ఎక్కువ! వీళ్లలోనే అసంతృప్తి.

ఓసీలు చూడటం లేదా..?

కులం చూడం, మతం చూడం.. అంటూ జగన్ తమ సంక్షేమ పథకాల అమలు గురించి చెప్పిన మాటలను కొందరు ఓసీలు సెటైరిక్‌గా వాడుతున్నారు. కులం చూడం, మతం చూడం, ఓసీలను అసలే చూడం.. అన్నట్టుగా జగన్ వ్యాఖ్యను కొనసాగిస్తున్నారు. అయితే జగన్ పాలనలో ఓసీలు లబ్ధి పొందలేదు అనేది ఉత్తిమాటే. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ లబ్ధి పొందుతున్నారు. పల్లెల్లో 90

శాతం మందికి రేషన్ కార్డు ఉండనే ఉంది. వాళ్లకు ఏ సంక్షేమ పథకం లబ్ధీ అందకుండా పోలేదు. చేనేత పని చేసే కొందరు ఓసీ వర్గాల వారు కూడా అందుకు సంబంధించిన డబ్బులను పొందారు. ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు కలిసే ఉన్నా, వాళ్లు వేర్వేరు రేషన్ కార్డులు, తల్లిదండ్రులు మరో కార్డు పెట్టుకుని.. అన్ని పథకాల లబ్ధీ పొందుతున్న ఓసీలు కూడా ఉన్నారు. ఎటొచ్చీ రేషన్ కార్డును కలిగి ఉండటమా, లేదా.. అనేదే కీలకమైన అంశంగా మారింది. ఈ విషయంలోనే కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకుగాక.. కార్పొరేట్లకు దోచి పెట్టాలా?

స్థూలంగా జగన్ సంక్షేమ పథకాల విషయంలో అన్ని పథకాలనూ పొందేయాలన్న వారిలో అసంతృప్తి కొంత ఉంది. వచ్చిన దాంతో తృప్తి పడటం మనిషి లక్షణం కాదు కాబట్టి, అది ఎప్పటికీ ఉండనే ఉంటుంది. ఇలా రకరకాల వర్గాలను సంతృప్తి పరుస్తూ పోతున్నా.. ఇంకా ఎవరో ఒకరు అసంతృప్తితో ఉండనే ఉంటారు. అది తెగేది కాదు.

ఇక కొందరు మేధావులు ఈ సంక్షేమ పథకాల విషయంలో విమర్శలు చేసేస్తూ ఉన్నారు. ప్రజలకు జగన్ పంచేస్తూ ఉన్నారని, ఓటు బ్యాంకు పాలిటిక్స్ చేస్తున్నారని, అడ్డగోలుగా పంచుతున్నారని.. అంటూలోతు లేని విమర్శలు చేస్తూ ఉంటారు. ఇలాంటి వాళ్లకు సూటి ప్రశ్న ఏమిటంటే.. ప్రజలకు సంక్షేమ పథకాల అమలు చేస్తే ఇంత అసహనం అయితే, ప్రభుత్వం మరేం చేయాలి? కార్పొరేట్లకు దోచి పెట్టాలా?

కార్పొరేట్ వర్గాలు ప్రభుత్వాలనుంచి బోలెడంత లబ్ధి పొందుతున్నాయి. వాళ్లకు భూములు ఫ్రీ, వాళ్లకు రాయితీలు, కరెంటు బిల్లులనుంచి మినహాయింపులు, ఆపై బ్యాంకులనుంచి అప్పులు. ఆ అప్పుల ఎగవేతలు, మాఫీలు! ఇవన్నీ రోజూ వార్తల్లోని అంశాలే! నిజానికి దేశంలో ప్రజా సంక్షేమం మీద ప్రభుత్వాలు పెడుతున్న ఖర్చుతో పోలిస్తే.. కార్పొరేట్లు పొందుతున్న రాయితీల మొత్తమే చాలా చాలా ఎక్కువ ఉంటుంది.

కార్పొరేట్లకు ఇచ్చే రాయితీలు, వాళ్లకు పది కోట్ల రూపాయల విలువైన భూమిని లక్ష రూపాయలకే ఇవ్వడం.. ఇవన్నీ వార్తల్లో అలా వచ్చి వెళ్లిపోయే అంశాలు. అదే ప్రజా సంక్షేమం మాత్రం దండగమారి పని అని కొంతమంది బలిసిన వాళ్లకు అనిపిస్తూ ఉంటుంది.

సంక్షేమ పథకాలు అనేవి ప్రజలకే కాదు, అంతిమంగా దేశానికి మంచి చేస్తాయి. రైతులకు, బడుగు-బలహీన వర్గాల కోసం వెచ్చించే ప్రతి రూపాయి కూడా దేశ సంక్షేమం కోసం వినియోగిస్తున్నదే అని గుర్తించాలి. దేశమంటే మట్టికాదు, దేశమంటే మనుషులని గురజాడ చెప్పిన విషయాన్ని మరిచిపోకూడదు. ప్రజలు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఆర్థికంగా ప్రజలకు డైరెక్టుగా అండగా నిలిచినా అదేమీ వ్యర్థం కాదు. వాళ్ల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడితే దేశమే మెరుగుపడుతుంది. భారతీయుల్లో డబ్బును వ్యర్థం చేసే అలవాట్లు తక్కువనే విషయాన్నీ గుర్తించాలి. సంక్షేమ పథకాల ద్వారా తమకు అందే డబ్బును ఆర్థికంగా తాము మరో మెట్టు పైకి ఎదగడానికి ఉపయోగించే ప్రజలే 90 శాతం మంది ఉంటారు. అంతిమంగా ప్రజల జీవన స్థితి గతులు బాగు పరచడమే ఏ ప్రభుత్వం అయినా చేయాల్సింది. ఏ కార్పొరేట్ కంపెనీకో, విదేశీ ఇన్వెస్టర్ కో భూములు ఇవ్వడమే అభివృద్ధి అనుకునే భ్రమలోకి వెళ్లిపోయారు కొంతమంది. ఆ భ్రమలనుంచి బయటకు రావాలి. ప్రజల జీవన స్థితి గతులు మంచి స్థాయికి చేరడమే నిజమైన అభివృద్ధి. కాబట్టి.. మేధావులు సంక్షేమ పథకాల విషయంలో అతిగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సెల్యూట్ల వెనకున్న అర్థం

- ప్రజామీడియా నెట్‌వర్క్

ఎయిర్ ఫోర్స్, ఆర్మీ, నేవీ అందరూ దేశానికి సైనిక దళాల కోవకి చెందిన వాళ్లే. కానీ ఎవరి ప్రత్యేకత వాళ్ళకి ఉంటుంది. అదేవిధంగా వారు చేసే సెల్యూట్ కూడా చూడడానికి ఒకేలా ఉన్నా ఆ దళాలకి ప్రత్యేకత ఉన్నట్టు వారి సెల్యూట్ కూడా ప్రతి రంగానికి వేరుగానే ఉంటాయి.

ఆర్మీ : ఆర్మీ వాళ్ళు చేయి ఎదుటి వాళ్లకు కనబడేలా పెట్టి, వేళ్ళన్నీ దగ్గరగా ఉంచి మూడవ వేలు తమ కనుబొమ్మలకి కానీ, లేదా హ్యాట్ బ్యాండ్‌కి కానీ తాకేలా పెడతారు. అది వాళ్ల మీద వాళ్ళకి ఉన్న నమ్మకాన్ని చూపించడమే కాకుండా, తమలో ఎలాంటి చెడు ఆలోచనలు లేవు అని తాము ఎలాంటి ఆయుధాలు దాచలేదు అని చెప్తున్నట్టు అర్థం.

నేవీ : చేయి 90 డిగ్రీల యాంగిల్‌లో పెట్టి అరచేయి కిందకి చూపిస్తున్నట్టు ఉంటుంది వీరి సెల్యూట్. అలా పెట్టడం వెనకాల ఉన్న కారణం ఏంటి అంటే ఆ సేయిలర్స్ షిప్‌లో పనిచేస్తున్నప్పుడు చేతికి నూనె లేదా గ్రీస్ అంటడం, లేదా దుమ్ము పట్టే అవకాశం



ఉంటుంది. అవి కనిపించకుండా ఉండటానికి అరచేయి భూమివైపు పెడతారు.

ఎయిర్ ఫోర్స్ : 45 డిగ్రీల యాంగిల్‌లో అరచేయి కుడి పక్కకి వచ్చేలా కుడి భుజం ముందుకు కనిపించేలా పెడతారు. వీళ్ళ సెల్యూట్ ఆర్మీ వాళ్ళ సెల్యూట్ కి నేవీ వాళ్ల సెల్యూట్ కి మధ్యలో ఉంటుంది. ముందు ఎయిర్ ఫోర్స్ వాళ్ళ సెల్యూట్ కూడా ఆర్మీ వాళ్ల సెల్యూట్ లానే ఉండేది. 2006లో ఎయిర్ ఫోర్స్ వాళ్ళకి కొత్త పద్ధతిలో సెల్యూట్ చేసే విధానాన్ని అమలు చేశారు. ఇలా ఒక్కొక్క సైనిక దళానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉన్నట్టు వారి సెల్యూట్ కి కూడా ప్రత్యేకత ఉంది.

ఇది తప్పనిసరి తప్పు... దూబెకు తక్షణశిక్ష అమలు..

- హేమంత్



వికాస్ దూబె కథ ముగిసింది... తప్పయినా తప్పనిసరి... ఎన్నిసార్లు చెప్పుకున్నా మళ్లీ అదే చెప్పుకోవాల్సి వస్తోంది... మన కోర్టుల మీద ఎవరికీ నమ్మకం లేదు... తక్షణ శిక్షలు సాధ్యం కాదు కదా, చార్జి షీట్లలో ఏవో బొక్కలు పట్టుకుని బయటపడినా పడొచ్చు... అందుకని దూబెను యూపీ పోలీసులు ఖతం చేయడంపై యూపీలో బోలెడుమంది దీపావళి చేసుకుంటారు తప్ప కన్నీరు కార్చేవారు ఎవరూ ఉండరు... అతని తల్లితో సహా... ఎందుకంటే..? కొన్నివేల మంది బాధితులు..

మహా అయితే సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, కట్టుకున్నది గనుక దూబె భార్య మాత్రం కన్నీరు కారుస్తారేమో... అంతే... నిజానికి దూబె 8 మంది పోలీసులను మట్టుబెట్టినప్పుడే తనకు యోగి మరణశాసనం రాసేశాడు... కాకపోతే కాస్త ఆలస్యం... వేల ఎన్‌కౌంటర్లతో పోలీసులు యూపీలో రౌడీషీటర్లు, నేరస్థులపై మునుపెన్నడూ ఎరుగని రీతిలో యుద్ధం సాగిస్తున్నారు... ఈ స్థితిలో తమ సహచరుల్ని బలిగొన్న ఈ నొటోరియస్ నేరస్థుడిని ఎలా వదిలిపెడతారు..? సో, అందరూ ఊహించిందే..

ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏమంటాడంటే... "దూబె మరణం తప్పదు... ఈరోజు కాకపోతే మరుసటి రోజు... కానీ యూపీ పోలీసులు దూబెకు సహకరించిన, సహకరించే తమ పోలీసులను ట్రేస్ చేస్తున్నారు ముందుగా... తన పొలిటికల్ కనెక్షన్లను విశ్లేషించుకుంటున్నారు... దూబె ఎలాగూ దొరక్క తప్పదు..."

అలాగే జరిగింది... తమ వాళ్లను ముందుగా గ్రిల్ చేశారు... దూబె లెఫ్ట్ హ్యాండ్, రైట్ హ్యాండ్ దొరికారు... ఓ ఇద్దరిని లేపేశారు... ఒకడు మొత్తం బయటపెట్టేశాడు... దూబె నెట్‌వర్క్ మొత్తం పూసగుచ్చినట్టుగా తెలిసిపోయింది... మధ్యప్రదేశ్ పారిపోయిన దూబె తను లొంగిపోయాడా..? లేక పోలీసులే దొరకబట్టుకున్నారా అనే చర్చ వదిలేస్తే... ఉజ్జయినిలో అతనిని అరెస్టు చేశారు..

అక్కడా ఉన్నది బీజేపీ సర్కారే కదా, పిచ్చోడు యూపీ నుంచి బెంగాల్ జంప్ అయిపోయి ఉంటే కథ వేరేగా ఉండేదేమో అని ఒకరిద్దరు అప్పుడే విశ్లేషణలు ప్రారంభించారు... కానీ యూపీ టాస్క్ ఫోర్స్ ఊరుకోదు కదా... అరెస్టు చూపించింది... వేసేస్తే తమ రాష్ట్రంలో వేసేయాలి, మధ్యప్రదేశ్‌లో అయితే కొన్ని లీగల్ చిక్కులు, ఆపరేషనల్ ఇబ్బందులు ఉంటయ్... అందుకే యూపీకి తీసుకెళ్లాకే ఖతం కార్యక్రమం చేపట్టాలి అనుకున్నారు... సాధారణంగా తెల్లవారుజామునే కదా మరణశిక్షలు అమలు చేసేది... వీళ్లూ అదే ముహూర్తాన్ని ఎంచుకున్నారు..

వాహనం తిరగబడింది... దూబె ఇదే అదునుగా తప్పించుకోవటానికి ప్రయత్నించాడు... లొంగిపోవాలంటూ హెచ్చరించినా వినలేదు... ఇక విధిలేక పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది... తను ఖతం అయిపోయాడు... కథలో కొత్తదనం ఉండొచ్చు కానీ కంటెంటు అదే... మొన్న పోలీసులపై దూబె కాల్పుల సంఘటన జరిగాక కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ స్పందించి, యూపీలో పోలీసులకు రక్షణ లేదు అంటూ యోగి ప్రభుత్వంపై విరుచుకుపడ్డయ్... దూబెకు సమాజ్‌వాదీ పార్టీ మద్దతు ఉంది... ఇప్పుడు అఖిలేషుడు ఎలా స్పందిస్తాడో... మేం కష్టపడి నిర్మించిన ఓ అరాచక, నేర వ్యవస్థ వెన్నువిరిచే హక్కు యోగీకి ఎవడిచ్చాడు అంటూ వీరంగం వేస్తాడా..? జాగ్రత్త అఖిలేషూ... యోగి తుపాకీకి కోపమెక్కువ..

అవునూ, మరి కోర్టులు దేనికి..? చట్టాలు దేనికి..? పోలీసులకే సర్వాధికారాలు ఇస్తే చాలా ప్రమాదకరం అంటారా..? అది రీజనబుల్ చర్చే... ఆ చర్చ కరెక్టే... ఇలాంటి నేరస్థుల్ని శిక్షించే దిశలో మన న్యాయవ్యవస్థ సమీక్ష అవసరమే..

H-1B వీసా రద్దు చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

- ఎన్. అబ్రహం

అమెరికాలో విదేశీ వృత్తి నిపుణులు ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు కల్పించే హెచ్1బీ, హెచ్2బీ, జే, ఎల్1, ఎల్2 వీసాలపై నిషేధాన్ని ఈ ఏడాది చివరి వరకు పొడిగిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. గ్రీన్‌కార్డుల జారీని కూడా 2020 డిసెంబర్ వరకు నిలిపివేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వులు జూన్ 24నుంచి డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటాయి. అమెరికాలో కరోనా వైరస్, ఆర్థిక మాంద్యం, రికార్డు స్థాయిలో పెరిగిన నిరుద్యోగం రేటు కారణాల రీత్యా, హెచ్1 బీ వీసా జారీ ప్రక్రియను 'సంస్కరించే యత్నం'లో భాగంగా హెచ్ 1 బీ సహా, ఇతర వర్క్ వీసాల జారీని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హెచ్1 బీ, హెచ్ 4, హెచ్ 2 బీ వీసా, జె అండ్ ఎల్ వీసాలతో బాటు పలు నాన్-ఇమ్మిగ్రేషన్ వీసాలను ఈ ఏడాది ఆఖరువరకు నిలిపివేసిన సంగతి తెలిసిందే.



అమెరికాలో పెరుగుతున్న నిరుద్యోగం దృష్ట్యా, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్ 1 బి వీసాలతో సహా ఇతర ఉపాధి వీసాలను నిరవధికంగా నిలిపివేయాలని ఆలోచించారు, ట్రంప్ ఇలా చేస్తే ఎక్కువగా నష్టపోయిన దేశాలలో భారత్ ఒకటి అవుతుంది. ట్రంప్ ఈ నిర్ణయం భారతదేశంలోని ఐటి కంపెనీలకు పెద్ద దెబ్బ ఇవ్వవచ్చు. ఇది జరిగితే యుఎస్‌లో ఉన్న చాలా మంది భారతీయులకు నష్టం జరుగనుంది. యుఎస్ ఆర్థిక సంవత్సరం అక్టోబర్ 1నుండి ప్రారంభమవుతుంది. ఆ తరువాత అనేక కొత్త వీసాలు మంజూరు చేస్తారు. అమెరికన్ కంపెనీలు విదేశీ ఉద్యోగులను, ముఖ్యంగా సాంకేతిక నైపుణ్యం ఉన్నవారిని వారి కంపెనీల్లో నియమించుకోవడానికి అనుమతిస్తుంది. ప్రతి సంవత్సరం వేలాది యుఎస్ టెక్నాలజీ కంపెనీలు పెద్ద ఎత్తున భారత్, చైనా దేశాలకు చెందిన ఉద్యోగులను నియమించుకుంటున్నాయిఇటువంటి పరిస్థితిలో అమెరికా ప్రభుత్వ హెచ్ వన్ బీ రద్దు నిర్ణయం వల్ల వేలాది మంది భారతీయ సాంకేతిక నిపుణులు నష్టపోతున్నారు. ఇదిలా ఉంటే చాలా మంది హెచ్ 1 బి వీసాదారులు ఇప్పటికే యుఎస్‌లో ఉద్యోగాలు కోల్పోయారు. కరోనా వైరస్ సంక్షోభ సమయంలో వీరంతా దేశానికి తిరిగి వస్తున్నారు.

ఒక దేశానికి చెందిన పౌరుడు/పౌరురాలు మరో దేశాన్ని సందర్శించాలంటే అనుమతి పత్రం కావాలి. అటువంటి అనుమతి పత్రాన్నే వీసా అంటారు. ఉదాహరణకు ఎవరైనా అమెరికా వెళ్లాలనుకొంటే ఆ దేశంనుంచి వీసా తీసుకోవాలి. ఇలాంటి వీసాలు చాలా రకాలు ఉంటాయి, పర్యాటకులు, వ్యాపారులు, ఉద్యోగులు, కళాకారులు, క్రీడాకారులు ఇలా భిన్న వర్గాల వారికి భిన్నమైన వీసాలు ఉంటాయి. అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగం చేయడానికి విదేశీయులకు జారీ చేసే అనుమతి పత్రమే హెచ్-1బీ వీసా. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వారికి వీటిని జారీ చేస్తారు.

అమెరికాలో టెక్నాలజీ, పరిశోధన, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అవసరం ఏర్పడింది. ఆ సమయంలో అమెరికాలో వీరికి ఎంతో కొరత ఉంది, కాబట్టి నైపుణ్యం కలిగిన విదేశీయులను తాత్కాలిక కాలానికి నియమించుకునేందుకు ప్రభుత్వం సంస్థలకు అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా 1990లో హెచ్-1బీ వీసాలను ప్రారంభించారు.

అమెరికా ప్రతి ఏడాదీ పరిమిత సంఖ్యలో మాత్రమే హెచ్-1బీ వీసాలను జారీ చేస్తుంది. ఏడాదికి 65,000 వీసాలు జారీ చేస్తారు. వీటిని జనరల్ కోటా అని చెప్పుకోవచ్చు. అంటే ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్-1బీ వీసాలకు డిమాండు బాగా ఉంటుంది. కోటాకు మించి దరఖాస్తులు వస్తే లాటరీ విధానంలో వీసాలు కేటాయిస్తారు. తమ ఉద్యోగుల కోసం సంస్థలు హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేస్తుంటాయి. అలాగే మరి కొన్ని సంస్థలు స్పాన్సర్ చేస్తుంటాయి.

హెచ్-1బీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు డిపెండెంట్ వీసా ద్వారా అమెరికాలో ఉండొచ్చు. ఇందుకు వారు హెచ్-4 వీసాలను తీసుకోవాలి. జీవిత భాగస్వామి, 21 ఏళ్లలోపు పిల్లలకు ఈ అవకాశం ఉంటుంది. హెచ్-4 వీసా ఉన్న కుటుంబ సభ్యులు అమెరికాలో చదువుకోవచ్చు. అయితే ఈ వీసా మీద ఎటువంటి ఉద్యోగాలు చేయడానికి లేదు. ఇందుకు వర్క్ పర్మిట్ తీసుకోవాలి.

అమెరికాలో హెచ్ 1 బీ వర్క్ వీసా లేదా గ్రీన్ కార్డు కలిగిన అనేకమంది భారతీయులకు కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. అక్కడే పుట్టిన వారి పిల్లలను కూడా కష్టాలు వెన్నాడుతున్నాయి. హెచ్-1 బీ వీసా కార్డు రద్దు పెద్ద ఇబ్బందిగా మారింది.

2020 డిసెంబర్ వరకు భారతీయులతో పాటు ఏ దేశానికి చెందిన వారికి కూడా అమెరికాలో ఉద్యోగం దొరకదు. ఈ మొత్తంలో అధికంగా నష్టపోయేది భారతీయులే. కరోనా వైరస్ అన్ని దేశాలతో పాటుగా అగ్రరాజ్యమైన అమెరికాను కూడా అతలాకుతలం చేసింది. ఈ సంక్షోభం కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన అమెరికన్లకు తిరిగి ఉపాధి కల్పించే విధంగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు వైట్ హౌస్ ప్రకటించింది. మరో నాలుగు నెలల్లో అధ్యక్ష ఎన్నికలను ఎదుర్కోవాల్సిన ట్రంప్, వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం. ఎన్నికల సమయం నాటికి కనీసం 5 లక్షల మంది అమెరికన్లకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు ట్రంప్. అమెరికన్లకు మద్దతుగా చర్యలు తీసుకోవడం ద్వారా మరోసారి అధ్యక్ష పీఠాన్ని ఎక్కాలని ట్రంప్ ఎత్తుగడలు వేస్తున్నారు. విదేశీయుల్ని కట్టడి చెయ్యడం ద్వారా స్థానిక యువతలో క్రేజ్ తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

కరోనా దెబ్బ: ఎక్కడ చూసినా బోర్డులే!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితులు కరోనాకు ముందు.. తర్వాతలా మారాయి. ఇంతకాలం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిన అద్దె ఇళ్ల సంబరం.. ఇప్పుడు యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. హైదరాబాద్‌లో భారీగా డిమాండ్ ఉండే అద్దె గృహాలు కొవిడ్ కారణంగా To-Let బోర్డులతో దర్శనమిస్తున్నాయి. నాడు విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం నగరాలకు వచ్చే వారి సంఖ్య భారీగా ఉండటంతో యజమానులు అద్దె ధరలు అమాంతం పెంచేశారు. ఇటీవల గత మూడు నెలలుగా సరైన అద్దెలు లేక అవస్థలు పడుతున్నారు.



హైదరాబాద్‌లో సొంతిల్లు పేదవాడికి ఊహకు అందని అద్భుతం. సొంతిల్లు ఉంటే అద్దెలతోనే బతికేయొచ్చన్నది కరోనాకు ముందున్న పరిస్థితులు. జీవన చక్రం ఒక్కసారిగా తలకిందులైంది. నాడు ఒక్క గది కావాలన్నా, రూ.4నుంచి రూ.5 వేలు, సింగిల్ బెడ్ రూం రూ.5నుంచి రూ.10వేలు, డబుల్ బెడ్ రూం. రూ.10నుంచి రూ.20వేలు పలికాయి. నగరంలో అద్దెకు ఇళ్లు దొరకడం అంటేనే కష్టం. అలాంటిది కరోనా ధాటికి ఈ రంగమూ నష్టాలను మూటగట్టుకుంటోంది. వైరస్ వ్యాప్తితో పాటు, ఉపాధి, వ్యాపార అవకాశాలు కోల్పోయి, అత్యధికమంది ఇంటి బాటపడుతున్నారు. ఇప్పుడు సగం ధరలకు అద్దెకు ఇస్తామన్నా, వచ్చే వారు లేక ఇళ్లముందు To-Let బోర్డులు వేలాడుతున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం వచ్చిన వాళ్లు ఇళ్లు ఖాళీ చేయడంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు, నాలుగు నెలలుగా అద్దెలు లేక భవనాల నిర్వహణ, పన్నులు చెల్లించడం భారమవుతోంది. నగరంలో అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనూ పరిస్థితి తీసికట్టుగా మారింది. సామాన్యులనుంచి, పలు వ్యాపార సముదాయాల వరకూ ఉపాధి కోల్పోయి ఇళ్లు, కార్యాలయాలు ఖాళీ చేస్తున్నారు.

కరోనా కారణంగా స్కూళ్లు, కాలేజ్‌లు, శిక్షణ సంస్థలు ప్రారంభం కాలేదు. ఇప్పట్లో ఇవి మొదలయ్యే అవకాశం లేకపోవడంతో చాలామంది ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికే పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడుతున్నాయి. చిరు వ్యాపారాలు దెబ్బతిన్నాయి. గిరాకీలు లేక అద్దె చెల్లించే పరిస్థితి కూడా లేదు. దుకాణాలతో పాటు, అద్దె ఇళ్లను కూడా ఖాళీ చేసి, సొంతింటికి వెళ్లిపోతున్నారు. దీంతో భవనాల నిర్వహణ, ఈఎంఐల చెల్లింపులు యజమానులకు భారంగా మారాయి.

ఎమ్మెస్ రామారావు

- ఎన్.భాను

ఎమ్మెస్ రామారావు (మార్చి 7, 1921 – ఏప్రిల్ 20, 1992) పూర్తిపేరు మోపర్తి సీతారామారావు. ఈయనకు సుందరదాసు అనే బిరుదు ఉంది. ఈయన తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్యగాయకుడు. 1944లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తాహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించాడు. గేయ రూపంలో ఈయన రచించిగానం చేసిన రామయణ భాగం సుందరకాండము ఎమ్మెస్ రామారావు సుందరకాండగా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఈయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి.

ఎమ్మెస్ రామారావు, జననం ...తొలినాళ్లు..


ఎమ్మెస్ రామారావు 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మగార్లు సీతారామ భక్తులు. చిన్నతనంనుండే రామారావుగారు పాటలు పాడుతుండేవారు. ఈయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. రామారావుగారికి 1942లో లక్ష్మీ సామ్రాజ్యంతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె (వెంకట సరోజిని), ఇద్దరు కుమారులు (బాబూరావు, నాగేశ్వరరావు)

సినీరంగంలో

ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా అనే ఎంకి పాట పాడించారు. ఆ చిత్రంలో నాయక పాత్ర ధరించిన సి.హెచ్. నారాయణరావుకు ఇదిగాత్రదానం. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్యగానం. తరువాత ఈయన దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు.

1944నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్యగాయకునిగా మద్రాసులో నివసించిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది.

1963 సంవత్సరాంతంలో కొన్ని కారణాల వల్ల మద్రాసు వదిలి రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసారు. 1970లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్(IAF)లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు.



M. S. Ramarao was an Indian singer and composer. He was popular for his devotional songs, especially sundarakandamu in Telugu. Born: 3 July 1921, TenaliDied: 20 April 1992, Hyderabad Albums: Sundara Kandamu, Seetharama Kalyanam, Drohi, Sri Ramanjaneya Yuddham, moreChildren: M. Babu Rao, M.Nageshwar Rao

1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హనుమంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమైనాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయడానికి అదే ప్రేరణ.

1972నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీనుంచి తెలుగులోనికి అనువదించారు, తన పేరుతో అవినాభావ సంబంధమేర్పడ్డ సుందరకాండ గేయరచన చేశాడు.

1975నుంచి హైదరాబాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదుని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరాబాదులో సహజ కారణాల వల్ల మరణించాడు.



ఇడ్లీల దినోత్సవం


- క్రిష్

భారత దేశానికి అప్పటికి ఇంకా స్వాతంత్రం రాలేదు.
ఆ రోజుల్లో ఒక అయ్యరు గారు మద్రాసునుంచి కలకత్తాకు హౌరా మెయిల్లో వెడుతున్నారు. అదే బోగీలో ఓ ఆంగ్లేయుడు కూడా ప్రయాణం చేస్తున్నారు. తెల్లారేసరికి రైలు బెజవాడ స్టేషన్ చేరుకుంది. ఉన్నత తరగతిలో ప్రయాణించే వారికి రైల్వే వారు స్పెన్సర్ బ్రేక్ ఫాస్ట్ ఉచితంగా అందించేవారు. ఆ బ్రిటిషర్ దాంతో కడుపు నింపుకున్నారు. అయ్యరు గారు మాత్రం ఇంటినుంచి తెచ్చుకున్న నాలుగు గిన్నెల టిఫిన్ క్యారియర్ విప్పి అందులో ఒక గిన్నెలోని రెండు ఇడ్లీలు తీసి తినడం ఆ ఆంగ్లేయుడు గమనించాడు. తెల్లగా, గుండ్రంగా ఉన్న ఆ పదార్థం ఏమిటో తెలుసుకోవాలనే ఉత్సుకత ఆయనలో మొదలయింది. అయితే అడగడం మర్యాదగా ఉండదని మిన్నకుండిపోయాడు.
మధ్యాన్నానికల్లా రైలు వాల్తేరు చేరుకుంది. రైల్వే వాళ్ళు ఆంగ్లేయుడికి చక్కటి, రుచికరమైన భోజనం అందించారు. అయ్యరు గారు రైల్వే భోజనాన్ని మృదువుగా తిరస్కరించి తన క్యారియర్ తెరిచి రెండో గిన్నెలో వున్న మరో రెండు ఇడ్లీలు కమ్మగా తినడం ఆ బ్రిటిష్ వ్యక్తి గమనిస్తూనే వున్నాడు. యెంత ఆలోచించినా తోటి ప్రయాణీకుడు తింటున్నవేమిటి అనేది ఆయనకు అర్ధం కాలేదు. దాంతో ఆయన ఉత్కంఠ మరింత పెరిగింది.
రైలు బరంపురంలో ఆగింది. మళ్ళీ అదే సీను.
బ్రిటిషర్ ఇక తట్టుకోలేక నేరుగా అడిగేశాడు.
"అయ్యా! ఇలా అడగడం మర్యాద కాదని తెలిసీ అడుగుతున్నాను. మీరు తింటున్న ఆ తెల్లటి పదార్ధాలను నేను ఎప్పుడూ చూడలేదు. అవేమిటో తెలుసుకోవాలని నాకు ఆసక్తిగా వుంది"
అయ్యరు ఇలా జవాబిచ్చారు.
"ఇవి ఐ.క్యు. టాబిలెట్స్. అర్ధం మీకు తెలుసుగా. మేధస్సు పెంచడానికి వీలైన పోషకాలు వీటిలో వున్నాయి. వీటిని తిని, భోజనం గట్రా ఏమీ లేకుండా మేము రోజులతరబడి వుండగలం"
"వీటిని ఎలా తయారు చేస్తారు" బ్రిటిషర్ ఆరా.
అయ్యరుగారు ఇడ్లీలు తయారు చేయడానికి కావాల్సిన సంభారాలు గురించీ, తయారు చేసే విధానం గురించీ వివరంగా చెప్పారు.
"మంచి సంగతులు మీనుంచి తెలుసుకున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే నాకూ ఓరెండు టాబ్‌లెట్లు ఇవ్వగలరా! వూరికే కాదు, మీరు చెప్పిన మొత్తాన్ని నేను చెల్లించుకుంటాను" అని ఆంగ్లేయుడు అభ్యర్ధించాడు.
అయ్యరు ఒక క్షణం ఆలోచించి చెప్పాడు.
"నా దగ్గర ఇంకా మూడే మిగిలాయి. కలకత్తాలో నేను మా చుట్టాల ఇంటికి వెడుతున్నాను, కనుక నాకు ఇబ్బంది లేదు. మీరే చెప్పారు కాబట్టి ఇడ్లీకి ఓ ఇరవై రూపాయల చొప్పున ఇవ్వండి చాలు"
బ్రిటిషర్ యెగిరి గంతేసినంత పనిచేసి అరవై రూపాయలు అయ్యరుకు ఇచ్చి మూడు ఇడ్లీలు తీసుకునితిన్నాడు.
మర్నాడు ఉదయానికల్లా హౌరా స్టేషన్ వచ్చింది.
రైలు దిగి ఎవరి దారిన వారు విడిపోయే సమయంలో బ్రిటిషర్ అడిగాడు.
"ఈ టాబ్‌లెట్లు తయారు చేసే విధానం చెప్పారు. అంతా చెప్పారా! ఏమైనా మరచిపోయారా!"
"చెప్పేందుకు ఏమీ లేదు, అంతా వివరంగా చెప్పాను"
"మరి ఈ టాబ్‌లెట్ల ఖరీదు అంత వుండకూడదే"
"చెప్పాను కదా ఇవి మేధస్సును వికసింప చేసే ఐ.క్యు. ట్యాబ్‌లెట్లని. మీరు మూడే తిన్నారు. రాత్రికి ఇప్పటికీ మీలో యెంత తేడా వచ్చిందో చూడండి. అంటే అవి పనిచేయడం మొదలయిందన్న మాట" అని అంటూ అయ్యరు తన హోల్డాలు, టిఫిన్ క్యారియర్ చేతబుచ్చుకుని చక్కాపోయాడు.

(ఒక ఇంగ్లీష్ కథనానికి స్వేచ్ఛానువాదం)

జంధ్యా వందనం వేటూరి వైభవం

- ఎం.జయంతి



జంధ్యాల వీర వేంకట దుర్గా శివ సుబ్రమణ్యా శాస్త్రి. ఇంగ్లీష్ అక్షరాల్లో పొడి పొడిగా రాస్తే జే.వీ.డీ.ఎస్.శాస్త్రి. ఇంకా పొడి చేసి క్లుప్తంగా చేస్తే జంధ్యాల. మొదటి పొడుగాటి పేరు బారసాలనాడు బియ్యంలో రాసి పెట్టింది. రెండోది, కాస్త పొట్టిపేరు, స్కూలు, కాలేజీ రికార్డుల్లో రాసుకున్నది. ముచ్చటగా మూడోది 'జంధ్యాల' అనే 'కలం పేరు' చిరస్థాయిగా వెండి తెరపై స్థిరపడిపోయిన పేరు. తెలుగు హాస్యానికే వన్నె తెచ్చిన పేరు.విజయాగార్డెన్స్‌లో ఒక చెట్టు కింద కూర్చుని వేటూరి చాలా పాటలు రాశారుట. ఆ చెట్టుకి "వేటూరి పాటల చెట్టు" అని పేరు వచ్చింది. ఈ విషయం అందరికీ తెలియకపోవచ్చు. అయితే వేటూరి తన హృదయాన్ని ప్రేమనే మహావృక్షంగా మార్చి ఎన్నో తీయని పాటల పండ్లను పంచడం మనకు బాగా తెలిసిన విషయం. ఆ పళ్ళలో అతి మధురమైన ఫలాలను వేటూరి తనకి అత్యంత ఆప్తుడైన జంధ్యాల కోసం దాచి ఉంచారేమో అనిపిస్తూ ఉంటుంది. వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ప్రేమగీతాలు అపురూ పమైనవి. దాదాపు జంధ్యాల ప్రతి సినిమాలోనూ ప్రేమపై ఓ పాట ఉంటుంది, ఆ ప్రేమ పాటలు ఎక్కువ వేటూరి రాసినవే. "ప్రేమ అనే రెండు అక్షరాల మాటను నిర్వచించడానికి ప్రపంచభాషలన్నింటిలోనూ ఉన్న వేలాది అక్షరాలు కూడా చాలవు అని జంధ్యాల తరచు అంటుండేవారు. అందుకే ఆ ప్రేమకీర్తనగా నా చేత దాదాపు పది పాటలు రాయించాడు ఆయన. ప్రకృతి ఒళ్ళో తలదాచుకున్న పసితనం ఆయనిది." అని వేటూరి జంధ్యాలకి సమర్పించిన అక్షర నీరాజనంలో పేర్కొన్నారు. "చినుకులా రాలి" (నాలుగు స్థంభాలాట), "నేను నీకై పుట్టానని" (చంటబ్బాయి), "లిపిలేని కంటిబాస" (శ్రీవారికి ప్రేమలేఖ), "ఈ తూరుపు ఆ పశ్చిమం" (పడమటి సంధ్యారాగం) – ఇలాంటి ప్రేమ పాటలన్నీ ఎవరు మరిచిపోగలరు? వేటూరి అంటే జంధ్యాలకు ఆరోప్రాణం అందుకే ఆయన చేత మల్లెపూవు చిత్రంలో కకుమభంజనం స్వాములవారి పాత్ర వేయించి మురిసిపోయారు. అందుకే జంధ్యాల మృతి చెందినపుడు వేటూరు దుఃఖం ఆపుకోలేక జంధ్యాల జీవితం ఎంత చిన్నదైనా.. అది తనకు మనుచరిత్రే అని బాధపడ్డారట.

సంగీతం, సాహిత్యం, హాస్యం ఈ మూడు కలిస్తేనే జంధ్యాల. డెబ్బయ్యో దశకంలో ఆధునిక తెలుగు సినిమాల్లో తన హాస్య సంభాషణలతో నవ్వుల హరివిల్లును పూయించిన ఘనత కేవలం జంధ్యాలకు మాత్రమే దక్కుతుంది. మనందరినీ కడుపుబ్బ నవ్వించిన జంధ్యాల వర్ధంతి నేడు.

రాజ్‌కపూర్ తన ఆత్మగురువు అని జంధ్యాల ఒకసారి వేటూరితో అన్నారట. అందుకేనేమో ఆయన చిత్రంలో ప్రేమ గొప్పదనాన్ని గురించి తెలిపే ఒక పాట తప్పనిసరిగా ఉండాల్సిందే. అది కూడా వేటూరి సుందరరామ్మూర్తిది మాత్రమే ఉండేలా ఆయన శ్రద్ధ వహించేవారు. జంధ్యాల మనసు వెన్నముద్ద అయితే ఆయన కళ్లు వెన్నెల పొద్దులు, ఆయన మాటలు జలపాత సున్నితాలు, నవరసాలన్నింటిలోనూ జంధ్యాల హాస్య రసాన్నే అవపోసన పట్టారు. నవ్వులను పండించారు. పెద్ద కళ్లేపల్లెలో మూడు రోజుల పాటు సాగే తెలుగు వసంతోత్సవాలు జంధ్యాలకు అత్యంత ఇష్టమైనవి. ఎందుకంటే అక్కడ ఆయన తన జోకులతో కళా రసికులను పొట్ట చెక్కలయ్యేలా నవ్వించడమే కాక తన పొట్టను కూడా చెక్కలు చేసుకునేలా నవ్వేవారు. వేలుగాడు, స్టువర్టుపురం పోలీసు స్టేషన్, స్టేషన్ మాస్టరు సినిమాల్లో జంధ్యాల రాసిన సంభాషలు ప్రాసక్రీడగా జగత్ విఖ్యాతమయ్యాయి. ముళ్లపూడిని గురువుగా భావించే జంధ్యాలకు బ్రాహ్మణీకపు ప్రథమ కోపాలూ, గ్రంధాక్షరీ శాపాలు కూడా హాస్యంలోని ప్రధాన వస్తువులే అయ్యాయి. రెండు జళ్ల సీత సినిమాలో జంధ్యాల రాసిన ఊరగాయ స్తోత్రాలు – దండకాలూ, మాయాబజార్ సినిమాలోని పింగళివారు రాసిన గోంగూరోపాఖ్యానాన్ని తలపింప చేస్తాయి. వేటూరి అంటే జంధ్యాలకు ఆరోప్రాణం అందుకే ఆయన చేత మల్లెపూవు చిత్రంలో కకుమభంజనం స్వాములవారి పాత్ర వేయించి మురిసిపోయారు. అందుకే జంధ్యాల మృతి చెందినపుడు వేటూరు దుఃఖం ఆపుకోలేక జంధ్యాల జీవితం ఎంత చిన్నదైనా.. అది తనకు మనుచరిత్రే అని బాధపడ్డారు. ఒక సభలో బాలు, ఎస్.జానకి, శైలజ ప్రసంగించి శ్రోతల కనుల వెంట నీరు తెప్పిస్తే ఆ సభకే అతిథిగా వచ్చిన జంధ్యాల మైకు ముందుకొచ్చి ఇంత వరకు 'పాడు' మనుషులు ముగ్గురొచ్చి కంట తడి పెట్టించారని ప్రసంగం ప్రారంభించగానే సభలో నవ్వులు మార్మోగాయి. శ్రీరమణ మహర్షి

వేదాంతం రమణోపనిషత్తులనే గ్రంధ రూపంలో వచ్చినట్లుగానే జంధ్యాల చమత్కారాలు చెణుకులు కూడా ఒక జంద్యోపనిషత్తు గ్రంథంగా తేవడానికి ఆయన అభిమానులంతా ప్రయత్నిస్తే భేషుగ్గా ఉంటుంది. కాలధర్మాన్ని, జీవనతత్వాన్ని 50ఏళ్ల వయసులో గ్రహించిన జంధ్యాల తృతీయ పురుషార్థాన్ని దాటి వెళ్లిపోయిన మహాజ్ఞాని. ఆయన గుర్తుగా మిగిలినవి హాస్య చిత్రాలు మాత్రమే.

జంధ్యాల 1951 జనవరి 14(మకర సంక్రాంతి రోజు)న నరసాపురంలో జన్మించారు. విజయవాడలో బీకాం గ్రాడ్యుయేట్‌గా బయటకు వచ్చారు. సిరిసిరి సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశారు. 1983లో జంధ్యాల 12 నెలల వ్యవధిలో 80 సినిమాలకు మాటలు రాశారు. 1984, 87, 1992ల్లో ఆనందభైరవి, పడమటి సంధ్యారాగం, ఆపద్బాంధవుడు చిత్రాలకు ఉత్తమ దర్శక, ఉత్తమ కథ, ఉత్తమ సంభాషణల రచయతగా మూడు సార్లు నంది అవార్డులు పొందారు. రెండు రెళ్ల ఆరు, ఆపద్బాంధవుడు చిత్రాల్లో నటించారు. చూపులు కలిసిన శుభవేళ, భారతీయుడు, ఇద్దరు, పడమట సంధ్యారాగం, అరుణాచలం, భామనే సత్య భామనే చిత్రాల్లోని కొన్ని ముఖ్య పాత్రలకు డబ్బింగ్ చెప్పారు. 40 చిత్రాలకు దర్శకత్వం వహించారు. భారత ప్రభుత్వం జంధ్యాలను పద్మశ్రీతో సత్కరించింది. సీఏ చదవాలని చెన్నైకు వచ్చి గుమ్మడి ప్రోద్బలంతో సంభాషణలు - కథా రచయితగా అవతారమెత్తారు. ఆత్మాహుతి, గుండెలు మార్చబడును, ఏక్‌దిన్‌కే సుల్తాన్ అనేది జంధ్యాలకు పేరు తెచ్చిన నాటకాలు. ఇందులో ఏక్ దిన్‌కా సుల్తాన్ పది వేల సార్లు ప్రదర్శితమవడమే కాకుండా, దాని తాలుకూ ముద్రణా ప్రతులు 15 సార్లు పునర్ముద్రణకు నోచుకున్నాయి. పండిత పామరులను అలరింప చేసే అరుదైన గ్రాంధిక వ్యావహారిక భాషలో పట్టున్న వేటూరి జంధ్యాలలు సినీ జీవితంలో సమకాలీనులవడం తెలుగు ప్రేక్షకులు చేసుకున్న అదృష్టం. వారివురు తెలుగు వారి అభిరుచులను గ్రహించి వ్యాపార అవసరాలకు అనుగుణంగా పని చేసిన తీరు అపూర్వం. వారు సిరి సిరి మువ్వలతో ఆడుకున్నారు శంకరాభరణంకు అలంకారాలు చేసారు. అడవి రాముడులో వేడుకలు చేసుకున్నారు సప్తపదికి అడుగులో అడుగు వేసారు వేటగాడుతో వినోదం పంచారు. ఇంకా చాలా సినిమాలకు కలిసి పనిచేశారు. జంధ్యాల దర్శకుడిగా మారిన తరువాత వేటూరికి వ్యాపార దృక్పథంలో కాక కొత్త కోణంలో తన ప్రతిభను ప్రదర్శించే అవకాశం కలిపించారు. స్వతహాగా జంధ్యాల మంచి అభిరుచి కలిగిన రచయిత అవడం వల్ల వేటూరికి కొన్ని మంచి సన్నివేశాలకి పాటలు వ్రాసే అవకాశం కలిగింది. వేటూరి ప్రేమను అందాన్ని సుకుమారంగా వర్ణిస్తూ పాటలు రాశారు. జీవనతత్వాన్ని 50ఏళ్ల వయసులో గ్రహించిన జంధ్యాల తృతీయ పురుషార్థాన్ని దాటి వెళ్లిపోయిన మహాజ్ఞాని. ఆయన గుర్తుగా మిగిలినవి హాస్య చిత్రాలు మాత్రమే.

అంతా మాయ..

పెట్రోల్-డీజిల్ ఏకమైన వేళ

- ప్రజామీడియా నెట్‌వర్క్

సాధారణంగా పెట్రోల్ రేటు కంటే డీజిల్ ధర తక్కువగా ఉంటుంది. కానీ ఎప్పుడైతే ధరల నియంత్రణను చమురు కంపెనీలకు కేంద్రం కట్టబెట్టిందో, అప్పుడే పెట్రోల్-డీజిల్ ధరలు ఏకమౌతాయని చాలామంది ఊహించారు. ఇప్పుడా రోజు రానే వచ్చింది. గడిచిన 20 రోజులుగా పెరుగుతున్న ధరలతో పెట్రోల్, డీజిల్ రేట్లు ఏకమయ్యాయి. ఢిల్లీలో ఈరోజు లీటర్ పెట్రోల్ ధర 80 రూపాయల 13 పైసలుగా ఉంటే.. లీటర్ డీజిల్ ధర 80 రూపాయల 19 పైసలుగా ఉంది. ఇంకా చెప్పాలంటే పెట్రోల్ ధర కంటే డీజిల్ ధర కాస్త ఎక్కువగానే నమోదైంది. ఇది ఎవ్వరూ ఊహించని పరిణామం. భారతదేశ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో గడిచిన 20 రోజులుగా చమురు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పడుతున్నప్పటికీ.. దేశంలో మారిన ఆర్థిక పరిస్థితుల కారణంగా పెట్రో-డీజిల్ ధరలు మాత్రం తగ్గడం లేదు.

ఈనెల 7వ తేదీనుంచి చూసుకుంటే ఇప్పటివరకు పెట్రోల్ పై 8 రూపాయల 93 పైసలు, డీజిల్ పై 10 రూపాయల 7 పైసలు ధరలు పెరిగాయి. మరో వారం రోజులు పరిస్థితి ఇలానే **కొనసాగుతుందంటున్నారు నిపుణులు.**

లాక్ డౌన్ తో చమురు సంస్థలు భారీ నష్టాలు చవిచూస్తున్నాయి. వాటిని పూడ్చుకునేందుకు ఇలా ప్రతి రోజూ పెట్రోల్-డీజిల్ రేట్లు పెంచుతున్నాయి. అయితే సగటు వినియోగదారుడిపై పడుతున్న ఈ భారాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

లాక్‌డౌన్‌తో దేశం ఆర్థికంగా కుంగిపోయింది. రావాల్సిన ఆదాయ తగ్గిపోయింది. ఇలాంటి టైమ్‌లో పెట్రోల్‌పై పన్ను తగ్గించడానికి కేంద్రం సముఖంగా లేదు. అందుకే ఓవైపు రేట్లు పెరుగుతున్నప్పటికీ మోడీ సర్కార్ చూసీచూడనట్టు వ్యవహరిస్తోంది.

ఇటు రాష్ట్ర ప్రభుత్వాల పరిస్థితి కూడా అలానే ఉంది. లాక్‌డౌన్ తో ఆదాయం బాగా పడిపోవడంతో.. ఇప్పటికిప్పుడు పెట్రోల్-డీజిల్ పై విధిస్తున్న స్థానిక పన్నుల్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టపడడం లేదు.

ఈ పరిస్థితులన్నీ కలిపి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే లాక్‌డౌన్‌తో చాలామంది ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. మరికొంతమంది సగం జీతాలతో నెట్టుకొస్తున్నారు. ఇలాంటి టైమ్‌లో పెట్రోల్-డీజిల్ ధరలు పెరిగాయంటే.. దానర్థం నిత్యావసరాల ధరలు కూడా పెరుగుతాయన్నమాట. సో.. చమురు ధరల పెంపు అనేది సగటు భారతీయుడిపై పరోక్షంగా పెను ప్రభావం చూపించబోతోంది. ఆ దుష్ప్రభావం ఇప్పటికే మొదలైంది కూడా!

ప్రేమనగర్ వెనక కథ


- ఎస్.రాజు

ప్రతి అన్నం మెతుకు మీద తినేవాడి పేరు ముందే రాసి ఉంటుందన్నట్టు సినిమా పరిశ్రమలో కూడా ఇలాంటివి జరుగుతూ ఉంటాయి. మనకు రాసిపెట్టని అదృష్టం ఇంకొకరిని వరించడం ఎలాగో ఈ సంఘటన ద్వారా తెలుసుకోవచ్చు. 1971లో అక్కినేని నాగేశ్వర్‌రావు, వాణిశ్రీ జంటగా వచ్చిన ప్రేమ నగర్ ఎంతటి ఘన విజయం సాధించిందో తెలిసిందే. దీని వెనుక ఆసక్తికరమైన కథ ఒకటుంది. సినిమా నిర్మాణానికి ముందు ఆ సమయంలో కోడూరి కౌసల్యదేవిగారు ఇదే పేరుతో రాసిన నవల అద్భుత స్పందన దక్కించుకుంది. దీన్ని ఏఎన్ఆర్ హీరోగా తెరమీదకు తీసుకురావాలని శ్రీధర్ రెడ్డి అనే నిర్మాత నిర్ణయించుకుని ఆ మేరకు రచయిత్రి వద్ద హక్కులు కొనేశారు.

స్క్రిప్ట్ సిద్ధం చేయించి అక్కినేనికి ఇచ్చారు. స్వతహాగా పూర్తిగా చదివే అలవాటు లేని ఏఎన్ఆర్ దాన్ని శ్రీమతి అన్నపూర్ణగారికి చదవమని ఇచ్చారు. మొత్తం కూలంకుషంగా పఠనం పూర్తి చేసి దేవదాసులో లేని కమర్షియల్ అంశాలు ఇందులో ఉన్నాయని ఖచ్చితంగా ఆడుతుందని ఆవిడ జోస్యం చెప్పారు. దీంతో ప్రాజెక్ట్ ఓకే అయిపోయింది. హీరోయిన్‌గా కెఆర్ విజయ ఫిక్స్ అయ్యారు. దీని కోసం కాస్ట్యూమ్స్ కొనేందుకు అవసరమైన డబ్బు తీసుకుని కారు ప్రయాణం చేస్తుండగా శ్రీధర్ రెడ్డి కారుకు యాక్సిడెంట్ అయ్యింది. దీంతో ఇదేదో అపశకునంలా భావించి శ్రీధర్ రెడ్డి భార్య ఈ సినిమా వద్దనేశారు.

అయితే కథలో దమ్ము తెలిసిన అక్కినేని దీన్ని కొనుక్కోమని రామానాయుడుగారికి రికమండ్ చేశారు. హీరో స్వయంగా అంత నమ్మకంతో చెబితే కాదంటారా. 60 వేల రూపాయలకు కొనేశారు. దర్శకుడిగా రాఘవేంద్రరావుగారి తండ్రి కెఎస్ ప్రకాష్ రావుగారిని తీసుకున్నారు. స్క్రిప్ట్‌లో మార్పులు జరిగాయి. హీరొయిన్ స్థానంలో వాణిశ్రీ వచ్చి చేరింది. అప్పట్లోనే 15 లక్షల బడ్జెట్‌తో రామానాయుడుగారు ప్రేమనగర్‌ని భారీగా నిర్మించారు. 34 ప్రింట్లతో రిలీజ్ చేస్తే ఊహించని విధంగా 50 లక్షలు వసూలు చేసిందీ బ్లాక్ బస్టర్. రిలీజైన పదిహేను రోజులు భారీ వర్షాలు ఉన్నా జనం లెక్క చేయలేదు. గొడుగులు వేసుకుని మరీ తండోపతండాలుగా ఎగబడి చూశారు.

కెవి మహదేవన్ సంగీతం, ఆచార్య ఆత్రేయ మాటలు, వెంకటరత్నం ఛాయాగ్రహణం అన్ని కలిసి దీన్నో దృశ్యకావ్యంలా మలిచాయి. గుమ్మడి, శాంతకుమారి, సత్యనారాయణ, వరలక్ష్మి, రాజబాబు, ధూళిపాల లాంటి ఎందరో స్టార్లు క్యాస్టింగ్‌లో భాగమయ్యాయి. దీన్నే తమిళ్‌లో శివాజీ గణేషన్ హీరోగా రామానాయుడుగారే రీమేక్ చేశారు. హీరొయిన్ వాణిశ్రీనే. హిందిలోనూ రాజేష్ ఖన్నా, హేమమాలినిలతో తీస్తే అక్కడా సూపర్ హిట్. ఇలా శ్రీధర్ రెడ్డి, కేఆర్ విజయల చేయి జారిన అదృష్టం ఇలా రామానాయుడు, వాణిశ్రీలకు అద్భుతంగా కలిసి వచ్చింది. సురేష్ బ్యానర్ దీని దెబ్బకు రెట్టింపయ్యింది. అందుకే అన్నారేమో పెద్దలు ఎవరికి చేరాలని రాసుంటే అది ఖచ్చితంగా వారికే చేరుతుందని.



ఉడుతా భక్తి - ఆ భక్తికి కారణం పూర్వజన్మ!!

- వాసుశ్రీ, శ్రీనియర్ జర్నలిస్ట్



ఉడుతా భక్తి అనే మాట సహజంగా మనం చేసే పని ఎదుటివారికి అంత ముఖ్యమయినది కాకపోయినా మనం వారిమీద ఉన్న ప్రేమ అభిమానంతో చేసే పనిని ఎదో ఉడుతా భక్తిగా చేసాం అని చెబుతూ ఉంటారు.

శ్రీ రాముని కరుణకు సంబందించిన ఉదాహరణ చెప్పాలంటే ముందుగా చెప్పేది సేతు బంధన సమయంలో ఉడుత చేసిన చిన్న సహాయమునకు శ్రీరాముడు దానిని తన చేతులలోకి తీసుకుని దానిని నిమురుట, ఆ నిమిరినప్పుడు పడిన శ్రీరాముని వేళ్ళ గుర్తులు ఇప్పటికీ ఆ ఉడుతల వీపుపైన ఉన్నాయి అని చెప్తారు కదా!

మరి ఇంతకీ అలా రాముని చేతులతో నిమిరించుకున్న ఉడుత ఏమి అయ్యింది? ఆ ఉడుతకు రాముని కార్యంలో సహాయం చేయాలన్న ఆలోచన ఎలా కలిగింది?

దానికి కారణం ఆ ఉడుత పూర్వజన్మ. ఆ పూర్వజన్మ కథను అద్భుత రామాయణంలో ప్రస్తావించారు. ఆ కథను ఇప్పుడు మనం చూద్దాం!

పూర్వ కాలంలో ఒక బ్రాహ్మణ కుమారుడు కాశీ నగరమునకు వెళ్లి అక్కడ సకల విద్యలు నేర్చుకుని తిరిగి తన స్వగ్రామమునకు చేరుకున్నాడు. అతని పాండిత్యమును వాదములలో ఎవ్వరూ నిలువలేక పోయారు. అతని ఖ్యాతి నలుదిశలా వ్యాపించసాగింది. అతనితో పాటుగా అతని తండ్రిని కూడా ప్రజలు కీర్తించేవారు. అయితే ఆ పొగడ్తలను విన్న అతని తండ్రి ఆ పొగడ్తలను చాలా మర్యాదగా మా అబ్బాయి ఇంకా చిన్న పిల్లవాడు వాడు నేర్చుకోవలసినది చాలా ఉన్నది అని చెప్పే వాడు. ఆ మాటలు ఆ కుమారునికి రుచించలేదు. తన తండ్రి బ్రతికి ఉన్నంతకాలం తనను అలా చిన్న పిల్లవానిగానే చూస్తారు కనుక తన తండ్రి చనిపోతేనే బాగుండు అనుకోవటం మొదలుపెట్టాడు.

అలా ఆలోచిస్తూ కొంతకాలానికి తానే తన తండ్రిని చంపెయ్యాలి అని అనుకున్నాడు. ఒక రోజు తన తండ్రి ఇంటిలోకి వస్తున్న సమయంలో అతని మీదకు ఒక కర్రను గురిచూసి విసిరాడు. ఆ దెబ్బకు మూర్ఛిల్లిన తండ్రి, కొంతసేపటికి తేరుకుని ఎంత విద్యా, జ్ఞానము ఉన్నా విచక్షణను కోల్పోయిన కారణంగా ఇంత క్రూరమయిన కార్యం చేసాడు కనుక , క్రూరమృగంగా జన్మించమని శపించాడు. కొడుకు తన తరువాతి జన్మలో ఒక పెద్దపులిగా అడవిలో జన్మించాడు

ఒకసారి తండ్రి బ్రాహ్మణుడు వేరే ఊరికి వెళ్ళవలసి వచ్చి ఆ అడవిమార్గంలో వెళుతూ ఉండగా, పులిగా జన్మించిన కుమారుడు అతనిమీద దాడి చేయబోయాడు. మృగ జన్మలో ఉండికూడా ఇంకా క్రూరంగా ప్రవర్తిస్తున్నావు కనుక ఎవ్వరికీ హాని చేయని ఉడుత జన్మ ఎత్తు అని మరలా తండ్రి ఆ పులికి శాపం ఇచ్చాడు. అప్పుడు ఆ పులికి గత జన్మ, ఆ జన్మలో సంపాదించుకున్న జ్ఞానము జ్ఞాపకము వచ్చి, తన తండ్రి పాదములపై పడి క్షమాపణ కోరి, ఆ శాపమునకు విమోచనము చెప్పమని అడిగెను. అలా కుమారునిలో పశ్చాత్తాపం గమనించిన బ్రాహ్మణుడు, నీకు ఏమి ఉపకారము జరుగక పోయినా నీవూ ఏనాడయితే పక్క వారికి సహాయం చేస్తావో ఆనాడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు నిన్ను స్పర్శిస్తాడు. ఆ విధంగా నీకు శాప విమోచనం కలుగుతుంది అని చెప్పాడు.

ఆ రోజునుండి ఆ ఉడుత అలా సముద్రతీరంలో గడుపుతూ ఉంది. తాను చేయగలిగిన అతి చిన్న సహాయం రామునికి అందించింది. ఆ సాయమునకు బదులుగా రాముడు ఆ ఉడుతను పట్టుకున్న కారణంగా ఆ బ్రాహ్మణ కుమారునికి శాపవిమోచనం కలిగింది.